భారతి

సాహిత్య మాసపత్రిక
జూన్ 1983

ఊహాన్ని చూపించే అద్దం
శ్రీనివాసులు

సమ సమాజం
తిరుమలరావు

చూపు నిలిపి క్షణం స్వేచ్ఛ – దీక్ష
సాంధ్యశ్రీ

జంతు ప్రకృతిలో రసానుభూతి
రమేష్ బాబు

మళ్లీ తెల్లవారుతుంది
కోటేశ్వరరావు

కేశవనామ సంకీర్తనలు
గోపాలకృష్ణ అబ్బూరి

ఇంకా ఆచార్య తిరుమల, శివశంకరశర్మ, విద్యాసాగర్, కిశోరుబాబు _ అశోకుబాబు, తిరునగరి, మార్కండేయశర్మ, యస్. యస్. రెడ్డి, భవానీశాస్త్రి, మిరా, దినకర్, సుబ్బరామశాస్త్రి, విజయ దత్తాత్రేయశర్మ, చంద్రశేఖరరెడ్డి, వేంకటబాలాజి ఇతరుల రచనలు

వ్యవస్థాపకులు
దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

జూన్ 1983

సంపుటము : ౬౦ సంచిక : 6

విడిపత్రిక వెల నాలుగు రూపాయలు

విషయానుక్రమణిక

జూన్ 1983

సముద్ర పుష్పం !

ఆచార్య తిరుమల

ప్రశ్నించే కళ్ళల్లో ప్రగతికాంతి పోస్తాను
శిశిరంలో రాలిన ఆకుల్ని శిలా శాసనాలుగా వేస్తాను !

నేను- భవిష్యత్తుకు దూసుకుపోతున్న బాణాన్ని
వికసించే పువ్వులో పరిమళించే ప్రాణాన్ని
ఎగిరే జెండాకు ఎనలేని గీర్వాణాన్ని
నిజానికి - అక్షరాల చుక్కల దివాణాన్ని !

నేను- హిమాలయ హిమవేదిక నుండి పిలిస్తే
హిందూ సముద్ర ఘోషతో కన్యాకుమారి
పలుకుతుంది!
తూర్పు వాకిలి తెరచి తీవ్రంగా చూస్తే-
కొండపైనుండి దూకిన సూర్యుడు
పడమటి కడలిలో ఈత కొట్టుకుంటూ
నా వైపే వస్తూ వుండటం కనిపిస్తుంది!

నేను- వానరత్వానికి వారసుణ్ణి కాను;
మానవత్వానికి వారసుణ్ణి !
నాది మంది-రం కాదు; మమతా మందిరం!
నా ఆలోచనలు నదీ నదాల్లా ప్రవహిస్తాయి
నా నమ్మకాలు పంటల్లా పచ్చ తివాసీలు పరుస్తాయి
నా ప్రేమాభిమానాలు కోకిల గీతాలై పల్లవిస్తాయి
నా భాషలు, నా రాష్ట్రాలు కాంతి హారాలై
నా గళాన్ని అలంకరిస్తాయి
నా పండితుల పాండిత్యాన్ని
గంధపు చెట్లు వహిస్తాయి
నా కవుల పాదాలు కన్నీటి కెరటాలమీద
నడచివచ్చి, మల్లెతోటల్లో విహరిస్తాయి!
జీవనదుల్లో కల్మషం చూసే వారికి
పువ్వుల్లో పురుగుల్ని వెదుక్కొనే వారికి
వెలుగు వాకిళ్ళలో చీకటి ముగ్గులు వేసేవారికి
నేను పాదాభివందనం చేస్తాను;

వెనక్కి తీసుకోని అడుగు ముందుకు వేయమనీ,
చేతులు కడుక్కుని శస్త్రచికిత్సలు చేయమనీ,
పాదాభివందనం చేస్తాను!

దయా ధర్మ సత్య సౌఖ్యాల కోసం
నా గుండెను తీసి సముద్రం మీద పరిచాను
అది సముద్ర పుష్పమై శాంతి బాష్పమై
నా దేశమై నవ్వింది !

ఆ నవ్వుని ఖడ్గంగా మార్చి
నీకు అర్పిస్తున్నాను
మెలకువలోనే కాదు నిద్రలో కూడా
ఆ ఖడ్గాన్ని వీడకు!
మండుటెండలో నీ చూపు కరిగిపోతున్నా
స్వాభిమానాన్ని విడిచి వాడకు!
దండను తెంపకు! పూలు ఏరుకోకు!!

నవత

ఒక కలం కొత్తదనాలు పూసింది- శిశిరంలో
వసంతంలా సముద్రంలో అనలంలా అర్ధ
రాత్రి చంద్రబింబంలా

నలుగురూ చూసి ఇదేమిటన్నారు - కలం కొత్త
పూలు పూయ కూడదన్నారు; సమాజం దాని
కలవాటు పడలేదన్నారు; ప్రజలు చెడిపోతారన్నారు;
కొత్తదంతా చెత్త అన్నారు!

నాలుగ్గోడల మధ్య నల్లమంటలు లేచాయి! రంగ
వల్లికల మధ్య నాగుబాములు పాకాయి! శాస
నాల సభల్లో నాటుబాంబులు పేలాయి!

కొత్తదనం కళల్లోనా హవ్వ! రాకూడదన్నారు
లాయర్లు! గతానుగతికంగా పోవాలన్నారు జడ్జీలు!
తమ అభిరుచిని బట్టే రచనలుండాలన్నారు విమ
ర్శకులు! కళ తప్పుదారి పడుతోందన్నారు సమీ
క్షకులు! కొత్తదనం ప్రపంచాన్ని తలకిందులు
చేస్తుందన్నారు సంపాదకులు! తందానా అన్నారు
తటస్థులు! మనకెందుకన్నారు వాన ప్రస్థులు!!
ఇంత అలజడి జరుగుతూంటే నోరెత్తలేదు
కళాకారులు! మరింత కొత్త ఉత్పత్తయింది!
కొత్తదనానికి బలం పెరిగింది!

ఇదే మాకు కావాలన్నారు ఎక్కడినుంచో వి
ద్యార్థులు! పాతను గోబాక్ అన్నారు ఎదుటి
నుంచే యువకులు!

ఈ సంక్షోభానికి సగంలో ప్రజలు మేలుకున్నారు
అప్పుడర్థమయింది కొత్తదనం అంటే !

ఏరా

శ్రీ నాగాభట్ల మార్కండేయ శర్మ

నీలకంఠేశ్వరాలయ శాసనములు ఒక చారిత్రక పరిశీలన

విజయనగర జిల్లా బొబ్బిలి తాలూకాలోని బలిజిపేట గ్రామానికి 4 కి.మీ. దూరంలో నారాయణపురం గ్రామం వున్నది. ఆగ్రామం సువర్ణముఖి నది ఒడ్డున గలదు. అచ్చట అత్యంత సుందరమైన, చరిత్రాత్మకమైన ఆలయమొకటి కలదు. ఈ ఆలయమున గల శాసనములలో ప్రస్తుత నారాయణపురము 'నిడుంజెఱు' అనియు, 'నావపల్లి'[2] అనియు పేర్కొనబడినది. నిడుంజెఱువు లేక నావపల్లే క్రమేణ నారాయణపురముగా మారినది. ప్రస్తుతము నీలకంఠేశ్వరుడని పిలువబడుతున్న దైవము శాసనములందు నీలేశ్వరుడని[3], నీలీశ్వరుడని[4] పేర్కొనబడినాడు. కళింగ గాంగ రాజైన నాల్గవ నరసింహదేవుని కాలము (క్రీ.శ.1378-1424) నుండి గ్రామము నారాయణపుర మని పిలువబడినట్లు తెలియుచున్నది.[5]

దేవాలయములు ప్రజల భక్తిభావ ప్రదర్శనలకు కేంద్రస్థానములుగానే కాక చరిత్ర రచనకువయుక్తమయిన శాసన సంపదకు కూడా నిలయమైయుండుట విశేషము. దక్షిణమధ్య కళింగములలో ముఖలింగము, శ్రీకూర్మము, సింహాచలము మొదలగు దేవాలయములు శతాధిక శాసనములను కలిగియుండి చరిత్ర రచనకు మహదాధారములుగా నిలిచియున్నవి నారాయణపుర ఆలయము ఈ కోవకు చెందిన ప్రసిద్ధాలయము. నీలీశ్వరాలయ శాసనముల పరిశీలన క్రీ. శ. 12వ, 13వ శతాబ్దములనాటి సామాజిక జీవితమును, ఆర్థిక స్థితిగతులను తెలుసుకొనుటకు దోహదకారి యగును.

క్రీ. శ. 6వ శతాబ్దములో తూర్పు గాంగ వంశరాజులు ముఖలింగమును రాజధానిగా చేసుకొని అవిచ్ఛిన్నంగా 12వ శతాబ్దము వరకు పరిపాలించిరి. త్రికళింగాధిపతులైన గాంగరాజులు రాజ్య పరిపాలనతోపాటు చక్కని ఆలయములను నిర్మించి వారి కళాపోషణను నిరూపించుకొన్నారు. 'ఒరిస్సా శిల్ప పద్ధతి' ప్రకారం నిర్మించిన నారాయణపుర నీలీశ్వరాలయము భువనేశ్వరులో నున్న పరశురామేశ్వరాలయమును పోలియున్నది. నీలీశ్వరాలయములోని శిలాశాసనములను పరిశీలించేముందు ఆలయ నిర్మాణమును, శిల్ప సౌందర్యమును తెలుసుకుందాం.

నీలీశ్వరాలయ నిర్మాణ పద్ధతి

ఈ ఆలయము నాలుగు ఆలయముల సముదాయము. వీటిలో ప్రధానమైనది నీలీశ్వరాలయము. ప్రక్కన మరి మూడు ఆలయములు శిథిలావస్థలో వున్నవి. వాటిలో నొకటి ప్రధానాలయమైన నీలీశ్వరాలయమునకు ప్రతిరూపమై యుండగా రెండు ఆలయముల నిర్మాణాకృతి గోపురముల వలెకే నిలిచియున్నది. తూర్పు ముఖముగానున్న నీలీశ్వరాలయమునకు ముందు ఒక నందీశ్వర విగ్రహము కలదు. ఆలయమునకు తూర్పు, దక్షిణ దిశలయందు ద్వారములు గలవు. ఉత్తరదిశయందు ద్వారస్థానమందు ఒక చట్రము వలెనున్న కిటికీ కలదు. ద్వారమున కిరువైపుల నున్న గూడులలో శైవ సంబంధమైన శిల్పములు గలవు. గర్భాలయమును ఆనుకొని మండపము గలదు. ప్రధాన గోపురమునకు నాల్గువైపుల గోపురాకృతులు వుండి, వానిపై ఒక్కొక్క యోగి విగ్రహము మలచ బడినది. చతురస్రాకారములో నున్న ముఖమండపములో ఎత్తయిన రాతి స్తంభములు వరుసకు నాలుగేసి చొప్పున రెండు వరుసలలో రెండువైపుల అమర్చబడినవి. స్తంభములకు నాలుగు అడుగుల దూరములో ఇరుప్రక్కల పొట్టి గోడలు కలవు. స్తంభముల నుండి యీ గోడలపైకి పలకరాళ్ళచే కప్పు ఏర్పరచ బడినది. ఇది చదునుగా, చుట్టూవున్న ఏటవాలు వసారా కప్పు కన్న రెండడుగుల ఎత్తున వున్నది. ఈ కప్పు చూరుల యందు పురాణేతిహాస గాథలైన సముద్ర మథనము, శ్రీరామ కథా చిత్రములు అతి సహజముగా జీవకళ ఉట్టిపడుతూ చిత్రింపబడినవి.


తూర్పుగానున్న ముఖద్వారమున కిరువైపుల కలశలు ధరించి మకరముపై గంగ విగ్రహము, తాబేటిపై యమున విగ్రహము మరియు సూర్య, చంద్ర విగ్రహములు కలవు. ఆలయమునకు

వెలుపలియున్న దక్షిణ, పశ్చిమోత్తరపు గోడలయందున్న గూడులలో గల అర్ధనారీశ్వర శిల్పము యొక్క అలంకారాయుధములలోనూ, ముఖలావణ్యములోనూ, వృష్ణులలోనూ, ఏకముఖమున స్త్రీ పురుష స్వరూపముల సమ్మేళనమును చూపుటలోనూ శిల్పి తన చాతుర్యమును అత్యంత రమణీయముగా వ్యక్తపరిచెను. మరియు మహేశ్వరుని అవతారములైన భిక్షాటనమూర్తి, హరిహరమూర్తి, కుమారస్వామి, గణపతి, నటరాజు, ఆలింగనమూర్తి, మహిషాసురమర్దిని, శిఖరంపైనున్న యోగుల విగ్రహములు - నీలేశ్వరాలయ శిల్ప సంపదయొక్క విశిష్టతను తెలియజేయుచున్నవి. ఇచ్చట ప్రధాన దైవము లింగాకారముతో పూజింపబడి నీలకంఠేశ్వరుడని పిలువబడుచున్నాడు.

శాసనములు

నీలేశ్వరాలయ మంటప స్తంభములపై సుమారు 53 శిలా శాసనములు చెక్కబడి యున్నవి. ఇవి తెలుగు లిపిలో వ్రాయబడినవి. ఈ శాసన పాఠములన్నియు దక్షిణ హిందూ దేశ శాసన సంపుటి (10)లో ప్రచురింపబడినవి. శాసనము లన్నియు దాన శాసనములే. ఈ దానములు ఎక్కువ సంఖ్యలో ప్రజలచే, రాజులచే, రాణులచే, రాజోద్యోగులచే ఆలయ అఖండ దీపము నడుపుటకై యివ్వబడినవి. అఖండ దీపము నిలుపుట ఒక పుణ్యముగా భావించి అందు నిమిత్తమై భక్తులు భూమిని, పశువులను, ధనమును సమర్పించుచుండెడివారు. ఈ ఆలయములో మొట్టమొదటి శకవరుషంబులు 1024 (క్రీ. శ. 1102)లో నీలేశ్వర దేవరకు అఖండ దీపనిమిత్తమై 3 మోపవుంను తన అన్నపేరు చెప్పి బేతరాజు సమర్పించెను.[6] చివరి శాసనము శకవరుషంబులు 1173 (క్రీ. శ. 1251) లో యివ్వబడినది.[7] ఇందుమూలముగా మొదటి చివర శాసనముల మధ్యకాలమైన సుమారు రెండు శతాబ్దములనాటి నారాయణపుర నీలేశ్వరాలయ చరిత్రను యీ 53 శిలా శాసనముల పరిశీలన తెలియజేయుచున్నది.

ఆలయ నిర్మాణం ఎప్పుడు జరిగినదో తెలుసుకొనుటకు ప్రత్యక్ష ఆధారం లేకపోయినను, శ. 1066 లో (క్రీ. శ. 1144) బచ్చనచే చంద్రగ్రహణ కాలమందు యివ్వబడిన శాసనమున, శ. 869 (క్రీ. శ. 947) న బచ్చన వంశీకుడైన మంత్రి పోతన యిచ్చిన దానమును తాను తిరిగి నెలకొల్పినట్లు తెలియబడినది.[8] అందువలన క్రీ. శ. 947 నాటికే యీ నీలేశ్వరాలయము వైభవోపేతముగా వెలుగొందియున్నట్లు ఊహింపవచ్చును. పదియవ శతాబ్ద మధ్యకాలం



నారాయణపురం ఆలయం

వరకు దానధర్మాలను, ప్రజల పూజాపునస్కారములను అందుకుంటూ వుండెడిదని చెప్పవచ్చును. నమోదైన యీ శాసనముల వలన మొత్తము 58 అఖండవత్తి దీపముల నిమిత్తమై 222 మాడలు, 3 పశువులు, ముప్పందుముల భూమిని అర్పించినట్లు తెలియుచున్నది.

రాజులు, రాణులు, రాజకుమారులు యిచ్చిన శాసనములు

శ. 1039 (క్రీ. శ. 1117) న పెర్మాడిరాజు భార్య (అయి తన కుమార్తె) చంద్ర గ్రహణ కాలమందు,[9] మరియొక భార్య అయిన సూరమ విషువసంక్రాంతి కాలమందు అఖండవత్తి దీపము నడుపుటకు 5 మాడలు దానము చేసిరి.[10] ఈ పెర్మాడి రాజు తూర్పు గాంగ వంశీయుడైన అనంతవర్మ చోడ గంగదేవుని తమ్ముడు. శ. 1051 (క్రీ. శ. 1129) న పెర్మాడిరాజు యొక్క కుమారుడైన రాజేంద్ర చోడదేవుడు 15 మాడలు, మరల శ. 1061 (క్రీ. శ. 1139) లో అఖండవత్తి దీపమునకు 5 మాడలు దానమిచ్చెను.[11] శ. 1054 (క్రీ. శ. 1132) న ఉత్తరాయణ సంక్రాంతి నిమిత్తము చోడగంగదేవుని తమ్ముడైన ఉలయవంద పెర్మాడి అఖండ దీపమునకు 5 మాడలు నావపల్లి ముప్పదిళ్ళవారి అధీనమున వుంచెను.[12]

ఈ పై శాసనముల పరిశీలన వలన మనకు చోడగంగుని తమ్ముడు పెర్మాడి రాజనియు, అతనికి మరియొక నామధేయము ఉలయవంద పెర్మాడి అనియు, అతని భార్యపేరు సూరమ అనియు, వారియొక్క కుమారుడు రాజేంద్ర చోడదేవుడనియు తెలియుచున్నది.

రాజోద్యోగులు యిచ్చిన శాసనములు

తూర్పు గాంగులకు సామంతుడైన రాపత్రి ప్రధానులలో నొకడైన సూరపరాజు తన తల్లి తండ్రులైన మేడపరాజు, గుండి దేవుల జ్ఞాపకార్థము రెండు పుట్లు ఫలసాయము లభించే భూమిని దానము చేసెను.[13] రాపత్రి ప్రధానులలో మొదటి వ్యక్తి మేడప రాజు. సూరపరాజు తన అన్న బేతరాజు పేరిట అఖండ దీప నిమిత్తమై 3 మోదవులు దాన మిచ్చెను.[14] చోడగంగదేవుని యొక్క మహాసంధి విగ్రహీ, కాస్యప గోత్రుడైన సబ్బసేనాపతి శ. 1070 (క్రీ. శ 1148) లో అప్పములు, నెయ్యి మొదలగు సామగ్రితో భోగములు జరుపుటకు ముప్పందుముల నేల కొవి స్వామికి అర్పితము చేసెను.[15] శ. 1073 (క్రీ. శ. 1151) లో రాచ పురవరి గుండయ ఉత్తరాయణ సంక్రాంతి కాలమున 5 మాడలు దానము చేసెను.[16] శ. 1050 (క్రీ. శ. 1129) న కామరాజు కొడుకు పురవరి సోమనాథుడు 5 మాడలు సమర్పించెను.[17] వీరచోడదేవర లెంక మాంకన్న శ. 1041 న నీలీశ్వరునకు 5 మాడలు సమర్పించెను.[18] లెంక అనగా సేవకుడు లేక వార్తాహరుడు.

ఈ విధముగా రాజులతోబాటు అలనాటి రాజోద్యోగులుకూడా ఆలయ పోషణకు విరివిగా దానములు చేసెడివారు. వీరి శాసనముల వలన రాజోద్యోగుల పదవులు తెలియవచ్చుచున్నవి. సేనాపతి, మహాసంధి విగ్రహీ (శాంతి, యుద్ధములను తీర్మానించువాడు),[19] శ్రీకరణ (కార్యాధికుడు)[20] పురవరి (పన్నులు వసూలు చేయు అధికారి),[21] లెంక (వార్తాహరుడు),[22] మండలీక దండనాయక మొదలైన రాజోద్యోగులు మత సంబంధమైన కారక్రమములలో పాల్గొనడం హర్షింపదగిన విషయం. తూర్పు గాంగ రాజైన అనంతవర్మ చోడ గంగ దేవుడు శైవమతము నుండి వైష్ణవ మతమునకు మారినను, శైవమత పోషణకు, ఆదరణకు అంతరాయము కలుగజేయలేదు. శ. 1058 (క్రీ. శ. 1132) న అనంతవర్మ చోడగంగుడు తన 59వ విజయరాజ్య వర్షమందు ఉత్తరాయణ సంక్రాంతి నిమిత్తము యిచ్చిన దాన శాసనములో 'పరమ మహేశ్వర' అనియే సంబోధించుకొనడం అతనికి శైవ మతము పట్ల యున్న ఆదరాభిమానాన్ని సూచించుచున్నది.[23]

ఆర్థిక సామాజిక పరిస్థితులు

ఆనాడు సాంఘిక వ్యవస్థ చాలా పటిష్ఠంగా వుండేది. దానములు సక్రమంగా, నిరాటంకముగా నడుపు బాధ్యతను స్థానికులకు దాతలు అప్పజెప్పుచుండెడివారు. ఆ స్థానికులు ఒక సంస్థగా రూపొంది ఆ దానము నిమిత్తమై యిచ్చిన ధనమునుగాని, భూమిని గాని తమ ఆధీనములో వుంచుకొని, అఖండ దీపమునకు కావలసిన నెయ్యిని సరఫరా చేయుచుండెడివారు. శ. 1058 (క్రీ. శ. 1136) లో పెర్మాడిరాజు దానముగా యిచ్చిన 5 మాడలు నావపల్లి 'ముప్పదిళ్ళ' వారి ఆధీనములో వుంచడమైనది.[24] "ముప్పదిళ్ళవారు" అనగా 30 యిండ్లవారు. ఈ సంఖ్య సాధారణముగా మొట్టమొదటిగా ఒక ఊరు ఏర్పడి నపుడు వున్న యిళ్ళ/ కుటుంబముల సంఖ్యను తెలుపుచున్నది.[25] అందువల్ల నావపల్లి అనగా నారాయణపుర గ్రామము ఏర్పడినప్పుడు 30 యిళ్ళవారు వుండిరని వూహింపవచ్చును.

శాసన విషయములను బట్టి ముప్పది యిళ్ళ సముదాయముతో ఒక ఊరు లేక గ్రామ మేర్పడినట్లే, కొన్ని గ్రామముల సముదాయముతో ఏర్పడిన 'విషయము' 'నాడు' మొదలగు పరిపాలనా విభాగములు ఉన్నట్లు తెలియుచున్నది. పరిపాలనా సౌలభ్యం కొఱకు రాజ్యమును 'విషయములు' గా విభజించిరి. 12 నుంచి 100 గ్రామములు కలిసి ఒక 'విషయము' (డిస్ట్రిక్ట్స్) గా వ్యవహరించుచుండిరి.

విషయములను నాడులుగా తిరిగి విభజించి, ఒక్కొక్కనాడులో 12 నుండి 30 గ్రామముల వరకు ఉండునట్లు ఏర్పర్చిరి.[26] శ. 1074 (క్రీ. శ. 1102) న యిచ్చిన శాసనములో గొరవ - 30 అను ప్రస్తావన ఉన్నది.[27] అనగా గొరవ ముప్పది గ్రామములు గల ఒక పాలనా విభాగముగా ఉన్నట్లు తెలియుచున్నది. గొరవను నాడుగా పరిగణించినట్లు ఏ యితర ప్రస్తావన లేకపోయినప్పటికి యీ విభాగము యొక్క పరిధి 30 గ్రామము లుండుటచేత దీనిని 'నాడు' గా వ్యవహరించుటకు వీలున్నది. తూర్పు గాంగుల తదుపరి శాసనములను బట్టి విషయమునకు, నాడుకు భేదమున్నట్లు కన్పించదు. అటులనే కొన్ని దానములు కాంపుల ఆధీనములో ఉంచబడు చుండెడివి. శ. 1050 (క్రీ. శ. 1129) న యిచ్చిన దానము నావపల్లి కాంపుల ఆధీనములో వుంచబడినది.[28] 'కాంపులు' అనగా వ్యవసాయదారులు. ఊరిలోని వ్యవసాయదారులంతా కలిసి, ఒక సంస్థగా వ్యవహరించి యీ దానమును కాపాడు చుండెడివారు. ఈ విధమైన ఏర్పాట్లు దానములు సక్రమమైన రీతిని నడపబడుతూ, గ్రామ ఐక్యతను, ప్రజల విధి నిర్వహణాశక్తిని వృద్ధిపొందించుచుండెను.

ఈ దానశాసనముల వల్ల అప్పటి ఆర్థిక వ్యవస్థ స్థిరముగా ఉన్నదని ఊహింపవచ్చును. క్రమ పద్ధతిగల తూనికలు, కొలతలు, నాణెముల చలామణి, పటిష్టమైన ఆర్థిక వ్యవస్థను సూచించును. ఆర్థిక వ్యత్యాసము లేకుండా దానమిచ్చిన వారందరూ సమానముగా 6 మాడలు నీలీశ్వరునకు అర్పించిరి. నావపల్లి సువర్ణముఖినదీ తీరమునందున్నందు వలన వర్తకవాణిజ్యములకు నిలయమై వుండెడిది. అందుచే వివిధ వర్గములకు చెందిన ప్రజలు ధనమునే (మాడలనే) అర్పించిరి. వివిధరకములైన నాణెములు వాడుకలో ఉండెడివి. అవి సంధి మాడ, బిరుదమాడ, టంకమాడ మొదలైనవి. రాజులు, సామంతులు వారిపేర్లతో నాణెములు ముద్రించి చలామణి చేసెడివారు. అట్టివి రాజరాజమాడ, కులోత్తుంగమాడ మొదలైనవి. మొదపులను (పశువులను) అతి తక్కువగా యిచ్చు ఆచారము వుండుటకు కారణము లేకపోలేదు ఇప్పటికిని యీ ప్రాంతమందు పశు సంపద సమృద్ధిగా లేదు. అందువల్ల పశుదానము, ధనదానమంత విరివిగా సాగలేదు. భూదానములు కూడా చేయు చుండెడివారు. భూమిని సాధారణముగా గడలతో కొలుచుచుండెడివారు. 20 జేనల పొడవుగల గడను "జేనకోల" అనెడివారు.[29] శ. 1070 (క్రీ. శ. 1148) న యిచ్చిన శాసనములో దానము 'జేనకోల' పద్ధతి ప్రకారమే భూమిని కొలచి దైవభోగము నిమిత్తము అర్పించినట్లు ఉన్నది.[30]

ప్రజలు పుణ్యకాలములైన సంక్రాంతి, సూర్య, చంద్ర గ్రహణ సమయములలో దానము విరివిగా చేయుచుండిరి ఉదయ దీపము, సంధ్యాదీపము అని ప్రత్యేకించి యిచ్చిన దాన శాసనములు కూడ గలవు శ. 1040 (క్రీ. శ. 1119) లో శనివార భోగము జరుపుటకు శనివార మండపమును బనాపతి కట్టించెను.[31] ప్రజలు తమ పుణ్యమునకే కాక రాజుయొక్క శ్రేయస్సు కోరుతూ దానములుచేసి, వారి యొక్క రాజ భక్తిని, దేశ క్షేమాభిలాషని వ్యక్త పరచుచుండిరి.

దక్షిణ భారతదేశ దేవాలయములలో విశ్వకర్మ కులజులలో 'ఆచార్యులు' శాసనములను చెక్కెడివారు. నీలీశ్వరాలయ శాసనాంతమున శిల్పుల పేర్లుగలవు. వారు ప్రోలాచారి, కాపాచారి, పినోజు, భూమాచారిగా పేర్కొనబడ్డారు.

12 వ శతాబ్దమునకు చెందిన నీలీశ్వరాలయము వైభవోపేతంగా ఒకటిన్నర శతాబ్దములు ఉచ్ఛస్థితిలో వెలుగొందినది. 13వ శతాబ్దము తరువాత శాసనములులేకపోయిననూ ఆలయ నిర్వహణ బాగుగా సాగినది కనుకనే ఎనిమిది శతాబ్దములుదాటిననూ ఆలయ శిల్ప సంపద పటిష్టముగా నున్నది. తూర్పుగాంగులు 12వ శతాబ్దమధ్య కాలమందు వారి రాజధానిని ముఖలింగము నుండి కటకమునకు మార్పు చేయుట వలన కొంతవరకు శ్రద్ధాభక్తులు లోపించెను. 13వ శతాబ్దము తరువాత శాసనములు లేక పోవుటకు యిదియే కారణమై ఉండవచ్చును.

మధ్య యుగంలో వైభవోపేతంగా వెలుగొందిన నీలీశ్వరాలయము ప్రస్తుతము ఆలనా పాలనా లేక నామ మాత్రంగా నిలిచి యున్నది. కొద్దికాలం క్రితం రాష్ట్ర పురావస్తు పరిశోధన శాఖవారు యీ ఆలయాన్ని పరిరక్షణ చేయుటకు ప్రయత్నించడం ముదావహం. వినోద పర్యటన మరియు పౌరసంబంధ శాఖ వారు యీ నీలకంఠేశ్వరాలయాన్ని చూడదగ్గ స్థలముగా గుర్తించుట ఎంతైనా అవసరము.

సూచి

1. దక్షిణ హిందూ శాసన సంపుటి. 10, సంఖ్య 652,656,665,677
2. ద. శా. సం. 10, సంఖ్య 653, 676, 693.
3. ద. శా. సం. 10, సంఖ్య 653, 656, 694
4. ద. శా. సం. 10, సంఖ్య 652, 665, 676
5. కళింగ దేశ చరిత్ర, పేజీ. 348
6. ద. శా. సం. 10, సంఖ్య 653
7. ద. శా. సం. 10, సంఖ్య 715
8. ,, ,, ,, ,, ,, 695
9. ,, ,, ,, ,, ,, 658
10. ,, ,, ,, ,, ,, 659
11. ,, ,, ,, ,, ,, 672. 692
12. ,, ,, ,, ,, ,, 679
13. ,, ,, ,, ,, ,, 715
14. ,, ,, ,, ,, ,, 653
15. ,, ,, ,, ,, ,, 716, 704
16. ,, ,, ,, ,, ,, 703
17. ,, ,, ,, ,, ,, 671
18. ,, ,, ,, ,, ,, 667
19. ,, ,, ,, ,, ,, 716
20. ద. శా. సం. 10, సంఖ్య. 703 శాసన పదకోశము పేజీ292
21. ,, ,, ,, ,, ,, 671 శా. ప. కో. పేజి
22. ,, ,, ,, ,, ,, 667 శా. ప. కో. పేజి. 259
23. ,, ,, ,, ,, ,, 679
24. ,, ,, ,, ,, ,, 679, 654
25. ఎడ్మినిస్ట్రేషన్ అండ్ సొసయిటీ ఇన్ మెడీవల్ ఆంధ్ర — డాక్టరు సి.వి. రామచంద్రరావు, పు. 228
26. —అదే— పు. 125
27. ద. శా. సం. 10, సంఖ్య. 654
28. ,, ,, ,, ,, ,, 671
29. ఆంధ్రుల సాంఘిక ఆర్థిక చరిత్ర, పేజి. 137
30. ద. శా. సం. 10, సంఖ్య 716
31. అదే 661

పుస్తకాలు:—
1. కళింగదేశ చరిత్ర
2. జర్నల్ ఆఫ్ ఆంధ్ర హిస్టారికల్ రిసెర్చి సొసయిటీ వాల్యూమ్‌లు
3. ఎడ్మినిస్ట్రేషన్ అండ్ సొసయిటీ (డా॥ సి. వి. రామచంద్రరావు)

సృష్టి

శ్రీ తిరునగరి

చీకట్లను పారద్రోలి ఎర్రగా నవ్వే ఉదయమై
ఉదయంలో సరోవరంలో విరిసే కమలమై
కమలం నుంచి కమ్మగా వీచే పవనమై
పవనం సోకి పరవశించే హృదయమై
హృదయంలోంచి ఉబికే రసఝరమై
నాగీతం!

మి నీ క వి త లు!

పెద్ద చేపలు
చిన్న చేపల్ని మింగుతుంటాయి
కాని
ఈనాడు

చిన్న చేపలే
పెద్ద చేపల్ని
మింగు తున్నాయి
అందుకు ప్రబలసాక్ష్యం........!!

నీ లి రా గ ం!

ఉచ్ఛారణ దక్షుచేత
అభిహితంబయిన
శబ్దంలా

వృద్ధి పొందుతుండేది !
వర్ధిల్లుతుండేది !
నిర్యాణమే లేనిది!

ని ర్దో షా క ర ం!

సుధాకరునిలోనూ
కళంకం ఉంటుంది
ఆ మసక
కన్పించంది
ఒక్క — మాతృ ప్రేమలోనే!!

శ్రీ కె. కిశోర్‌బాబు

శ్రీ కె. అశోక్‌బాబు

శ్రీ ధూర్జటి వేంకట బాలాజి

దీపాల వారి కవిత

దీపాల పిచ్చయ్యశాస్త్రిగారి పేరు వినగానే వెంటనే జ్ఞాపకం వచ్చేది ఆయన విమర్శ. ఈ తరం వారికి ఆయనగొప్ప పరిశోధకునిగా, చురుకైన విమర్శకునిగా, నిశిత వ్యాఖ్యాతగా మాత్రమే పరిచితులు. కాని ఆయన రెండవమూర్తిని ఆయనలోని భావుకుని చాలామంది ఎఱుగరు.

విపులమైన ఆయన సాహిత్య సమీక్షలు పదులమీది పరిశోధకవ్యాసాలు, సారంగధర వ్యాఖ్యానం, ఆయనలోని భావుకుణ్ణి కప్పివేసి, ఆయన్ను ఒక పట్టువిడవని విమర్శకునిగా ప్రతిష్ఠించాయి.

నిజమాలోచిస్తే ఆయన సారస్వత జీవితం కవిత్వంతో ప్రారంభమైంది. ఆయన సాహిత్యకృషికి అంకురార్పణం 1913లో "భక్తకల్పద్రుమం" అనే శతకంతో జరిగింది. తర్వాత ఒకటి వెంట ఒకటిగా ఆయనచేతినుండి పలు ఖండకావ్యాలు వచ్చాయి. "కాలం, నెల్లూరు గాలివాన" వంటివి ఒకజాతికిచెందగా, 'భారతి, సువర్ణమేఖల, ప్రణయకుసుమం' వంటివి ఇంకోజాతికి చెందినవి.

ఆయన సంప్రదాయబద్ధమైన సంస్కృతాంధ్ర సాహిత్యాలలో నిష్ణాతులైనా, ఆయనచూపు ఆ సంప్రదాయపు పరిధిలోనే నిలిచిపోకుండా అధునిక యుగంమీదికి ప్రసరించడం ఒకవిశేషం. అయితే సంప్రదాయబద్ధులూ, కాకపోతే ఆధునిక సాహిత్య జీవులు అవడం ఆనాటి సమకాలీన పండితుల లక్షణం. కాని ఈయన సంప్రదాయ భూమిక మీద పాదాలు గట్టిగా నిలద్రొక్కుకొని ఆధునిక భావప్రకటనంమీద ఆసక్తి చూపించారు. ఆయన ఆధునిక భావదర్శనం 'కాలం' అనే ఖండకావ్యంలో స్ఫుటంగా కనబడుతుంది. ఆనాటి సమస్యలను పట్టించుకొని ఈయన 'కాలం' అనే కావ్యంలో వ్రాసిన పద్యాలుచూడ దగ్గవి. భారతీయుల పరాధీనత, కన్యాశుల్క దురాచారం, వరశుల్కపు అనాచారం, ఈయన మనస్సును ఎంతగా నొప్పించాయో ఈ పద్యాలవల్ల తెలుస్తుంది. ముందుగా భారతవీరుల శక్తిసామర్థ్యాలను వ్యక్తంచేస్తూ-

"భారతభూమి నిప్పటికి భారతవీరుల వింటి మ్రోతలున్
వారల సింహనాదములవారిగవారక మాఱు మ్రోగెడిన్
వైరులగుండియల్ పగుల; వాని ప్రయోజన మేమి యింతకున్
నీరసులైరి హైందవులు, నీదయలేమిని జేసి కాలమా!"

-అనే పద్యంలో కాలంయొక్క నిర్దయను గురించి తమ ఆవేదనను వ్యక్తంచేస్తారు. మరొకచోట కన్యాశుల్కపు అనాచారాన్ని గురించి—

"కన్యాదాన శుభక్రమాచరణ విఖ్యాతాంధ్రులన్ మాయురే
కన్యావిక్రయ పాపకార్య కరణాఖండ ప్రభావాదికుల్
అన్యాయార్జిత విత్తవంతులు సనహ్యాచార విస్తార దా
ర్జన్యుల్ చేసితివేమి నేర్పిది పిశాచప్రాయ దుష్కాలమా!"

—అని విచారిస్తారు. మరొకచోట వరశుల్కపు అనాచారానికి జీవితాన్ని పణంగాపెట్టిన స్నేహలతాదేవిని స్మరిస్తూ—

"ఈ వరశుల్కబాధకయి, యీపఱకెందఱు పూవుఁబోఁడులో
హా, విమలాంగపల్లుల, హుతాశన కీలల పాలుజేసిరి
స్వీ! వివరింపనేమిటికి స్నేహలతాదుల నీవెఱుఁగవే
ఈ విలయంపు దుర్గతి యిఁకెన్నటికంతమునందుఁ గాలమా!

అని ఉద్వేగంతో ప్రశ్నిస్తారు.

నెల్లూరుకు కనివినియెరుగని గాలివాన వచ్చినపుడు యావత్ప్రాణీకం ప్రకృతి గావించిన విలయతాండవానికి భీతావహులై తమ ఇలవేల్పైన రంగనాథుని మిగిలిన దేవతలను తలచుకొని ఎలా వాపోయినారో ఇట్లాచెప్పారు.

"లాతి పోలికను మూలస్థానమును వీడి
శంకరా! కదలవు స్థాణువుపలె :
నిద్దుర చాలించి నేఁడైన సాయమ్ము
రవ్వంత రావయ్య రంగనాథ!
నీ తండ్రితోఁ జెప్పియీతఱి మమ్మెట్లొ
బ్రతికింపరా! ప్రకంపన కుమర!
ఉండ్రాళ్ళ బండితో బండె దర్పించెద
గణపతీ కరుణించి కావవయ్య!

వెడలి రండయ్య! యో యిలువేల్పులార!
చచ్చిపోవుచునుంటి మాసార సహిత
చండవాత మహాహతి విండ్లుగూలి
యనుచు, బ్రార్థించి రొకకొంద అధికభక్తి!"

ఇట్లాంటి రచనలు ఆత్మాశ్రయమైన ఖండ కావ్యజాతికి చెందితే- భారతి, సువర్ణమేఖల, ప్రణయకుసుమం కథావస్తుకములైనవి 'భారతి' కావ్యంలో ప్రహతంగా పేర్కొనబడే___

"భూపతిఁజంపితిన్ మగఁడు భూరి భుజంగము చేతఁజచ్చె"

-అనే చాటుపద్యంద్వారా యావత్కావ్య కథావృత్తాంతం నివేదింపబడుతుంది. కాని ఈ పద్యానికి లోకంలో "కులట" అని అర్థం చెప్పడమైంది. కాని దానిని ఒకసాధ్వీమతల్లి పరంగా వ్యాఖ్యానించి పద్యంలోని ఒక్కొక్కదళాన్ని ఒక్కొక్క ప్రకరణంగాచేసి, ఆమె తనశీలాన్ని ఎలానిలుపుకుందో వివరించి పాఠకుల్ని ఆశ్చర్య చకితులను చేస్తారు.

'సువర్ణమేఖల' 'ఎరువుసొమ్ము బరువుచేటు' అన్న దానికి చక్కని రూపకల్పన 'గైడిమొపసా' 'నెక్లెసు' అనేకథతో పోలికలు ఉన్నా, లోకంలో ప్రచారంలోఉన్న అట్టిదే ఇంకోకథను తీసుకొని ఒక భార్యాభర్తల జంట ఎరువుసొమ్ముతో ఎన్నిబాధలు పడ్డారో చక్కగా వ్యాఖ్యానించారు.

ఇవన్నీ ఒకఎత్తు ప్రణయకుసుమకావ్యం ఒక్కటీ ఒకఎత్తు. ప్రణయకుసుమం పేరెత్తితేనే ఒక భావకావ్యంలా వినిపిస్తుంది. ప్రణయం-ప్రేమ ప్రధానవస్తువులుగా తీసుకొని భావకవులు చాలా కావ్యాలు వ్రాశారు. సరిగ్గా ఆకోవకేచెందకపోయినా,ఆవాసన ప్రణయకుసుమంలోఉంది. శాస్త్రిగారి పాండిత్యప్రకర్ష క్రొత్త నాజూనుకు సంతరించుకొని ప్రణయకుసుమంలో ఒదిగి ఇంపు పుట్టిస్తుంది. ఇది కేవలం శాస్త్రిగారి స్వకపోల కల్పితకథకాదు. భర్తృహరి వ్రాసిన 'నిర్వేద' నాటకాన్ని ఆధారంగా తీసుకొని మక్కీకి మక్కీగా కాక తుదినఉన్న నిర్వేదంమార్చి సుఖాంతంచేసారు.ఇందులో నాయికానాయకులు మల్లికా వసంతులు-వారుదంపతులు. వారిగాఢప్రేమ-అన్యోన్య ప్రీతి-సుకుమారమైన గీతపద్యాలలో ప్రసంగశైలిలో వినిపిస్తారు.

ప్రణయకుసుమ కావ్యంలో నాలుగు అంశాలు ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. అవి ప్రకృతివర్ణన, మనస్తత్వ పరిశీలనము, అగ్నిపరీక్ష ప్రేమౌన్నత్యం-అనేవి. కావ్యంలోని మొదటిదళంలో సతీపతులు మల్లికావసంతులు ఉపవనవిహారానికి వెడతారు. వారు అనురాగబద్ధ జీవనులు, ప్రేమైకమూర్తులు. అందమైన తోటలో వసంతునికొరకు వేచియున్నమల్లిక-పురుషునికొరకు వేచియున్నప్రకృతివలె ఉందట। ఆ సందర్భంలో ప్రకృతిశోభకు పరవశించిన వసంతుడు___

"శుకపికశారికాళికుల సుస్వర భాస్వరతానమొప్ప, వా
రకముహరాచల త్పృథుతరంగ మృదంగరవంబె సంగగా
బ్రకృతి రహస్యముందలచి పాడుచునున్నది భావగీతముల్
సకియరొ! యాసరిద్రమణి సారతరుల్ తలలూచి మెచ్చగన్"

అంటాడు. రమణీయమైన ప్రకృతి శోభకు వసంతుడేకాదు. ప్రతి రసహృదయం స్పందిస్తుంది.

ద్వితీయ దళంలో ప్రేమికులైనటువంటి మల్లికా వసంతుల ప్రేమకు ఒకసార్థకత ఏర్పడుతుంది. వారిరువురిమనసులు గాఢప్రణయంతో పెనవేసుకున్నాయి. ఒకనాడు వారిరువురికి సతీసహగమన దృశ్యం కనబడింది. చనిపోయిన పతికొరకు జీవితం అర్పించేసతి గొప్పదని వసంతుడు అంటే, పతిచనిపోయిన వెంటనే, ఆవార్తవిన్న సతిప్రాణాలు వదలడంలోనే నిజమైన ప్రేమఉంది. కానీ ఈ సహగమనం వట్టి ఆడంబరం, అని అంటుంది మల్లిక. ఇక్కడవారిరువురి మనస్తత్వాలను విశ్లేషిస్తూ కవివసంతుని మాటగా___

"కాంత వనంబునందుఁ గసుఁగందగనీక మృదూక్తి యుక్తులన్
గాంతుడు పుల్కిపుచ్చెలలనా! యిపుడీవు వచించినట్టి వృత్తాం
తము ప్రేమతత్వము, నితాంతము స్వాంతము ఁదన్పెమేలు మే
లింతటి తత్త్వవేత్త్రివనియే నెరుగంజుమి యంచు పంచనన్"

అంటాడు. వసంతుడు తుదకు గంభీరంగా తలఊచి మల్లిక ప్రేమ ఎంతటిదో పరీక్షించాలని నిర్ణయించుకున్నాడు.

తృతీయదళం మల్లికకు ఒకఅగ్నిపరీక్షలా భాసిల్లుతుంది. శుక్రవారపునోమునోచి గౌరీపంచాక్షరీవ్రతాన్ని పట్టినమల్లిక ముత్తైదువులను యథోచితంగా పూజించి వారివల్ల తగు ఆశీర్వాదాలను పొందుతుంది. ఇంతలో ఒకవార్తాహరుడు వచ్చిహఠాత్తుగా వసంతుని మరణవార్త తెల్పగా 'హా! వసంతా!' అంటూమల్లిక మరణిస్తుంది. మరికొంతసేపటికి వసంతుడు తనపరీక్ష ఏమయిందో చూడటానికి ఇంటికివచ్చాడు. తన అగ్నిపరీక్షకు ఆహుతియైన మల్లిక మరణానికి మిక్కిలి విలపిస్తాడు.

"పతిమృతివార్తవిన్న బయిప్రాణముతోడను నిల్చునే? పతి
వ్రత యని నీవునాడనిన వాక్యము నమ్మకనే భువన్మనో
గతినిఁ బరీక్ష సేయఁగఁగు కల్పనజేసితి నిన్నుఁ గోలుపో
యితినయొ మందభాగ్యుడవిసీ! కడుబాపిని సుమ్ము ప్రేయసీ!"

మల్లికను తాను పరీక్షిస్తే తన్ను ఓదార్ప వచ్చిన మునీంద్రుడు తన్ను పరీక్షించాడు. యోగి తన చేతి కమండలాన్ని పగులగొట్టి దానికొఱకు విలపిస్తాడు. వసంతుడు ఆశ్చర్యపడగా ముని -

"మృణ్మయంబని నిరసించె దేటికోయి
ప్రేమ తత్త్వంబు నెఱుగని పిన్నవాడ!
మృణ్మయంబైన కాక హిరణ్మయంబె
యైన వెలసమమే ప్రణయాపణమున"

— అంటాడు. దీనినిబట్టి ప్రేమతత్త్వమేమిటో మనకు విదిత మౌతుంది. తుదకు మునీంద్రునిచేత బ్రతికింపబడిన మల్లిక వసంతునితో సుఖదాంపత్యం నెరపుతుంది.

ప్రణయకుసుమ కావ్యానికి మూలమైన 'నిర్వేద' నాటకంలో శాంత రసం ప్రధానపాత్ర వహిస్తే, ప్రణయకుసుమ కావ్యంలో ప్రణయం గెలిచింది. ఇట్లాగే గీతగోవిందకర్తయైన జయదేవుని భార్య పద్మావతీదేవి మరణించగా — తుదకు లక్ష్మణసేన మహారాజు దంపతులు జగన్నాథుని ప్రార్థించగా — ఆమె బ్రతుకుతుంది. ఇక్కడ మల్లిక మునీంద్రునిచే పునర్జన్మను పొందుతుంది. ఇక్కడ భర్తే ఆమె ప్రేమను పరీక్షించ నెంచితే అక్కడ లక్ష్మణసేనుని భార్య పద్మావతీ దేవిని పరీక్షిస్తుంది. తుదకు ఈ రెండింటిలో ప్రేమే గెలుస్తుంది. ఉత్తమ ప్రేమకు విజయం కలగడమే ప్రణయకుసుమ కావ్య పరమార్థం.

కథా వస్తువులను తీసుకొని స్వతంత్రకావ్యాలు వ్రాయడమే కాకుండా సంస్కృతం నుంచి ఎన్నో ఇంపైన అనువాదాలు చేసారు. ఈయన తక్కిన పద్యరచనలన్నీ ఒక ఎత్తు. మేఘసందేశపు తెనిగింపు ఒక్కటీ ఒక ఎత్తు. కాళిదాసు మేఘసందేశంమీద మోజుపడి ఇప్పటికి కొన్ని పదులమీద ఆంధ్రీకరణలు వచ్చాయి. కాళిదాసు మాట ఏదీ పొల్లుపోకుండా తెలుగులోకి దించడమే సరియైన ఆంధ్రీకరణం అని అంతా అనుకొంటే, శాస్త్రిగారు ఒక్కరే విశిష్టంగా ఆలోచించి మేఘదూతను తెనిగించారు. అసలు మేఘదూత రెండు సర్గలూ నూట ఇరవై నాలుగు శ్లోకాలైతే, ఈయన నూటఎనభై ఎనిమిది పద్యాలుగా తెనిగించారు. అయితే ఇంత గ్రంథం ఎందుకు పెరిగింది? ఈయన ఒక్కరే కాళిదాసు మాటల్ని కాకుండా ఆమాటల వెనుక ఉండే రమ్య భావనను తెలుగులోకి తెచ్చారు. ఈ దృష్టి సంస్కృతంనుంచి తెనుగుచేసిన పూర్వమహాకవులందరికీ ఉండేది. తరువాత లోపించింది. ఏనాడో లోపించిన గొప్పరసదృష్టిని, ఈయన మేఘదూతలో పునరుద్ధరించారు. కనుకనే తెలుగు మేఘదూత అంటే విధిగా దీపాలవారిదే జ్ఞాపకం వస్తుంది. ఉత్తరమేఘంలోని యక్షుని విరహావస్థను ముందుకు తెచ్చి వివరించడం చాలారసస్ఫోరకమైంది.

"లలితంబగు ప్రియంగులతఁజూచి తలయూఁచుఁ
గనులారఁ జికితరంగముల నరయుఁ
బుష్పగుచ్ఛముల నొంపుల నెంచి పులకించు
బర్హిబర్హము సొరెఁబార దూఁచుఁ
బరిపక్వ బింబంబుఁ బలుమరుఁ బరికించు
నలికిన లేటి చూపుల్క్కలను వలచుఁ
దలిరుటాకుల మెత్తఁదనమిచ్చఁగడు మెచ్చుఁ
జిలుకు పలుకులకుఁ జెవియొసంగుఁ
బ్రకృతి సౌందర్య తత్త్వార్థ పాఠపఠన
రీతియో: కాక పూర్వాను భూతరమ్య
వస్తు సంస్మరణ క్షణపరవశతయొ;
కవికుమారుడొ, యాతండు కాముకుండొ!"

అంటాడు మేఘదూత' కావ్యంలో పేర్కొనదగిన మరొక గొప్ప ఘట్టం 'ఉజ్జయినీవర్ణన' మేఘుడు యక్షుడు చెప్పిన అలకాపురిని చేరడానికి తగు మార్గాన్ని చూపుతూ మధ్యేమార్గంలో వచ్చే ఉజ్జయినీ నగరాన్ని, దాని శోభను వివరిస్తాడు.

"కిటికీల వెడలెడు కేశసంస్కార ధూ
పమ్ములచే నింత బలుపుగనుచు
భవనమయూరముల్ బాంధవప్రీతిచే
నలుపు నృత్యములఁ గానుకలుగఁ గొనుచు
మేడలఁ గామినీ మృదుపదరాగాంకి
తములను నేత్రోత్సవముగఁ గనుచు
మొగి గృహాలంకారమునకయి చల్లిన
పూవుల సౌరభంబులను గొనుచు
నుజ్జయిని సౌధవీథుల నొయ్య నొయ్య
విహరణము సల్పుచును బురీవిభవమందుఁ
గొంతకొంతైనఁ గనుచు విశ్రాంతిఁ గొనుచుఁ
బొపుకొనుమయ్య, సఖుడ, అధ్వశ్రమంబు."

— ఉజ్జయినీ నగరవర్ణన తరువాత పేర్కొనదగినది యక్షుని కాపురం : అలకాపురం.

"అళిబృంద సంగీతములతోడ నొప్పు వృ
క్షమ్ములు నిత్యపుష్పమ్ములగుచు
గొలకుపు లంచబారులు మొలనూళ్లుగా
దనరారు నిత్య పద్మమ్ములగుచు
నలరుఁ గేకోత్కంఠములయి బర్హులు నిత్య
భాస్వదుచ్చైః కలాపమ్ములగుచు
హవణిల్లు నిశలు నిత్యజ్యోత్స్నలయి ప్రతి
హతతమో వృత్తి రమ్యమ్ములగుచు

వప్పురంబున; నదియుఁగా కఁబువాహ
నిత్యయౌవనకలితులు : నిత్యసఖులు
నిత్యసంపత్సమృద్ధులు నిత్యభోగు
లచటఁ గాపురమున్నట్టి యక్షులెల్ల"

– తర్వాత దీపాలవారు చూపే క్రొత్త వెలుగులో విరహిణి యక్షకాంత ఇట్లాకనబడుతుంది.

"తలయంటులేని క్రుంకుల బిరుసెక్కి చె
క్కుల నంటిన్రేలు ముంగురుల దాని
చెక్కుల జీరాడు చికురమ్ములను సారె
కోరగావించు నిట్టూర్పు దాని
నిట్టలమగు వేడి నిట్టూర్పు సెకలచే
బొలిపోవు చిగురు కెమ్మోవి దాని
కలనైన నా పొందు కల్గునేమోయన్న
పేరాస నిద్దురఁ గోరుదాని
కోరినను నిద్రరామిని సారె సారె;
గడలుకొను దుఃఖభరమునఁ గన్గొలకుల
నిండి కాల్వలగట్టు కన్నీటి దాని
గాంతువు సఖుండ! హృదయంబు కరిగిపోవ"

తరువాత కురుక్షేత్ర దర్శనం. ఇందు ఆనాటి తెలుగుకవి మీద స్వాతంత్ర్య జాతీయోద్యమ ప్రభావం ముఖ్యంగా గమనించదగ్గది.

"ప్రీతి రణభూమి కసువులర్పించినట్టి
భరతపుత్త్రుల రక్త ప్రవాహతతులు
పాలిపాయలు గట్టినపట్టులచటఁ
గన్పడును, నేఁటికిని మేను గగురుపొడవ
వరుసనచ్చటఁ బొడకట్టు భారతీయ
కదనవీర కపాల కంకాళసమితిఁ
గన్నులారఁగ నొకపరికన్నఁ జాలుఁ
బందకైన మగంటిమి పరిఢవిల్లు"

పరిసమాప్తిలో అందరిలాగే మేఘుడు వెళ్ళి సందేశం చెప్పినట్టుగాకాక, అతడు తనదారిన తాను ఎగిరి పోయినట్టుగా చెప్పడం కవి హృదయం-అని ఈయన చేసిన పరిష్కారం ప్రశంసించదగ్గది!

ఈయన మేఘ దూతనే కాకుండా కొన్ని భాసనాటకాలను కూడ ఔనన్నట్టు తెనిగించారు. అందులో కూడా ఈయన సన్నివేశాన్ని బట్టి, సందర్భాన్ని బట్టి కవి హృదయాన్ని సముచితంగా స్వతంత్రించి వ్యాఖ్యానించారు.

ఆయన కవిగా బయలుదేరి, విమర్శకునిగా రాటుదేలి, పరిశోధకునిగా స్థిరపడినప్పటికీ ఆయన వ్రాసిన ప్రణయకుసుమం, మేఘదూత వంటికావ్యరచనలు ఆయన్ను రసవత్కవిగా నిరూపిస్తాయి.

స్వయంగా గ్రాంధికవాది అయినా వ్యావహారిక భాషావాదపు ఔచిత్యం గ్రహించి, అవసరమైనచోట తానుకూడా వ్యావహారిక భాషనువ్రాసి తన సమతాదృష్టిని వెల్లడించారు. ఏనాడూ బిరుదాలకు, ప్రశంసలకు తలఒగ్గని వినమ్రమూర్తి ఆయన.

పలనాటి మండలములో జన్మించి, సింహపురిసీమలో స్థిరపడి, ఆధునికాంధ్ర సాహిత్యంలో తనదైన ముద్ర నిలుపుకొని కవిగా, గొప్ప భావుకునిగా_సాహితీప్రియులహృదయాలలో చెరగిపోని స్థానం సంపాదించుకొన్నవారు శ్రీ దీపాలవారు.

బ్రతుకుతెరువు కోసం తెలుగుపండితుడై, ఆంధ్ర సాహిత్యానికే బ్రతుకుతెరువు చూపిన ధన్యులు శాస్త్రిగారు.

సాహిత్యమే ఆయన జీవితం, సాహిత్యమే ఆయన సంపద, సాహిత్యంకొఱకు పుట్టి, సాహిత్యంతో ఎదిగి, సాహిత్యమే జీవనోపాధిగా జీవిస్తున్న సహస్ర మాసాధిక జీవి శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి గారు.

* చరంశ్చరైవేతి

డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు

యుగయుగముల సుప్రభాతములు
దివ్య పారిజాతమ్ములు చేసి
తరతరముల నవ వసంతములు
ప్రభారవింద గీతమ్ములు చేసి
విశ్వమానవ భావకిరణాల కైంకర్యము గావించి
కైవరించెద కైమోడ్చెద అవధరింపుమో ముకుంద!
మాన్యహృదయ సంస్కార కల్హారాల నైవేద్యముగ ఉంచి
కేరించెద కేళించెద అలరింపుమో గోవింద!

సంవత్సరాదుల చైతన్యము
సుసంపన్న భాగ్యోదయాంతరంగము
ఉగాదుల నవనవోన్మేషము
సవిస్తర సతతహరిత సచ్ఛీల సంభావము
మంత్ర పుష్పమ్ముగా
గాయత్రీ జపమ్ముగా
బహూకరించు భాగ్యమిమ్మని వినతి!
భాగ్యాతి భాగ్యుడనై భవహరింప ఆనతిమ్మని మనవి!
తారంగమో ఎదమడుగుల!
తాండవమో గుండె కొండెల!

అనురాగామృత జీవతత్త్వము
అనంతానంత జవసత్వము
విద్యుద్విచలిత విచిత్రరూపము
విద్వద్వికసిత విపరీత దీపము
సామవేదమ్ముగా
గురువాదమ్ముగా
సమర్పింప సమ్మతించమని వేడికోలు!
సమర్పణలో ఆత్మార్పణము గావింప వెన్నెలకోలు!
మృదంగనాదమో మమతా పొదరిండ్లు!
మృదుగంగా నాదమో మానవతా పాలిండ్లు!

సుశాస్త్రవికాసము
సమగ్ర చరిత్ర సారము
అమిత గణిత ప్రాభవము
విచిత్ర గణాంక విన్యాసము
భక్తి గీతమ్ముగా
భక్తజన నాట్యమ్ముగా
అందించ అనుమతించవని అభ్యర్థన!
అందించుటలో నన్నానందింప జేయుమని విజ్ఞాపన!
ఖగోళ భూగోళ ఆబాలగోపాలము నా కండ్లు!
సాగరాకాశ సమస్త విజ్ఞానతీరము నా పిడికిళ్ళు!

ఈ మహత్తర క్షణంలో
లోకోత్తర రసస్పందనలో
అజ్ఞతని నీవనుకొన్నను సరే నీకోసంగతి చెప్పవలె!
మరి వ్రాకుచ్ఛ నాకు దయతో శక్తి నొసంగవలె!

సాహిత్య కవిత్వములు రసతప్త నృత్యములు
సాంకేతిక సమీకరణములు రసాయన వైనములు
భౌతిక పరిశీలనలు భౌమిక పరిశోధనలు
మానవ సునిశిత మేధో శిల్పసంపదలు మధుర మానస
మనోహరాగ్రహారములు
దారితప్పుతున్నవి లక్ష్యశుద్ధిలేక!
అడ్డుదారి త్రొక్కుతున్నవి ఆత్మశుద్ధి కనరాక!

ఆర్థిక ధోరణులు సాహార్ద్రిక పరమార్థిక యోచనలు
ఆకలిదప్పికల సమస్యలు కామవిదర్పికల కార్చిచ్చులు
వయోజరాభారాలు నిత్యశాంతి రాయబారాలు
ప్రపంచయుద్ధభయాలు మారణాయుధాల బెదరింపులు
ప్రజ్వరిల్లుతున్నవి ప్రళయాన్ని తెస్తూ!
ప్రవహిస్తున్నవి ఉత్పాత జలపాతములు ఉరకలేస్తూ!

రశ్మ్యాగారక రణరంగాలు రాటుదేలిన చండశాసనాలు
ప్రాథమిక హక్కుల పోరాటాలు స్వజాతి విజాతి
సంఘర్షణలు
సంగటిముద్దల సంకటాలు ధన ప్రాణ మాన రక్షణల
పెనుగులాటలు
రాజకీయాల అరాచక తగవులాటలు అధికారంకోసం
ప్రాకులాటలు

ఎన్నో!
ఎన్నెన్నో!
క్రోధానికి ఆజ్యం పోస్తున్నవి!
ప్రేమను అగ్నికి ఆహుతి చేస్తున్నవి!

నీ పేరుచెప్పి బ్రతుగ్గడిపే గడుగ్గాయిల దొమ్మరాటలు
నిన్నే మ్రింగేసి శుభ్రంగా భోంచేసే పెద్దమనుషుల
మైకం మాటలు
ముసుగులో గ్రుద్దులాటలు
పొదుగు క్రింద కాలనాగులు
ఇలా ఎన్నో!
ఇంకా ఎన్నెన్నో!

నీకు తెలియదని కాదుకాని
నావంతు చెల్లించుకోవాలని నీకు తెలియ జేస్తున్నాను!
నీవు చర్య తీసుకోవని కాదుకాని
త్వరితంగా తీసుకోవాలని నిన్ను వేడుకొంటున్నాను!
నామొరాలకించి విశృంఖలించవా!
నా ఆర్తినందుకొని దేదీప్తించవా!

ఏమిటిదీ పరమాత్మా!
నీ గర్భగుడిలో దీపమారిపోయింది!
ఈ గుండెగదిలో చీకటి నిండుకొంది!
ఒక్కక్షణం తండ్రీ! పరాత్పరా!
ఇదిగో, వెలిగించాను దీపం!
చూడెంత వెలుతురో ఇంకెందుకు భయం!

ఎవరిదా నవ్వు?
పులకరింపజేసే ఆ నవ్వు?
తన్మయం!
చిన్మయం!

"పిచ్చివాడా!
ఇప్పుడు దీపమెలిగించింది ఆ భగవంతుడా?
భలేవాడివే!
ఆ దేవుడెప్పుడో నీలో దీపమెలిగించాడని నీకు తెలియదా?
ఆ వెలుతురులో
మంచి దారొకటి నీవే చూచుకోవాలి!
ఆ దారిలో
నీవారిని నీవే రప్పించుకోవాలి!
ఎవరికి వారే మేలు కొనాలి!
మేలుకొని ముందుకు నడవాలి!"

ఎవరన్నట్లు!?
అయినా నే విన్నట్లే?
అర్థమయింది ప్రభూ!
పరమార్థం గోచరించింది!
ఇదిగో సూర్యుణ్ణి లేపుతున్నా....
నా ఆత్మారాముణ్ణి మేలుకొలుపుతున్నా....
కార్యదీక్షను అందించిన
నీ ధర్మభిక్ష చాలు!
జాతిశక్తికి నీవిచ్చిన
ఈ రామరక్ష చాలు!

[* ఇది ఐతరేయ బ్రాహ్మణ మంత్రము. నడు, ముందుకునడు! అని అర్థం]

శ్రీ టి. చంద్రశేఖర రెడ్డి

మినీకవిత - మరొక పరిశీలన

ఈ మధ్యన మినీకవిత మీద చర్చలు అనేకం జరుగుతున్నయ్. పత్రికల్లో రగడలు రగిలినయ్. మినీకవిత స్వరూప స్వభావాలను గురించీ, అది పాఠకలోకానికి అందిస్తున్న ప్రయోజనం గురించి విభిన్న భావాలు వ్యక్తమవుతున్నయ్.

పూర్తిగా వివిధ కవుల మినీకవితల్తో నొక సంకలనం వెలువడింది (మినీకవితా విప్లవం- సంకలన కర్త శ్రీ కొల్లూరి). మినీకవిత గుణగణాలని సమగ్రంగా సంశ్లేషిస్తూ వో వ్యాస సంపుటి వెలుగులోకి వచ్చింది (మినీకవిత- రచయిత శ్రీ అద్దేపల్లి రామ మోహనరావు).

సాహితీలోకంలో ఇంత సంచలనం, పాఠక సమూహాల్లో ఇంత కలకలం సృష్టించిన, సృష్టిస్తున్న మినీకవిత పూర్వాపరాల మీద వో చిరు అవగాహనా కోరకం వికసింప చేసేందుకు చేసిన స్వల్ప యత్నం ఈ వ్యాసాంగం.

మినీకవిత అంటే

మినీకవిత అంటే హ్రస్వకవితగా అర్థం చెప్పుకోవచ్చు. హ్రస్వత పదరాశిదే కాని భావవాసిది కాదు. స్వల్ప పద పరిధిలో ప్రతిభావంతంగా— అర్థం పాఠకుని మేధకు సూటిగా ఘాటిగా తాకేలా చేసేందుకు వో నూత్న వాహిక మినీకవిత. శ్రీ అద్దేపల్లి రామ మోహనరావుగారు చెప్పినట్లు మినీకవితకి ఉచ్ఛ్వాసం "క్లుప్తత", నిశ్వాసం "ధ్వని".

కొందరి దృష్టిలో మినీకవిత వచన కవిత్వపు సంక్షిప్తరూపం. మరికొందరి దృక్పథంలో అది వచన కవితా యౌవనరూపం.

గతంలో మినీకవిత పువాదులు :-

వొక సంపూర్ణ భావానికి మినీకవితలాంటి రూపదానం చెయ్యటం నూతనం కాదు. ప్రాచీన కాలంలో సైతం ఉన్నదే. మినీకవితకి ప్రస్తుతం వున్న వస్తు భాషాస్వరూపాల్ని వొక ప్రక్కన వుంచి, మినీకవితకు ప్రాణాధారమయిన మూలశక్తివి అవగాహనకు ఆధారంగా ఎంచుకుంటే; శాలివాహన సప్తశతి, సంస్కృతాంధ్రాల్లోని చాటువులు, శతకాదులు మినీకవితాధోరణికి సమీపంగా వుండటం గమనించవచ్చు. కొన్ని నాటకాల్లో కావ్యాల్లో కొన్ని భావ వ్యక్తీకరణలని మినీ కవితలుగా దర్శించవచ్చు. ఉదాహరణకి మృచ్ఛకటికంలోని వొక పద్యంలోని ఈ భావం—

"చావులో, ధరిద్రంలో
చావేనయం దరిద్రం కంటే
ఆ సమయంలో మాత్రమే దుఃఖమిస్తుంది చావు
చచ్చేదాకా దుఃఖమిస్తుంది దరిద్రం"

కాక - ఉమర్ ఖయ్యాం రుబాయీలనీ గాలిబ్ గీతాల్లాంటి ఉర్దూకవితల్ని కూడా మినీకవితలుగా భావించవచ్చు. గురజాడ కలం నుంచి వెలువడిన కవిత్వంలో కూడా మినీకవిత లక్షణాలని అక్కడక్కడ చూడవచ్చు. ఉదాహరణకి ఈ నాలుగు పంక్తులూ—

"మనిషి చేసిన రాయి రప్పకి
మహిమ కలదని సాగి మొక్కుతూ—
మనుషులంటే రాయి రప్పలకన్నా
కనిష్ఠంగా చూస్తావేల బేలా!"

ఏది మొదటి మినీ కవిత

"ఇప్పుడు బాగా ప్రాచుర్యం పొందిన మినీకవితా లక్షణాలని దృష్టిలో వుంచుకుని, వోసారి దృష్టిని నిశితంగా గతంలోకి సారిస్తే మొదటి మినీ కవితగా చెప్పుకోదగిన కవిత నొకటి - శ్రీ శ్రీ "మహాప్రస్థానం"లో "ఆః"

నిప్పులు చిమ్ముకుంటే
నింగికి నేనెగిరి పోతే
నిబిడాశ్చర్యంతో వీరు—
నెత్తురు కక్కుకుంటూ
నేలకు నే రాలిపోతే
నిర్దాక్షిణ్యంగా వీరే—

"మహాప్రస్థానం" లోని ఈ రెండు కవితలని కూడా మినీ కవితలుగా నిర్ధారించవచ్చు.

పరాజితులు :– అలసిన కన్నులు కాంచేదేమిటి ?
తొణికిన స్వప్నం
తొలగిన స్వర్గం ;
చెదరిన గుండెల నదిమేదేటి ?
అవతల, ఇవతల
అరులై, ఇరులే ;
విలసిన ప్రాణుల పిలిచే దెవ్వరు ?
దుర్గతి, దుర్గతి
దుర్మతి, దుర్మృతి.

సాహసి :– ఎగిరించకు లోహ విహంగాలను
కదిలించకు సుప్త భుజంగాలను ;
ఉండనీ –
మస్తిష్క కులాయంలో
మనో వల్మీకంలో
అంతరాళ భయంకర
ప్రాంతరాలనా నీ విహారం ?
ముళ్ళదారినా నీ సంచారం ?

"సంధ్యా సమస్యలు" సైతం మినీకవిత లక్షణాలని మిక్కుటంగా ప్రతిఫలించే కవితే.

మినీకవిత పరిమాణం

ఏ వచనకవితకయినా ఇది నిర్దిష్టమయిన పరిమాణమని విర్దేశత ఎక్కడా వుండదు. చెప్పదల్చుకున్న భావాన్ని బట్టీ, కవి వ్యక్తీకరణ శక్తిని బట్టీ కవిత పరిమాణం.

పరిమాణం రీత్యా ఇంతవరకూ వొచ్చిన మినీకవితల్లో దిగువన ఉటంకించిన నాలుగు కవితలూ అతి చిన్నవి.

పన్నెండక్షరాల్లో శ్రీ టి. చంద్రశేఖరరెడ్డి "జీవితంలో"
నవ్వు
గులాబీ పువ్వు
ముల్లు
కన్నీళ్లు.

పధ్నాలుగక్షరాల్లో శ్రీ బెల్లంకొండ రామదాసు.
బ్రతుకే వొక క్రాస్
మనిషే వొక క్రైస్తు.

పదిహేనక్షరాల్లో శ్రీ సమ్మంగి శ్రీనివాస ప్రసాద్ "సూదిమందు"
వృత్తిరీత్యా దేముడు
ప్రవృత్తిరీత్యా యముడు.

పదిహేడక్షరాల్లో శ్రీ కాళోజీ "జే. పీ."
పుటక నీది
చావు నీది
బ్రతుకంతా దేశానిది.

మినీకవిత జననం

కాలమాన పరిస్థితుల కనుగుణంగా సామాజిక ప్రయోజనాలు కారణంగా కవిత్వం భిన్నరకాలుగా రూపపరిణామం పొందింది. కవనం భావకవిత్వంగా, అభ్యుదయ కవిత్వంగా, విప్లవకవిత్వంగా, దిగంబరకవిత్వంగా రకరకాలుగా దర్శన మిచ్చింది. ప్రతిరూపం తన సమకాలీన సమాజచేతనాన్ని సంపూర్తిగా ప్రతిబింబించింది. ఆ దృష్టి తోనే నేటి కాలపు ప్రధాన ప్రక్రియగా మినీకవిత ఆవిర్భవించింది.

కొందరు విమర్శకుల దృష్టిలో మినీకవిత వ్యాపార నాగరికతా ప్రతిఫలం. మిగిలిన సాహితీ ప్రక్రియల నేకానికి స్థలం కేటాయించ టంతో స్థలాభావం వల్ల పెద్దకవితలని విస్తృతంగా ప్రచురించేందుకు అవకాశంలేక పత్రికలు మినీకవిత ప్రచురణని ప్రోత్సహించాయని వీరివాదం. మినీకవిత జననానికి కారణం ఇదొకటే కాదు.

వొస్తున్న దీర్ఘకవితల్లో అనేకం పరస్పర ప్రతిధ్వనులుగా మేధకి వినిపించటం పాఠకుడికి విసుగు కలిగిస్తున్న సమయంలో ఆవిర్భవించిన మినీకవిత తన క్లుప్తతతో, విస్పష్టధ్వనితో జనాన్ని ఆకర్షించింది. పరిమిత పరిధిలో వొక పరిపూర్ణ భావనని సమగ్రంగా సంక్షిప్తంగా తీవ్రధ్వనితో ధ్వనించింది. కవి హృదంతరాల్లోంచి ఆలోచన కలంలోంచి బలంగా వ్యక్తం చేయడానికి వీలయిన వాహికగా అవతరించింది. భావ పునరుక్తి దోషాన్నీ, భాషాభేషజాన్నీ, అస్పష్టతనీ వో ప్రక్కకు తోసేసి క్లుప్తత ఉచ్ఛ్వాసంగా ధ్వని నిశ్వాసంగా దినదిన ప్రవర్ధనమయింది. సాహితీజీవులని తనవైపు ఆకృష్టం చేసుకుంది.

మినీ కవిత లక్షణం

మినీ కవితకి ధ్వని వెన్నెముక. గోరంత వ్యక్తంచేసి వ్యక్తిత విషయం మీద కొండంత అవగాహన తృటిలో కలిగించడం ధ్వని. అత్యల్ప సంఖ్యలో పదాల్ని, స్వల్ప వాక్యాన్ని వినియోగించి వొక మినీకవితని వెలుగులోకి తే దలుచుకున్న కవికి ఈ ధ్వని రహస్యం తెలియడం అత్యవసరం. ఈ పంథాలో రాయబడ్డ విజయవంతంగా భావం చెప్పబడ్డ కవిత శ్రీ కాళోజీ "జే. పీ.]
పుటక నీది
చావు నీది
బ్రతుకంతా దేశానిది.

స్వరోదనతో పరవేదనలో ఈ లోకంలోకి వూడిపడి, స్వవేదనతో పరరోదనలో రాలిపోయిన జీవి - జనన మరణాలు రెండింటినే తన విగా భావించాడనీ, రెండింటి మధ్యా విరామమయిన జీవితాన్ని దేశం కోసం ధారపోసాడని భావన. కవిత చిన్నదయినా జే. పీ. త్యాగనిరతీ, జీవనప్రయోజనం విపులంగా ధ్వనించింది.

ధ్వనినే పునాదిగా చేసుకుని జింబో ధ్వనించిన మరో కవిత— బ్రతుకు.

నేను
చచ్చిపోతాననే కదూ_
నీ బాధ
పిచ్చివాడా_
ఈ వ్యవస్థలో
మనం బతికింది
తొమ్మిది మాసాలే.

శవాలకి కోరికలుండవు. కొంతమంది జీవులకి కోరికలుండీ తీరవు. తీరని కోరికల తీతాల్లో జీవిస్తున్న జీవి జీవం ఉండీ శవం_ జీవచ్ఛవం. పరిసరాల్లో జీవిస్తున్న ప్రతిజీవీ జీవచ్ఛవమే అయితే_ ఏ చీకూ చింతా లేకుండా మాతృగర్భంలో నివసించిన తొమ్మిదిమాసాలే నిజానికి మనిషి జీవించిన క్షణాలని భావం. కవితకంతటికీ ప్రాణమయిన చివరి మూడుచరణాల్లో కవి విసరిన కొపమెరుపు కొరడా కొసయుళుపు గమనీయమయినవి.

మినీ కవిత చదవగానే పాఠకుడి మీద పడిన ముద్ర—శిల తగిలిన జలంలో అల్లల్లా ప్రకంపిత మయి ప్రచలితమయి మెదడంతా అలముకుంటుంది. ఆ అనుభూతి సాంద్రత శాశ్వతంగా మెదడుపొరల్లో చోటు చేసుకుంటుంది.

మినీకవితకి చివరి పంక్తి చివరిదాకా దూకిన భావజలపాతం యొక్క ముగింపు శక్తి బలవత్తరమైనవి. చరణంనుంచి చరణానికి పాగిపోతున్నపుడు అందుతున్న అవగాహన తుదిచరణందాకా వొచ్చే సరికి వొక అనూహ్యమయిన మలుపు విచిత్రంగా తిరిగి ఆ మెరిక మలుపులో మెరుపువిరుపుతో తీగేలు మనిపిస్తుంది. ఈ కవిత "పీళ్ల" చూడండి. కవి శ్రీ వెంపలి వెంకట శివప్రసాద్.

అమృతం తాగితే
చావో రాదంటారు.
విషం మింగితే
బ్రతుకే లేదంటారు.
మరి [illegible] తాగారవి
అనుక్షణం [illegible] బ్రతుకుతున్నారు.

గతజీవన విషాదం విషం లాంటిది. స్మరణకొస్తే మనిషి నీరసిస్తాడు—మరణిస్తాడు. భావి జీవితస్వప్నం అమృతం లాంటిది. తలపుకొస్తే మనిషి కొత్త జీవం పుంజుకుంటాడు. కలలు కల్లలయిన మనిషికి వర్తమానం శూన్యం. వర్తమానమేగా గతంగా మారేది. అనుభూతమౌతున్న వర్తమానమంతా నైరాశ్యమే అనపుడు తలచుకుందుకు గతంలో ఏమీ మిగలనపుడు మనిషి ప్రస్తుతంలో ప్రతిక్షణం ఛస్తాడు. నడుమనడుమ వాంఛాతీరాల్లో వూహావిహంగమై విహారంచేసి జీవిస్తాడు. వ్యవస్థలో జీవచ్ఛవాల జీవన వైచిత్రిని అంతర్లీనంగా ధ్వనించడం కవితలో వినపడుతుంది.

అంత్యచరణంలో వో చేదునిజాన్ని చాచికొట్టినట్లు చెప్పడం శ్రీ అలిశెట్టి ప్రభాకర్ కవిత "నా దృష్టిలో" కూడా ద్యోతకమవుతుంది.

అంతస్తూ ఐశ్వర్యం
శ్రామికుడి భిక్షం
నాదృష్టిలో ధనమదాంధుడే
అడుక్కు తినేవాడు.

పగలంతా వెగలు కక్కే ఎండలో మాంసాన్ని చెమటగామార్చి శ్రమించే జీవి శ్రమఫలాన్ని మరొకడు దోచుకుపోతున్న వ్యవస్థమనది. వెలుగులో కష్టపడిన రక్తం రాత్రి కన్నీరు కాగా దోచుకుపోతున్నవాడి జీవితం రేయింబవళ్ళు సుఖమయం అవుతున్నది. అంతస్థుల్లో ఐశ్వర్య మిచ్చిన విలాసాల్లో కులుకుతున్నది. ధనికుడి జీవనసౌధానికి పునాదిని దానం చేసింది శ్రామికుడి శ్రమేననీ - ఆ శ్రమని ఆధార చేసుకుని జీవిస్తున్న ధనికుడే నిజానికి భిక్షకుడనీ ఈ నాలుగు చరణాల్లో ప్రతిభావంతంగా చెపుతాడు కవి.

అసంఖ్యాకంగా వొస్తున్న మినీకవితల్లో ప్రముఖంగా కనబడే మరోలక్షణం కొన్ని జీవనసత్యాలను అనూహ్య ధోరణిలో అత్యంత ప్రతిభావంతంగా చెప్పడం - మనం నిత్యం చూసే వస్తువులనో—అప్రధానంగా కనపడే విషయాన్నో ఆధారం చేసుకుని వో భయంకర సత్యాన్ని బయటికి లాగడం. నిదర్శనం శ్రీ కె. బాలరాజు కవిత "హ్యూమనిజం" దర్శించండి.

క్షౌరశాలలోని
మంగలి
త్రిప్పినట్లు తిరిగి
తలవెంట్రుకలు
తీయించుకున్నట్లు
నేటి ప్రజలు

ప్రజానాయకుల
వెంబడి తిరిగి
మానవత్వాన్ని
గొరిగించుకుంటున్నారు.

క్షౌరశాలతో సమాజాన్ని పోల్చి మంగలి త్రిప్పినట్లు మనిషి తిరగడాన్ని ప్రజానాయకుల వెంట ప్రజలు తిరగడంతో ఉపమించ డంలో వ్యక్తమయిన దాస్యధోరణి; తల వెంట్రుకలు తీయించుకోవ డంతో మనిషి మానవత్వాన్ని గొరిగించుకోవడంతో పోల్చటంలో ప్రసరించిన దోపిడీ విధానం కవిత స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ కవితలో భావం వ్యక్తీకరణమయిన విధానం వినూతనం.

ఇలాంటిదే మరోకవిత శ్రీ నందిని సిధారెడ్డి "అల".

ఎంత సిగ్గులేనిది
ఆడుకుని, వాడుకుని
నేలకి కసిరి కొట్టినా ఈ కాయితం
మళ్ళా, గాలి పిలవగానే
గాల్లో లేచిపోతుంది.
ఊహల్లో ఎగిరే మనసూ
అంతే?
ఎంత
సి
గ్గు
లేనిది?

గాలి పిలిస్తే లేచిపోయే కాగితంతో వూహ పిలిస్తే వెళ్ళిపోయే మనసుని పోల్చడం ఈ కవితలో రమ్యత. ఈ భావనలో వూహని మనసుని లేపుకుపోయే గాలిగా దర్శించడంలో కవి వూహాశక్తి అభివ్యక్తమవుతోంది. మనసుని కాగితంగా, వూహని గాలిగా కవి తాత్మతో దర్శించిన కవి అక్కడితో ఆగకుండా లేచిపోవడం పైన తనకున్న అసహ్యాన్నీ, అయిష్టాన్నీ చివరి నాలుగు పాదాల్లో మధ్య పదాన్ని విరిచి పేర్చి కసిగా నొక్కి వ్యక్తం చేస్తాడు.

కొన్ని మినీకవితలు రెండు భాగాలుగా భావాను సారంగా, విడిగా వ్యక్తం చెయ్యబడి రెండిటి కలయికలోంచి శీర్షికని పూతం చేసుకుని విషయాన్ని బలంగా ధ్వనిస్తాయి. ఇది శ్రీ అలిశెట్టి ప్రభాకర్ కవిత "చెమట వ్యాపారం".

నీ శ్రమఫలం
నీ సమక్షంలోనే పాతిపెట్టబడ్డ
విత్తనం –
దాన్నే డబ్బుచెట్టుగా పెంచి
దక్కించుకున్న వాడిదే
పెత్తనం.

శ్రామికుడి శ్రమని విత్తనంతో పోల్చి అందులోంచి అంకు రించిన ధనవృక్షాన్ని పెంచి ఎవరో దక్కించుకోవడాన్ని ధ్వనించ డంలో – కవితలో – వ్యవస్థలో దోచబడుతున్నదీ, దోచుకుంటున్నదీ ఎవరో స్పష్టంగా తెలుస్తున్నది.

కొన్ని మినీకవితలు సాధారణ వాక్యాలుగా పదాలుగా దర్శన మిచ్చినా చిరుచిరు విరుపుల్తో చివరిదాకా వో శక్తిని ప్రోదిచేసుకుంటూ వచ్చి తుదిపాదంతో వో తటిల్లతల్లా మెరిసి అనుభూతి వర్షాన్ని కురిసి పోతాయి. నిదర్శనానికి శ్రీ పురిపండా అప్పలస్వామి కవిత "అడవి వూరు".

అడవిలో
ఒక్క ప్రాణానికే ముప్పు
ఊళ్లో
ధనానికీ మానానికీ ప్రాణానికీ
అన్నిటికీ ముప్పే.
అడవిలో జంతువులు
ఊళ్ళో మనుషులు.

జనం నివసించని అరణ్యంలో జంతువులు చేసే అపకారంతో పోల్చుకుంటే సంఘంలో మనిషి సాటి జీవులకి చేస్తున్న అపకారం చాలా ఎక్కువ అన్న భావాన్ని ప్రతిపాదిస్తూ మనిషికన్నా జంతువులు నయం అన్న అర్థాన్ని పరోక్షంగా ప్రసరిస్తుందీ కవిత. చివరి రెండు చరణాల్లో అభివ్యక్తి మొత్తం కవితకి ప్రాణశక్తి.

ఒకే రకం పదాన్నో, పదబంధాన్నో ఒకే కవితలో భిన్నా ర్థంలో ప్రయోగించడం మినీకవితా రచనలో మరోలక్షణం. శ్రీ శిఖామణి కవిత "తలలు" చూడండి.

చెదరిన పుట్టనుండి
బెదరిన చీమలు పరుగులెత్తినట్లు
లేమి కొలిమి నుండి
ఆకలి పొగ తెగబడినప్పుడు
ఆకలి తీర్చలేని మంచినీళ్ళు కూడా
అసహాయతలో
మెడబడతార
పొంమారిందని మీ తలలమీద మీరే
బాదుకుంటున్న అన్నార్తుల్లారా.

బాదవలసిన తలలు
వేరే వున్నాయని
తెలుసుకునే దెప్పుడు?

పొల మారినపుడు తలలు బాదుకోవటాన్నీ, బాదవలసిన తలల గురించీ, వొకే పదబంధ ప్రయోగంతో పాఠకుడికి స్పృహ కలిగింప చెయ్యటంలో విశిష్టత హృదయాన్ని కదిలింప చేస్తుంది. అన్నార్తుల్ని చెదరిన పుట్టనుండి బెదరిన చీమల్తో ఉపమించటం– లేమిని కొలిమితో ఆకలిని ఆ కొలిమినుంచి తెగబడిన పొగతో పోల్చటం – కవితలో విలక్షణత.

వొక వస్తువునో విషయాన్నో కవిత పొడుగూతా వైవిధ్యంతో వర్ణించి వొక సామాజిక సత్యాన్ని చివరకు బలవత్తరంగా చెప్పడం మినీ కవిత మరో లక్షణం. ఈ కవిత "చరిత్ర చెప్పని గణితం" శ్రీ అలిశెట్టి ప్రభాకర్ రచన.

సామాన్యుడి జీవిత వృత్తాంతం
ఎపుడూ కష్టాలు ఇమిడి వుండే
ఒక బిందువే.
అతన్నాధారం చేసుకుని గీసుకునే
వృత్త వైశాల్యాలే
సంపదలు సౌఖ్యాలు పొదాలు
ఇది చరిత్ర చెప్పిన గణితంకాదు.
ప్రతి పెట్టుబడిదారీ వ్యవస్థ
బాహాటంగా ఏర్పరచుకున్న
స్వార్థపు వలయం.

నిత్యజీవితంలో జరిగే సంఘటనలని, సంభాషణల కుపయోగించబడ్డ వాక్యాలని యధాతథంగా ప్రయోగించి వో దిగంబర సత్యాన్ని కవిత కలిగించిన అవగాహనలోంచి వెలిగించడం మినీ కవిత మరో వైచిత్రి. ఈ కవిత శ్రీ బి. జంగమ్మది.

"అమ్మా! ఇంటోన్ని"
"పోయిరా!"
"తల్లీ! గడ్డోన్ని"
"వెళ్ళిరా!"
"మా తల్లీ! ముసిలోన్ని"
"పోపో!"
"ఏడు కొండలవాడా
వెంకట రమణా"
"వస్తున్నా ఉండు!"

అంగ వైకల్యం పొంది, ముదిమి మీద పడి జీవికలేని దౌర్భాగ్యుల మీద కన్నా; శ్రమించగలిగిన శక్తీ, అవకాశం వుండీ దేవుడి పేరు వాడుకుని భుక్తి సంపాదించాలనుకునే వాళ్ళపైనే; సంఘంలో కొందరు జీవుల దయాగుణం ప్రసరిస్తున్నదనీ; మనిషికి మానవత్వం కన్నా దైవభీతే అధికమనీ పరోక్షంగా నిరూపిస్తుందీ కవిత. నిరాడంబర వ్యక్తీకరణ ఈ కవిత విలక్షణత.

కొన్ని మినీ కవితలు కవితాభాగం వొక్కటే చదివి వూరుకుంటే అర్థరహితంగా, అస్పష్టంగా అనిపిస్తాయి. శీర్షికతో అన్వయించుకుని చదివితే వో సంపూర్ణ భావాన్ని సమగ్రంగా ప్రతిఫలిస్తాయి. ఈ మూడు కవితలనీ అవలోకించండి.

శ్రీ అలిశెట్టి ప్రభాకర్ "హృదయం"

రాత్రి మాత్రమే
కాసేపు ఈ రోడ్డు
నిశ్శబ్దంగా ....
నిర్మానుష్యంగా....
తెల్లారితే మళ్ళీ
ఒకటే రద్దీ ....

శ్రీ ఆసు రాజేంద్ర "మృత్యువు"

నా ముంగిలి ముందు నుంచుని
ఓరగా చూస్తుంది
నేనెపుడు తలుపు తీస్తానా అని.
నేను తలుపు తీసానో
అది లోపలికి
నేను బయటికి.

శ్రీ టి. చంద్రశేఖరరెడ్డి "జీవితంలో...."

నవ్వు
గులాబీ పువ్వు
ముళ్ళు
కన్నీళ్ళు.

మినీకవితల్లో కవితామయమయిన ఆలోచనలని వ్యక్తం చెయ్యడానికి గణితాన్నో, వ్యాకరణ చిహ్నాలనో వాడుకోవడం కూడా కద్దు. ఉదాహరణలు ఈ మూడు మినీకవితలు.

శ్రీ అంకిత కేశవులు "డబ్బు"

సువ్వు + డబ్బు = హీరో
నువ్వు — డబ్బు = జీరో
పరమాత్ముడి కన్నా
పైసాయే మిన్న.
దేర్ఫోర్ మేరే యారో
దేవుడికి గోలీ మారో.

శ్రీ సారధి "కాదు ?"

జీవితమనే వాక్యంలో
ప్రేమ
పుల్‌స్టాప్ కాదు కామా ?

శ్రీ కె. వాసుదేవరావు "!?"

జరాభారంతో
కుంగిపోయిన
ఆశ్చర్యార్థకమే
ప్రశ్నార్థకం
అవుతుంది.

అనంతమయిన వేదాంతాన్ని అత్యల్ప పరిమాణంలో ధ్వనింపింది మినీకవిత అడపాదడపా అక్కడక్కడా. ఈరెండు కవితల్నీ చూడండి.

కవి శ్రీ వసీరా

కాళ్లు తడవకుండా
సముద్రాన్ని దాటగల మేధావియైనా
కాళ్లు తడవకుండా
జీవితాన్ని దాటలేడు.

శ్రీ చంద్రసేన్ "ముక్కంటి తే?వి"

"కన్ను తెరిస్తే జననం
కన్ను మూస్తే మరణం
రెప్పపాటే కదా ఈ ప్రయాణం.

మినీకవిత – సామాజిక ప్రయోజనం

ఏ కవనం సామాజిక ప్రయోజనం అయినా పాఠకుడిలో మానసిక చేతనాన్ని అంకురింపచేసి, విస్తరింపచేయడం.

పాఠకుడి మనోచేతనం మీద ఏ సాహితీ ప్రక్రియ ప్రభావం అయినా దాని పరిమాణాన్ని బట్టి వుండదు. దానిప్రమాణాన్ని బట్టి వుంటుంది. ఈ సత్యాన్ని దృష్టిలో వుంచుకుని పరికిస్తే అనేక భావవీచికలని విస్తృతపరిధిలో వీచగల దీర్ఘకవితకి వున్న ప్రాధాన్యం మినీకవితకి సైతం వుంది. స్వల్పపరిధిలో వొకేవొక్క భావాన్ని విస్పష్టంగా పాఠకుడి మీద ముద్రితం చేయడంతో కవి ఆశించే సామాజిక ప్రయోజనాన్ని మినీకవితే బలవత్తరంగా నెరవేర్చగలదు.

వొక్కోసారి దీర్ఘకవితలోంచి వీచిన ప్రతి భావవీచిక తాకిడీ పాఠకుడికి శాశ్వతంగా జ్ఞప్తికుండకపోవచ్చును గాని – మినీకవిత తనలో వొక్కుమ్మడిగా రగిలించిన అలజడిని పాఠకుడు విస్మరించలేడు.

అందుకే మినీకవితకి నేడింత ఆదరణ – సాహితీ లోకంలో పోషణ.

[ఈ వ్యాసరచనలో "మినీకవిత" వ్యాస సంకలనం – మరింకెన్నో వ్యాసాలూ — కవితా సంకలనాలూ ఎంతగానో సహకరించాయి. శ్రీ అద్దేపల్లి రామమోహనరావు గారికీ, తదితర వ్యాసకర్తలకూ, కవులందరికీ నా కృతజ్ఞతలు.]

౨౨

రక్షించండి కవిత్వాన్ని

అణగారిన అకాడమీల నుండి
మూసలో పోసిన యునివర్సిటీల నుండి
కుహనా సాహిత్య సంస్థల నుండి
స్టంటు స్లోగన్ సోడాబుడ్ల నుండి
సెక్సు సేమియా సినీ పాటలనుండి
విదేశీ విచ్చలవిడి విష వాయువుల నుండి
నా దేశాన్ని రక్షించండి
కవిత్వాన్ని విడుదల చేయండి!

చలం!

స్వేచ్ఛా వాయువు
పీల్చడం తప్పా?
భౌతికంగా రొచ్చుగుంటలో
ఉన్నామని తెల్చి చెప్పడం దోషమా?
గోనెసంచి గుండెల్లోని
కుష్ఠు కుబుసాన్ని
బట్టబయలు చేయడం
పిట్టకథల్ని పిసికి వేయడం
చలం చార్వాకమా?
దేశీయం దేబెగా
ఒప్పుకోలేదు
పాశ్చాత్యం పాడిగా
పిండుకోలేదు
'మ్యూజింగ్స్' 'భగవద్గీత వ్యాఖ్యానం'
"బిడ్డల పెంపకం, "స్త్రీ"
వ్యాసాలు, నాటకాలు
సానుభూతి కోసం వ్రాయలేదు
స్వతహాగా పుట్టుకొచ్చాయి
నిమ్మగడ్డ 'శ్మశాన సాహిత్యం'గా
ముద్రవేసినా
యువతకు దారి బత్తెం!

శ్రీ యస్. యస్. రెడ్డి

శ్రీమతి శివలెంక భవానీ శాస్త్రి

శైవ సిద్ధాంతదర్శిని

శివభక్తి బోధకములగు గ్రంధము లెన్నియున్నను, ఒక్కొక్క విషయమునే బోధించునవి విశేషముగా గలవు. కాని యన్నివిషయముల నొక్కచో జేర్చికూర్చిన గ్రంధములతి స్వల్పములు అందుచేత పామరులు తమ భక్తిని పెంపొందింప జేసికొనుటకు, పండితులు శ్రుత్యాగమ పురాణేతి హాసంబులతో గ్రంథాంత రాభిలాష లేకయె యుపన్యసించి శివభక్తిని దేశమందంతట వ్యాపింపజేయ ముందంజ వేయుటకు నుపయుక్తములగునటులీ గ్రంథము ముదిగొండ వీరేశలింగ శాస్త్రిగారిచే రచింపబడి బ్ర॥ శ్రీ॥ లో॥ కొడిమేల రాజ లింగారాధ్యుల వారిచే శైవ ప్రచారిణీ ముద్రాక్షర శాలలో వరంగల్‌లో గలాశాలలో ముద్రింపబడినది. హనుమకొండ సిద్ధేశ్వర స్వామి కంకిత మీయబడినది. ఈ విషయ మీ క్రింది సీసపద్యమువలన దెలియు చున్నది.

సీ॥ శ్రీ భారతీపతి సేవిత చరణాబ్జ
గంగా జటాజూట కామదమన
శశికలిత్తోంస శాశ్వతా నందద
శర్వ పరాత్పర శాంకరీశ
భక్తపాలన దక్ష పద్మాక్షిహృచ్ఛ్కంజ
భాస్కర శంకర పరమపురుష
సిద్ధసన్నుత కార్యసిద్ధి ప్రదాహను
మద్గిరి మందిర మాన్యచరిత
గీ॥ సాంబసిద్ధేశ్వరా పరశ్మతము వినతి
తతుల నర్పించి శైవ సిద్ధాంత దర్శి
ని యమ గ్రంథకుసుమంబునే నీపదముల
నర్పణము సేతు గైకొనుమయ్య ప్రేమ.

ఈ గ్రంధారంభమున గురువరేణ్యులగు ముదిగొండ నాగలింగ శాస్త్రిగారి ప్రోత్సాహ ప్రోద్బలముల వలన తామీ గ్రంథరచన నారంభించితిమనియు, శ్రీ కొడిమేల రాజలింగారాధ్యులవారు తమపై అపార ప్రేమానురాగములతో వీ గ్రంథమును ముద్రించినారనియు, శాస్త్రిగారు సవినయముగా విన్నవించుకొనిరి.

అగాధమును, దురవగాహమును, భయంకరమును, అనంత దుఃఖముల కొలయమును, అత్యంత ఘోరదురిత క్రియాపుంజము లకు గొణాచియును అగు భీకర సంసార పారావారమును దాటి యపవర్గమును (మోక్షము) బొందుటకు ప్రతి మానవ మాత్రుడును తప్పక యత్నింపవలెను.

అత్యున్నతమగు మోక్షశైలాధి రోషణమునకు సోపానము లనేకములున్నను, వానిలో భస్మరుద్రాక్షలింగధారణాది శైవ సోపానము లుత్తమోత్తములు.

అష్టావరణములు "గురుర్లింగం జంగమశ్చ తీర్థంచైవ ప్రసాదకః భస్మరుద్రాక్షమంత్రాశ్చేత్యష్టావరణ సంజ్ఞికాః" గురువు, శివ లింగము, మాహేశ్వరుడు, తీర్థము, ప్రసాదము, భస్మము, రుద్రాక్ష, మంత్రము" అని యెనిమిది విధములుగా ప్రఖ్యాతములైనవి.

"ఇమాని శివభక్తానాంభవదోషతతేస్సదా
నివారణైక కార్యాణి ఖ్యాతా న్యావరణాఖ్యయా"

సంసార సంబంధమగు దోషజాతము భక్తుల యొద్దకు రాకుండగ పారదోలునవిగాన నీయవి యావరణ సంజ్ఞచేత ప్రసిద్ధములైనవి.

పైజెప్పబడిన అష్టావరణములోనివగు విభూతి, రుద్రాక్ష, పంచాక్షరీ మంత్రము, గురువు అను ప్రధానములగు నాలుగు విషయముల గూర్చి శ్రుతిస్మృతి పురాణేతిహాస ప్రమాణ పురస్సరముగా రచించి, శైవశిద్ధాంతముల ప్రజాహృదయములకు హత్తుకొనునట్లు, శివభక్తి పారమ్యము పెంపొందునట్లు శాస్త్రిగారు వివిధ రమణీయ గాధావళిద్వారా వ్యాఖ్యాన పురస్సరముగా నీగంథ్రమును రచించిరి. శైవ సిద్ధాంతదర్శిని ద్వితీయ భాగము నైతము కొలది కాలములో ప్రచురింతుమని ప్రథమభాగమున శాస్త్రిగారు నుడివినను, అది తదుపరి ప్రచురింపబడలేదు.

భస్మవిధి— 'త్రయాయుషజమదగ్నిః' అని ప్రత్యక్షముగా వేదములే భస్మను ధరించుచున్నవి. 'భూత్యైన ప్రమదితవ్యం' భస్మముచేత అప్రమత్తుడవు కాకుండుమని శ్రుతి విధించినది. మనో

రతసిద్ధికై మహర్షిపుంగవు లనేకు లీభస్మను ధరించి వ్రతానుష్ఠాన పరతంత్రులై 'వ్రతమే తచ్ఛాంభవం' 'వ్రతమే తత్పాశుపతమ్మ'ని పాశుపత, శాంభవ వ్రతములుగా నీ భస్మధారణను గూర్చి పచించిరి.

శ్రు॥ "వ్రతమే తత్పాశుపతం పశుపాశ విమోక్షాయేతి" భస్మో ద్ధూలన, త్రిపుండ్రధారణములు పాశుపత వ్రతమనియు, పశుపాశ విమోక్షము కొరకు దీని నాచరింపవలయుననియు నదర్వశిరస్సున నుడువబడినది.

భస్మమహిమ యవాఙ్మానసగోచరము. భస్మధారణము శిష్టజన సంప్రదాయము. ముక్తిసాధకము. పాపనాశనము. కాన గట్టి భస్మ నశ్రద్ధ చేయక నత్యంత ప్రేమతో భక్తితో ధరించి యైహిక భోగ ముల ననుభవించి దేహాంతమున ముక్తినిఁబొందుమని శాస్త్రిగారు తమ గ్రంథమున భక్తుల నుద్బోధించిరి.

సత్యం శౌచం జపోహోమ స్తీర్థం దేవాది పూజనం
తస్యవ్యర్థమిదం సర్వం యత్త్రిపుండ్రం నధారయేత్ శా₂
శ్రాద్ధే యజ్ఞే జపే హోమేవైశ్వ దేవే సురార్చనే
ధృత త్రిపుండ్రః పూతాత్మా మృత్యుంజయతి మానవః
త్రిపుండ్రం యద్యధృత్వాతు కుర్యాద్యత్కర్మ తద్వృథా(కా)

త్రిపుండ్రమును ధరింపక నొనర్చిన జపము, హోమము, తీర్థము, దేవాది పూజనము మొదలగున వన్నియు నిష్ఫలములని శాతాతపులును, శ్రాద్ధము, యజ్ఞము, జపము, హోమము, వైశ్వ దేవార్చనము, సురార్చనయును త్రిపుండ్రధారియై మానవుడాచరించిన మృత్యువును జయించుచున్నాడని అటుల గానిచో సర్వకర్మ ములు నిష్ప్రయోజనములని కాత్యాయనులును తమతమ స్మృతుల యందు విధించి యున్నారు. మనువు బ్రహ్మహత్యాది మహాపాతక నివ ర్తక ప్రాయశ్చిత్తముగా భస్మధారణను విధించి యున్నాడు.

శ్లో॥ ఆయుష్కామోనరో రాజన్ భూతికామోథవానర :
నిత్యం వైధారయేద్భస్మ మోక్షకామశ్చవై ద్విజః (భార)

పంచమ వేదమనబరగు శ్రీ మహాభారతము నందు, ఎవరు సర్వధర్మాచరణ కారణంబగు నాయువును,ఐశ్వర్యమును, మోక్షమును గోరుచున్నారో వారందరును నిత్యము నేమముగ భస్మను ధరింప వలె నని పలుకబడినది.

శ్రు॥ అగ్నిరితి భస్మవాయురితి భస్మ జలమితి భస్మ స్థలమితి భస్మ వ్యోమేతి భస్మ సర్వగ్ం హవా ఇదగ్ంభస్మ వాఙ్మన ఏతాని చక్షూగ్ంసి భస్మాని[5] (అధర్వ)

పంచభూతములు భస్మ స్వరూపులని అధర్వణవేదమందును, "మహాదేవో మహాభస్మ" జగత్కారణుడగు మహాదేవుడే భస్మ స్వరూపమని సూత సంహిత యందును, పరిశుద్ధము, అగ్నిహోత్ర జమగు భస్మను ప్రణవమున గ్రహించి సర్వాంగములందును నభిషే చన మాచరించినచో భస్మస్నాన మాత్రముననే జనుడు తానొనరించిన పాపారణ్యము భస్మీభవించునని పునీతుడై శివసాయుజ్యమునందున్నా డని లింగపురాణమునందు చెప్పబడినది.

మానస్తోకేతి మంత్రేణ మంత్రితం భస్మధారయేత్
ఊర్ధ్వ పుండ్రం భవేత్సామ మధ్య పుండ్రం యజూషించ
అధః పుండ్రంఋచస్స్యాత్తస్మాత్పుండ్రం త్రియా
యుషం త్రియాయుషంజమదగ్నేః కశ్యప
స్య త్రియాయుషం అగస్త్యస్య త్రియాయుషం
యద్దేవానాం త్రియాయుషం తన్మేఅస్తు త్రియాయుషం[6]
(శ్వేతాశ్వతరోపనిషత్)

"మానస్తోకేతనయే" అను మంత్రమున భస్మను ధరింప వలయును. పైరేఖ సామవేదమనియు, మధ్యరేఖ యజుర్వేదమనియు క్రిందిరేఖ ఋగ్వేదమనియు నర్థము కావుననే త్రిపుండ్ర (రేఖ) ము త్రియాయుషమని వచింప బడుచున్నది. కశ్యపాది మునీంద్రులు, విష్ణ్వాది దేవతలు, ధరించిన యా త్రియాయుషము నాకు మనగుగాక యని యర్థము.

భస్మోద్ధూళిత సర్వాంగం సుప్రసన్న మనుస్మరన్
రామరహస్యోపనిషత్

భాస్వత్త్రిపుండ్రో భసితైస్సితస్సన్మౌళి జటావల్కల భస్మ
కుంచ[7] (హరివంశే)[8]

అనువచనములచే రామకృష్ణులు భస్మధారులేయని తెలియు చున్నది. శివపురాణమునందు, బృహజ్జాబాలమునందు కాలాగ్ని రుద్రో పనిషత్తునందు, అద్వైతమత స్థాపన నిదానముగు సూతసంహిత యందు విశేషముగా భస్మమహిమ వచింపబడినది. సర్వమతముల వారును నిత్యోపాసనానంతరము భస్మను ధరించుచున్నారు.

భస్మ నామాంతరములు

సమస్తైశ్వర్య ప్రదాయకమగుటచే విభూతియనియు, తత్వభావ నము వలన భసితమనియు 'సర్వపాపనాశకమగుటచే భస్మమనియు' నిఖిలాపన్నివారకమగుటచే క్షారమనియు, భూతప్రేత పిశాచాది భయ ముల నుండి రక్షించునది యగుటచే రక్షయనియు, భస్మమునకు నామములు వచ్చినవి[9] అని శాస్త్రిగారిచే చెప్పబడినది.

భస్మోత్పత్తి పరమేశ్వరుని యొక్క సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశానములను పంచముఖములనుండి కపిల, కృష్ణ, ధవళ, ధూమ్రరక్త వర్ణ విశిష్టములగు నందాభద్రా సురభి, సుశీల సుమనసులను పంచగోవులు జన్మించగా వానినుండి విభూత్యాదులుత్పత్తి జెందినవని చెప్పబడినది[10].

బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య శూద్రజాతులెల్లరు భస్మధరించుట కర్హులే.

ఫాలభాగమున ధరింపబడిన భస్మత్రిపుండ్ర విధిచే లలాటమున వ్రాయబడిన దురక్షరములను, అనగా దుష్టవ్రాతను నాశనముచేయు చున్నదని చెప్పబడినది.[11]

'ప్రణవేన సర్వాంగముద్ధూళ్య' ఇత్యాద్యుపనిషదాదివచన నిచయముచే శరీర మందంతట భస్మబూసికొనవలయునని శాస్త్రము లుద్ఘోషించుచున్నవి గాన స్థాననియమము వదిలి శరీరమందంతటను త్రిపుండ్రోద్ధూళనాత్మకముగా భక్తులు భస్మధరింపవచ్చును. వర్ణాశ్రమ వివక్షలేక సమంత్రకముగాగాని, అమంత్రకముగాగాని భస్మధారణ గావింపవచ్చును.

"బ్రహ్మణానామయంధర్మః" త్రిపుండ్రధారణము బ్రాహ్మణ ధర్మమని విధిగా ద్విజులకు విధింపబడి యున్నది. శివునకు ప్రియమైనదై మోక్షము నొసంగు జాలు నీ భస్మము భక్తజనములకు కొంగు బంగారమేకదా!

ఇట్టివిధముగా భస్మవిధి, భస్మోత్పత్తి, భస్మనామాంతరములు, భస్మమహిమ గూర్చి శాస్త్రిగారు స్మృతి శ్రుతి ప్రమాణపూర్వకముగా నిరూపించుటయేగాక దృష్టాంత పూర్వకముగా మనోహరములగు రమణీయ గాథావళిద్వారా భక్తుల హృదయముల భక్తిరసతరంగిణులలో నోలలాడించిరి.

పరమేశ్వరుడు సముద్ర మధ్యమున వటపత్రశాయియై మోహాక్రాంతుడగు విష్ణునకు భస్మ నొసటంబెట్టి యాతని యజ్ఞానము నశింపజేసెననియు, తొల్లి వీరభద్రుడు క్రూరకర్ములగు సర్పాసుర పంచమాస్యాసురాదులచే హతులైన యమరులను భస్మచే బ్రతికించెననియు, వామదేవమహాముని శరీర భస్మ స్పర్శచే, అనేకజన్మసంలబ్ధ మహాపాతక సంయుతుడగు యవనాధీశ్వరుని బ్రహ్మరాక్షస స్వభావమును పటాపంచలుగా జేసెననియు, ఋషభ యోగీశ్వరుడు, భద్రాయువును భస్మప్రభావముచే బ్రతికించెననియు, ధనమదాంధతచే కన్ను మిన్ను గానక భస్మను ధరింపక దానమీయరాదను మహాపండితుడగు సుశీలుని యవమానించిన భుజంగ రాజుయు, యౌవనమదంబున పండితుని హేళన గావించిన రాజుభార్యయు శత్రువులచే రాజ్యభ్రష్టులై, క్రుళ్ళిన దేహములతో నికృష్ట పరిస్థితిలో భిక్షాటనము చేసిరనియు, చివరకు సుశీలుని గాంచి తమను క్షమించి రక్షింపుమని వేడికొన నాతని భస్మప్రభావంబున తేజోవంతులై, రాక్షసాక్రాంతమైన రాజ్యమును జయించుటయేగాక తన దర్శనమాత్రముననే భుజంగాధిపుడు రాక్షస స్వరూపుడైన గంధర్వుని శాప విమోచన మొనరించెననియు, వివిధ గాథావళి సహృదయ రంజకముగా జెప్పబడినది. రుద్రాక్ష — రుద్రాక్ష మహిమగూర్చి, రుద్రాక్షోత్పత్తినిగూర్చి, రుద్రాక్షవిధినిగూర్చి, రుద్రాక్ష ధారణముగూర్చి శాస్త్రిగారు ప్రమాణ పూర్వకముగా నిరూపించినారు.

రుద్రాక్షధారణము నిగమాగమ పురాణేతిహాస బోధితము. శిష్టసంప్రదాయాగతము. రుద్రాక్షధారి సాక్షాత్ రుద్రుడే[12] నిత్యము మితిలేని పాతకముల జేయించు యీ సంసార పిశాచము నుండి తొలగించి మానవుని సన్మార్గమున ప్రవేశపెట్టునది రుద్రాక్షమాలికయే.

రుద్రాక్షవిధి సచ్చిదానంద స్వరూపుడగు పరమేశ్వరుని సాయుజ్య సౌధాధిరోహమునకుగల నెనిమిది సోపానములలో రుద్రాక్ష రెండవ సోపానము భస్మవిరహిత దేహాలమై యున్నతవిభూతిప్రేత పిశాచాది గ్రహములావేశింపకుండుటకును, శరీరరక్షణ కొఱకును, రుద్రాక్షధారణమేర్పడినది. అట్టిపరమ పవిత్రమగు రుద్రాక్షధారణము వలనను, పూజనము వలనను, సమస్తదురితములు తొలగి ముక్తి కలుగునుగాన రుద్రాక్షధారణమక్షయ ఫలదాయకమని చెప్పబడినది.

'భవసాగర తారాయ భగదృగ్గర్భ జన్మనే।
విద్రావితాప, భద్రాయ రుద్రాక్షాయ నమోనమః
భూతిరుద్రాక్షమంత్రాశ్చ గురుర్లింగంచ జంగమః
పాదతీర్థ ప్రసాదౌ చేత్యష్టావరణ సంజ్ఞికాః'[13]

అని రుద్రాక్షగొప్పతనమును గూర్చి, అష్టావరణముల గూర్చియు తెలిపిరి.

రుద్రాక్షోత్పత్తి పూర్వమున సనత్కుమారుడు, ఋభు నిదాఘకాత్యాయన, భారద్వాజ వశిష్ఠాది మహర్షుల ప్రార్థనపై కాలాగ్నిరుద్రుడు సంహారకాలమున సంహారము జేసి సంహారాక్షిని మూసికొనిన సదాశివుని నేత్రమువలన నుద్భవించినవి గనుక, రుద్రాక్షములని వ్యవహరింపబడుచున్నవని[14] రుద్రాక్షోత్పత్తినిగూర్చి శాస్త్రిగారు వివరించిరి.

త్రిపురాసుర సంహార సమయమున బరమేశ్వరు నేత్రత్రయము వ్యాకులత నొంద దానినుండి బాష్పబిందువులు పుడమియందుబడి సర్వజగద్ధితమునకై శివాజ్ఞచే రుద్రాక్ష వృక్షములై జనించినవని చెప్పబడినది.[15]

రుద్రాక్ష భేదములు కపిలవర్ణ విశిష్టములు, సూర్యనేత్ర సముత్పన్నములునగు రుద్రాక్షములు ౧౨, శ్వేతములు చంద్ర నేత్రోదితములునగు రుద్రాక్షములు ౧౬, వహ్నినేత్రాగతములు, కృష్ణవర్ణములు నగునవి౧౦ మొత్తము రుద్రాక్షవృక్ష సంఖ్య ౩౮.[16]

తెల్లని రుద్రాక్షల బ్రాహ్మణులును, ఎఱ్ఱని రుద్రాక్షల రాజులును, పచ్చని రుద్రాక్షల వైశ్యులును, నల్లని రుద్రాక్షల చతుర్థకులజులును ధరింపయోగ్యులని బ్రహ్మవైవర్తమునందు చెప్పబడినను 'గుణోలోపేన ముఖ్యస్య పరిత్యాగః' అను న్యాయమునను సరించి గుణలోపమైనను ప్రధానమగు రుద్రాక్షను[17] పరిత్యజించక ధరింప వలయునని క్రియాసారము ద్ఘోషించుచున్నది కనుక వర్ణవివక్షను వదలియే రుద్రాక్షమునైనను ధరించుట శ్రేయస్కరమని తెలియుచున్నది.

రుద్రాక్షప్రమాణము — ఉసిరికాయంత ప్రమాణముగల రుద్రాక్షము లుత్తమములని, రేగుపండంత ప్రమాణముగలవి మధ్యమములని, శనగగింజంత ప్రమాణము గలవి క్రియాసారమునందు చెప్పబడినది.

అన్ని జపమాలికలలో రుద్రాక్షమాలిక మిగుల ప్రశస్తమైనదని గౌతమీస్మృతియందు చెప్పబడినది.[18]

మహర్షులందఱు రుద్రాక్షమాలికాధారులైనటుల సూతసంహితయందు గలదు.[19]

రుద్రాక్షభేదములు — ఏకముఖి, ద్విముఖి, పంచముఖి మున్నగు విధముగా ౧౪ భేదము లిందుగలవు.

రుద్రాక్షను శిరస్సునందుంచుకొని స్నానమాచరించిన గంగాస్నానఫలమును, రుద్రాక్షకు జలాభిషేకము చేసిన లింగపూజన ఫలమును లభించునని క్రియాసారము ౧౦ ఉ నందు చెప్పబడినది.

రుద్రాక్షధారణఫలము — రుద్రాక్ష నామోచ్చారణమాత్రమున వేయి గోదానఫలము,[20] స్పర్శనదర్శనములచే నరుడు పశుత్వము వీడి ముక్తినందునని[21] చెప్పబడినది.

రుద్రాక్షముఖము రుద్రుడని, తద్బిందువులు సర్వదేవతలని కావుననే రుద్రాక్షధారణ మాత్రముననే సర్వపాపములు నశించునని క్రియాసారమునగలదు[22]. సమస్తవైదికకర్మలు భస్మ రుద్రాక్షధారులై యాచరించినచో నక్షయఫలము చేకూరును. లేనిచో ఘోరపాపము సంభవించుటయేగాక కర్మఫల రహితులగుదురు. సర్వకాల సర్వావస్థలయందును రుద్రాక్షమును ధరింపవలసినదని స్కాందమునగలదు.[23] రుద్రాక్షపూజనఫలము లింగపూజన ఫలముతో సదృశమైనది.

శ్లో॥ అధరామ గిరౌరామః పుణ్యేగోదావరీ తటే
భూతి భూషిత సర్వాంగో రుద్రాక్షాభరణైర్యుతః[24]
పాద్మపురాణము

అను శ్లోకము వలన శ్రీరాముడు భస్మరుద్రాక్షధారియైనటుల పద్మపురాణమునందును, విష్ణుమూర్తి భస్మరుద్రాక్షధారియై శివానుగ్రహము బడసినటుల వై. ప నందును "రుద్రాక్షమాలాభరణో జటావల్కల సంయుతః తపసాతస్య దేవస్య కేశవస్య మహాత్మనః ప్రాదురాసీన్మహాదేవశ్శంకరః కరుణానిధిః"[25] అనిగలదు. వై. ప. 4.

వసుమతి రుద్రాక్ష ధరించి వారకాంతాలోలుడగు భర్తయగు సౌమ్యవంతుని బుద్ధి మరల్పగలుగుటకు, సౌమ్యవంతుడు శత్రుసంహారుడై జయలక్ష్మిని చేకొనుటకు, వారి కుమార్తెయైన సర్వకల సభయందు చిత్ర పటాంతర్గతుడైన విష్ణుమూర్తి సంతటివానిచే 'రుద్రాక్షధారణము సర్వశ్రుతిసిద్ధము, సర్వపాపహరము' అని చెప్పించి భర్తమనసు మార్చి రుద్రాక్ష భక్తిప్రపూరితుని గావించుటకు, సుప్రతీపుడు పిల్లికూనకు రుద్రాక్షధారణ గావించి స్వర్గమునకుఁ బంపి కల్పవృక్షముఁ దెప్పించుటకు, ఒక్క రుద్రాక్ష శిరస్సున బడుటచే మహాపాపియగు జామిత్రునికి కైలాస పదవి లభించుటకును, రుద్రాక్షధారణమే మూలమని వివిధ రమణీయ కథాంశములచే సుమధుర మంజుల పదపుంజరాజిచే శాస్త్రిగారిచే సోదాహరణముగఁ జెప్పబడినది.

మంత్రము అవాఙ్మానసగోచరము, ముక్తిప్రదమునగునట్టి తత్వపరిజ్ఞానమునకు మంత్రము మూలము. మంత్రోపాసనమువలనగాని మనశ్శుద్ధి గలుగదు. మనశ్శుద్ధి గలిగినగాని పరమేశ్వర సందర్శనము సంభవింపనేరదు. కావున మంత్రోపాసన మత్యవసరము.

మంత్రమనగానేమి ?— "మననాత్త్రాయత ఇతి మంత్రమ్" అనగా మననము చేయుటవలన రక్షించునది గాన మంత్రమయ్యెను. మొత్తము మంత్రముల సంఖ్య 7 కోట్లు, కొన్ని మంత్రములు శైవములు, కొన్ని వైష్ణవములు, కొన్ని శాక్తేయములు. మంత్రసిద్ధిచే సకలము సిద్ధించుననుటకు అధర్వణవేదము ప్రమాణము.

మంత్రము దేవతారూపమనియు, మంత్రార్థము శివుడనియు శైవసిద్ధాంత శిఖామణియందు కలదు.

"సర్వేషామేవతత్త్వానాంమూలం శివ ఇతి స్మృతంతస్మాన్మూలమితిజ్ఞేయమ్" సర్వతత్త్వములకును శివతత్త్వము మూలమైనదగుటచే శివమంత్రమునకు మూలమంత్రమను వ్యవహారము కలిగెను.

భవసాగర మగ్నానాం దేహినాం హితకామ్యయా
ప్రాహోన్నమశ్శివాయేతి మంత్రమాద్యం హరస్స్వయం

భవసాగరమగ్నుల జన్మబాధా ప్రశమనమునకై పరమేశ్వరుడే "ఓం నమశ్శివాయ" అను నీ మొదటి మంత్రమును వచియించెనని వాయవీయ సంహితయందు కలదు.

సప్తకోటి మహామంత్రములు చిత్తవిభ్రమము గలుగజేయును. అందటికి నొక్క పంచాక్షరీ మంత్రము మాత్రము మనోచాంచల్యము గలుగజేయక మోక్షము నొసంగును.[26]

పంచాక్షరీ మంత్రము పంచభూతాత్మికము. నకారాదిబీజములు పంచభూత స్వరూపములు. ఎటులన నకారము భూమి యనియు, మకారము ఉదకమనియు, శికారము అగ్నియనియు, వాకారము వాయువనియు, యకార మాకాశమనియు, మంత్ర మంతయు శివస్వరూపమని చెప్పబడినది.[27]

పంచాక్షరీ శివపదేన విభూతిరుద్రా।
ధ్యాయ స్త్రయాస్ఫురతితేన చతుర్థకాండః
కాండేన సర్వయజురేవ విభాతితేన
ఋక్సాషు మధ్య మణి వాచ విభాంతివేదాః — వైదింప[28]

వైదికమగు నీ పంచాక్షరీ మంత్రముచేతనే వేదమున కంతయు బంగారమునకు పరిమళ మబ్బినటుల గుణాధిక్యము గలిగినదని పై శ్లోకమున జెప్పబడినది.

అన్ని విద్యలలో వేదముత్కృష్టమైనది. దానిలో నమకమును అందు పంచాక్షరియు దానియందు 'శివ' అనుమంత్రమును సుత్తమోత్తమములు.[29] పంచాక్షరీ మంత్రమునకు ముందు 'ఓం' కారము చేర్చి ఓం, న, మ, శి, వా, య అని యుచ్చరించినచోనది షడక్షరీ మంత్ర మగును.

"వినా ప్రణవకం మంత్రం స్త్రీశూద్రాణాంచ సాధకం"

స్త్రీశూద్రాదులకు వేదాధికారమీయుగమున లేదని శాస్త్రములు నుడువుటచేతను, ఒంకారము వేదస్వరూపమగుట చేతను అధికారి భేదమునుబట్టియు ఓంకార రహితమగు పంచాక్షరియే వారికుపాస్యమని చెప్పబడినది. తారక మంత్రమేది-? "నమో వృక్షేభ్యో హరికేశేభ్యో నమస్తారాయనమః[31]

అన్నిశ్రుతియందు 'నమస్తారాయ' అని యీశ్వర నామమే తారకముగా సూచింపబడినది. "మంత్రాధీశాభాతి పంచాక్షరీయం" అను కాశీసారమునందలి శంకరుని వాక్యమును పంచాక్షరియే సంసార తారకమగునని యుపదేశింప బడినది.

"రామనామమస్మరణీయమా?" అని ప్రశ్నించుకొని శాస్త్రిగారిట్లు సమాధానము నిచ్చుచున్నారు. శ్లో॥ శివలింగ ప్రతిష్ఠాతాసర్వావగుణ వర్జిత"[32]

శ్రీరామచంద్రుడు సేతువునందు తనపేరున లింగమును ప్రతిష్ఠించి అగస్త్య మహర్షివలన శివగీతలువిని, సదాశివ ధ్యానము సేయు మహా శివభక్తుడు. అట్టి మహా భక్తుని నామస్మరణము బసవేశ్వర నామమువలె యున్నతగతి సౌధమునకు సోపానమగుటలో సంశయములేదు. "నాకంటె నధికులు నా భక్తవరులు" అను ప్రభులింగ లీలయందలి వచనమును, పరమేశ్వరుని కంటె భక్తులే యధికులని నిరూపించుచున్నది. వీరశైవులు 'దధీచిరామాన్' అని స్మరించుచునే యున్నారు కాన శివభక్తుడగు రాముడు బసవేశ్వరునివలె స్మరణీయుడనియే రాద్ధాంతము.

పంచాక్షరీ ప్రభావము — స్కాందమహా పురాణమున పార్వతితో పరమేశ్వరుడు పంచాక్షరీ మహాత్మ్యమును వివరింపుచు "లోకములు, వేదములు, మహర్షులు, ఈ చరాచర ప్రపంచ మంతయు పంచాక్షరీ ప్రభావముననే నిలిచియున్నవి సుమా!" అని వచించెను.

కలియుగమునందు మానవుడు పండితోత్తముడైనగాని పామరుడైనగాని, అంత్యజుడైనగాని అగ్రజుడైనగాని పంచాక్షరీ మంత్రమును జపించినగాని సమస్త శుభముల బొంది ముక్తి నొందజాలడని ఈశ్వరుడు వాయు సంహితలో తెలిపెను.

అగ్ని హోత్రములుగాని, వేదత్రయముగాని, యజ్ఞముగాని పంచాక్షరి జపము యొక్క కోట్యంశము తోడను సమానములు గావు [34]

ఉపమన్యు మహర్షి పరమేశ్వరుని నుండి శైవశాస్త్ర రహస్యముల గ్రహించి బోధకుడై ప్రకాశించుటకును, వశిష్ఠ, వామదేవాది యోగీంద్రులు ముక్తకిల్బిషులై మహాతేజోవంతులగుటకును, సర్వులు విగతపాపులై మోక్షలక్ష్మిని కైవసము జేసికొనుటకు పంచాక్షరియే మూలమని, మంత్ర ప్రభావము వర్ణనాతీతమని సిద్ధాంత పంచకమున జెప్పబడినది. సర్వకాల సర్వావస్థలయందు పరిశుద్ధుడైనను, అపరిశుద్ధుడైనను, శివనామము స్మరించు మానవుడు సిద్ధినొందగలడని 'తత్వజ్ఞ' అందు చెప్పబడినది.

మహాపాశుపతుడగు శ్రీహరిని స్మరించు చున్నానని శాస్త్రిగారు శ్రీహరిమూర్తినిట్లు కనులకు గట్టినట్లు వర్ణించుచున్నారు.

శ్లో॥ హృదంతరే శంకర తత్త్వచింతనం జిహ్వాంతరే శైవషడక్షరంచ
ఫాలప్రదేశే శివశూలచిహ్నం ధరంహరింపాశుపతంస్మరామి[35]

పంచాక్షరీ మంత్రార్థము :

నమఃపదము అంగమనియు, లేక జీవుడనియు, శివపదము లింగమనియు, లింగాంగ సంబంధము, అయ అను పదముచే బోధింపబడి

నది. కావున పంచాక్షరీ మంత్రము శివజీవైక్య బోధకమని తెలియు చున్నది. శివశబ్దతమగు నా పరబ్రహ్మను నమస్కార పూర్వకముగా నుపాసింపవలెనని తన్నమఇత్యుపాసీత" అని శ్రుతి బోధించు చున్నది.

దూర్వాసమహర్షిచేపంచాక్షరీ మంత్రోపదేశమంది, ఆమంత్రాను స్థాన బలముచే దివ్యతేజస్సునొందుటయేగాక, వారకాంతాలోలుడై అపవిత్ర దేహుడగు దాశార్హపతికి భర్గమహర్షిచే పంచాక్షరీ మంత్రోప దేశము గావించి పాపరహితుని గావించుటకును, సూర్యశర్మ వంచకు డగు మానవునిహస్తము కనబడదు, అచేతన వృషభంబులను సైతము చేతన స్వరూపమున రప్పించి, స్నుషాసుతులను ధేనువును బ్రది కించి, ఐహిక సౌఖ్యంబు లనుభవించి యంతమునకై వల్యమందుట కును పంచాక్షరీ మంత్రానుష్ఠానమే మూలమని శాస్త్రిగారు భక్తగాధా పురస్సరముగా నభివర్ణించిరి.

గురులక్షణము :

శ్లో॥ గుకార స్త్వంధకారస్యా ద్రుకార స్తన్నిరోధకృత్
అంధకార వినాశత్వాద్గురు రిత్యభిధీయతే స్కా. ఉ. సం.[37]

గుకారమునకు అంధకారమని, రుకారమునకు నిరోధమని యర్థములు. అంధకార సదృశమగు అజ్ఞానమును బోగొట్టి జ్ఞాన మొసగువాడగుటచే గురువని వచింపబడు చున్నాడు. షట్త్రింశత్ తత్వాతీతుడగు పరశివుడే గురురూపమున వచ్చి చెప్పకుండిన మాన వులకిక తరింపులేదని సదానంద శతకమున నుడువబడినది.

"ఆచార్యదేవోభవ" అని శ్రుతి గురుగౌరవమును ప్రకటించి నది శైవసిద్ధాంత శిఖామణిలో గురుపూజయే శివపూజయని వ్యవహ రింపబడినది. కావున గురుడే శివుడని భావింపవలయును.

గురుయాత్ర, దేవయాత్ర, తీర్థయాత్రలను త్రివిధములగు యాత్రలలో గురుయాత్రయే యధికమైనదని శైవసిద్ధాంత శిఖామణిలో కలదు.

"గురుర్బ్రహ్మ గురుర్విష్ణు ర్గురుర్దేవో మహేశ్వరః

గురుస్సాక్షాత్ పరబ్రహ్మ" అనెడి గురుస్తోత్రము సైతము గురువు త్రిమూర్త్యాత్మకుడని తెలియజెప్పుచున్నది.

గురులక్షణము :

శ్లో॥ గురవో నిర్మలాశ్శాంతా స్సాధకో మితభాషిణః
కామక్రోధవినిర్ముక్తాస్సదాచారా జితేంద్రియాః[39].

గురువు నిర్మలుడును, కపటములేనివాడును శాంతస్వభావము గలవాడును, మితభాషియు, కామక్రోధరహితుడును, సదాచారము గలవాడును, జితేంద్రియుడునై యుండవలెను. శాస్త్రజ్ఞుడు, ధీమం తుడు, తపశ్శాలి, జనవత్సలుడు, తత్త్వవేత్త, లోకాచారరతుడు, మోక్షప్రదుడునగు మహానుభావుడే గురుశబ్ద వాచ్యుడగును.

గురుశిష్య సంబంధము :

గురుశిష్యసంప్రదాయ మనాదిసిద్ధము. గురువులేకుండ నభ్యసిం చినవిద్యలు, అనుష్ఠించిన మంత్రములు నిరర్థకములు, నిష్ఫలములు. సత్పాత్ర దానమువలె సచ్ఛిష్యుని విద్యాదానము ముక్తిప్రదమగును.

శిష్యశబ్దార్థము :

"శాసనీయశ్శిష్యః" అనగా శిక్షింప దగినవాడు శిష్యుడని యర్థము. సత్యవాదియు, గురుభక్తియుతుడును, దంభాహంకార రహితుడు, రాగద్వేషశూన్యుడు, శాంతుడు, సర్వజనప్రియుడు గుర్వాజ్ఞ పరిపాలకుడునగు వాడే శిష్యుడు.

గురువు శిష్యునిజ్ఞానమును, ప్రవర్తనను పరీక్షించి విద్య నొసంగుటగాని, మంత్రోపదేశము సేయుటగాని చేయ వలయును. అటులేశిష్యుడును గురులక్షణమును గురుసామర్థ్యమును విచారించు కొనియే విద్యనేర్చుకొన ప్రారంభింపవలెను.

శుభకార్యములందు, వివాహాదులయందు, మాస శివరాత్రుల యందు, దక్షిణాయన ఉత్తరాయన పుణ్యకాలములయందు గ్రహణ కాలమందు, పర్వములయందు శిష్యుడు శక్తికొలది గురువు నర్చించిన చాలును. గురు కటాక్షమునకు పాత్రుడైన శిష్యుడు పాపపంకిలము నుండి ప్రక్షాళితుడగును "శరీరమర్థం ప్రాణంచ సద్గురుభ్యో నివేద యేత్" శరీరార్థ ప్రాణముల శిష్యుడుగురువునకు సమర్పింపవలెను.[40]

పరశువేది స్పర్శవలన లోహము బంగారమగునటుల గురు కటాక్షప్రసారమున మానవుడు శివుడగుచున్నాడు.

గురువులు సద్గురులక్షణ సంపన్నులై, ద్రవ్యార్జనమే ప్రధాన ముగా నెంచక శిష్యహృత్తాపమును హరించువారలై యుండ వలయును

గురుశిష్యుల విషయమై మూడు న్యాయములు గలవు. 1) మార్జాల కిశోర న్యాయము. 2. మర్కట కిశోర న్యాయము. 3) భ్రమరకీట న్యాయము.

1. మార్జాల కిశోరన్యాయము- శిష్యుడు సదాచార సంపత్తిలేక దుర్వ్యసనుడై తనవద్దకు రాకయున్నచో గురువే సన్మార్గమున లాగి కొనివచ్చి సదుపదేశ మొసంగి జ్ఞానోపదేశము చేయవలయును.

2. మర్కట కిశోరన్యాయము : గురువు తప్పుద్రోవలనడచిన శిష్యు దేయాతని వెంటబడి గురువుకు విజ్ఞానశక్తిని కలిగించి తాను జ్ఞానమాతనివలన నేర్చుకొనవలెను.

3. భ్రమరకీటన్యాయము : తుమ్మెద తన ఝుంకారముచేదైవముగా తలచి స్మరింపుము. గురు ప్రాశస్త్యమీ క్రింది సీసమునందు పురుగుకు తన స్వరూపము కలిగించునటుల గురువు శిష్యుని జ్ఞాన శక్తిచే తనతో సమానునిగా జేసికొని జ్ఞానముపదేశింపవలెను.

శైవసిద్ధాంత దర్శినినవలోకించి ఆకళింపుజేసికొనిన పాఠకున కాయాసము గలుగకుండ ఉపమన్యాది భక్తులగాధల రచించి శాస్త్రి గారు వారినుత్సాహపఱచిరి.

ఉపమన్యుడు గురువాజ్ఞ జవదాటక మెలంగి నేత్రముల బొంది దేవతాసాక్షాత్కారము నొంది, సకలశాస్త్రపారంగతుడగుటకును, దుర్వర్తన శిష్యులగు చంద్రశేఖరుని, వీరయ్యను మనస్సున శ్రమకలుగకుండ సన్మార్గమునకు లాగికొనివచ్చి కైవల్యమొందునట్లుచేయుటకును, గురువే గురూపదేశమే కారణమని రమ్యముగా నీ గ్రంథమున నిరూపింపబడినది.

ఈ గ్రంథసారాంశ మంతయు నాలుగు మాటలలో చెప్పబడినవి.

1. నిరంతరము భస్మరుద్రాక్షల ధరించి పంచాక్షరిని గాని షడక్షరిని గాని నిత్యము జపించుచు గురుబోధల విని గురువును నిట్లు చెప్పబడినది.

సీ॥ కామాది విషయోరు గహనపాతికి మార్గ। సందర్శకుడు వసే
చరుడు గురుడు
అజ్ఞాన తిమిరావృతాంధ కోటికి జ్ఞాన। కాంతి ప్రదుండు
భాస్కరుడు గురుడు
ఘోర సంసృత్యకూపార మజ్జత్ప్రజా। పాణిపద్మ
ప్రాప్తప్లవము గురుడు
దారిద్ర్యదుస్సహ క్రూరమహాకుండ। లీ దుష్టులకు జాంగలికుడు
గురుడు
గీ॥ శిష్యమానసకానన సీమజాత। మోహశుష్కతృణాగ్ని
సముండు గురుడు
లోకబంధుడు మోక్షైక లోలుదఖిల। కల్మష వినాశకుండు
శంకరుడె గురుడు

ఉపదేశకాండ[42]

అ ధో జ్ఞా పి క లు

1. 4వ పేజి
2. 4వ పేజి
3. 4వ పేజి
4. 5వ పేజి
5. 5వ పేజి
6. 10వ పేజి శై. సి. ద.
7. 11వ పేజి శై. సి. ద.
8. 11వ పేజి
9. 12 వ పేజి.
10. నందా చద్రా సురభిస్సుశీలా సుమనాస్తదా।
పంచగావశ్శివాజ్ఞాతాస్సద్యోజాతాదివ క్త్రత॥
కపిలః కృష్ణధవలధూమ్ర రక్తాస్తథైవచ।
నందాదీనాంగవాంవర్ణాః క్రమేణ పరికీర్తితా:
సద్యోజాతాద్విభూతిశ్చ వామాదృపితమేవచ।
అఘోరాద్భస్మసంజాతం పురుషాత్క్షారమేవచ
రక్షాచేశాన వక్త్రాచ్చ నందాది ద్వారతో భవేత్
(సి. శి. భూ) 13 వ పేజి.
11. త్రైపుంద్రితాని రచితాని లలాటపట్టే।
లుంపంతి దైవ లిఖితాని దురక్షరాణిః సోమ. విభూ.
19 వ పేజి.
12. కంఠేరుద్రాక్ష మాలాంయద్ధృత్వాతు క్రియతేయది, సో
పిరుద్రత్వమాప్నోతి (స్కాందము.)
13. 37 వ పేజి
14. అధకాలాగ్నిరుద్ర॥ ప్రోవాచ రుద్రస్య నయనాదు
తృన్నోరు ద్రాక్ష ఇతిలోకే ఖ్యాయతే। అధవా సదా
శివస్సంహార కాలే సంహారం కృత్వా సంహారాక్షి ముకు
లీకరోతి। తన్నయనాజ్జాతా రుద్రాక్ష ఇతిఖ్యాయతే
(రుద్రాక్షజాబాలోపనిషత్) శైవసిద్ధాంత దర్శిని 38 పేజి.
15. శ్లో॥ తదాకులం తస్యబభూవ చాక్ష్ణం
త్రయంతతో శ్రూణ్యపతంశ్చతేభ్యః
రుద్రాక్ష వృక్షా విటపైర్చ భూవుశ్శివాజ్ఞయా
సర్వజగద్ధితాయ (కి. ఉ. శై. సి. ద. 39 పేజి)

16. రుద్రాక్షవృక్షాస్తపనాక్షి జాతాస్తే ద్వాదశస్యుః
కపిలాది భేదైః
చంద్రాక్షిజాషోడశ శుభ్రవర్ణాః కృష్ణాదశస్యుర్జ్వల
నాక్షిజాతాః
(బ్రహ్మవైవర్తపురాణం – శై. సి. ద. 39వ పేజి)

17. శై. సి. ద. 41 వ పేజి.

18. 'రుద్రాక్షై రనంత ఫలముచ్యతే' (గౌతమీ స్మృతి, శై. సి. ద. 43వ పేజి

19. ఋషయోమృదవస్స్వస్థాస్సర్వద్వంద్వ వివర్జితాః
రుద్రాక్షమాలాభరణస్సిత భస్మావకుంఠనాః
సూతసంహిత. శై. సి. ద. 43వ పేజి.

20. గవాంకోటి ప్రదానస్యయత్ఫలంభువి లభ్యతే తత్ఫలం లభతే మర్త్యోనిత్యం రుద్రాక్షధారణాత్ (కాలాగ్నిరుద్రము)

21. "దర్శనాత్స్పర్శనాచ్చైవ స్మరణాదపి పూజనాత్
రుద్రాక్షధారణా దేవ పశుత్వం వినివార్యతే" (కాలాగ్ని రుద్రము.)

22. రుద్రాక్షధారణాత్సద్యస్సర్వైపాపైః ప్రముచ్యతే
తన్ముఖం రుద్రమిత్యాహుస్తద్భిందు స్సర్వదేవతాః
(క్రియాసారము – శై. సి. ద. 49వ పేజి)

23. గచ్ఛన్, తిష్ఠన్, స్వపన్, జాగ్రదున్మిషన్ని మిషన్నపి, శుచిర్వాప్యశుచిర్వాపి (స్కాందము.)

24. పాద్మపురాణము, శై. సి. ద. 50

25. వై. ప. 4, శై. సి. ద. 50.

26. సప్తకోటి మహామంత్రాశ్చిత్త విభ్రమకారకాః
ఏకః పంచాక్షరీ మంత్రస్సర్వేషాం మోక్షదాయకః
శై. సి. ద. 63వ పేజి

27. నకారాదీని బీజాని పంచభూతాత్మికానిచ। నకారః పృథివీ జ్ఞేయామకారస్తోయ శికారోగ్నిరితి ప్రోక్తోవాకారోవాయు రుచ్యతే। యకారోనభ ఇత్యుక్తం మంత్రో బ్రహ్మమయ శ్శివముచ్యతే (శై. సి. ద. 63వ పేజి)

28. వై. ది. ౧ప. శై. సి. ద. 63వ పేజి

29. శ్లో॥ విద్యాసుశ్రుతి రుత్కృష్టా రుద్రైకాదశినీస్మృతా
తత్రపంచాక్షరీ తస్యాం శివఇత్యక్షరద్వయం. (వై.ది. ౧పః, 63వ పేజి శై. సి. ద.)

30. శివజ్ఞానవిద్య, అధ్యా౧, శై. సి. ద. 68వ పేజి

31. యజుస్సంహిత, శై. సి. ద. 74వ పేజి.

32. రామాష్టోత్తరశత నామావళి, శై. సి. ద. 80వ పేజి.

33. పంచాక్షరీ ప్రభావేన లోకావేదా మహర్షయః
తిష్ఠంతి శాశ్వతాధర్మాః జగదేతచ్చరాచరం (స్కాంద శై. సి. ద. 81వ పేజి)

34. అగ్నిహోత్రాస్త్రయో వేదా, యజ్ఞాశ్చబహుదక్షిణాః
పంచాక్షర జపస్యైతే కోట్యంశేనాపినో సమాః (సిద్ధాంత పంచకం, శై. సి. ద. 83వ పేజి)

35. స్కాంద మహాపురాణము శై.సి.ద. 84వ పేజి

36. నమః పదం తత్త్వలు జీవవాచిశివః పదంతత్పరమాత్మవాచి
అయేతి తాదాత్మ్యపదం తదేతన్నమశ్శివాయేతి జగాద మంత్రః శై. సి. ద. 85వ పేజి

37. స్కా. ఉ. సం. 98వ పేజి శై. సి. ద.

38. " గురుపూజైవ పూజాస్యాచ్ఛివస్య పరమాత్మనః "
(శైవసిద్ధాంత శిఖామణి)

39. గురుగీతలోకలదు. శై. సి. ద. 98వ పేజి

40. శై. సి. ద. 120వ పేజి

41. గురోః కటాక్షవేధేన శివోభవతి మానవః। రసవేధా ద్యథాలోహో హేమతాం ప్రతిపద్యతే ౧౭ సి వ
(శై. సి. ద. 122వ పేజి)

42. ఉపదేశకాండ కోడూరి వేంకటాచలకవి, శై. సి. ద. 143వ పేజి

విపిన విహారి

శ్రీ పట్లూరి ఈశ్వరచంద్ర విద్యాసాగర్

ఆలసా నిలమా! అలా అలలు అలలుగా తేలిరాకు
పిచ్చిగా నీ పద పథాల వెంటబడి అర్ణవాలు దాటుతాను.
ఈ పచ్చిక మైదానం మీద తొలి ఉషస్సు పరుచుకుంది.
చెల్లా చెదురైన శీతల రస బిందువుల్ని కూర్చి
అజంతా ఎల్లోరాల్ని పేర్చుకోని
తరతరాల చరిత్రకు చెదరని ప్రతీకలు!
ఆ పర్వతాల నంటురితనంతో స్నేహం కట్టి
నదీజల నినాదాల్లో స్నానం చేస్తాను
చెదల చెక్కిలి మీద సిగ్గుల సింధూరం!
ఝుమ్మని పూసిన పూపొదలు
పువ్వులకై ఱెక్కలు దించిన తుమ్మెదలు,
ఎగిరే విహంగాలు, కదిలే మేఘాలు,
చెదిరే తరంగాలు;
ఈ ప్రకృతి రమ్యకుడ్యాల మీద
హాయ్! ఎన్నిమోనాలిసాలు!
ఏయ్! ఆమని అందాల రాణి! కోయిలా!
తలిరుల సందుల్లోంచి
అలవోకగా అమృత భాండాన్ని వొంచి
అనంతమైన శూన్యంలోకి అంతర్ధానంకాకు.
ఇక యిక్కడ యీ ప్రకృతిలో లీనంకాక
వంటరిగా మరోక్షణాన్ని భరించలేని నేను
ఈ అడవిలో వెదురులా పుట్టి
వేణువునై పోతాను.

○●○

అహాన్ని చూపించే అద్దం

శ్రీ మద్దూరు శ్రీనివాసులు

అద్దం
ఆడపిల్ల జీవితంలా సున్నితమైంది
క్రిందపడ్తే ముక్కలౌతుందీ....అని
చెప్పినా వినకుండా
కావాలనే పగులగొట్టేసి
గర్వంగా నవ్వేవాణ్ణి.
ఓరోజు
ఆ అద్దం ముక్కే
నా అరికాలి గుండెల్లో గుచ్చుకునేసరికి
తెలిసొచ్చింది
జీవితమంటే ఏంటో.
అప్పట్నుంచీ
అద్దం
నా ముఖాన్ని చూపించే ముందు
నా అహాన్ని అసహ్యంగా చూపిస్తూంటుంది.

○)(○)(○

శ్రీ ఎ. విజయదత్తాత్రేయశర్మ

శ్రీకాకుళం జిల్లా గ్రామనామములు ఒక పరిశీలన

(గతసంచిక తరువాయి)

సంస్థానములు - జమిందారీలు

జయపురం

నేడు ఒరిస్సా రాష్ట్రాంతర్భాగమైన జయపుర సంస్థానం 15-18 శ॥ కాలంలో ఈ ప్రాంతముపై ఆధిపత్యం కలిగిఉండేది. నాటి కేంద్రపట్టణ నామమునుబట్టి జయపురం (పాల&టె) గ్రామ నామములేర్పడినవి. జయపురపాలకులలో భైరవదేవ(1510-1527); హరిదేవ (1669-1672), ముగ్గురుబలరామదేవులు (I-1571-97, II 1684-86, III-1711-13), వీరవిక్రమదేవ (1637-1669), ముగ్గురు విక్రమదేవులు (I-1758-81, II-1825-60, III-1875-1920), విశ్వనాథదేవులుగా వ్యవహృతులైన ఇరువురు విశ్వంభర దేవులు (I-1527-71, II-1672-76), నల్గురు రామచంద్రదేవులు (I-1708-11, II-1781-1825, III-1860-1889, IV-1893-1931)ఉన్నారు. వారిపరంగా భైరిపుర (సొం & ఇ), బలరామపురం (పా), విక్రమపురం (సొం&టె&పాల), విశ్వనాథపురం(న). ప్రతాప విశ్వనాథపురం (టె) రామచంద్రపురం (శ్రీ) గ్రామనామములేర్పడినవి.[73]

టెక్కలి

"పదకొండవ శతాబ్దములో శైలోద్భవ వంశీయపురాజు, తన కుమార్తెయగు కస్తూరికామోదిని, దక్షిణ కళింగాధిపతియగు గంగవంశపు యనంతవర్మ చోడగంగతో వివాహముచేసెను. కన్యాదాన సమయమున విశిత దక్షిణదేశమును 'టికిలి' స్వరూపముగా దానము చేసెను. అది లగాయతు యీ రాజ్యమునకు టికిలియని పేరుగలిగినది."[74] కాల క్రమమున 'టికిలి' 'టెక్కలి' అయినదన్నమాట.

టెక్కలిరాజులకు గోపాలస్వామి యిష్టదైవతము. వారిలో గోపాలదేవుడు (16శ॥ ఉత్తరార్ధం) ప్రముఖుడు. దండుగోపాలపురం, గోపాలదొరవూరు, గోపాలపురం, మజ్జిగోపాలపురం (అన్నిటి) గ్రామములు ఆదేవునిపేరునగాని, ఆ రాజుపేరునగాని ఏర్పడినట్టివి. టెక్కలి పాలకుల వైష్ణవమతాభిమాన సూచికములా అన్నట్లు గోపవల్లభపురం, హరిదాసపురం, బృందావనం(టె) గ్రామనామములై ఉన్నవి. పర్లా పాలకుడు నరసింహదేవుని వలన వీరు 'జగద్దేవ' బిరుదాన్ని పొందారు. కొత్తజగద్దేవపురం, పాతజగద్దేవపురం (టె) ఆ బిరుద సూచికంగా ఉన్నవి. టెక్కలి పాలకులలోగల నరసింహనామధేయులను బట్టి నరసీపురం, నరసింగపల్లి, నరసాపురం (టె) ఏర్పడినవిగా తోచును. టెక్కలి పాలకులైన జయకృష్ణ, శివరామ, నీలకంఠ, పురుషోత్తమ, పద్మనాభ, వీరభద్ర, లక్ష్మీనారాయణ, నారాయణ, మధుసూధన, రఘునాథ, జగన్నాథ, రామకృష్ణ, రాజగోపాలుర పేర్లననుసరించియే టెక్కలి తాలూకాలో కృష్ణరాయపురం, కృష్ణాపురం, శివరాంపురం, నవరనీలాపురం, తోటనీలాపురం, పురుషోత్తపురం, పద్మనాభపురం, పద్మాపురం, వీరభద్రాపురం, పెద్ద లక్ష్మీపురం, పెద్ద నారాయణపురం, నారాయణపురం, రఘునాధపురం, వీరరఘునాధపురం, అకులరఘునాధపురం, రఘునాధపురం, (టెక్కలి) సుంకర జగన్నాధపురం, పూడి జగన్నాథపురం, రామకృష్ణాపురం, ఉద్దానం రామకృష్ణాపురం, వీరరామకృష్ణాపురం, రాజగోపాలపురం గ్రామనామము లేర్పడినవిగా తోచును.

లక్ష్మీనారాయణపురం, నారాయణపురం, నరసింగపురం, పద్మనాభపురం, పురుషోత్తమపురం, రఘునాధపురం, రామకృష్ణాపురం, (అన్నీసొం) గోపాలపురం, పురుషోత్తమపురం, రామకృష్ణాపురం శేఖరపురం, శివరాంపురం, (అన్నిపా) గోపాలపెంట, నరసింగుపల్లి (న) గ్రామనామములుకూడ పైనచెప్పబడిన టెక్కలిరాజుల పేర్లపరంగా ఏర్పడినట్లున్నవి.

మదనాపురము (టెక్కలి)లక నామము టెక్కలి రాజులలో 'మంగరాజు' బిరుదము బడసిన మీనకేతనునివలనగాని అతని మనుమడు అనంగుని వలన గాని వచ్చియుండ వచ్చును.

11వ శ॥నందు టెక్కలి ప్రాంతమును పాలించిన పద్మచంద్రుని రాజధాని బిజయపూర్ నేటి బెజ్జిపల్లి (టె)తో పోల్చడమైనది.[75]

కోటబొమ్మాళి (స)

టెక్కలి రాజులలో నొకడగు వనమాలి దన పేరిట గ్రామమును నిర్మించెను. "అది 'వనమాలికోట' యనబడి కాలక్రమమున 'గోట వనమాలి' యయ్యెను. వకారముత్కళ భాషలో బకారమగును గాన, వనమాలి బనమాలియయి, యుచ్చారణ సౌలభ్యార్థము 'బొమ్మాళి' యయ్యెను."[76] ఇది కోటబొమ్మాళి గ్రామ నామ చరిత్ర.

సంతబొమ్మాళి (టె)

ఈ బొమ్మాళి నిర్మాతకూడ వనమాలియే. ఈ గ్రామం వర్తక వ్యాపారాలకు కేంద్రమైన 'సంత' జరిగేదిగా ఉండేది కావడంచేత 'సంత' బొమ్మాళి అని పేరు తెచ్చుకున్నది.[77]

తిర్లంగి (టె)

"చంద్రశేఖరుడు (వనమాలి దాయాది, ప్రత్యర్థి) వనమాలి తన జోలికి రాకుండ బొమ్మాళి రాజ్యమునకు దన రాజ్యమునకు సరిహద్దులలో నొక గ్రామమున త్రిలింగ దేశపు సర్దారుని గాపు పెట్టెను. ఆగ్రామమిప్పుడు తిర్లంగియని వ్యవహరింపబడుచున్నది"[78] కాని, వనమాలి — చంద్రశేఖరుల కాలమునకు చాలమునుపే తిర్లింగి గ్రామనామము శాసనములలో కానవచ్చుచున్నది.[79]

రఘునాథపురం (టెక్కలి)

18వ శ॥ ఉత్తరార్ధమున టెక్కలి పాలకుడు రఘునాథుడు "అతడు తన పేరిట నొక గ్రామమును చిరస్మరణీయార్థము నిర్మించెను. అదియే 'రఘునాథపుర' మని ప్రకీర్తిత మగుచున్నది. క్రీ. శ. 1747న రఘునాథపుర ప్రతిష్ఠ మహావైభవముతో జరిగెనని రఘునాథజగద్దేవుని స్వీయచరిత్ర వక్కాణించు చున్నందున నిప్పటి టెక్కలి రఘునాథపుర జన్మదినములవియై యుండవచ్చునని చరిత్రాన్వేషకుల దృష్టి కొక నవ్యపథము స్ఫురించుచున్నది."[80]

సంస్థానములు - జమిందారీలు

జయపురం

నేడు ఒరిస్సారాష్ట్రాంతర్భాగమైఉన్న జయపుర సంస్థానం 15-18 శతాబ్దాల మధ్యకాలంలో ఈ ప్రాంతముపై ఆధిపత్యంకలిగి ఉండేది. పాలకొండ, సాలూరు, మేరంగి ఇత్యాది చిన్న సంస్థానములన్నియు జయపురం వారివలన రూపుదాల్చినవే. 'జయపురం' ఆకాలమున కేంద్రపట్టణము కాబట్టి ఆపేరున గ్రామములు టెక్కలి, పాలకొండ తాలూకాలలో కూడవెలసినవి.

ఇచ్ఛాపురం, సోంపేటతాలూకాలలోని హరిపురములు జయపుర పాలకుడు హరిదేవు (1669-1672) పేరవెలసినవి. అతని పూర్వీకుడు భైరవదేవు[104] (1510 - 1527) పేరున సోంపేట, ఇచ్ఛాపురం తాలూకాలలో భైరిపురములు గలవు. పాతపట్నం తాలూకాలోని బలరాంపురం జయపురాధీశులైన ముగ్గురు బలరామ దేవులలో (బలరామ I-1571-1597, రెండవబలరామదేవు 1684 - 1686, మూడవ బలరామదేవు 1711-1713) నెవరిపేరున ఏర్పడినదో ? జయపుర పాలకులలో వీర విక్రమదేవు (1637-1669) మొదటి విక్రమదేవు (1758-1781), రెండవ విక్రమదేవు (1825-1860), మూడవ విక్రమదేవు (1875 - 1920) గలరు. విక్రమపురములు సోంపేట, టెక్కలి, పాలకొండ తాలూకాలలోనున్నవి. జయపుర విశ్వంభరదేవు (1527-1571), రెండవ విశ్వంభరదేవు (1672-1676) ప్రఖ్యాతులు. వీరు విశ్వనాథదేవులని కూడ వ్యవహృతులు. ప్రతాపవిశ్వనాథపురం టెక్కలితాలూకాలోను, విశ్వనాథపురం నరసన్నపేట తాలూకాలో వున్నవి. జయపురేశ్వరులలో నలుగురు రామచంద్ర నామధేయులున్నారు. (I-1708-11, II-1781-1825, III 1860-1889, IV-1893-1931), శ్రీకాకుళం తాలూకాలో రెండు రామచంద్రపురములున్నవి. వీరరామచంద్రపురం(సోం), సామంత రామచంద్రపురం(సోం), బేరిరామచంద్రపురం (సోం), జయరామచంద్రపురం(టె) దొడ్లరామచంద్రపురం(టె), బురదరామచంద్రపురం (పాత) తూముకొండరామచంద్రపురం (పాత) మొ॥ ఈ జిల్లాలో రామచంద్రపురములు పుష్కలముగా నున్నవి.వీటిలో అన్నీ జయపురరాజుల పేరుననేగాక కొన్ని శ్రీరామచంద్రుని పరంగా నేర్పడినవి కావచ్చును. అది యనుగాక, ఈ ప్రాంతంలోని చిన్నసంస్థానములు జయపురం వారిచే నేర్పరుచబడినవికావున పాలకులపేరును ఆయాసంస్థానాధీశులు తమవంశాలలో నిలుపుకొనడము జరిగినది. ఉ॥ దా॥ పార్వతీపుర పాలకులలో విశ్వంభరదాత్రాజు, సాలూరు పాలకులలో రామచంద్రరాజు మొ॥ పైనపేర్కొనిన వాటిలో సామంత రామచంద్రపురం(సోం) గ్రామ నామం ఈ విషయాన్ని మరింతగా ధృవీకరించుచున్నది.

పార్వతీపురం

"శ్రీ బెలగాం పురీక్షితి నాధునకు జమీ దెచ్చియిచ్చిన మంత్రి ధీరుం"నిగా తాడూరి కృష్ణశాస్త్రి విరచిత గౌతమీ మహాత్మ్యమున ఎన్నబడిన పాత్రేరు అప్పల పట్నాయకు పార్వతీపుర పాలకుడు విశ్వంభరధాత్రీరాజు (18శ॥) మంత్రి.[81] ఈతని పేరున కొబోలు అప్పల పట్నాయకునిపేట (పాల) గ్రామము రూపెత్తినది.

పోరాము

ఈ సంస్థానం జయపుర మొదటి విశ్వంభరు (1672–76)నిచే పాయకరావు అనే బిరుదముతో 'దీనబంధు' అను వానికీయబడినది. దీనబంధుపురములు (టె&పా) ఆతని పేరుమీదగ వచ్చినవై యుండును.

పాలకొండ

"జయపురరాజుగారగు విశ్వంభర దేవుగారీయనను "నరేంద్ర నాయుడను" బిరుదముతో పాలకొండకు జమిందారుగ జేసిరి. పిమ్మట ఈ బిరుదు 'నరేంద్రరావు' అని మార్చబడినది."[82] పాలకొండ పాలకుల బిరుదును స్ఫురింపజేసే నరేంద్రపురములు (శ్రీ& టె& పాలప) గలవు. మొండెముకొల్లాం అడవులలో పాలకొండ పితూరీదారుల నెదిరించిన తెల్లదుమ్మ మొఖాసాదారు సంతోషరాయని[83] పేర 'సంతోషపురము' (పా& టె) నేర్పడినట్లుతోచును.

పాలకొండ సాహిత్య పరిభాషలో 'క్షీరగిరి' యైనది. "క్షామం బన్నది లేదు క్షీరగిరి దేశంబందు నెందేనియున్" అని పొగిడిన అడిదము సూరకవి (1720–1785)యే "దాక్షీమీయరు పాలకొండపురిలో దాక్షిణ్యశూన్యత్వమీ పాజీ పట్టణమేల వచ్చితిని" అని వాపోవడమూ జరిగినది.[84] 'పాలకొండ ధరణీ సామ్రాజ్యధౌరేయులై' ప్రవర్తిల్లిన 'బంచముల్' అని సూరకవిచేత తెగనాడబడిన వారిలోని వారైన వెంకుపాత్ర, క్రిష్ణాపాత్రులు, వెంకంపేట, క్రిష్ణంవలస (పాల) గ్రామనామకాముకులై యుందురాయనిపించును.

18వ శ॥లో పాలకొండ పాలకుడైన రామభద్రరాజు పేరున తూర్పు రామభద్రరాజుపేట, తోటకారదరి రామభద్రరాజుపేట అను అయ్యవారిపేట (పాల) గ్రామనామము లేర్పడినవి. 18వ శ॥ చివరిలో తూర్పు ఇండియా వర్తక సంఘ ప్రభుత్వముపై పితూరీ జరిపిన పాలకొండ పాలకుడు విజయరామరాజు. అతని కుమారుడు వారసుడు సీతారామరాజు. వారిపేళ్ళమీదుగా విజయారాంపురం, పాలమెట్ట విజయరాంపురం, సీతారామరాజుపేట, రామరాజుపేట (అన్నిపాల) గ్రామములు రూపెత్తి యుండును.[85] సీతారామరాజు సోదరుడు వారసుడు వెంకటపతిరాజు (1791–1828) పేర వెంకటపతిరాజుపేట, ఉసిరికావలస వెంకటపతిరాజుపేట, అతని దివాను ఎల్లు మహంతి పరుశురామపాత్రుని పేర పరశురాంపురం, మరియొక దివాను జగన్నాధ పాత్రుని పేర జగన్నాధపురము, జగన్నాధవలస, మొఖాసాదారుడు వెంకటరాయుని పేర వెంకట రాయుని అగ్రహారం, వెంకటరాయుడుపేట (అన్నిపాల) గ్రామములు రూపెత్తినవిగా తోచును.

బొబ్బిలి

బొబ్బిలి పాలకులు 'రంగరాయ' బిరుదాంకితులు. గోపాలక్రిష్ణ రంగరాయలు చరిత్ర ప్రసిద్ధిపొందిన బొబ్బిలియుద్ధ (క్రీ. శ. 1857) వీరుడు. అతని కుమారుడు వారసుడు గోపాలవెంకటరంగారావు. రంగరాయపురం, గోపాలక్రిష్ణ రంగరాయపురం, వెంకటరంగరాయపురం (పాల) వీరి మూలమున వెలసినవై యున్నవి. రాజారాయండప్ప రంగారాయల (1790–1830) అల్లుడు రామరాయలు పాలకొండ తాలూకాలోని ఉంగరాడ, మంతెన ఎస్టేటుదారుండు. ఆతని పేర రామరాయపురం, ఆతని భార్య సీతయమ్మ పేర సీతాదేవిపురం (పాల) గ్రామములున్నవి.

మందసా

'రాజమణి' అనునది మందసారాజుల నామాంత్యపదము. గుడారాజమణిపురం, మందసా సంస్థానము విస్తరించుకొనియుండిన సోంపేట తాలూకాలో కలదు. సోంపేట తాలూకాలోనిదే అయిన వాసుదేవపురం మందసారాజు వాసుదేవ రాజమణి రాజదేవు వలన ఏర్పడినది కావచ్చును.

విజయనగరం

కళింగాంధ్రములోని సంస్థానములన్నింటిలో తలమానికమైనది. బొబ్బిలియుద్ధ వీరుడు పెద్ద విజయరామరాజు (1708–1757), పద్మనాభ యుద్ధవీరుడు చిన్న విజయరామరాజు (1748–1794) ప్రఖ్యాతులు. విజయరామ నామధేయులు పాలకొండ జమిందారులలోనూ ఉండుటనుబట్టి ఆ తాలూకాలోని విజయరామపురములు వారి పేరనే వెలసినవని భావించినప్పటికీ, శ్రీకాకుళం తాలూకాలోని విజయరాంపురం విజయనగర విజయరామరాజుల నామప్రేరకముగా ఏర్పడినదని భావించవచ్చును. మొదటి ఆనందరాజు (1671–1717), ఆనందరాజు (1732–1760) లలో నెవరిపేరుననైన ఆనందపురములు (శ్రీ& న& టె& చీ) నేర్పడి ఉండవచ్చును. పూసపాటి వారి 'గజపతి' బిరుదపరంగా గజపతి నగరములు (న& పా) ఉన్నవి. నారాయణ గజపతి రాజపురములు (2చీ) పూసపాటి నారాయణగజపతి (1786–1845)

పేరున నేర్పడినవి. కళింగ విజయనగర రాజుల సేనాధిపతులుగా నుండిన కమ్మదొరలలో నొకడైన వెలిసేటి మల్లికార్జునదొర బంటుపల్లి (చీ) గ్రామాన్ని నిర్మించినట్లు కాళ్ళకూరి గౌరీకాంతకవి రచించిన 'ధర్మనందన విలాసం' వలన తెలియవస్తోంది.[86] తిరుపతిపాలెం (చీ) నాటి కమ్మదొరలలో నొకడైన తిరుపతి దొరపేరున వెలసినట్లు తోచును.

ముస్లిం పాలనా ప్రభావము

16-18శ॥ మధ్యకాలంలో ఈ ప్రాంతంపై ముస్లిం అధికారం సాగినది. గోలకొండ సుల్తాన్ కులీకుతుబ్‌షా (1512-1543) పట్టుకొనిన కోటలలో శ్రీకాకుళమొకటి. 1652-87 సం॥ల కాలములో కుతుబ్‌షాహీల ప్రతినిధులైన ఫౌజ్‌దారుల పాలనలో 'చికాకోల్' ఒక 'సర్కార్' నకు కేంద్రస్థానం. "శిస్తులు వసూలుచేసి ధనపు మూటలశిఖలు ఇక్కడ కోయుచుండుటచే 'శిఖాఖోల్' గను తరువాత చికాకోల్‌గా భ్రష్టంఅయిందని చెపుతారు. దక్కను సుబేదారులు ఇచట వారి ప్రతినిధులనే పేరుతో సామంత ప్రభువులకు పంపే ఫర్మానాలపై వేయబడిన శిఖా (లక్కసీలులను)ఖోల్ తెరిచి బటువాడా చేయుటచే శిఖాఖోల్ నామము ముసల్మాను పాలకులు కల్పించినట్లు పెద్దలు చెపుతారు. సిక్కా (నాణెము) ఖోల్ (తెరిచే) ప్రదేశం అని కూడా చెపుతారు. శిఖాఖోల్ క్రమంగా శికాకోళము, శికాకుళము, శ్రీకాకుళంగా మారినట్లు అంటారు."[87] 'శిఖాఖోల్' క్రమంగా శ్రీకాకుళము అను శిష్టరూపం సంతరించుకొనినదని ఎంచుటకన్న 'శ్రీకళింగ' పదము శ్రీకాకుళముగా మారినదనుట సమంజసమనిపించును. ఆంధ్ర మహావిష్ణువు స్థానమైన 'శ్రీకాకుళం' పేరుకూడ నా కళింగములోని గ్రామమునకు వచ్చియుండవచ్చును. కోటీశ్వరాలయ ముండుటచే పూర్వము నీ గ్రామమునకు కోటీశ్వరాగ్రహారమని వాడుకకూడ యుండినది. ఏదిఏమైనా, ముస్లిం పాలనా ప్రభావమువలన ఆంగ్లేయుల కాలంలోనే కాక నేటికీ శ్రీకాకుళమును 'చికాకోల్'గా వ్యవహరించడం (వాడుకలో) జరుగుచుండుట గమనించవగిన విషయం.

1687 – 1724 సం॥లలో మొఘల్‌ఫౌజుదారుల పాలనలో 'చికాకోల్ సర్కార్' ఉండినది. 1724 సం॥ నుంచి ఈ ప్రాంతం ఫ్రెంచివారికి దఖలు పడేంతవరకు ఆసఫ్‌జాహి (నిజామ్) ప్రతినిధులుగా ఫౌజుదారులు ఏలిరి. ఫౌజ్‌దారులలో ప్రముఖుడైన షేర్ మహమ్మద్‌ఖాన్ (1652 సం॥) పేర షర్ మహమ్మద్‌పురం(చీ) గ్రామం ఉన్నది. అట్లే జఫర్‌ఆలీ (1749 సం॥), ఇబ్రహీంఖాన్ (1754 సం॥)ల పేరిట జఫర్‌బాదా (ద్) (శ్రీ), ఇబ్రహీంబాదా(చీ) ఏర్పడినవి. ఫకీర్‌టకియా, ఫాజుల్‌బేగ్ పేట, కాశింవలస, కాశింవలస పేట, రసూల్‌పేట, నిజామాబాదా, తురకపేట (అన్నీ శ్రీ), అమీన్‌సాహెబ్ పేట (ఇ), మహమ్మద్‌పురం, మొహినుద్దీన్‌పురం, రహిమాన్‌పురం (న), మొఘలాయ్‌పేట, మహల్‌పాడా, తురకశాసనం[88] (సొం), హుకుంపేట, తురకలకోట (టె), రసూల్‌పేట, బేగంపేట, హుస్సేన్‌పురం (పాల), ఆలీఖానుడుపేట, మసీదుఅగ్రహారం, షాపురం (చీ) గ్రామనామములు ఈ ప్రాంతంపై రెండు శతాబ్దులకాలంపాటు సాగిన ముస్లింపాలనా ప్రభావమును తెలియజేసేవిగా ఉన్నవి.

"మహమ్మదీయులు పాత టెక్కలిని స్వాధీనపఱచుకొని, యచటఁ దురకలకోటను గట్టి (ప్రస్తుతపు తురకలకోట) యందు నివసించిరి. కోట బొమ్మాళికి సమీపమున అగ్బర్‌పూరను (ప్రస్తుతపు అక్కవరం) గ్రామమును సృష్టించి యందునుగూడ నివసించిరి."[89]

అన్నితావులా అగ్బర్ పూర్‌లు అక్కవరములు కాలేదు. కొన్నితావుల పాతపేరు వదలక నిలుచుటయో, లేక క్రొత్తపేరుతో జతకలిసి సహజీవనము చేయుటయో జరిగినది. అందులకుదాహరణముగ తురకపేట యూరు సౌలాపురం (శ్రీ), సీతారాంపురం అను తురకపేట (శ్రీ) గ్రామనామములను పేర్కొనవచ్చును.

పాశ్చాత్యుల పాలనకూడ నీ ప్రాంతమున బహుకాలము సాగినను, ఫాక్స్‌దొర పేట, స్కాట్‌పేట (శ్రీ) అను రెండు గ్రామనామములే ఆ ప్రభావసూచికముగా కానవచ్చుచున్నవి. ఎల్విన్‌పేట ఇప్పుడు పితాని (సొం) అని వ్యవహరింపబడుచున్నది.[90]

అను

కొందరు వ్యక్తులకు వలెనే ఈ జిల్లాలోని కొన్ని గ్రామాలకు బహునామధేయములుండుట ప్రత్యేకముగా గమనించదగిన విషయ విశేషం. ఇందుకు కారణములుకూడా బహు విధములు. ఇచ్ఛాపురమునకు బెల్లుపాడ అని మరియొక పేరు ఉన్నను[91] నేడది పూర్తిగ మరుగునపడిపోయినది. కొన్ని సందర్భములలో అట్లుగాక క్రొత్త పేరువచ్చినను పాతపేరు వదలకుండా ఉంటుంది. అప్పుడే ఈ 'అను' (alias) అవసరమవుతుంది. ఈ సందర్భంలో సాధారణంగా 'అను' తరువాతవచ్చు నామమునే పూర్వనామముగా భావించడానికి వీలుంది. ఉ॥దా॥ టెక్కలి తాలూకాలోని చింతామణి అను నువ్వుగుడ్డి. చింతామణి నిర్మాత టెక్కలి ప్రభువు చంద్రశేఖర జగద్దేవ 17వ శతాబ్దికి చెందినవాడు. 'నువ్వుగుడ్డి' అనుచోటనతడు 'చింతామణి' యను కోటను గట్టుటచే నువ్వుగుడ్డికి ముందు జింతామణి యను పేరు వచ్చిచేరినది. ఒకే ఊరుకు నాలుగుపేర్లుండిన సందర్భములుకూడ లేకపోలేదు. శ్రీనివాసాచార్యులనే వారు తమ కుమార్తె వేణమ్మకు అరణముగా నిచ్చిన గ్రామము సబ్‌రిజిస్ట్రార్ వారి లెక్కలలో 'పాండ్రంగి శ్రీనివాసాచార్యులుపేట ఉరఫ్ వేణమ్మ

పేట' అని ఉండగా పంచాయితీ రికార్డులలో శ్రీనివాసాచార్యులపేట అని ఉందిట. ఈ వేణమ్మపేట ప్రజలనోళ్ళలోబడి 'యానాంపేట'గా మారిందనికూడా వ్రాస్తున్నారు[92] గాని ఈ పరిశీలనను ప్రమాణంగా తీసుకొన్న గణాంక జాబితాలో శ్రీనివాసాచార్యులపేట (శ్రీ) అనే ఉన్నది ఈ జిల్లాలో రెండు పేర్లుగల ఒకే ఊర్లు లెక్కకు ఇరవైకి పైగానే ఉన్నవి. అవి : భైరవానిపేట అను జగన్నాధపురం, బుడితి పేట అను గొడికార, హరిశ్చంద్రపురం అను సుబ్రహ్మణ్యపురం, జగన్నాధపురం అను సోమిడివలస, లక్ష్మీపురం అను ముష్టిఅగ్రహారం, మునగన్నఅగ్రహారం అను ఋంగెన్నపాడు, సీతారామపురం అను తురకపేట, సుమంతపురం అను పొడుగుపాడు (అన్నీ శ్రీ); చిల్లిదాసపురం అను శాపనం, లక్ష్మీదేవిపేట అను నువ్వులరేవు, మాకవరం అను మాకయ్యవలస, పల్లిఊరు అను సంగరువానిపేట, పిట్టసరాయి అను వాసుదేవపురం, వేణుగోపాలపురం అను జాడుపూడి, వీరరఘునాధపురం అను గంగధారపేట(అన్నీ టె) లక్ష్మీపేట అను లచ్చంపేట, లచ్చయ్యపేట అను సీతాదేవిపురం, కోటవాడదరి రామభద్రరాజుపేట అను అయ్యవారిపేట (అన్నీపా) పాసి అను గంగుపేట(పా), దల్లిపేట అను దొంకపల్లి (చీ), మాకివలస అను శ్రీరామక్షేత్రం (న).

కోటలు-పాకలు

'కోట' అను నామ్యాంతమున గల గ్రామాలన్నింటా కోటలుండినవనిగాని, 'పాక' పేరు చివరనగల ఊర్లలో పాకలుమాత్రమే ఉంటవనిగాని నిర్ణయించలేము. ఈ జిల్లాలో కోటలు ఎక్కువే: కొత్తకోట (శ్రీ & పాల & చీ), పెద్దకోట, కొర్లకోట (శ్రీ), జలాంతరకోట, కుంతికోట, నవగడ (సొం), నౌగడ, మీనాకోట, జంపరకోట(పాల), భరణికోట, మరాడి(రి)కోట, సారవకోట(పా), రెంటికోట, తార్లకోట(టె). "పాక తాటాకుపాకగాదు. పాక, పాక్, పాక్కం స్థలవాచకము కేల్పాక్ అనగా అర్థం సముద్రతీరము. మన ప్రాంతాల పాకప్రాచుర్యం తమిళ చోళులనుండి వచ్చెననుట సరిగాదు. రేనాడు తెలుగు చోడులనాటికే పాకస్థలవాచకము."[93] ఈ జిల్లాలో పాకట ఉ॥దా॥ డొంపాక (శ్రీ), మురపాక (చీ).

వలసలు

పొరుగుననున్న విశాఖ, విజయనగరం జిల్లాలలోవలెనే ఈ జిల్లాలోకూడా 'వలసలు' విశేషముగా శతసంఖ్యకు దాపున ఉన్నవి. అవి ప్రధానముగా వ్యక్తుల పేర్లనుబట్టి, స్థానికంగా లభించే పాడిపంటలనుబట్టి ఏర్పడినట్టివిగా వర్గీకరించవచ్చును. ఉ॥దా॥ పాత్రునివలస, వెదుళ్ళవలస (శ్రీ), చిన్నయ్యవలస, చేమలవలస (న), దాలెంరాజువలస, రావివలస(చీ), పాత్రునివలస, పాకివలస(టె), దాసరి రామినాయుడువలస, మద్దివలస, నాయిరోళ్ళవలస (పా).

జాతి, కుల, వృత్తి, సంబంధములు

ఏదోఒక జాతి, కుల, వృత్తులకు చెందినవారు తొలుత నివసించుటను బట్టియో, లేక వారిసంఖ్య గణనీయమైనదిగానుండుటను బట్టియో కొన్ని గ్రామములకు తత్సూచనాపూర్వక నామములేర్పడినట్లు తోచును. ఉ॥దా॥ గుజరాతిపేట, జంగాలవలస, సానివాడ, సింధువాడ(శ్రీ); గొల్లగంధి(ఇ); గొల్లవలస, రావులవలస, రెల్లివలస, తెలగవలస(న); గొల్లలపాలెం, గొల్లూరు(సొం): బంటుకొత్తూరు, భట్టపాడు, బ్రాహ్మణ తెరాల, చాకిపల్లి, కంబరిగాం, కాపుగోడవలస, కోమటూరు, రౌతుపురం, వడ్డితాండ్ర(టె), కోదులవీరఘట్టం, సవరగొంది. గొల్లవలస, జంగాలపాడు, జాప్రికోదులగుమడ, కుమ్మరిగుంట, రాజులగుమడ, మహాజనంవారిపేట[94](పాల), శాలిపేట, కుమ్మరిగుంట, మజ్జిగూడెం, మాలపేట, రెల్లివలస, సానిపాలెం, రౌతుపురం, ఉప్పరజమ్మి(పా), బోయిపాలెం, గొండుపాలెం (చీ). ఈ జిల్లాలోగల ఏజెన్సీ (మన్యం) ప్రాంతం ఉన్నది. సవరలువంటి గిరిజనులు గణనీయమైన సంఖ్యలో వున్నారు. వారి గ్రామనామములకు ముందు 'సవర' విశేషణం సహజంగా ఏర్పడినది. ఉ॥దా॥ సవరకొత్తూరు, సవరలింగాపురం, సవరనీలాపురం, సవరపేట, సవరరామక్రిష్ణాపురం, సవరసోమనాధపురం (టె), సవరగొంది (పాల), సవరబొంతు, సవర చీపురుపల్లి, సవర వలస,[95] సవరగుడ, సవరశేఖరపురం, సవరసిద్ధి మడుగు (పా)

వృక్ష, జంతు సంబంధములు

శ్రీకాకుళంలో నివ (కదంబ) గాం (పా) గార (శ్రీ), పలాశ ( ) వంటివి చెట్ల పేర్లుగా గుర్తించబడినవి.[96] మరికొన్ని ఉ॥దా॥ ఆముదాలవలస, కానుగులవలస, మఱ్ఱివలస, మఱ్ఱిపాడు, మునగవలస, రావివలస, మోదుగవలస (శ్రీ): తులసిగాం (ఇ) కంబకాయ, జిల్లేడువలస, కొవకరపల్లి, మామిడివలస (న); మామిడిమెట్టు, నువ్వుగాం (సొం), బొప్పాయిపాడు, చీపుర్లపాడు, చింతలగార, జొన్నలపాడు, కందులగూడెం (టె); జిల్లేడుపూడి, భూర్జ, బూరుగ, గరికపాడు, మొదుగులపేట, వెలగవాడ (పాల); నేరడిగుడ, నిమ్మలపాడు, పువ్వులకొండ, రేగులపాడు (పా) గోరింట, వెలగాడ, తోటపాలెం (చీ).

దోమలపల్లి (శ్రీ), దుప్పలపాడు (న) బాతుపురం (టె), పోతులూరు (టె), ఏనుగుపేట (పాల), గేదెలపేట (పాల). పులిబంద, పులిపుట్టి (పా), ఆబోతులపేట, ఛిలకలపాలెం, దుప్పలవలస (చీ)

ఇంటిపేర్లు

గ్రామనామములతో ఇంటిపేర్లకు అవినాభావ సంబంధంగలదు. గ్రామనామములు ఇంటిపేర్లయిన, లేక ఇంటిపేరు గ్రామనామమైన వాటికి ఈజిల్లాలో ఉ॥దా॥ దూసి, ఇప్పిలి, కళ్లేపల్లి(శ్రీ) మరువాడ (న&పాల), కొల్లూరు (సొం), శ్రీరంగం (టె), తుమరాడ (పాల), గరిమెళ్ళ కొత్తవలస (పాల), కొట్టగడ్డ (పా).

పెద్ద-చిన్న; క్రొత్త-పాత వగైరా

ఒకే పేరుగల గ్రామాలను వేరువేరుగా గుర్తించడానికి ఆయా పేర్లముందు చిన్న-పెద్ద అనే విశేషణం చేర్చడం ఒక ఆనవాయితీ.[97] ఉ॥దా॥ చిన్నకాకితపల్లి-పెద్ద కాకితపల్లి, చిన్న వెంకటాపురం-పెద్ద వెంకటాపురం (శ్రీ). పాలకొండతాలూకాలో 'పెద్ద' పేరు ముందుగలిగిన గ్రామాలు 10, 'చిన్న' విశేషణంగా గలిగినవి 9 ఉండగా, పాతపట్నంతాలూకాలో 'పెద్ద' విశేషణంగా గలట్టివి 16, 'చిన్న' విశేషణంగా గలట్టివి 20 గ్రామములున్నవి. క్రొత్తగా ఏర్పడిన గ్రామాలను అదే పేరుగల పాత గ్రామాలనుంచి వేరుగా గుర్తించడానికి ఆయా గ్రామనామముల ముందు పాత క్రొత్త అని విశేషణములను చేర్చడం సులభమైన పద్ధతి. ఉ॥ దా॥ పాత కమలాపురం, కొత్త కమలాపురం (సొం), పాతజగ్గదేవపురం, కొత్త జగ్గదేవపురం (టె) కొత్త శ్రీకాకుళం అంటూ లేదుగాని పాత శ్రీకాకుళం (శ్రీ) వున్నది. పాత నౌపడా, పాత టెక్కలి (టె) వున్నవి. భౌగోళిక విశేషములను పేరుముందు చేర్చటం చేతకూడా ఒకే పేరుగల గ్రామాలను వేర్పరచి చెప్పుట కలదు ఉ॥దా॥ రాగోలు (శ్రీ), కొండ రాగోలు (పా), కొత్త పోలవలస-కొండపోలవలస (న), పొప్పంగి-శ్రీకొండపొప్పంగి (పా), రామచంద్రపురం, బురదరామచంద్రపురం-తూముకొండరామచంద్రపురం(పా)ముకుందపురం-ఘాటీ ముకుందపురం (సొం), లక్కవరం (సొం) ఆకాశ లక్కవరం (టె).

వేర్పాటుగా గుర్తించడానికి వీలు కల్పించని గ్రామములు కూడ లేకపోలేదు. ఉ॥దా॥ కొత్తూరు (6పా), గురాండి (3పా), బొమ్మిక (3పా), అనంతగిరి (3పా), రాజపురం, సారిపల్లి (టె), కొత్తవలస, పాలవలస, క్రిష్ణాపురం (శ్రీ), అంపాలెం, చిట్టివలస, ఈదులవలస (న) ఇటువంటి ఊరిపేర్లే పూర్తి విలాసంలేని ఉత్తరాల బట్వాడా విషయంలో తంతితపాలా శాఖవారిని తిప్పలు పెడుతూ ఉంటవి.

ఊరిపేరుపై మక్కువ

ఒక ప్రాంతపు ప్రజలు వేరొక ప్రాంతమునకు కారణాంతరములవలన పోయి అచ్చోట స్థిరపడినప్పుడు పూర్వనివాస గ్రామంపై మమకారానికి గుర్తుగా క్రొత్తనివాస గ్రామానికి కూడా అదే పేరు పెట్టుకోవడం గలదు. ఉ॥దా॥ బొబ్బిలిపేట, పార్వతీపురం (శ్రీ) ఈ రెండూ పొరుగునున్న విజయనగరం జిల్లాలో ప్రముఖపట్టణములు. విశాఖ జిల్లాలోనిదైన ఎలమంచిలి గ్రామ నామముగా ఈ జిల్లాలో రెండు తాలూకాలలో (శ్రీ&న) వున్నది. వనజంగి ఉన్న శ్రీకాకుళం తాలూకాలోనే వనజంగిపేట, బారువా వున్న సోంపేట తాలూకాలోనే బారువాపేట ఉన్నవి. చీపురుపల్లి గ్రామ నామంగా సోంపేట, టెక్కలి పాతపట్నం తాలూకాలలో ఉన్నది. నేడు ఒరిస్సా రాష్ట్రాంతర్భాగములుగ నున్న బరంపురం, భద్రపురం వరుసగా ఇచ్ఛాపురం, సోంపేట తా॥ ఉన్నవి. చోడవరం, (న) గజపతినగరం (న & పాల), అన్నవరం (పాల), దౌలేశ్వరం (పా), భద్రాచలం (పా) మొ॥ సమీప జిల్లాలలోని గ్రామనామములేకాక హరిద్వారం, (పాల), రామేశ్వరం (పా) వంటి ఉత్తర, దక్షిణ భారత దేశాలలోని ప్రముఖ పుణ్యక్షేత్రముల పేర్లుకూడా గ్రామ నామములుగా నీ ప్రాంతమున స్వీకరించబడినవి.

రమణీయములు

టెక్కలి తాలూకాలోని 'ఉద్యాన వనం' అపభ్రంశం చెంది 'ఉద్దాన'మైనట్లు [98] కాకుండా చెవికింపైన (చూడటానికి, ఉండటానికి ఎలాఉంటవోగాని) గ్రామనామములు కొన్ని పేర్కొనదగినవి కలవు. ఉ॥దా॥ దీపావళి(శ్రీ), నెలవంక(ఇ), ప్రియ(వ), రాగపురం(సొం) కిన్నెరవాడ, హంస, భామిని (పా), సారంగి(పాల), కామధేనువు, బృందావనం ఉన్న టెక్కలి తాలూకాలోనే గోకులపాడుకూడా ఉన్నది. 'లక్ష్మీపురం' అను ముష్టి అగ్రహారం(శ్రీ) అనునది ఈ విషయంలో తుదిమాట.

ముగింపు

పై వివరణలవలన ఈ జిల్లాలోని గ్రామనామములు గతించిన చరిత్రకు సాక్షీభూతిములుగ నుండినట్లు తెలియుచున్నది. రాజవంశముల ప్రభావము గ్రామనామములపై నెంతగలదో నంతకు దీటుగా సామాన్య జన జీవనానికి అవసరమైన వృక్ష, జంతు సంబంధి పేర్లు కూడ గ్రామనామములుగ నిలచినట్లు తెలియవచ్చుచున్నది. చరిత్ర దృష్ట్యా ఈ జిల్లాలోని గ్రామనామముల ప్రాధాన్యత కలిగియుండి మరింత విస్తృత శాస్త్రీయ పరిశోధనకు తగియున్నవి. జిల్లాలోగల ఏజన్సీ ప్రాంతప్రభావము, ఒకవైపు సరిహద్దుగానున్న ఒరిస్సా రాష్ట్ర (భాష) ప్రభావము గ్రామనామములపై యుండుటబట్టి అట్టి ప్రభావమునకు లోనైన గ్రామనామములు ప్రత్యేకముగా పరిశీలించదగియున్నవి. స్థలభావమును దృష్టిలో నుంచుకొని తలస్పర్శగా సాగిన ఈ పరిశీలన ఇంకను ఈ విషయమై శాసనములు, సాహిత్యము మొ॥ సాధనము లాధారముగా పరిశోధన జరుగవలసిన అవసరమును గుర్తించుచున్నది.

అ ధో జ్ఞా పి క లు

1. సంగ్రహ ఆంధ్ర విజ్ఞానకోశము, ఎనిమిదవ సంపుటము (హైదరాబాదు, 1971), పు 629–30.
2. వై. వి. కృష్ణారావు & ఏటుకూరి బలరామమూర్తి, ఆంధ్రప్రదేశ్ దర్శిని, (విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1976), పు. 1009.
   సౌలభ్యము కొరకు తాలూకాల పేర్లు కుండలీకరణములలో సంక్షిప్తముగా పేర్కొనబడినవి. ఆ సంజ్ఞావివరణ :పా = పాతపట్నం, పాల = పాలకొండ, టె=టెక్కలి, శ్రీ=శ్రీకాకుళం, సోం=సోంపేట, న = నరసన్నపేట, ఇ = ఇచ్ఛాపురం, చీ=చీపురుపల్లి.
3. చూ॥ భారతి, సెప్టెంబర్, 1982, పు. 37–44
   'విజయదత్' విజయనగరం జిల్లా చరిత్ర–సంస్కృతి (మాన్సాన్, విజయనగరం, 1983), పు. 15–19
4. డా॥ ఎన్. రమేశన్ (సం) ఆంధ్రప్రదేశ్ డిస్ట్రిక్ట్ గజిటార్స్: శ్రీకాకుళం (హైదరాబాదు, 1979) పు. 16.
5. కుందూరి ఈశ్వరదత్తు, ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము, (ఆం॥ ప్ర॥ సాహిత్య అకాడమీ, హైద్రాబాదు, ద్వితీయ ముద్రణ, 1979), ప్రథమభాగము, పు. 34–35.
6. భావరాజు వెంకటకృష్ణారావు, ఎర్లీ డైనాస్టీస్ ఆఫ్ ఆంధ్రదేశ, (మద్రాస్, 1942), పు. 385–86.
7. డా॥ ఎన్. రమేశన్, కాపర్ ప్లేట్ ఇన్స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ మ్యూజియం, వాల్యూం 1 (హైదరాబాద్, 1962) పు 140.
8. జర్నల్ ఆఫ్ ఆంధ్రా హిస్టారికల్ రీసెర్చి సొసైటి, (రాజమండ్రి). పార్ట్ 1, జూలై 1926, పు. 40
9. ప్రాచీనాంధ్ర చారిత్రకభూగోళము, ద్వితీయ భాగము, పు. 122, 293.
10. పైది పు 122–123.
11. రాళ్ళబండి సుబ్బారావు (సం) కళింగదేశ చరిత్ర (రాజమహేంద్రవరము, 1930), అనుబంధము, పు. 85
12. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము, పు. 38, 311–12
13. డా॥ ఎన్. రమేశన్, కాపర్ప్లేట్ ఇన్స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మ్యూజియం, వాల్యూం 1, (హైదరాబాద్, 1962), పు. 144.
14. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము, పు. 313
15. పైది. పు 283.
16. యస్. ఐ. ఐ. VI నెం. 1118.
17. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము, పు. 40.
18. జె. హెచ్. ఆర్. ఎస్. సం III. పు. 49–53
19. పైది. వాల్యుం X పు, 143–144.
20. యస్. ఐ. ఐ. నెం. 1247, 1248.
21. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము, పు. 93
22. డా॥ నేలటూరి వేంకటరమణయ్య, విష్ణుకుండినులు, (హైదరాబాద్, 1973), పే. 56
23. ఆంధ్రదేశ చరిత్ర – భూగోళ సర్వస్వము, రెండవ సంపుటము (హైదరాబాద్, 1974), పు. 485
24. కళింగదేశ చరిత్ర, పు. 505.
25. ఆర్. సుబ్రహ్మణ్యం, ది సూర్యవంశ గజపతీస్ ఆఫ్ ఒరిస్సా, (వాల్తేరు, 1957), పే. 138, 140.
26. యస్. ఐ. ఐ. IV. నెం. 695.
27. చూ. డా॥ సి. వి. రామచంద్రరావు, ఎడ్మినిస్ట్రేషన్ అండ్ సొసైటీ ఇన్ మిడీవల్ ఆంధ్ర (ఎ. డి. 1038–1538) అండర్ ది లేటర్ ఈస్టరన్ గాంగాస్ అండ్ ది సూర్యవంశ గజపతీస్ (నెల్లూరు, 1976) పు. 124
28. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము, పు. 311–312.
29. ఆదిభట్ల వేంకట రమణ, శ్రీకాకుళంజిల్లా చరిత్ర (ప్రపంచ తెలుగు మహాసభల జిల్లాస్థాయి ప్రచురణ. 1975), పు. 49.
30. ఎస్. ఐ. ఐ. V నెం. 1342, 43, 44
31. జె ఎ. హెచ్. ఆర్. ఎస్. సం. XXI (జూలై 1950–ఏప్రియల్ 1952) పు. 166
32. ఆంధ్రభూమి (తెలుగు వారపత్రిక, సికింద్రాబాద్, 28–10–82) పే. 42
33. భూగోళ సర్వస్వము. ప్రథమ సంపుటము, పు. 499
34. జి. ఆర్. వర్మ, కళింగదేవ (తాడేపల్లిగూడెం 1977) పు, 12,179
35. ఆంధ్రభూమి, 21–10–1982, పు, 54

36. ఎస్. ఐ. ఐ V, నెం. 1136, 1232

37. భూగోళ సర్వస్వము, మొదటి సంపుటము, పు. 172

38. జె. ఎ. హెచ్. ఆర్. ఎస్. IV, పే. 163

39. సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన కోశము, ఏడవ సంపుటము, (హైదరాబాదు, 1970) పు. 288

40. శ్రీకాకుళంజిల్లా చరిత్ర, పు. 68

41. డా॥ వి. మస్తానయ్య, ది టెంపుల్స్ ఆఫ్ ముఖలింగం (కాన్సెప్ట్ పబ్లికేషన్స్, న్యూ ఢిల్లీ, 1978,) పే. 2

42. జి. ఆర్. వర్మ, కళింగదేవ, పు. 136

43. సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశము, ఏడవసంపుటము, పుట 291

44 విజ్ఞాపురపు వెంకట కోదండరావు (అను) విశాఖపట్టణముజిల్లా వృత్తాంత సంగ్రహము (శ్రీ వేణుగోపాలప్రెస్, విశాఖపట్నం, 1889). పు. 120

45. భూగోళ సర్వస్వము, మొదటి సంపుటము, పు. 171

46. డా॥ తూమాటి దొణప్ప, ఆంధ్రసంస్థానములు–సాహిత్య పోషణము (ఆంధ్ర విశ్వకళా పరిషత్తు, వాల్తేరు, 1969), పు. 579.

47. సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశము, ఎనిమిదవ సంపుటము, పు. 485

48. జె. ఎ. హెచ్.ఆర్.ఎస్.XXIX పే 24 & బి. యస్. ఎల్. హనుమంతరావు. రెలిజియన్ ఇన్ ఆంధ్ర(గుంటూరు, 1973), పే. 59

49. డా॥ ఆర్. సుబ్రహ్మణ్యం, శాలిహుం డాం (ఆంగ్లం) (హైదరాబాద్, 1964) పే 3–4

50. జి. ఆర్. వర్మ, గుడిగుంపా, (తాడేపల్లిగూడెం, 1974) పు. 103

51. భావరాజు వెంకట కృష్ణారావు, ఎర్లీ డైనాస్టీస్ ఆఫ్ ఆంధ్రదేశ, పు. 612

52. ఎర్లీ డైనాస్టీస్ ఆఫ్ ఆంధ్రదేశ, పు. 368

53. ప్రాచీనాంధ్ర చారిత్రిక భూగోళము, పు 290

54. జె. ఎ హెచ్ .ఆర్ .ఎస్ XXII, పే. 184

55. కళింగదేవ, పు. 13

56. కళింగదేశ చరిత్ర, 461

57. కళింగదేవ, పు 53

58. భూగోళ సర్వస్వము, రెండవ సంపుటము, పు. 51

59. డా॥ ఎన్. రమేశన్ (సం) ఆం॥ ప్ర॥ డిస్ట్రిక్ట్ గజిటీర్స్ శ్రీకాకుళం, పు. 20.

60 భీమనామధేయులు ఈ ప్రాంతముపై ప్రభావము నెరపిన తూర్పు చాళుక్య, తెలుగు చోడులలో ఉన్నారు. అట్లే అనంతవర్మలు వాశిష్ఠ, మాఠర వంశీకులలో గలరు.

61. కళింగదేశ చరిత్ర, పు. 479.

62. ఎర్లీడైనాస్టీస్ ఆఫ్ ఆంధ్రదేశ, పే. 578

63. కళింగదేవ, పు. 53, 54 & 134.

64. డా॥ ఎన్. వెంకటరమణయ్య, ది ఈస్టరన్ చాళుక్యాస్ ఆఫ్ వేంగి, (మద్రాసు, 1950) పే. 128

65. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము, పు. 152–153.

66. ఎస్. ఐ. ఐ, వాల్యూం VI, నెం. 1119

67. భూగోళ సర్వస్వము, మొదటి సంపుటము, పు. 594.

68. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము, పు. 237

69. జంతర్నాడు. వీరకూటం, శ్రీకూర్మచాళుక్య ప్రభువులలోను పురుషోత్తమ నామధేయులున్నారు.

70. భూగోళ సర్వస్వము, మొదటి సంపుటము, పు. 45–46

71. పైది. పు. 30

72. భూగోళ సర్వస్వము. రెండవ సంపుటము, పు. 55

73. జయపురాధీశ్వరులకు పూర్వపాలకులైన నందాపురాధి పతులలో ఒక భైరవరాజు (1370 ప్రాంతం) గలడు. 1776 ప్రాంతంలో గోలుకొండ జమిందారు భైరవ భూపతి రాజుగలడు. పార్వతీపురం, పాలకొండ, సాలూరు మొ॥ చిన్న జమిందారీలన్నియు జయపురం వారి అనుగ్రహమువలన రూపెత్తినవి కావటంచేత ఆ సంస్థాన పాలకులలోను జయపుర రాజుల పేర్లుదాల్చిన వారు కానవస్తారు ఉ॥దా॥ పార్వతీపురం పాలకులలో విశ్వంభర భత్రాజు, సాలూరు పాలకులలో రామచంద్రరాజు మొ॥ ఈ జిల్లాలో పుష్కలముగానున్న రామచంద్రపురములలో నొకటి సామంత రామచంద్రపురం (సొం) ఈ విషయాన్ని మరింతగా ధృవీకరిస్తున్నది. రామచంద్రపురములలో కొన్ని శ్రీరామ చంద్రుని పరంగా నేర్పడినవికూడా అయివుండవచ్చును.

74. కళింగదేశ చరిత్ర, పు. 282 టెక్కలికి సంబంధించిన గ్రామనామముల చరిత్రకు ప్రధానాధారము : కళింగదేశ చరిత్ర (పుటలు 389–392)లోని లక్ష్మీనారాయణ హరిచందన జగద్దేవు విరచిత 'టెక్కలి కాదంబరాజ వంశేతిహాసము' అనువ్యాసము.

75. జె. ఎ. హెచ్. ఆర్. ఎస్., వాల్యూం VII, పే. 32

76. కళింగదేశ చరిత్ర, పు. 390.

77. జె. ఎ. హెచ్. ఆర్. ఎస్., వాల్యూం, V, పార్ట్ 2 (అక్టోబరు 1930) పే. 117.

78. కళింగదేశ చరిత్ర, పు. 390

79. ఇంద్రవర్మపుర్లిశాసనమున 'తిరిలింగవాస్తవ్యాయ' అనుపదము వాడబడియున్నది.
సంగ్రహాంధ్ర విజ్ఞానకోశము, నాలుగవ సంపుటము, పే 602, 603.

80. కళింగదేశచరిత్ర, పు 391.

81. డా॥ తూమాటి దొణప్ప, ఆంధ్రసంస్థానములు – సాహిత్య పోషణము పు. 561

82 విశాఖపట్నంజిల్లా వృత్తాంత సంగ్రహము

83. పైది. పు 547 అధోజ్ఞాపిక

84. చాటుపద్య మణిమంజరి, పు 39-40.

85. పాలకొండ విజయనగరానికి కప్పముకట్టినది కావడంచేత ఆ కాలంలో విజయనగరపాలకులైన పెద్ద, చిన్న విజయరామరాజులు, చిన్నవిజయరామరాజు సోదరుడు దివాన్ సీతారామరాజు ప్రముఖులు కావడంచేత పాలకొండ తాలూకాలోని ఈ గ్రామములు విజయనగర పాలకవర్గ నామసంబంధములా యనిపించకపోదు.

86. ఆదిభట్ల వెంకటరమణ, శ్రీకాకుళం జిల్లా చరిత్ర, 181-182

చ॥ అతఁడు కళింగరాజ్యమున కర్థిగమించి తదీయమేదినీ
పతి బహుమాన మందుకొని పౌరుషమారంగ బంటుపల్లి సు
స్థితి రచియించి భోగపురి సీమ రణస్థలి చెంత నందు సు
స్థితిముగ నిల్చి యచ్చట ప్రతిష్ఠ యొనర్చెను మల్లికార్జునన్॥

బంటుపల్లి వైభవాన్ని కవి ఈ విధంగా వర్ణించాడు

తే॥గీ॥ మేలునకుఁదల్లి కీర్తికి పాలవెల్లి
తల్లితల్లికి క్రొత్త ముత్యాల ఝల్లి
వెండి బంగారములకెల్ల నిండు ఘల్లి
ప్రాభవపుఢిల్లి అతడేలు బంటుపల్లి॥

87. పైది. పు. 168

88. తురక శాసనమను గ్రామమున్నట్లే పండశాసనం(పె), 'శాసనం' (ఇచ్ఛాపురం&పె) అను గ్రామములున్నవి. కనుక నిచ్చటశాసన మనగా 'భూమ్యాది నానార్థలేఖ్యము' అనియేగాక 'సరిహద్దురాయి' అను అర్థమునుకూడ స్వీకరింపవచ్చును. కుందూరి ఈశ్వరదత్తు ఇన్‌స్క్రిప్షనల్ గ్లోసరీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్. (హైదరాబాద్, 1967) పే, 287-88

89. కళింగదేశచరిత్ర, పు. 391

90 డా॥ రమేశన్ (సం) ఆం॥ ప్ర॥ డిస్ట్రిక్ట్ గజిటీర్స్ 'శ్రీకాకుళం' పే. 134

91. భూగోళ సర్వస్వము, మూడవ సంపుటము, పు. 411

92. ఆంధ్రభూమి, (వారపత్రిక, 24-2-1983), పే. 94

93. జి. ఆర్. వర్మ, గుడీ-గుంపా, పు. 35.

94. "మహాజనము : బ్రాహ్మణవర్గము, గ్రామములోని పెద్దలు" కుందూరి ఈశ్వరదత్తు, శాసనశబ్దకోశము, పు. 229

95. 'పనస = పన్ను చెల్లించనక్కరలేని భూమి' డా॥ బూదరాజు రాధాకృష్ణ, ప్రాచీనాంధ్ర శాసనాలు, (హైదరాబాద్, 1971), పు. 377

96. జి. ఆర్. వర్మ, కళింగదేవ, పు. 53, 124

97. జె. ఎ. హెచ్. ఆర్. ఎస్. XXII, పు. 184

98. భూగోళసర్వస్వము, మూడవ సంపుటము, పు. 414

[గ్రామ నామముల జాబితా వ్రాయుటలో చేదోడుగా నుండిన చి॥ యస్. కామేశ్వరి, టి. కామేశ్వరులకు రచయిత కృతజ్ఞుడు.]

మళ్ళీ తెల్లవారుతుంది

శ్రీ నాగభైరవ కోటేశ్వరరావు

నడిచేది
నలుగురులోనే
నలుగురిలానే
నడివీధిలోనే–

ఆలోచనలకాళ్ళు
ఆకాశంలో
కళ్ళు అంతరిక్షంలో–

ఈ చుక్కలు చేతికి
చిక్కినట్టే నటించి
వేళ్ళ సందుల్లోంచి
జారిపోతుంటాయి

ఈ పిట్ట
రెక్కలూపుతూ, సాగుతూ
కనుచూపు మేరలో
బిందువై

నిలువునా గుడ్డివాణ్ణి చేస్తుంది
ఈ కథ రోజూ జరిగేదే!

అయినా
మళ్ళీ తెల్లవారుతుంది!
కాళ్ళు ఆకాశంలో....
కళ్ళు అంతరిక్షంలో.... !

జీవన సంగీతం

కనులలోని కలలు అశ్రు
కణమ్ములై తొణకినపుడు
గుండెలోని తలపు లగ్ని
గుండములై మండినపుడు

ఒక చల్లని మాట చాలు
ఊర్పు సెగలు చల్లారును
ఒక కమ్మని పాట చాలు
కలత బరువు కడ తేరును

మన బ్రతుకుల బాటలలో
పెనుచీకటి మూగినపుడు
మన మనసుల తోటలలో
చితి మంటలు రేగినపుడు

ఆశామణి దీపద్యుతి
అరుణోదయమై విరియును
ఆత్మీయుల అనురాగమె
అమృత వర్షమై కురియును

పలురకాల అనుభూతుల
వర్ణాలను మేళవించి
అందమైన గతకాలపు
టను భవాల కుంచెలతో

వర్తమాన యవనికపై
భవితవ్యం చిత్రిస్తూ
మౌనముగా సాగిపోవు
మానవాళి జీవితాలు

సాగిపోవు ఆ జీవన
సమీరాలు తాకినంత
ప్రపంచ విపంచి పలుకును
చైతన్యోత్సవ గీతం
మానవతా సంగీతం

మనసే ఒక అరవిందం
మమతే మధుర మరందం
తనివి తీర గ్రోలినపుడె
మన మనుగడ కానందం.

అంతరంగ విహంగం

ఒక మధుర మనోజ్ఞ స్వప్నాన్ని
ఒక విధుర విషాద సత్యాన్ని
రెండు రెక్కలుగా ధరించి
అంతరంగ విహంగం
వింతగా ఎగిరి పోతుంది
ఊహా విహాయస వీధిలోకి
అతివేగంగా ప్రతి ఉదయం

ఏ అనంత దిగంతాలకో పయనించి
ఏ సుదూర తీరాలలోనో విహరించి
రకరకాల అనుభూతుల గింజల్నేరుకొని
జీవనకాసారంలోని వేదనా నీరాన్ని గ్రోలి
తిరిగి తిరిగి అలసి సొలసి
నిశ్శబ్దంగా చేరుకుంటుంది
నిద్ర గూటిలోకి ప్రతి రాత్రి.

శ్రీ కె. దినకర్

డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు

జంతు ప్రకృతిలో రసానుభూతి ఉన్నదా? మానవానుభూతికి అది భిన్నమైనదా?

విశ్వంలో జీవి ఆవిర్భావం – అది వృక్షమైనా కావచ్చును, జంతువైనా కావచ్చును, రెండింటికీ మధ్యస్థంగా ఉన్నదైనా కావచ్చును, రెండు వర్గాలకు చెందనిదైనా కావచ్చును – ఏది ఏమైనా అది బహు విచిత్రమైనది. మిగుల విశిష్టమైనది. తెలిసి వస్తుందో రాదో కూడ తెలియనంతటి అద్భుతాన్ని కలిగించేది. జిజ్ఞాసను పెంచి ఆలోచనను రేకెత్తింప జేసేది. కాల క్రమగతిని జీవ పరిణతిని అర్థంచేసుకోవడానికి విస్తృతంగా వెలువడ్డ మానవ ప్రయత్నమే పరిణామవాద సిద్ధాంతము. మౌలికంగా స్పష్టంగా ఒకే ఒక్క మూలకందం నుంచి (ఇది ఏదీ అంటే ఈనాటికీ ప్రశ్నార్థకమై నిలబడి ఉంది!) సకల జీవరాశులూ ఉద్భవించాయని, కాల ప్రవాహంలో ప్రకృతిలో కలిగే ఎన్నో మార్పుల కనుగుణంగా తమ తమ జీవిత క్రమాలను సుస్థిర పరచుకొనేందుకు అనుక్షణం ప్రయత్నిస్తూ ఉంటాయని – ఈ ప్రయత్నాల పరంగా (యాదృచ్ఛికం కావచ్చును, ప్రమాదవశాత్తు కావచ్చును, ఇంకేవిధంగానైనా కావచ్చును) నూతన జాతులు ఏర్పడేందుకు అవకాశం ఉంటుందని పరిణామవాదం ప్రబోధిస్తుంది. జీవులలో వైవిధ్యం. జీవజాతుల ప్రత్యేకీకరణం – ఇలాంటివన్నీకూడా ప్రకృతి ప్రభావ ఫలితంగానే ఏర్పడుతాయంటే చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. అందుకే శాస్త్రంలో ప్రకృతి సర్వశక్తివంతమైనది. నేడు అమీబా అనబడే ఏకకణ జీవి అత్యల్పస్థాయికి చెందిన జంతువుగాను మానవుడు అత్యుత్తమ స్థాయికి చెందిన జంతువుగాను పరిగణించబడడం జరుగుతున్నది. అమీబా నుంచి హైడ్రా, హైడ్రా నుంచి ఆర్థ్రోపోడా, అందునుంచి ఎఖైనో డెర్మేటా.... అలా అలా చేపలు, కప్పలు, సరీసృపాలు – అక్కడి నుంచి పక్షిలోకవైపు మనుష్యలోకవైపు రూపొందాయని భావించడం జరుగుతున్నది. ఒక విధంగా చెప్పాలంటే మనిషికూడా జంతువే నన్న విషయం స్పష్టంగా తెలియవస్తుంది. అయితే మనిషి జంతువుకాదని జంతువు నుంచి వేరుపడినాడని మనిషికి జంతువుకు మధ్యన ఎంతైనా వ్యత్యాసమున్నదని ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు. జంతు ప్రవృత్తి వేరని మనిషి ప్రవృత్తి వేరని – మహోన్నతమైన మానవతా గుణంతో జాతి సంస్కృతిని భాగ్యోదయ ప్రగతి వైపుకు నడిపించే లోకశ్రేయోక్రియా పరుడైన మనిషి యొక్క తత్త్వం జంతు తత్త్వానికి భిన్నమైనదని, జంతువులో కానరాని విశిష్టత, నిర్దుష్టత, విజ్ఞత, విచక్షణ మొదలైన లక్షణాలన్నీ మనిషికే పరిమితమని – ప్రపంచ జనాభాలో ఎక్కువ శాతం మనుష్యుల బలీయమైన అభిప్రాయం. సనాతన ధర్మం కానివ్వండి, బౌద్ధం కానివ్వండి, ఇస్లామ్ కానివ్వండి, క్రిస్టియానిటీ కానివ్వండి– మనిషి జంతువు నుంచి వేరుపడాలనే ప్రవచిస్తున్నాయి. అంతమాత్రాన జంతువు మనిషికన్నా నీచమైనదన్న అభిప్రాయానికి రారాదు. తర్కబద్ధమైన శాస్త్రజ్ఞానంతో చర్చిస్తే జంతువుకు మనిషికి ఏవిధమైన తేడా కనిపించకపోవచ్చును. అయితే అది భౌతిక దృక్పథం. ఏదిఏమైనా జంతువుకు, మనిషికి ఉన్న ఏకోదర సంబంధాన్ని గుర్తించి, కొనియాడి అనంతమైన ఆ సంబంధ బాంధవ్యాన్ని అర్థంచేసుకొని సంస్కారంతో నడచుకోవడమే గొప్పతనం! దానికి ఉపక్రమిద్దాము.

జీవజాలాన్ని సునిశితంగా పరిశీలిస్తే ఒక విషయం స్పష్టంగా బోధపడుతుంది. అత్యంత సూక్ష్మజీవి అయిన అమీబా మొదలుకొని అద్భుతమైన విషయావగాహన, ఆలోచన, వివేచన ఉన్న మనిషి వరకు జన్యుపరమైన ఒక అనుబంధము కనిపిస్తుంది. ఈ బాంధవ్యము ఎక్కడినుంచి మొదలైందని అడిగితే చెప్పడం కష్టమేమోకాని, ఒక్కసారి మొదలైన అనుబంధం మాత్రం నిరంత

రంగా నిరభ్యంతరంగా కొనసాగుతునే ఉంటుంది. ఇది శాశ్వత సత్యం. ప్రకృతి ప్రబోధించే దివ్య సూత్రం. భారతీయ ధర్మసారమైన వేదాలు ప్రవచించే భగవంతుని తత్త్వం. ఇందులో మార్పు రాదు. అన్వేషణకు, గవేషణకు అందని జీవపరమార్థమిది. అంతుబట్టని రహస్యమిది. అర్థంకాని విచిత్రమిది. దీనిని గుర్తించి ప్రకృతి గొప్పతనాన్ని కొనియాడడం ఒక్కటే జిజ్ఞాసువు చేయదగ్గ పని.

జంతుజాలా లన్నింటిలోనూ ఏకోదర సంబంధాన్ని నిర్దుష్టంగా తెలియజెప్పే అలవాట్ల నెన్నింటినో గుర్తించవచ్చును. ప్రతి జంతువు విధిగా కొన్నిలక్షణాలను కలిగిఉంటుంది. ప్రపంచంలోని ప్రతి జీవికి ఆకలి అనునది ఉన్నది. దప్పికఅనునది ఉన్నది. నిద్ర అనునది ఉన్నది. అంతేకాదు. మైథునంపై ప్రీతి అనునది తప్పని సరిగా ప్రతి జంతువు కలిగి ఉండును. ఈ నాలుగు లక్షణాలు విశ్వజనీనంగా సర్వకాలీనంగా ఎప్పుడూ ఉంటాయి. ఆహార సముపార్జన ప్రతిజీవికి అవసరమే. కూటి కొరకు కోటి విద్యలన్నది అతిశయోక్తి కాదు. అమీబా బ్యాక్టీరియమ్‌లను, డయాటమ్‌లను, ఇంకా చిన్న చిన్న సూక్ష్మజీవులను తింటుంది. గాజు ముక్కలను అందిస్తే తిరస్కరిస్తుంది. ఏది ఆహారమో, ఏది ఆహారము కాదో, ఏది శత్రువో, ఏది సహజీవో కూడ తెలుసుకొనే స్థితిలో ఈ సూక్ష్మజీవి ఉండడం విశేషమనే చెప్పవలె. ఎక్కువ వేడి ఉన్న ప్రాంతాలనుంచి చల్లని ప్రాంతాలకు, ఎక్కువ కాంతి ఉన్న ప్రదేశాలనుంచి తగు మాత్రం వెలుతురు ఉన్న స్థలాలకు అమీబా సంచరించడం దాని సూక్ష్మ బుద్ధికి స్పష్టమైన దృష్టాంతం। పరిణామరీత్యా ప్రాథమిక స్థాయిలో ఉన్న ఈ విచిత్రమైన జీవశక్తి పరిణామం జరిగేకొద్దీ చిత్రాతి చిత్రంగా పెరుగుతూ వచ్చి మనిషి స్థాయి కొచ్చేసరికి అనూహ్యమైన స్థితికి చేరుకొంది భళీ। అనిపిస్తుంది. అయితే నిమ్న జంతువుకు అనుభూతి ఉంటుందా? అనుభవం తెలుస్తుందా? మంచిచెడ్డలు తరచి చూచే శక్తిని కలిగి ఉంటుందా? ఒక్కసారి చూచిన దానిని మళ్ళీమళ్ళీ గుర్తు పెట్టుకొనే శక్తి ఆ ప్రాణికి ఉంటుందా? అన్నది ఉత్సాహాన్ని రేకెత్తింప జేసే ప్రశ్నలు. వీటికి సమాధానాలివ్వవలసిన అవసరం ఉన్నది. అమీబా చిరంజీవి (నీరు ఉన్నంత వరకే।). మనిషికి నిర్దుష్టమైన జీవితకాలం ఉన్నది. వానపామును తుండతుండాలుగా (అడ్డంగా మాత్రమే।) చేస్తే ప్రతి తుండమూ ఒక వానపామౌతుంది. ఒక చెయ్యి పోగొట్టుకొంటే మళ్ళీ మనిషికా చెయ్యి రాదు. శత్రువుల బారినుంచి తప్పించుకొనేందుకు బల్లి తోకను పోగొట్టుకొంటుంది. అయినా మళ్ళీ ఆ తోక పెరుగుతుంది. ఈ రకంగా విశ్లేషిస్తే మనిషి కన్నా అమీబాదే పైచేయి అవుతుంది. అలా అనిపిస్తుంది. అయితే సంక్లిష్టంగా ఎదిగి ఉన్న నాడీ వ్యవస్థ మనిషికొక హోదాను, స్థాయిని తెచ్చిపెట్టింది. ఈ వ్యవస్థవల్లే మనిషి నాడు జగద్విదితుడౌతున్నా డన్నది నిర్వివాదాంశం.

మనిషి వలె జంతువు కూడ ఆహారాన్ని తీసుకొంటుంది. అంటే ఆకలిని గుర్తిస్తుంది. నీరు త్రాగి దప్పిక తీర్చుకొంటుంది. శత్రువుల నుంచి తనను తాను రక్షించుకొంటుంది. ఎండ, వాన, చలి-మొదలైన ప్రకృతి పరమైన బాధలనుంచి తప్పించుకోవడానికి వీలుగా గూళ్ళను కట్టుకొంటుంది. పొదరిళ్ళను ఏర్పరచుకొంటుంది. బొరియలను తయారు చేసుకొంటుంది. గుహాలలో నివసిస్తుంది. కొన్ని జంతువులు చెట్లకొమ్మల సహాయంతో ఇళ్ళ వంటి వాటిని కూడ ఏర్పరచుకొంటాయి. కొన్ని జంతువులు మనుష్యులవలె సంఘజీవులు కూడ। కలిసి మెలిసి ఉంటాయి. మందను చూచుకొనేందుకు ఒక జంతువు ముందు ఉండి నాయకత్వం వహిస్తుంది. అరుపులు చరుపులు లాంటి శబ్దాలతో సహ జంతువులతో సంభాషణను జరుపుతాయి. కష్టసుఖాలను తెలుపుకొంటాయి. ప్రమాదాలను హెచ్చరించుకొంటాయి. సంతోషాలను వెలిబుచ్చుకొంటాయి. విషాదాలను వెళ్ళబోసుకొంటాయి. మానవ భావాలకు సరిపోలిన ప్రేమ, వాత్సల్యం, ద్వేషం, ప్రతీకారం, ఘర్షణ, ఆవేశం, ఉక్రోషం, ఆవేగం, అలసట, కోపం - ఇత్యాది లక్షణాలన్నీ జంతువులకు కూడ ఉన్నాయని చెప్పటానికి సందేహపడవలసిన అవసరం లేదు. స్త్రీపురుష జంతువులు కలుసుకొంటాయి. మనుష్యులలో మాదిరే। సంభోగప్రక్రియ కూడ ఇంచు మించు ఒకే విధంగా ఉంటుంది. ఈ స్త్రీ పురుష పరస్పరాకర్షణకు మూలమేదో ఇంతవరకు తెలియరానిదై ఉన్నది. ఈ ఆకర్షణా భావము జంతువులకును మనుష్యులకును సమముగనే ఉన్నదని తెలుస్తున్నది. అయితే జంతువులలో కామకేళి విచ్చలవిడిగా ఉంటుందని వావి వరుసలు పాటించబడవని - మనిషి ఇక్కడే వేరుపడతాడని కొందరు తాత్త్వికులు అభిప్రాయపడతారు. కానీ ఈ వావి వరుసలు, సమాజ నిబంధనలు మనుష్యులలో ఐకమత్యము, క్రమశిక్షణ, సంఘీభావము పాటించటానికి - నైతికంగా, ధార్మికంగా ఉన్నత స్థితిని చేరుకోవడానికి - మనుష్యుల చేతనే మనుష్యుల కొరకు రూపొందించబడ్డాయన్న సంగతి మానవ వికాసాన్ని ఆది నుంచీ తరచి చూస్తే ప్రస్ఫుటంగా తెలిసివస్తుంది. అంటే ఆలోచించి మనిషి నిర్ణయం తీసుకోగలడు, జంతువు ఆ పని చేయలేదని తెలుస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే మనిషికి ముందు చూపు ఉన్నది, జంతువుకు అది లేదు అని చెప్పుకోవచ్చును. ఈ ముందు చూపుకు కారణమేమై ఉంటుం

దనేది ఒక ప్రశ్న. మనిషికి ఈ విచక్షణ ఏర్పడటానికి ఏ శక్తి దోహద పడి ఉంటుందనేది ఎంతో ఆలోచనను రేకెత్తింప జేస్తుంది.

మానవులలో మమతానురాగాలు ఉన్నట్లే జంతువులలో కూడ ఉన్నాయి. పసిపిల్లలను అవి చూచుకోవడం ఎంతో రస వత్తరంగా ఉంటుంది. ఒక కోడిపెట్ట చిన్న చిన్న కోడిపిల్లలను ఎంతో జాగరూకతతో గమనిస్తూ ఉంటుంది. ఒక కుక్క దాని పిల్లల దగ్గరకి వెళితే విరుచుకుపడుతుంది. కోతి పిల్లను కాని, పిల్లి పిల్లను కాని వాటి వాటి తల్లులు ఎంత జాగ్రత్తగా చూచు కుంటాయో మనం నిత్యం చూస్తూ ఉంటాము. తల్లి ఆవును చూచి అంబా అని పలికే లేగదూడను చూచినప్పుడు ఎవరికైనా సరే తన్మయత్వంతో ఒడలు పులకరిస్తుంది. ధాన్యపు గింజలను తీసుకొని వచ్చి తల్లి పిచ్చుక వాలీ వాలగనే గూటిలోనుంచి గొంతులు చించుకొనే పిచ్చుక పిల్లలు కిచకిచ లాడుతూ సంబర పడడం చూస్తే ఎవరికైనా ఎంతో ఆనందం కలుగుతుంది. అంటే తల్లీ పిల్లల అనుబంధాలు ప్రకృతిలో మనుష్యులకు మాత్రమే కాదు జంతువులలో కూడ ఉన్నాయని తెలుస్తుంది. జంతువులలో మరొక విచిత్రమైన లక్షణం కూడ ఉన్నది. ఎక్కువ ఎండను భరించలేక కొన్ని జంతువులు వేసవి నిద్ర పోతాయి. అంటే వేసవి పూర్తి అయ్యే వరకు ఏ విధమైన క్రియా శీలక జీవన వ్యాపారాలలో పాల్గొన కుండా స్తబ్దంగా ఉండిపోతాయన్న మాట. దీనినే ఈస్టివేషన్ అని పిలుస్తారు. మనుష్యులు కూడ వేసవి బాధనుండి తప్పించుకోవాలని రకరకాల ప్రత్యామ్నాయాలను అనుసరిస్తూ ఉండడం వేసవి విడుదలకు వెళుతూ ఉండడం గమనించవలసి ఉన్నది. అలాగే మరికొన్ని జంతువులు చలికాలంలో చలి బాధ తట్టుకోలేక శీతాకాలపు నిద్ర పోతాయి. అంటే మంచు బారినుండి తప్పించుకునేందుకు జంతువులు ఒక విలక్షణమైన పథకాన్ని రూపొందించు కొంటాయన్నమాట. ఇక్కడ ఇవి మనుష్యులకేమాత్రమూ తీసిపోవడంలేదు. ఈ శీతాకాలపు నిద్రను హైబర్నేషన్ అంటారు. వేసవి నిద్రపోయే జంతువులలో కొన్నిరకాల నత్తలను చలికాలంలో నిద్రపోయే జంతువులలో ధ్రువప్రాంతాల ఎలుగులను ఉదాహరణలుగా చెప్పుకోవచ్చును. కొన్ని రకాల పక్షులు చలిబాధను తట్టుకోలేక ఒకప్రాంతంనుంచి మరో ప్రాంతానికి వలసపోతాయి. ఈ వలస పోవడాన్ని మైగ్రేషన్ అని అంటారు. వానకోయిల (స్వాలో) మైగ్రేషన్ నెరిపే ఒక పక్షి (మేధావుల వలస ఇటీవల ఎక్కువగా మన దేశంలో ఉండడాన్ని మనమిక్కడ గుర్తు చేసుకోవచ్చును). ఈ విధంగా జంతువుల ప్రవర్తనా సరళి మానవ జీవితాలను ప్రతిబింబింప జేసే విధంగా ఉండడం సనాతన జన్యు సంబంధ బాంధవ్య ఫలితమేనని అనుకోవడంలో పొరపాటు ఉండదు.

జంతువుల భావ వినిమయంలో కూడ మనుష్యులనే పోలి ఉన్నదనడంలో అత్యుక్తిలేదు. అయితే మానవులలో ఉన్నంత సంక్లిష్టంగా స్ఫూర్తివంతంగా పరిపూర్ణంగా విశిష్టంగా అమోఘంగా అద్భుతమనిపించే తీరులోమాత్రం లేదు, అలా ఉండడానికి అవకాశం కూడ లేదు. శారీరక ప్రవర్తనా సరళిలో 90% వరకు మనుష్యులతో ఏకీభవించే జంతులక్షణాలు మానసిక ప్రవర్తనా సరళిలో అంత ఎక్కువశాతం వరకు ఏకీభవించలేవు. మనుష్యులలో మెదడు, వెన్నుపాము - ఇవి రెండే కేంద్రనాడీ వ్యవస్థకు సంబంధించిన ప్రధాన అంగాలైనా, ఈ రెండింటికీ అందని మరొక విచిత్ర భావన ఉన్నది. ఈ భావన శాస్త్రరీత్యా మనస్సు కావచ్చును, జాగృతి కావచ్చును, అంతరాత్మ ప్రబోధం కావచ్చును, లక్ష్యాన్ని నిర్దేశించే అంతరాళము కావచ్చును. ఈ నాలుగూ ఒకటే ఒకటే కావచ్చును లేదా భిన్న భిన్నములు కావచ్చును. ఈ లక్షణములను ఆధారముగా చేసుకొని రూపొందిన శాస్త్ర భాగమే సైకాలజీ అని తెలియనగును. సైకోట్రానిక్స్, టెలిపతీ, క్లైయిర్ వోయిన్స్, సైకియాట్రిక్స్ మొదలైనవి ఆ సైకాలజీలోని అంశాలు కావచ్చును లేదా అనుబంధాలు కావచ్చును. జంతువులకు మనుష్యులకు ప్రధానమైన భేదమున్నది ఈ మనస్సుకు సంబంధించిన విషయంలోనే! అయితే జంతువులలో మనస్సు అనేదే లేదా అంటేచెప్పడం కష్టమౌతుంది. జంతువులు కూడ స్పందిస్తాయి. ఆర్తిని వెళ్ళబోసుకొంటాయి. సంభ్రమాశ్చర్యాలను ప్రకటిస్తాయి. కళ్ళనీళ్ళు పెట్టుకొంటాయి. అయినప్పటికీ మానసికంగా మనిషి ఎదిగినంత ఎత్తుకు జంతువులు ఎదగలేక పోయినాయి (అయితే మనిషి మనిషికి మధ్యనున్న వ్యత్యాసం మరింత విచిత్రమైనది!) ఈ విషయం వల్లనే మనిషి మహోన్నతమైనస్థాయిని చేరుకో గలిగాడు. జంతువులలో కూడ చెప్పుకోదగిన స్థాయిలోనే మానసిక పరమైన మార్పు ఉన్నదని చెప్పడానికి భయపడవలసిన అవసరం లేదు.

తెల్లవారుతునే తెల్లవారుతున్నదని తెలిసి కోడికూతవేస్తుంది. సంకేత స్థలానికి ఒక పావురం ఉత్తరాన్ని చేరవేయగలుగుతుంది. తన యజమానిని ఒక గుర్రం గుర్తుపట్టగలుగుతుంది. మేతనుంచి ఒక గేదె తన స్థావరానికి తను తిరిగి వెళ్ళగలుగుతుంది. అంటే జంతువులలో కూడ తెలివి, జ్ఞాపకశక్తి ఉన్నాయని అవి ఉండడం వల్లనే అవి ఆలోచిస్తాయని తెలుస్తుంది. జంతువులు ఆలోచిస్తాయని చెప్పడానికి స్పష్టమైనదృష్టాంతాలెన్నో ఉన్నాయి. ఒకసారి కర్రదెబ్బ తిన్న కోతి ఆ కర్ర చేతిలో ఉన్నట్లయితే మనిషిని చూచి భయపడు

తుంది. హారన్ శబ్దాలు వినిపిస్తే వెనక్కు తిరిగి చూసి ఎంతో జాగ్రత్తగా ఒక కుక్క పిల్ల నడి రోడ్డుమీద పరుగులు తీస్తుంది. ఒకసారి గేటు దాటబోయి ఆ గేటు దగ్గర పశువులు రాకుండా కిటికీలాగ ఉన్న ఇనుప కమ్మీలలో చిక్కుకొన్న దూడపిల్ల రెండవ సారి ఆ కమ్మీలలో కాళ్లు పడకుండా జాగ్రత్త పడుతుంది. ఒక్క ఎగురు ఎగిరి అటువైపుకి చేరుకొంటుంది. పాలు త్రాగడానికొచ్చే ఒక పిల్లి పిల్లను చాటునుంచి దెబ్బ తీస్తే అది ఎంతో మెలుకువతో మరుసటి రోజు పాలు త్రాగడానికి ప్రయత్నిస్తుంది. ఒక్కసారి ఇంజక్షన్ ఇచ్చిన ఎలుక పిల్లకు రెండవదఫా సూది వెయ్యడానికి ప్రయత్నిస్తే ఎంతో కష్టసాధ్య మవుతుంది. సూది బాధను అది ముందుగానే తెలుసుకోవడం వల్ల ఇబ్బంది ఏర్పడుతుంది. బోనులో ఉన్న కోతికి బలవంతంగా ఇంజక్షన్ ఇచ్చి మరుసటి రోజు దా దగ్గరికెళితే గుర్రుమని చూస్తుంది. సిరంజిని లాగి కొరికి పడేస్తుంది. అంటే దానికి నొప్పి అనే విషయం బాగా తెలియ వచ్చిందని అర్థమవుతుంది. ఒక మగ దుప్పి ఆడదుప్పి వదిలే కొన్ని రకాల స్రావ్యాలను వాసన ద్వారా గుర్తుపట్టి ఆడదాని ఉనికిని తెలుసుకోవడం దాని జ్ఞాపక శక్తికి, సూక్ష్మ బుద్ధికి నిదర్శనం. ఇలాంటి ఉదాహరణాలు ఎన్నైనా ఇవ్వవచ్చును. జంతు శాస్త్రాన్ని అధ్యయనం చేసేవారికి జంతు ప్రకృతి ఎంత హృద్యంగా ఆహ్లాదంగా ఉంటుందో అందరి కంటే ఎక్కువగా తెలుస్తుంది. కాబట్టి జంతువులు మనుష్యుల మాదిరే ఆలోచించ గలవని జ్ఞప్తి పెట్టుకోగలవని తెలుస్తున్నది 3 సంవత్సరాల చింపాంజీలకు పరీక్షలు పెడితే డెబ్బై రకాల సైగలను, సంకేతాలను ఎంతో విచక్షణతో వెల్లడి చేయడం వాటికున్న జ్ఞాపక శక్తికి ప్రబలమైన తార్కాణము. మరి మనిషికి, జంతువుకు అసలు భేదమెక్కడ ఉన్నదన్న అనుమానం వస్తుంది. మాటలాడే ఏకైక జంతువు మనిషి అని అనడం వల్ల భాషా విషయంలో మాత్రమే మనిషికీ జంతువుకూ భేదమున్నదేమోనని అనిపిస్తుంది. నిజానిజాలను పరిశీలిద్దాము.

భావ ప్రకటనను ప్రస్ఫుటించడానికి మనిషికి భాష అవసరమైనది. విశ్వంలో ప్రకృతి భాష ఒక్కటే. యోచనాశక్తి ఉన్న మనిషి తనకంటూ ఒక ప్రత్యేక భాషను ఏర్పరచుకొన్నాడు. ప్రపంచంలోని మానవ భావ మొక్కటే కాని మానవ భాష మాత్రం ఒక్కటి కాదని మనకు తెలుసు. వాస్తవానికి అలా ఉండే అవకాశం కూడ లేదు. భాషాశక్తి వల్లనే మానవుడు జంతువుపై అధిక్యాన్ని కనబరుస్తున్నాడేమోనని అనిపిస్తుంది. అయితే జంతువులకు కూడ భాషాశక్తి ఉన్నదని, వాటి భాష వాటికున్నదని, వాటి తాహతు వాటిదని స్పష్టంగా నిర్ణయించుకోవలసిన అవసరం ఉంది.

గబ్బిలాలు మనం వినలేని శబ్ద తరంగాలను సృష్టించుకొంటూ రక్షణ, పోషణ, ప్రత్యుత్పత్తి - ఇత్యాది ప్రక్రియలను నిరాటంకంగా నిర్వర్తించుకొంటూ ఉంటాయి. మనం వినలేనంత మాత్రాన ఆ జంతువులో భాష లేదని భావ వినిమయం లేదని అనుకోకూడదు. చేపలలో ప్రత్యేకమైన విద్యుత్తును జనింపజేసే ఉపాంగాలు ఉండి మెరుపుల రూపంలో సముద్ర మధ్యంలో భావ వినిమయం జరుగుతుంది. ఇది ప్రకృతిలో అపూర్వమైన విషయం. తేనె టీగలలో మానవ సంగీతాన్ని మరిపించే మధురమైన శబ్దం ద్వారా భావ వినిమయం జరుగుతుంది. ఆహార సముపార్జనకు ముందు, ఆహారాన్ని సేకరించుకొన్న తరువాత - రెండు సమయాలలోనూ తేనె టీగలు ప్రత్యేకమైన శబ్దాలను, కదలికలను ప్రదర్శిస్తాయి. పీతలు భావ వినిమయం కోసం నిర్దుష్టమైన కంపనాలను చూపుతుంది. అగ్ని కీటకాలు నిప్పురవ్వలను ప్రదర్శిస్తూ ఎంతో ఫలవంతంగా తమ జీవితాన్ని గడుపుకొంటాయి. వృశ్చిక జాతిలో ప్రత్యేకమైన శోభనంరాత్రి నృత్యం ఒకటి ఉన్నది. ఈ నృత్యాన్ని మృత్యు నృత్యమని పిలుస్తారు. ఎందుకంటే స్త్రీ వృశ్చికము పురుష వృశ్చికం చేసే శబ్దాన్ని బట్టి, ప్రదర్శించే అను కంపనాలను బట్టి తన జాతికి చెందిన వృశ్చికమా ? కాదా ? అన్నది నిర్ణయించుకొని తన జాతికి చెందని మగ వృశ్చికమైతే నిర్దాక్షిణ్యంగా చంపివేస్తుందని ఒక ప్రతీతి. అది వాస్తవం కూడ ! (జాతిలో ఎన్నో ఉపజాతు లుండవచ్చు కదా !) పక్షులలో కిల కిలలు, రవ రవలు ఉన్న మాట మనకు తెలిసినదే. మృగాలలో సందర్భాను సారంగా వెలువడే అరుపులు, చరుపులు మనం రోజూ చూస్తున్నవే. మనుష్యుల మల్లే బాధ పడడం, సంతోష పడటం, ఆశ పడటం, కోరిక పెంచుకోవడం, భయ పడటం, భయ పెట్టటం వంటి అన్ని లక్షణాలను జంతువులు ప్రదర్శిస్తాయి. అలాగే ఆకలి, అభిమానం, ప్రేమ పగ, ద్వేషం, ప్రతీకారం, ఘర్షణ, నొప్పి - వంటి లక్షణాలను సయితం జంతువులు మానవుల మాదిరే ప్రదర్శిస్తాయి. జంతువులు మాటలాడలేవు. మనుష్యులు మాటలాడ గలరు. జంతువులకు అక్షర జ్ఞానం లేదు. రాదు. మనుష్యుల కొక్కరికే ఉంది ఉంటుంది అనే అభిప్రాయానికి రావడం జరుగుతుంది. అయితే మనుష్యుల మాదిరే జంతువులు కూడ మాటలాడగలవని చిలుక పలుకులు విన్నప్పుడు తెలిసొస్తుంది. చింపాంజీలు ఏ బీ సీ డీ లు రాయడాన్ని చూస్తే జంతువులకు కూడ అక్షర జ్ఞానం ఉండే అవకాశం ఉందని బోధపడుతుంది. ఇదీ పరిస్థితి. ఇటువంటప్పుడు మనుష్యులకు, జంతువులకు ఏవిధమైన భేదమూ లేదనే నిర్ణయానికి రావలసి ఉంటుంది. అది నిజం కూడ ! అమీబానుంచి మనిషి వరకు ఒకే విధమైన జన్యు సంభావన ఉండడం - ఉన్నదనడం శాస్త్ర సత్యం

అస్సాం, మేఘాలయ ప్రాంతాలలో డి. డి. టి. వంటి రసాయనికాలను ఇండ్ల లోపలి గోడలపై చల్లుతుంటే దోమలు లోపల వాలడం మాని బయట వాలడం నేర్చుకొన్నాయి. కీటక స్థాయిలోనే ఇంత తెలివి తేటలు ఉన్నప్పుడు పరిణామ పరంగా అనూహ్యమైన స్థాయికి చేరుకొన్న మనిషి ఎంతో తెలివిగలవాడై ఉండటంలో ఆశ్చర్యమేమీ లేదు. మనిషి ఆ విధంగా తెలివి పరంగా జంతువు నుంచి వేరుపడు తున్నాడని భావించవచ్చును.

కాబట్టి శాస్త్రాధారాలతో సమీక్షిస్తే మనిషి కూడ ఒక జంతువేనని సందేహం లేకుండా తెలుస్తుంది. అయితే మనిషికి ఉన్న బుద్ధి కుశలత జంతువుకు లేదు. ఆలోచనా శక్తి కూడ లేదు. ఒకవేళ ఉన్నా వాటి శాతం అత్యల్పంగా ఉంటుంది. మనిషి ప్రకృతిని పరిశీలించగలడు. అర్థం చేసుకోగలడు. విశ్లేషించుకోగలడు. ప్రమాణాలను గుర్తించగలడు. భవిష్యత్తును ఊహించి తన ఉనికికి భంగకరం కాని దిశలో తన జాతిని సుస్థిరం చేసుకొనే ప్రయత్నంలో తనదంటూ ఒక ప్రత్యేకమైన పథకాన్ని రూపొందించుకొంటాడు. అతనికి ఆత్మ విమర్శనా శక్తి ఉన్నది. ఆ శక్తి జంతువుకు లేదు. అనుభవాలు మనిషికి, జంతువుకు ఒకటే అయినా అనుభూతం చెందే విషయంలో ఎంతో భిన్నత్వం ఉంది. మనిషి అనుభూతి స్థాయి సంతృప్తం చెంది ఆత్మ వివేచనతో అలరారుతుంది. జంతు స్థితి అలాకాదు. దాని అనుభూతికి మానవానుభూతి కున్నంత రసస్ఫూర్తి ఉండదు. అయితే కొందరు మనుష్యులు జంతువులలాగా ఉండడమనేది వేరే సంగతి. దీన్ని వివరించడానికే సంస్కారపద ప్రయోగం జరిగింది. పరిపూర్ణమైన మానసిక వికాసంతో విరాజిల్లే ఆత్మ వివేచనా సంపత్తిని సంస్కారమని అనుకోవచ్చు. సంస్కార వంతుడు మాన్య రస భావుకతతో జీవితం పట్ల అర్థవంతమైన అవగాహనను కలిగి ఉంటాడు. అలా కాని వాడు స్వరూపరీత్యా మానవుడు కావచ్చును కాని, భావ ప్రకటన రీత్యా మానవుడు కాలేడు. జంతువుకు సంస్కారం ఉండే అవకాశం చాల తక్కువ (సంస్కారానికి విశ్వాసానికి ఎంతో వ్యత్యాసముంది. ఈ విషయాన్ని విజ్ఞులు గుర్తించాలి). కాబట్టి మనిషికి జంతువుకు ఉన్న భేదమల్లా ఒక్క సంస్కారమనే తెలుస్తుంది. ఈ సంస్కారంలో ఉండే వ్యత్యాసం వల్లే మానవానుభూతి జంతు అనుభూతికి భిన్నంగా ఎంతో విశిష్టంగా ఉంటుంది. ఈ విషయంలో సందేహం లేదు. దీనిని అంగీకరించడానికి శాస్త్ర పరిజ్ఞానం అక్కరలేదు. మాననీయమైన మానవ ప్రకృతిలో లీనమై ఆ రసార్ద్రతలో తల మునకలై స్పందించి ధ్వనించగలిగితే మానవానుభూతి కున్న ప్రాముఖ్య మేపాటిదో తెలిసొస్తుంది. భారతీయ సనాతన ధర్మం ఈ విషయాన్ని ఎంతో చక్కగా విపులీకరించి ఉండడం మన అదృష్టం. దానిని నిలుపుకొందాము.

[డోనాల్డ్. ఆర్. గ్రిఫిన్ రాసిన "ది క్వొశ్చెన్ ఆఫ్ అనిమల్ అవేర్‌నెస్" చదివాక ఇది రాయాలనిపించింది.]

—✲—

బాష్పవర్షం

శ్రీ రాణి శివశంకర శర్మ

ప్రపంచంలోని అనంతమైన దుఃఖాన్ని చూసి
గ్రీష్మంలా మండి మండి
నీటిలోనికి మింగి, మింగి, బిగపెట్టి
ఇక దుఃఖాన్ని ఆపుకోలేక
తనలో మూగిన నల్లని మబ్బులతో ఊపిరాడక,
బోరుమని యేడ్చివేసింది, గుండె చెరువైపోయి
చెరువులే నిండిపోయేలా ఆకాశం.

వానలో తడిసిన చెట్లు ఆకుల కొనల నుంచి
నీటి బొట్లను జారవిడుస్తుంటే
గుండెలు విచ్చిపోయే ఆకాశ దుఃఖాన్ని చూసి
కనుగొనల నుంచి కన్నీరుగా కరిగిపోతున్నట్లనిపిస్తుంది.
జడమైన చెట్లు చేమలు, ఇంటికప్పులు కూడ
చుక్కలు చుక్కలుగా నీటిబొట్లను జారవిడుస్తుంటే
ప్రపంచంలోని దుఃఖానికి, ప్రపంచ హృదయమే,
కన్నీటిగావిచ్చి, మున్నీటిగా మారిపోతోందనిపిస్తుంది.
నిజానికి స్వపర భేదాలు లేని సర్వసమాన దృష్టితో
ప్రపంచాన్ని పరికించగల్గితే,
ఈ జీవరాసుల దుఃఖానికి, కన్నీళ్ళు కనుకొనల నుంచి
మొదటి రోదనలోనే పూర్తిగా జారిపోయి,
కన్నీళ్ళు చాలక నెత్తురెరువు తెచ్చుకొని
అంతిమ రక్త బిందువు వరకు ప్రవహించిపోయి,
"వార్ధుక మేఘంలా కరిగిపోయి
ఒక్కొక్క మనిషి ఒక్కొక్క చెరువైపోతాడు.
ఆ కన్నీళ్ళ ప్రవాహం మీద కరుణలేని దేవుడు
వటపత్రం పరచుకొని నిద్రపోతాడు మామూలుగా.

శ్రీ సర్దేశాయి తిరుమలరావు

మానవాత్మలో సమ సమాజం

అరణ్య పర్వంలో హనుమంతుడు, భీముడు కలుస్తారు. "అంత పెద్ద ఘటానివి కదా, ఏమి ఇట్లయిపోయినావు ? నీవు సముద్రాన్ని ఎగిరేటప్పటి ఆకారాన్ని చూడవలెనని ఉంది చూపించవూ" అని భీముడు మారాము చేస్తాడు. దానికి హనుమంతుడు "కాలం మారింది నాయనా, అప్పటి నా ఆకారాన్ని చూడలేవు. పంచ భూతాలే మారుతాయి. మేము చిరంజీవులమైనా కాలం బట్టే నడచుకుంటాం. కాలం దురతిక్రమం సుమా" అంటూ మందలిస్తాడు.

కాలం అనంతం అయినా, మన అనుకూలం కోసం భూత, వర్తమాన, భవిష్యత్తు అని విభజించుకొన్నాము.

కాలం అనేదేలేదనీ, అది ఆత్మాశ్రియభావమే కాని వస్త్వాశ్రియ ధర్మం కాదనీ ఒక వాదం. లవణరాజు కలలో (యోగ వాసిష్ఠం) జీవితకాలమంతా కొద్ది నిమిషాలలో అనుభవంలోకి వస్తుంది. అది ఇంద్రజాలం క్రిందా, మనోభావం క్రిందా జమలోనికి వస్తుంది. ఐన్‌స్టీన్ రిలెటివిటీ సిద్ధాంతానుసారం, కాలం ఆకాశంలో భాగం.

సాంఘిక శాస్త్రజ్ఞులు కాలంను "సమస్యల ప్రవాహం" గా పరిగణిస్తారు. కాలగమనాన్ని రెండు విధాలుగా రూపించుకోవచ్చు. ఒకటి - కాలం బాణం వలె ముందుకు దూసుకొని పోతూ వుంటుంది. పునరావృతం అయ్యే రాత్రింబవళ్ళు, ఋతువులు చూస్తే, కాలం చక్రంవలె దొర్లుతూ, తిరుగుతూ పోతూవుందనడం. రెండు - కాలం వెనుకకు పోవడం వుండదు. ఉంటే ముసలివాడు పిల్లవాడై, కూనై, పిండమై, శుక్లశోణితాలై, రక్తమై, అన్నసారమై, అన్నమై, గింజలై పోవలసిఉంటుంది. "ఎచ్చట బుట్టెనచ్చటికి నేగుట నైజము ప్రాణకోటికిన్" అనే భాగవత పద్యంలో ఇట్టి అర్థమిచ్చే పంచాగ్ని విద్య చెప్పబడిందంటారు.[1] దేహంనుండి వెలువడిన జీవుడు ఆకాశం చేరుకొని, మేఘాల ద్వారా వర్షింపబడి, ఆహారమై, శుక్ల శోణితాలై పిండమై పుట్టుతాడట. ఇది అనంత వలయంగా సాగిపోతుంది. కాంతికిరణం కంటె ఎక్కువ వేగంతో ఏదైనా వస్తువు పయనించే పక్షంలో, సూర్యుని నుంచి ఆ వస్తువు "నేడు" బయలుదేరి "నిన్న" రావచ్చునని పదార్థవైజ్ఞానికులను కున్నారు.

గతాన్ని మెచ్చుకొనేవారు, వర్తమానాన్ని మెచ్చుకొనేవారు, భవిష్యత్తును మెచ్చుకొనేవారు అని మూడు రకాలవాళ్ళుంటారు. బాల్య కాలాన్ని నెమరువేసుకొంటూ ఉండేవారు, భూతకాల ప్రియులు. వీరి నినాదం "గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్". ఇది వ్యాసుడు తన ముసలి తల్లి సత్యవతితో చెప్పిన వాక్యం. నీ మునిమనుమలు కొట్లాడుకొని చస్తారు. దాన్ని మీరు చూడలేరు. వానప్రస్థానికి పొండి అని ఆమెకూ, ఆమె కోడండ్రకూ హితం చెబుతాడు.

చిన్ననాటి నేస్తాన్ని గురించి స్కాట్‌లాండ్ కవి రాబర్టు బర్న్సు వ్రాసిన ఈ విశిష్టమైన పద్యం చూడండి.

బహుకాలదర్శనం

చిరకాల నేస్తాన్ని మరచిపోవలెనా
మతికి తెచ్చుకోకూడదా ?

వంతపాట

ఎన్నాళ్ళకెన్నాళ్ళకు ప్రియతమా
ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు
బహుకాల దర్శనం.

పాతకాలపు నెనరులకు
దయారసం ఆస్వాదించుదాం మనం
మనిద్దరం కొండ కోనల్లో పరిగెత్తినాం
మంచి బంతిపూలను తెంచినాం
కాళ్ళరిగేటట్లు తిరిగినాం
ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు
బహుకాల దర్శనం.

మనిద్దరం వాగుల్లో ఆడినాం
పొద్దుపొడుపు నుంచీ అంబటిపూటదాక
మనమధ్య సంద్రాలు గర్జించినాయి
ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు
బహుకాల దర్శనం.

ఇదుగో నా చేయి అనుంగుసోదరా
ఏదీ నీ చేయి ఇయ్యి
మంచి పానీయాన్ని తాగుదాం
ఎన్నాళ్ల కెన్నాళ్ళకు
బహుకాల దర్శనం.

నీవు నీగిండివి కమ్మ
నేను నాదవుతాను
మనం సౌహార్దరసాన్ని ఆస్వాదించుదాం
ఎన్నాళ్ల కెన్నాళ్ళకు
బహుకాల దర్శనం.

బర్న్స్ ఒక జానపద గీతం ఆధారంగా స్కాటిష్ ఏసతో వ్రాసినాడు. ఇందులోని అనిర్వచనీయమైన కరుణార్ద్రత చూపించ డానికే తెలుగు చేసినాను.

యుద్ధం ముగిసిన తర్వాత లక్ష్మణుడు "ఈ లంక బంగారంలా గుంది. ఇక్కడే ఉండిపోదా" మంటాడు. అప్పుడు శ్రీరాముడు బంగారంలాగేమో ఉందికాని, ఒరే లక్ష్మణా ఇదినాకు నచ్చలేదు. "అమ్మా, పుట్టిన వూరూ స్వర్గం కంటె గొప్ప నాయనా, పద అయోధ్యకు" అంటాడు. జనని సరే. జన్మభూమి ఎందుకు? ఇందుకు. షట్టి, బాల్యం ఎక్కడ గడిపి ఉంటారో ఆ స్థలం ప్రీతికరం. "ఉత్తర రామచరితం"లో శ్రీరాము డిట్లానే అంటాడు. తండ్రి బతికి ఉండగా, తమకు కొత్తగా పెళ్ళయివుండగా, తల్లులు తమ గురించే మాట్లాడుకొంటున్న ఆ రోజులు పోయినాయి. కేవలం జన్మస్థలం ముఖ్యంకాదు. ఒకడు విమానంలో పుట్టుతాడు. ఒకడు ఆర్.టీ సీ. బస్సులో పుట్టుతాడు. వారికి విమానం మీదనూ, బస్సు మీదనూ మమకారం ఉండదు. శ్రీకృష్ణుడు మధురలో, జైలులో పుట్టుతాడు. ఆయనకి మధుర అన్నా, జైలు అన్నా అంత ఇష్టం వున్నట్లు దాఖలాలేదు. బాల్యాన్ని గడిపిన గోకులమంటేనే ఆయన కిష్టం. వసుధైవ కుటుంబీకుడైన నెహ్రూకు ఆయన బాల్యం గడిపిన అలహాబాదు, అచటి త్రివేణీ సంగమం అంటే ప్రత్యేకాభిమానం. నా పిడికెడు చితాభస్మాన్ని అలహాబాదు గంగాతీరాన కూడా చల్లండి అని తన వీలునామాలో వ్రాసుకొన్నాడు.

"మాతాచ పార్వతీదేవి, పితాదేవో మహేశ్వర బాంధవా శ్శివ భక్తాశ్చ స్వదేశో భువనత్రయం" అనే స్థాయిలో వుండే యోగి, "కందిమల్లయపల్లి మావూరు" అంటాడు. ఇదీ కీలకం. "దాని సిగ్గోసిన గోపురం, గోపురమన్నదే కావలసివుంటే మావూరు రండి" అని పుల్లంభట్టు అంటే, నారాయణభట్టు "మీవూరి గోపురం యెవరిక్కావాలిరా! నీకు బోధపడదు. చిన్నతనంలో ఎప్పుడూ ఆ గోపురం మీదనే" అంటాడు.2 ప్రపంచాన్నంతా పర్యటించి విదేశ స్త్రీని పెండ్లాడి, మాంచి ఉద్యోగం చేసి, రిటయిరయి, టంచనుగా పింఛను పుచ్చుకుంటూ హాయిగా జీవించే డాక్టరు దేవ బంధుకు, అతడు అంజిగా వుండి చింతలపల్లెలో చెలమనీరు త్రవ్వి త్రాగే పిన్ననాటి రోజులే హఠాత్తుగా కలలో వస్తుంటాయి.3 మన అందరిలోనూ "అంజి" దాగి వుంటాడు. మనం స్మృతి జీవులం.

గురజాడ "మీ పేరేమిటి" కి పోదాము. కథా భాగం - "మనస్సులు గత కాలమునాటి స్థితి గతులను గూర్చిన ఊహలతో నిండి యుండెను. తలపోసి తలపోసి 'ఆనాడు. యీ స్థలం ఎలా వుండెనో బౌద్ధులు యేమేం చేసినారో' అని నేనంటిని".

"ఆ పీనుగులూ మనలాగే యేడుస్తూ వుండేవారు. మన కంటే అధ్వానంగా ఉండేవారు" అని సున్నితమైన తలంపులు బెదరి చెదిరె పెళుసు గొంతుకతో వెంకయ్య అరిచాడు. ఖాయిదా లావు చేసి తిట్లు తిట్టే మాష్టారు వెంకయ్య.

గతం నశోచామి, కృతం స్మరామి. గతంలో ఏముంది? ఉండేదే ఇంక మీదట అనేది రెండవ వర్గం. వీరి ప్రకారం, "గత కాలము కంటె మేలు కాలము వచ్చున్".4

సర్ థామస్ మోర్, నీట్షే, బెర్నార్డ్‌షా, అరవిందుడు, టీల్ హార్డ్ డిచార్డిస్, బ్రొనోస్కీ మున్నగువారు, పురుషుడు పురుషోత్తముడు (సూపర్‌మన్) కానున్నాడనీ, మానవుడు అత్యున్నత స్థానానికెదుగు తాడనీ వీరి తపన, తపస్సు. "మానవాళికి నిజంగానే మంచికాలం రహిస్తుందా?" అని శ్రీశ్రీ తపిస్తాడు. "వెనుక చూచిన కార్యమేమోయ్, మంచి గతమున కొంచమేనోయ్, మందగించక ముందు కడుగేయ్, వెనుకబడితే వెనుకెనోయ్" అని గురజాడ అంటే "పదండి ముందుకు పై పైకి" అని శ్రీశ్రీ పురమాయిస్తాడు.

గత కాలాన్ని స్మరిస్తూ వుండేవానిని చాదస్తుడనో, వేదాంతి అనో నవ్వుకొని వూరకుంటాము. భవిష్యత్తు గురించి మాట్లాడే వానిని క్రాంతదర్శిఅనో, విప్లవవాదిఅనో, ఆదర్శవాది అనో, దివాస్వాప్నికుడనో మంచి పదజాలాన్నే వాడుతాము. గతం పోయింది. భవిష్యం రాలేదు. వాటిజోలి మనకెందుకు. ఉన్నది ఈనాడు. ఇప్పుడే మనం ఆనందం అనుభవించవలె అనే వానిని నాస్తికుడనీ, హిడొనిస్టు అనీ శాపనార్థాలు పెట్టుతాము. ఏమి న్యాయం?

కనపడేవాని కన్నా కనపడనిది బాగున్నట్లనిపిస్తుంది. అందుకే ఆదర్శపరిస్థితులు భూతకాలంలోనైనా వున్నట్లు చెప్పుతారు. భవిష్యత్తులోనైనా వుంటాయని చెప్పుతారు. రామరాజ్యం

భూతకాలంలో సంభవించిన ఆదర్శ రాజ్యమని కొందరంటారు. తమ గృహచ్ఛిద్రాలతో ప్రజల ప్రాణాలు తోడే నేటి మంత్రుల వలెనే, శ్రీరాముని రాజ్యమూనూ, అనేది మఱచిపోతారు.

పదునాఱవ శతాబ్దంలో సర్ థామస్ మోర్ ఒక ఆదర్శ సాంఘిక వ్యవస్థను భావించుకొని ఉటోపియా అనే పేరుతో ఒక గ్రంథంలో ఆ వ్యవస్థను విశదంగా వర్ణించినాడు. గ్రీకు భాషలో 'ఉ' అంటే కాదు. 'టోపియా' అంటే స్థలం. ఉటోపియా అంటే నోవేర్ అని అర్థం. ఆదర్శంగా ఏదీ ఎక్కడా వుండదు అటు వంటి ఆదర్శ స్థలమే ఉటోపియా. ఎక్కడా లేని స్థలం. ఈ పదాన్ని నేను "అతలం" అంటాను. ఇది ఉటోపియాకు సమానం. నా "అతలం" మన అథోలోకాల్లో ఒకటికాదు. "అతలం" ఎక్కడా లేని స్థలమన్నాను. అది అస్థలం - మోర్ యొక్క ఉటోపియా.

మేధావులు ఎన్నో ఆదర్శ వ్యవస్థల గురించి కలలు కన్నారు. వర్ణించినారు. ప్రణాళికలు తయారు చేసినారు. "బ్లూప్రింటు" లు రచించినారు. కొన్ని అతలాలు భూతకాలమం దుండగా, కొన్ని అతలాలు భవిష్యత్తులో ఉంచబడ్డాయి. మొదటివి విస్మృతి పథంలోనివి కాగా రెండవవి క్రాంత దృష్టిపథంలోనివిగా కన్పిస్తాయి. మొదటివి రాత్రి కలలు. రెండవవి పగటి కలలు. బేకను నవ్య అట్లాంటిస్, గాంధి "రామరాజ్యం" భూతకాలంలో వుండినాయనుకొని, భవిష్యత్తులో స్థాపించవలెనని అనుకొనే అతలాలు ఎక్కడా లేని, ఉండని, ఆదర్శ వ్యవస్థలని వర్ణించిన అతలాలు ప్లేటో రిపబ్లిక్, థామస్ మోర్ ఉటోపియా, విలియం మారిస్ "అతలం నుంచి వార్తలు", గురజాడ "దేశభక్తి" గేయం. శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన విడంబనం వల్లనూ, ఏకపక్ష నియంతృత్వరాజ్యాల విజృంభణవల్లనూ పరిణమించే ఘోరపరిస్థితులను వర్ణించే అతలాలు ఉన్నాయి. వీటిని దుస్థలాలు (డిస్టోపియా) అనవచ్చు. అల్‌డస్ హక్సులే బ్రేవ్ న్యూ వరల్డు, జార్జిఆర్వెల్ "1984", వెల్స్ నేటి ఉటోపియా, సోల్జనిత్సిన్ వ్రాసిన సోవియట్ రష్యా వ్యతిరేక ప్రహసనాలు దుస్థలాలకు కొన్ని నిదర్శనాలు.

"ఇవాన్ మూర్ఖుడు" అనే చిన్నకథలో టాల్‌స్టాయ్ ఆదర్శ వ్యవస్థను ఎంతో హాస్య పరిశంగా చిత్రించినాడు. ఆ కథలో మనుష్యుని పతనం చేసే "స్వంత ఆస్తి"ని బలపరిచే సైతాను "తలకాయ పని" చేస్తూ చేస్తూ బుర్ర పగిలి చచ్చిపోతాడు.

జోనాథన్ స్విఫ్టు మానవుణ్ణి ఎంతవరకు తిట్టవచ్చునో అంతవరకూ నోరారా తిట్టి పోసినాడు. "గలివరు యాత్రలు" అనే గ్రంథంలో మానవజాతినే ఖండించివేస్తాడు. గలివరు, యాత్రికు పోయిన దేశాల్లో "హ్యూహినెం" అనే అశ్వద్వీపం ఒకటి. ఈ దేశంలో గుర్రాలదే పారుపత్యం. వీనికి చాకిరీ చేసేందుకు "యాహూ"లు అనే పరమ నికృష్ట మృగా లుంటాయి. ఈ యాహూ లెవరనుకొన్నారు? మనమే! హ్యూహినంల గుణగణాలని మన గలివరు (ఇతడు వాని దృష్టిలో యాహూయే) ఇట్లా ఉగ్గడిస్తాడు.

స్నేహ దయా దాక్షిణ్యాలు హ్యూహినెంలలో సర్వత్రా కనిపించే సుగుణాలు. "అసత్యము" అనేమాట వాళ్ళ భాషలో లేదు. ఆ దేశంలో పదరబోతులు, పరనిందకులు, చాడీకోరులు, జేబుదొంగలు, దారిదోపిడీగాండ్రు, కన్నపుదొంగలు, వకీళ్ళు, కుంటెనకత్తెలు, హాస్యగాండ్లు, వేటగాండ్రు, రాజకీయవాదులు, చిర్రుబుర్రులాడేవాళ్లు, అధికప్రసంగులు, రాద్ధాంతులు, స్త్రీనిమానభంగంచేసేవాళ్లు, హంతకులు, గజదొంగలు, కళాకారులూ లేరు. రాజకీయ పక్షాల మురాల నాయకులుకానీ, అనుయాయులుకానీ లేరు. ఆశ చూపెట్టికానీ, ఆచరణద్వారాకానీ, వ్యసనాలకు ప్రోద్బలం లేదు. భూగృహకారాగారాలు, గొడ్డండ్లు, ఉరికంబాలు, కొరడాదెబ్బలు వేసేముందు కట్టేకంబాలు, నేరంచేసినవాణ్ణి జనులు హేళన మొదలగువానికి గురిచేసేందుకు అనువుగా వాని చేతులను, తలను, రంధ్రంలో బిగించి బహిరంగంగా ప్రదర్శించే కొయ్యచట్రాలు లేవు. దగాచేసే అంగడివాళ్లు, యంత్రకారులూ ఉండరు. గర్వం, దంభం లేవు. డాబులరాయుళ్లు, పేచీకోరులు, త్రాగుబోతులు, సంచార వేశ్యలు లేవు. గయ్యాళిగంపలైన భార్యలు, బుద్ధిహీనులు, పండితమ్మన్యులు, ఎప్పుడూ అరుస్తూ, కొట్లాడుకొనే స్నేహితులు వుండాకోర్లు లేరు. భూస్వామ్య ప్రభువులు, ఫిడేలు వాయించే వాళ్లు, న్యాయమూర్తులు, నట్టువకాండ్రూ లేరు.

మన సంఘంలో ఏయే చెడుగులు వున్నాయో వాటిని ఏకరువు పెట్టుచున్నాడు స్విఫ్టు. ఆదర్శవ్యవస్థలో అవివుండరాదని చెబుతున్నాడు. ఇక "యాహూ"లనే మృగాల (అంటే మనుష్యులే) ప్రవర్తనను "హ్యూహినెం" లలో శ్రేష్ఠుడొకడు గలివరు కిట్లు చెప్పుచున్నాడు.

"యాహూలు ఇతర మృగములకంటె తమను తాము ఎక్కువగా ద్వేషించుకొంటాయి. ఐదు యాహూలకు, యాభైకి సరిపోయే మేతవేస్తే శాంతంగా మెక్కక, ప్రతియొక్కటీ అంతా తనకే కావలెనని చెవుల బట్టికొని గుంజట్లాడుతాయి. రంగురంగుల మెరసే రాళ్లంటే (ఇవి నవరత్నాలు) యాహూలకు పిచ్చిప్రేమ. యాహూల విషయమై ఇంకొక ఆశ్చర్యకర సత్యమేమంటే, వాటికి అశుచిపైనా, గబ్బుపైనా ఉండే ఆకర్షణ. ఇతర జంతువులకు శుభ్రత నైజగుణం.

యాహూలను ఏహ్యజంతువులుగా చేసే గుణం ఏదంటే, చేతికి చిక్కిందాన్నెల్లా మ్రింగివేసే తీరని భక్ష్యాభక్ష్య క్షుత్తు. ఇంటిలో గాదె పట్లలో వేసిన నాణ్యమైన మేతకంటే, దూరంనుంచి కొల్లగొట్టిన లేదా దొంగిలించిన తిండి అంటేనే ఇష్టపడుట యాహూల ఇంకొక చిత్రగుణం. అన్ని విధాలైన రోగాలు వచ్చేది ఒక్క యాహూలకే. దీనికి ఔషధమేమంటే వాటి పీయ, ఉచ్చ కలిపి కషాయం చేసి వాటి గొంతులో పోయుటే.

గలివరు యాత్రకు పోయిన "మహాకాయుల" ద్వీపం **(Brobdingnag)** రాజు గలివరు దేశపు మనుషులు భూమ్మీద ప్రాకే అసహ్యక్రిములలో నికృష్టతములు అని తన తీర్పును ఇస్తాడు.

స్విఫ్టు మానవుని అఘాపాతకత్వాన్నీ, దౌష్ట్యాన్నీ, అసమతల దర్పణాలతోనూ, సూక్ష్మదర్శినితోనూ, దూరదర్శినితోనూ అనేక కోణాలలో నిశితంగా పరీక్షించినాడు. మైలను భీముని ఖడ్గసృష్టికి ఏమేమికావలెనో అవి స్విఫ్టు రచనకూ కావలెను. స్విఫ్టు తన కాలము నాటికే ప్రబలిన ధన స్వామ్య వ్యవస్థను చిత్రిస్తున్నాడు.

ఆస్తి, ధనశక్తి, దోపిడీ అనే పెట్టుబడిదారీ విధాన లక్షణాల ఖండనే స్విఫ్టు మహాశయుడు చేస్తూన్నది. ఆస్తులు కల్గిన విరామ వర్గంవారి రాకాసితనాన్ని వెబ్లెను, ది థియరీ ఆఫ్ లీషర్‌డ్ క్లాస్ లో మెత్త మెత్తగా మొత్తినాడు.

సైంటు అగస్టీను "దేవరాజ్యం" అనే ఆదర్శక్రైస్తవ అతలం వ్రాసినాడు. అటువంటిదే యాగంటి లక్ష్మప్ప "మావూరు". యాగంటి లక్ష్మప్ప తత్వం పూర్తి పాఠం ఇస్తున్నాను:

"ఏ వూరయ్యా మీదేవూరు - పరబ్రహ్మ నిర్మాణమే మావూరు - కందిమల్లయ పల్లె మావూరు - కాలకర్మలబాపును మావూరు - కనుల యెదుట నుండును మావూరు - అట్లు కనవచ్చు కనరాదు మావూరు - ఇంటిలోపలి పుట్ట మావూరు - పాములంటితే ఫలమిచ్చు మావూరు - కర్మ జీవులకెల్ల మావూరు - అంధకారమై యుండును మావూరు - కర్మలు తెగితేను మావూరు - పండువెన్నెలై యుండును మావూరు - రోగాలు లేవయ్యే మావూరు - నిత్యభోగాలు కలిగుండు మావూరు - కవికానకున్నది మావూరు - ముక్తికారణమై యుండు మావూరు - పాపల నడుమను మావూరు - బట్టబయలై యుండును మావూరు - శృంగారమై యుండు మావూరు - శ్రీరంగమై యుండు మావూరు - తల్లి గోవిందమ్మ మావూరు - తండ్రి వీరబ్రహ్మ మావూరు".

ఇందు ఆధ్యాత్మికతతోబాటు గ్రామం లౌకికాదర్శాలు కల్గినట్లు సూచింపబడుట విశేషం.

సంఘం ఎట్లా నిర్మింపబడవలెననేందుకు రెండు నమూనాలను ఎంపిక చేయవచ్చును. మార్క్సీయ దృక్పథంలోని ఆదర్శ కమ్యూను, పోపరీయ దృక్పథంలోని "క్రమ క్రమ సాంఘిక ఇంజనీరింగు". దిగువ పట్టికలో పైని రెండు విధానాలు పొందు పరుపబడ్డాయి.

అంశం	సమస్యా పరిష్కార పద్ధతి (పోపరు)	ధ్యేయనిర్ణయ పద్ధతి (మార్క్స్)
కాలం	భూతం, వర్తమానం	వర్తమానం, భవిష్యత్తు
తక్షణధ్యేయం	సమస్యానిర్వచనం	లక్ష్యనిర్ణయం
అంతర్గతతత్వం	వర్తమానవ్యవస్థలోని లోపాలను కనిపెట్టుట	ప్రపంచం ఎలావుండవలెనో అనిఅనుకొనుట
రాజకీయ పర్యవసానాలు	స్వేచ్ఛావాదం, విషయాల అందుబాటు, పబ్లిక్ డిబేటు, ప్రభుత్వ విమర్శ	"ప్రణాళిక"నుఅమలులో పెట్టుట. చర్చాబహిష్కారం, వైవిధ్యాన్ని అణచివేయుట
ముగింపు	ప్రస్తుత చెడుగుల నివారణ	భవిష్యత్తులో మంచిది కలుగుట

పైని పట్టిక చూస్తే మొదటి పంథా సంస్కారమనీ, అందు మార్పు క్రమాగతమనీ; రెండవ పంథా విప్లవమనీ, అందు మార్పు హఠాత్సంభవమనీ తెలుస్తుంది.

గురజాడ "దేశభక్తి" గేయంలో మొదటి మార్గం సూచించబడింది. ఉన్నవ "మాలపల్లి" నవలలో తక్కెళ్లపల్లి జగ్గని ద్వారా రెండవమార్గం సూచించబడింది. వాటిని పఠనా సౌకర్యార్థం పూర్తిగా ఇస్తున్నాను.

దేశభక్తి (గురజాడ)

దేశమును ప్రేమించుమన్నా
మంచిఅన్నది పెంచుమన్నా
వట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్

పాడిపంటలు పొంగిపొర్లే
దారిలో నువు పాటుపడవోయ్

తిండికలిగితే కండకలదోయ్
కండకలవాడేను మనిషోయ్

యీసురోమని మనుషులుంటే
దేశమేగతి బాగుపడునోయ్
జల్దుకొని కళలెల్ల నేర్చుకు
దేశి సరుకులు నించవోయ్

అన్నిదేశాల్ క్రమ్మవలెనోయ్
దేశిసరుకుల నమ్మవలెనోయ్
డబ్బు తేలేనట్టి నరులకు
కీర్తిసంపద లబ్బవోయ్

వెనుక చూచిన కార్యమేమోయ్
మంచి గతమున కొంచమేనోయ్
మందగించక ముందు అడుగేయ్
వెనుక పడితే వెనుకేనోయ్

పూను స్పర్ధను విద్యలందే
వైరములు వాణిజ్యమందే
వ్యర్థ కలహం పెంచబోకోయ్
కత్తివైరం కాల్చవోయ్

దేశాభిమానం నాకుకద్దని
వొట్టిగొప్పలు చెప్పుకోకోయ్
పూని యేదైనాను వొక మేల్
కూర్చి జనులకు చూపవోయ్

ఓర్వలేని పిశాచం దేశం
మూల్గులు పీల్చేసెనోయ్
ఒరులమేలుకు సంతసిస్తూ
ఐకమత్యం నేర్చవోయ్

పరులకలిమికి పొర్లి యేడ్చే
పాపికెక్కడ సుఖం కద్దోయ్
ఒకరిమేల్ తనమేలనెంచే
నేర్పరికి మేల్ కొల్లలోయ్

స్వంతలాభం కొంతమ్మానుకు
పొరుగువాడికి తోడుపడవోయ్
దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్

చెట్టపట్టాల్ పట్టుకొని
దేశస్థులంతా నడవవలెనోయ్
అన్నదమ్ములవలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయ్

మతం వేరైతేను యేమోయ్
మనసు వొకటై మనుషులుంటే
జాతమన్నది లేచి పెరిగి
లోకమున రాణించునోయ్

దేశ మనియెడి దొడ్డవృక్షం
ప్రేమలను పూలెత్తవలెనోయ్
నరుల చమటను తడిసి మూలం
ధనం పంటలు పండవలెనోయ్

ఆకులందున అణగి మణిగి
కవిత కోయిల పలుకవలెనోయ్
పలుకులను విని దేశమందభి
మానములు మొలకెత్తవలెనోయ్

పైని గీతంలో థామస్ పెయిన్, బెంథాము, గాంధీ భావాలు ఇమిడి ఉన్నాయి. అహింస, సామరస్యం, వివృత సంఘం దీని లక్షణాలు. ఇక తక్కెళ్ళపల్లి జగ్గని ప్రణాళికను చూస్తాము.

బుర్రకథ (మాలపల్లి)

రామరామ శ్రీరామా రామా - రామా రఘురామా
తక్కెళ్ల జగ్గని ధర్మబోధలు తలపున నిలుపండి
ఆదికాలమున అందరు జనులు అన్నదమ్ములండి
నదులు వనంబులు నానామృగములు నాల్గు సంద్రములు
కొండలు తండలు జలములు పొలములు కుంటలు సెలయేళ్లు
కాయలు పండ్లు పాడిపంటలు ఘనమైయినా సొ యిండ్లు
అంతరువులా భేదము లేక అందరి సొమ్మండి
కుడవాగట్టా సొకరికి బెట్టా కొదవాలేదండి
నానీ భేదములేక లోకము నడుస్తూ వుండేది
మనసు లోపలా చీకు చింతలు మందుకైన లేవు
తొత్తుల దొరల భేదములేని తోడుబంటులండి
అందల మెక్కి మోసే భేదము లసలేలేవండి
ధనికుల పేదల తారతమ్యముల్ తలలు జూపలేదు
అరకువ ఆకలి బాధలప్పుడు అంకురించలేదు
ధనమును గొల్చే దుష్టరోజులు దాపరించలేదు
తిరిపెము కొరకై ధనికుల బీదలు దేవిరించలేదు.

కూటికి గుడ్డకు గుడిసికుంటలు గోడుచెందలేదు
మాపులు రేపులు మలనుల మాడుచు మాలలెండలేదు
భోగ్యము లొక్కట వస్తులొక్కట బొందియుండలేదు
దొరలు మత్తులై నీచభోగముల దొర్లుతుండలేదు
పాటు పడడమె పరువు తక్కువను భ్రాంతిలో పడలేదు
రామరామ .... రఘురామా
తక్కెళ్ల జగ్గని .... నిలపండి.
కృతయుగ మందలి ధర్మములెల్ల క్రిందుమీదు గాక
పాపముతోటి కలియుగమంత పండిపోయెనండి
పాప ధర్మములు లోకమంతట పరిసిపోయెనండి
యెక్కడ జూచిన అర్భాటములె యెక్కడ ఘోషములె
యెక్కడ చూచిన పోటీలండి యెక్కడ కలవరమె
సన్మార్గంబున జీవయాత్రలు సలుపుట దుర్ఘటము
లోకమందున చక్రవర్తియై లోభుడేలుచుండు
లోకమునందలి ద్రవ్యమంతయు లోభుల పరమయ్యె
అంతా నాదే అంతా నాదే అందురు జనులండి
అంతా మనదే యనెడి రోజులు అంతరించెనండి
పరువిడు కాకులు యిండ్ల మీదుగా పారవెరచుచుండు
యెంగిలి చేయీ కాకులవైపు విసరదు యిల్లాలు
నారాయణమ్మలు యిల్లెయంటు నడుతురు యింటింట
యెవరో కొందరు అరువు కొందురు యెల్లద్రవ్యములను
కోటికొక్కరై వున్నారండి కోటీశ్వరుడంటు
కుచేలులందరు అయినారండి కోట్లకొలదిగాను
కోటీశ్వరులకు నిష్టిబిడ్డలు కోట్లకు కర్తలట
మనుమలె గాదూ ఎనంతరాబా మారుహక్కులంట
అరువు జెప్పితె అడ్డగాలి పనికి పాతికెంట
రామరామ .... రఘురామా
తక్కెడ జగ్గని ధర్మశాస్నముల్ తలచి బ్రతుకరండి
ధనికులు బొర్రలు నింపుకొందురు తలప రొకరిబాగు
చేతుల వేళ్ళ పనులు ముట్టక చెడి సోమరులైరి
కాలిమీదనె కాలువేసుకొని కాలం బుచ్చేరు
భాగ్యవంతులకు బీదలెల్లరు బానిసలైనారు
పొద్దుగూకులు చాకిరిచేస్తురు బొక్కెడికూటికిగా
యెంతచేసినా తృప్తిలేదయా యజమానులకెల్ల
రోగంరానీ నొప్పిరానీ నాగా దప్పదయా
కూలికి విలువగలదని మీరు గుట్టుదెలుసుకొండి
కూలికి దగిన విలువ బుచ్చుకొనే కూలికి మరిపోండి
నీళ్ళ నాలికి వొప్పుకుంటిరా నెనరు జెరుపుకొందురి
ప వాండ్లందరు యేకమైతిరా ప్రపంచమె మీది
ఐకమత్యమె అన్ని పనులకు ఆధారము సుండి
శ్రేణులు గట్టిసమ్మెగట్టితే చెల్లును మీ మాట
కొట్టావద్దు తిట్టావద్దు కోర్కెలు నిడివేరున్
అసహాయ యోగము తరుణము జూచి అవలంబించండి
దానికి మిగిలిన మంత్రితంత్రముల్ ధరలో లేవండి
శంకలు దక్కి మీరెల్లరు శపథము జేయండి
సమతాధర్మం ప్రపంచమందున స్థాపింతురుగాని
కృతయుగధర్మం లోకమంతటా కుదుటబెట్టగలరు
రామరామ ... ... రఘురామా

ఇందులో మహాభారతంలోని భావాలు, చారిత్రక భౌతిక వాదం, మార్క్స్ శ్రమాధిక మూల్యము, కమ్యూనిస్టు మేనిఫెస్టో లోని "ప్రపంచంలోని పనివారలారా ఏకం కండి" మొదలైన అంశాలున్నాయి.

ఇంతకన్నా స్పష్టంగా వెంకటదాసు, పురపు జగ్గని విచారణలో ఉన్నవ, ప్రిణాళికను విశదీకరిస్తాడు. ఇప్పుడు "మాలపల్లి" నుండి పూర్తిపాఠం ఇస్తున్నాను. కోర్టువారికి, జగ్గనికి జరిగిన సంవాదమిది. ఇందులో జగ్గని వాఙ్మూలం సోక్రటీసు న్యాయమూర్తులను ఎద్దేవా చేస్తూ చేసిన "అపాలజీ" వలెనూ, గోర్కీ "అమ్మ" 1907 అనే నవలలో పావెల్ కోర్టువారి ఎదుట ఇచ్చిన స్టేట్‌మెంట్ వలెనూ, 1970 లలో శ్రీలంకలో, విచారణ సంఘం ఎదుట విప్లవవాది రోహణ విజయవీర ఇచ్చిన వాఙ్మూలం వలెనూ అన్ని కాలాల్లోనూ ప్రతిధ్వనించేదిగా ఉంది. ఇకమూలం అనుసరిస్తాము.

"వెం: వెంకటదాసే నాపేరు. మధ్యవచ్చిన పేరు మధ్యనే పోనియ్యండి – ఆలోచించుకుంటే నా చరిత్ర యావత్తూ లోకానికి రజ్జుసర్ప భ్రాంతిగా ఉండకపోదు.

కో: వేదాంతివి కూడానా ?

వెం: వేదాలను అంతమొందించేవాడని ఆమాట అర్థమిచ్చేటట్టయితే వేదాంతినే

కో: వేదాలనే అంతం చేస్తావా ?

వెం: లోక కంటకములయిన ధర్మాలందులో ఉంటేవాటిని.

కో: సాక్ష్యమంతా విన్నావుకదా, ఏమి చెపుతావు ?

వెం: సాక్ష్యమంతా నిజమే. కొన్ని కొత్త సంగతులు చెప్పుకోవలసి ఉన్నవి. ఉత్తరువు దయ చేయిస్తే చెబుతాను.

కో: దేనిని గురించి?

వెం: ఫిర్యాదీ, ఇండియా చక్రవర్తి, నే జేసినవి దొంగతనా లంటాడు. నే కాదంటాను. ఆ సందర్భంలో నే జెప్పేది సాకల్యంగా వ్రాసుకోవలసిందని నా కోరిక.

కో: చెప్పుకోవచ్చు. యావత్తూ వ్రాస్తాను.

వెం: సృష్ట్యాదిన హక్కుస్వత్వాలు లేవు. జనులు సోదర భావంతో భూదేవి యిచ్చిన పంటను అశ్వస్తనిక భావంతో అందరూ అనుభవిస్తూ ఉండేవారు. గ్రామంలో నిలువ చేసిన ధాన్యాల పాతళ్ళు, గాదెలు, కొట్లు, గ్రామ సంఘాలు గ్రామ సమూహ మునకై ఉపయోగిస్తూ వుండే వాండ్లు. జనులందరికీ సంఘ సేవ తప్ప రెండవ సేవ లేదు. ఆహార పదార్థాలే ద్రవ్యం. ధనకాంక్ష పుట్టలేదు. వెండి, బంగారు పెంకుల కింకా విలువ లేదు. అహో రాత్రాలు వాటిని కాపాడే కాలం కాదు. అంతా పని చేసుకుండే వాండ్లు. ఆరోగ్యవంతులై అనుభవించే వాండ్లు. ఆ రోజులలో సంపాదన అనుభవించడంకోసం గాని దాచుకొని కాపాడడం కోసం కాదు. మనసుకు తృప్తి వుండేది. వ్యాకులమూ, తొందరా, పోటీలు లేవు. నిర్మల మనస్కులై ఆనందమనుభవిస్తూ వుండే వాండ్లు. అందరూ భాగ్యవంతులే. దారిద్ర్యమే లేదు. స్వర్గం భూమి మీదనే ఉండేది. ఇట్లా వుండగా ఈశ్వరుడు వచ్చి ప్రపంచ మంతా నాదన్నాడు. నేను గొప్ప వాడిని గనుక నాకు మీరంతా సేవ చెయ్యండన్నాడు. తనకు మేడలు కట్టమన్నాడు. తనను రథ మెక్కించి మొయ్యమన్నాడు. ఈశ్వరుడి ఐశ్వర్యం చూచి చిన్న దేవుళ్లు బయలుదేరారు. త్రిమూర్తులమన్నారు. దిక్పాలకులమన్నారు. ఇదివరకు మా గణితం ముప్పైమూడు కోట్లన్నారు. ఇంకా పెరిగింది. గ్రామ దేవతలూ, గృహదేవతలు కూడా పుట్టారు. జనుల సంఖ్య కంటే దేవతల సంఖ్య ఎక్కువైంది. కొలువులు సాగినవి. వాండ్లను జూచి కొందరు జనులకు కూడా నోళ్లూరినవి. గురువులు మా దేవతలమని బయలు దేరారు. పుడమి దయ్యాలై ఐశ్వర్య వంతులు పుట్టారు. యథాశక్తిగా దేశాలు, గ్రామాలూ, క్షేత్రాలు, ధన ధాన్యాలు ఆక్రమించుకొన్నారు. మనుష్యులను బానిసలు చేసి, ప్రభుత్వమిచ్చి వారిమీద సైతం స్వామ్యం సంపాదించారు. పోటీ దారు లెక్కువ గావడంచేత గావాలె, ఈశ్వరుడు స్వర్గాన్ని హరించి భూమి మీద నుంచి యెత్తుకొనిపోయి యెక్కడనో పెట్టుకున్నాడు. స్వర్గం భూదేవతలకూ, ధనికులకు కూడా దూరమే అయ్యింది. ఎవరైనా అక్కడి కడుగు పెట్టగలరుగాని వీండ్లకు సాధ్యం కాదు. ఇది తెలిసి ఐశ్వర్య వంతులు తక్కినవన్నీ అనుభవిస్తున్నారు. స్వర్గం భూలోకం విడువంగనే నరకమూ, దుఃఖమూ, అత్యాశా, అతృప్తి, లోభమూ, దారిద్ర్యమూ వస్తులూ అతిశయించినవి.

ఇసుక మేట వేసినట్టు ధనం యేకొద్దిమంది దగ్గరనో చేరింది. ఒక చోట పల్లం చేస్తేనే గాని వేరొక చోట మెట్ట యేర్పడదు. భూమి కుంగి చెరువయితే ప్రక్కన కొండ ఒకటి పైకుబుకుతుంది. ఒక ద్వీపం మణిగి వేరొక ద్వీప మేర్పడుతుంది. అశేష జనులూ దరిద్రులై యెవరో కొందరు భాగ్యవంతులయినారు. భాగ్యవంతు లకే భాగ్యం. దరిద్రులకే దారిద్ర్యం నిలకడయింది. రెండూ పెంపు గూడా అవుతున్నవి. సమర్థులయి ఇతరుల ధన మపహ రించిన వారికే గాక, అప్రయోజకులయిన వారి సంతానానికే వార సత్వ ప్రకారం రావలసిందని చట్టాలు చేసుకొన్నారు. కష్టపడి, పంటలు పండించి, చేతిపనులు చేసి అమర్చిన పదార్థమంతా ధన వంతులపహరించి, తిని, తొక్కి, తొంబాడి, శ్రమపడి పనిచేసే వాండ్లకు ఆహారం లేకుండా చేస్తున్నారు. వీటికనుకూలంగా చట్టాలు కూడ చేసుకొన్నారు. భాగ్యవంతులు బీదలను దోచుకుంటే దాని పేరు వ్యవహారం. బీదలు తమ హక్కును తీసుకుంటే చౌర్యం. బీదల దగ్గరనుంచి మోసంచేసి ఆకర్షించిన ధనం మరల బీదలు లాక్కుంటే యెట్లా తప్పయిందో కోర్టువారు నిర్ధారణ చేయగోరు తున్నాను. ఇటువంటి ఆక్రమచట్టాల ఔరస సంతానమే బీదల నేరాలు. అశాస్త్రీయ చౌర్యములకంటె, శాస్త్రీయ చౌర్యములే లోకాని కెక్కువ హాని చేస్తున్నవి. భాగ్యవంతులకుపయోగించేది చట్ట సమ్మతం. కానిది నేరం. భాగ్యవంతుల ప్రాణానికి విలువ యెక్కువ. బీదవానికంటే భాగ్యవంతుని కునకమే అతిశయం. బీదలోడ్చిన చమటా, రక్తము కరుడుగట్టి ధనికుని భాగ్యం అవు తుంది. కానీ యిది భాగ్యవంతు డంగీకరించడు. భాగ్యవంతుడు పేదవానికెంత అవసరమో, పేదవాడు భాగ్యవంతునకంత అవ సరం. కాని భాగ్యవంతుడది గుర్తించడు. బీదవాండ్లను భాగ్య వంతుల క్షేమానికి భగవంతుడు సృష్టించాడనే వాండ్ల నమ్మకం. అంతకు తప్ప బీదల జన్మలు ప్రయోజనకారులు గావు. అందువల్ల భాగ్యవంతుల కుపయోగపడని బీదవాండ్లుండ నవసరం లేదు. ఇది కలియుగ ధర్మం. మతకర్తల బోధలు, వారి అనుచరుల కక్కర లేదు. వారి ధర్మానికనుగుణమయిన కృతయుగ ధర్మాలను పునరుద్ధ రించ వలెనని నా ప్రయత్నము. కలియుగములో రాక్షసులు లేరం టారు. గాని ధనికులే కలియుగరాక్షసులు. మా సంతానుల చర్యవల్ల ధనికుల భారం తగ్గుతుంది. బీదలకు సుఖం కలుగుతుంది. దేశ మాత ప్రసాదించగల సౌఖ్యాలు ఆమె సంతానమంతా సమానంగా అనుభవించదాని కవకాశం గలిగి ఇహమే స్వర్గమవుతుంది. దేవ రాజ్యం భూమి మీద తిరిగి పునస్థాపితం కావడమే నా పరమావధి. నా పరమావధే నా దేవుడు. దానిని పొందడమే నా కానందం.

కో: ధనధాన్యాలు, సుఖదుఃఖాలూ పూర్వజన్మ కర్మల వల్ల మానవులకు లభింపవా? తక్కువ నోములు నోచి ఎక్కువ కోరికలు కోరితే యేమి ప్రయోజనం?

వెం: పూర్వజన్మల కర్మలవల్లనే లభిస్తవనుకోండి. భాగ్యవంతులకు ప్రాప్తముండేవారు బీదల ధనాన్ని అపహరించారు. ఇప్పుడూ పూర్వజన్మ కర్మఫలం చేతనే బీదలు తమ న్యాయార్జితాన్ని తిరిగి పొందుతున్నారు.

కో: అయితే సంతానులు శిక్షింపబడుతున్నారు గదా?

వెం: అవును. భాగ్యవంతుల జాటు సాగినంతవరకు శిక్షింపబడుతూనే ఉంటారు. భాగ్యవంతులు తమ వర్తనను మార్చుకోకపోతే బీదలే చట్టాలు మార్చి లోకంలో భూతల స్వర్గం స్థాపిస్తారు. ఈ ధర్మం నెరవేరడానికి దయాసత్య శౌచాలు సాధనంగా తీసుకొంటాం. నా హయాంలో జరిగిన ఒక్క బందిపోటులో కూడా హత్యలు జరుగలేదు. నా అనుచరులు మద్యపానం, వ్యభిచారం విడిచిపెట్టినారు. నాది హృదయ రాజ్యం. నా రాజ్యం నశించదు. నే పోయిన తరువాత గూడా అది నిలిచే ఉంటుంది. జనుల హృదయ పీఠాలలో నా సింహాసనం నిలిపాను. నా ధర్మాలు అమలులోకి రాకతప్పవు. పాలనా పద్ధతులు అవసరాన్ని బట్టి మారుతుంటవి.

కో: ముగించావా?

వెం: ముగించినట్టే.5 ఆయాసంగా వుంది. ఇప్పటికే గ్రంథం పెరిగింది".

వెంకటదాసు సాక్ష్యంలో మహాభారతంలో భీష్ముడు ధర్మరాజుకు చెప్పిన భావాలు, బైబిలు భావాలు, టాల్‌స్టాయ్ చిన్నకథ "ఇవను మూర్ఖుడు" లోని భావాలూ, మార్క్సిస్టు ధోరణి, అక్టోబరు విప్లవం (బోల్షివిక్ విప్లవం) ప్రభావం. "రామరాజ్య" భావబీజాలూ వున్నాయి. వర్గ విరోధ తత్వం వుంది. కర్మసిద్ధాంతమూ వుంది. ఇదంతా తత్వ సాంకర్యం. ఉన్నవ వ్రాసిన కాలులో బెంగాలులో కుపిత యువకులు హింసాత్మక ఉద్యమం నడుపుతూ వుండేది. టాగూరు "నాల్గు అధ్యాయాలు", శరచ్చంద్ర చటర్జీ "పాదేర్‌దాబి" (ఇవి బెంగాలు యువకులు విప్లవ చర్యలను వర్ణించే గ్రంథాలు) లు వెలువడిన కాలం. "మాలపల్లి"లోని వ్యవస్థా విశ్లేషణ శాస్త్రీయంగా లేదు. చాతుర్వర్ణ్యములతోడి మతం క్షీణిస్తున్నదే అనే బెంగ తప్ప, ఈ సంఘం ఎందుకు క్షీణిస్తున్నదన్న ఆలోచన లేదు.

పాశ్చాత్య ప్రభావం వల్ల అనే వాదం వుంది. పాశ్చాత్య ప్రభావం వల్ల సంఘం ఏల చెడిపోవలెననే ప్రశ్నకు విశ్వనాథ దగ్గర జవాబు లేదు. కాలం మార్పు తెస్తుంది. దాని ప్రతికారం పోవలె అనే పురాతనుల తెలివిడినైనా విశ్వనాథ కనబరచలేదు.

అధోజ్ఞాపికలు

1. ముండక, ఛాందోగ్య ఉపనిషదులు.

2. గురజాడ కథ "పెద్దమసీదు"

3. మధురాంతకం రాజారాం కథ "చెలమనీరు"

4. నన్నయ పద్యపాదం ఎంత చక్కగా మార్చబడగలదో చూడండి:

5. వెంకటదాసు జనుల్లో ధనాశ ప్రబలి భాగ్యవంతులు బీదవారు అని రెండు వర్గాలయినాయి అంటాడు. భీష్ముడు కూడా (చూ. తరువాత) ప్రలోభం వలన జనం ధనం పోగు చేసికొన ప్రారంభించినారు అంటాడు. మానవ నైజం గమనిస్తే దానికి బంగారం మీద ఎక్కువ మోజు అని స్పష్టం కాగలదు. "సర్వేజనాః కాంచన మాశ్రయంతి" అని కదా నానుడి! ఆథెన్సు నగరంలోని శ్రీమంతుడు టైమన్. అతిథి సత్కారాలు చేస్తూ (వీరేశలింగం "రాజశేఖర చరిత్ర" లోని రాజశేఖరుడూ ఇట్టివాడే) వున్నదంతా పోగొట్టుకొని బుక్కా ఫకీరవుతాడు. ఒక గుహలో దాగుకొని వుంటాడు. ఒకనాడు నేలను త్రవ్వుతుంటాడు. బంగారం కనపడినట్లవుతుంది. అప్పుడు టైమను కాంచన విలాసం మీద చేసిన "స్వగతం" అర్థశాస్త్రంలో శాశ్వతస్థాన మాక్రమించింది. బంగారాన్ని "మానవాళి సమష్టిగణిక" అంటాడు టైమన్. పైగా రచన షేక్సుపియరుదాయె. టైమను ఉపన్యాసాన్ని మార్క్సు కూడా తన రచనలో ఉద్ధరించుకొన్నాడు. [సశేషం]

శ్రీ శ్రీ - స్వర్గం

శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి

ఆకాశంలో విహంగాలను
భూలోకం సారంగాలకు
బ్రెయిన్ గన్ చూపి చూపి
తరలించిన జగజెట్టీ....శ్రీశ్రీ....

2

అనియమం భాషలో
అనాచారం జీవికలో
అరాజకం భావంలో
పూరించెను నీ విప్లవ శంఖం.

3

నా దండటి తీరు కాదు
మీద గుప్పె డుండెద నని
ఎత్తున కెత్తుగ, మఱి, గ
మ్మత్తు లెన్నొ చేసినావు.

4

పొగడినారు కొందఱు నిను
తెగడినారు మఱి కొందఱు
పొగడికలును తెగడికలును
నగలయ్యెను నీ కంఠము.

5

అసలు కొంత ప్రతిభ కలదు
కొసరుగా నుద్రేక ముండె
మిశ్రీ యై నీ కవితకు
శ్రీశ్రీ గుర్తింపు వచ్చె.

6

అగ్ని గోళముల నుమిసెడి
అంగారక గ్రహము రీతి
అహరహమును క్రక్కినావు
ఆకలి మంటలను నీవు.

7

కాలపు పెను గుండంలో
కాలిపోతి వొక సమిధగ
పూరా అర్ధ శతాబ్దం
జారీ చేసియు వాక్కుల.

8

అస్థానము జన్మించితి, వా
స్థానము లేదు - మహా
ప్రస్థానము వ్రాసి, మహా
ప్రస్థానమె చేరుకొంటి.

9

కవిగా నా శుభ చింతన
నాకంలోనే యుండగ
తిరిగి పుట్టవలసిన యీ
దేశంలోనే పుట్టుకు.

శ్రీ గోపాలకృష్ణ అబ్బూరి

శ్రీ తాళ్లపాక పెదతిరుమలాచార్యుల కేశవనామ సంకీర్తనలు

శ్రీ తాళ్లపాక పద కవిత్రయంలో రెండవవాడూ పద కవితా పితామహుడైన అన్నమాచార్యుల 'చనవరి సుతుడూ', శ్రీమద్వేద మార్గ ప్రతిష్ఠాపనాచార్య, శ్రీ రామానుజ సిద్ధాంత స్థాపనాచార్య, కవి తార్కిక కేసరి, శరణాగత వజ్ర పంజరాది బిరుదులు వహించిన శ్రీ తాళ్లపాక పెద తిరుమలాచార్యులు, తండ్రి తన అవసాన దశలో "దినమొక సంకీర్తన శ్రీ వేంకటేశ్వరునకు అంకితం చేసి చెప్పమనగాను" సంకీర్తన రచనకు పూనుకొని, చక్కని కవితా శక్తితో రచించి తండ్రికి తగిన కొడుకుగా నిరూపించుకొన్నాడు. ఈ విషయంలో ఆయన తన తండ్రి రచనలనే మేలు బంతిగా స్వీకరించాడు.

తాళ్లపాక వారి సంకీర్తనలన్నీ రెండు వర్గాలుగా ఆధ్యాత్మ, శృంగార సంకీర్తనలుగా ప్రసిద్ధిచెంది వున్నాయి. అయితే ఈ విభజన స్థూలమైనదే. సూక్ష్మంగా పరిశీలించినట్లయితే మరింత అర్థవంతంగా వర్గీకరించడానికి ఆస్కారం వుంది. అప్పుడు పద కవితా పరిణామాన్నీ, సంకీర్తన రచనా కాలాన్నీ, ప్రేరేపణలనూ అంచనా వేయడానికి అవకాశం కలుగుతుంది. ఆ ప్రయత్నానికి నాందిగా ఈ వ్యాస రచనకు ఉపక్రమించడం జరిగింది.

కర్ణాటక వాగ్గేయకారుడు శ్రీ పురందరదాసు తాళ్లపాక వారితో ప్రత్యక్ష సంబంధం కలిగి వున్నవాడు. ఆయన రచనలలో అధిక భాగం "దేవర నామా"లుగా కన్నడంలో వ్యవహృతమౌతున్నాయి. ఆ "దేవర నామా" లతో పోల్చదగిన తాళ్ళపాకవారి కృతులు స్వల్పమే. అయితే 'దేవరనామ' ప్రక్రియ కేవలం నామస్మరణే ప్రధానోద్దేశంగా కలది కనక వస్తు వైవిధ్యం అంతగా కనిపించదు. తాళ్ళపాక వారి సంకీర్తనలలో సమకాలీన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు తమ ప్రభావం చూపి భావ వైశాల్యాన్ని కలిగించాయి.

పెద తిరుమలాచార్యుల రచనలను పరిశీలిస్తున్నప్పుడు హరినామ స్మరణే ప్రధానంగా కనిపించే కొన్ని సంకీర్తనలను గుర్తించడం జరిగింది. సూక్ష్మ పరిశీలనలో ఈ రచనలను ఆయన వొక ప్రణాళిక ప్రకారం రచించారని వ్యక్తమౌతోంది. ఆయన తన నీతి సీస పద్య శతకంలోని ఆఖరి పద్యంలో

"మాధవ గోవింద మధుసూదనాచ్యుత
వామన ప్రద్యుమ్న వాసుదేవ
కృష్ణ దామోదర కేశవ శ్రీధర
హరి విష్ణు పురుషోత్తమానిరుద్ధ
సంకర్షణాధోక్షజ త్రివిక్రమ పద్మ
నాభ జనార్దన నారసింహ
శౌరి హృషీకేశ నారాయణోపేంద్ర
తాలాంక ముఖనామ తాళ్ళపాక
యన్నయాచార్య సుత తిమ్మయాహ్వయుండ
బ్రణుతి జేసితి రహిఁగొమ్ము పద్యశతము
కలిత లక్ష్మీశ సర్వ జగన్నివేశ,
విమల రవికోటి సంకాశ వేంకటేశ !"[1]

అంటూ విష్ణు నామాలను స్మరిస్తూ ముగించాడు. ఇందులో స్మరించిన మొత్తం ఇరవై అయిదు విష్ణు నామాలలో వొక్క శౌరి అన్న నామం తప్ప మిగిలిన యిరవై నాలుగు నామాలూ కేశవ నామాలుగా వ్యవహృతమౌతూ, సంధ్యావందన సమయంలో ఆచమన సందర్భంలో పఠించే నామాలుగా గుర్తించవచ్చు. అయితే సీస పద్య రచనలో గల పరిమితులవల్ల ఈ నామాలను సరియైన వరసలో చెప్పడం కుదరలేదు.

సంధ్యావందన సమయంలో పఠించే నామక్రమం ఇదీ—[2]

1) కేశవ 2) నారాయణ 3) మాధవ 4) గోవింద 5) విష్ణు 6) మధుసూదన 7) త్రివిక్రమ 8) వామన 9) శ్రీధర 10) హృషీకేశ 11) పద్మనాభ 12) దామోదర 13) సంకర్షణ 14) వాసుదేవ 15) ప్రద్యుమ్న 16) అనిరుద్ధ 17) పురుషోత్తమ 18) అధోక్షజ 19) నారసింహ 20) అచ్యుత 21) జనార్దన 22) ఉపేంద్ర 23) హరి 24) శ్రీకృష్ణ.

పెదతిరుమలా చార్యులవారి అధ్యాత్మ సంకీర్తనలలో 29 రేకులో నాలుగో పాట—

బౌళి

పల్లవి॥

మచ్చ కూర్మ వరాహ మనుష్య సింహ వామనా
యిచ్చ రామ రామ రామ హిత బుద్ధి కలికి

చరణం॥ నన్నుఁ గావు కేశవ నారాయణ మాధవ
మన్నించు గోవింద విష్ణు మధుసూదన
వన్నెల త్రివిక్రమ వామనా శ్రీధరా
సన్నుతించే హృషికేశ సారెకు పద్మనాభ ॥మచ్చ॥

కంటిమి దామోదర సంకరుషణ వాసుదేవ
అంటేజాలు ప్రద్యుమ్నుఁడా అనిరుద్ధుఁడా
తొంటే పురుషోత్తమ అధోక్షజ నారసింహామా
జంట వాయకు మచ్యుత జనార్దన ॥మచ్చ॥

మొక్కేము వుపేంద్ర హరి మోహన కృష్ణరాయ
యెక్కితి శ్రీ వేంకట మిందిరానాధ
యిక్కువ నీ నామములు యివియే నా జపములు
చక్కఁగా నీ దాసులము సర్వేశ అనంత ॥మచ్చ॥[3]

ఈ సంకీర్తనలో పల్లవిని వదిలిచూస్తే మొదటి రెండు చరణాల్లోనూ, మూడవ చరణం మొదటి పాదంలోనూ వున్న కేశవ నామాలు సరైన క్రమంలో వున్నాయి. పెదతిరుమలాచార్యులు ఈ క్రమంలోనే సంకీర్తన రచనకు ఉపక్రమిస్తూ మొదటగా ఈ సంకీర్తనను చెప్పి ఉంటాడు. ఈ యిరవైనాలుగు కేశవ నామాలకు సంకీర్తనలను అదే క్రమంలో చెప్పారనే సంగతి రేకుల సంఖ్యనూ పాటల సంఖ్యలనూ పరిశీలిస్తే వ్యక్తంకాగలదు. పెద తిరుమలాచార్యుల అధ్యాత్మ సంకీర్తనల రేకులలో కనిపించే క్రమం ఇదీ—[4]

రేకు సంఖ్య	పాట సంఖ్య	నామం
20	5	హరి
39	6	నారాయణ
41	3	కేశవ
	6	మాధవ
42	2	అచ్యుత
	3	జనార్దన
43	1	గోవింద
	2	విష్ణు
	3	మధుసూదన
	4	త్రివిక్రమ
	5	వామన
	6	శ్రీధర
	7	హృషీకేశ
44	1	పద్మనాభ
	2	దామోదర
	3	వాసుదేవ
	4	ప్రద్యుమ్న
	5	అనిరుద్ధ
	6	పురుషోత్తమ
45	1	అధోక్షజ
	2	నరసింహ

ఈ పట్టికను పరిశీలించినపుడు 43, 44, 45, రేకుల్లోని నామ సంకీర్తనలు (44 వ రేకులో ఉండవలసిన సంకర్షణ నామం తప్పించి) సంధ్యావందన క్రమాన్నే పాటించడం గమనార్హం. అంటే పదిహేను నామాలు. వొక్క సంకర్షణ నామం తప్పించి (పైన పేర్కొన్న కేశవ నామాలలో 13 వ సంఖ్యది) సరైన వరస లోనే వున్నాయన్నమాట. దీనిని బట్టి సంకీర్తనలన్నీ సరైన క్రమంలోనే రాసినా రాసి రేకులమీది కెక్కించడంలో క్రమం తప్పినట్టు గ్రహించవచ్చు. అచ్యుత, జనార్దన నామాలు ఈ పద్ధతి ప్రకారం 45 వ రేకు తరవాత రావలసినవి 42 వ రేకులోనే చోటు చేసుకున్నాయి. 41 వ రేకులోని మాధవ, కేశవ నామాలు సక్రమమైన వరసలో లేవు. హరి, నారాయణ నామాలు 20, 39 రేకుల్లో చెరొక చోటా సర్దుకున్నాయి. అయితే ఇవన్నీ అధ్యాత్మ కీర్తనల రేకులుగా లెక్కలో వున్నాయి. వొక్క సంకీర్తన తప్పించి నిజానికి ఇవన్నీ శృంగార సంకీర్తనలే. అయితే పై పట్టికలో కానరాని ఉపేంద్ర, కృష్ణ, సంకరుషణ నామ సంకీర్తనలు శృంగార సంకీర్తనల రేకుల్లోని 39వ రేకులో 3, 5, 6 సంఖ్యలతో కనిపిస్తున్నాయి.[5]

అసలు రేకులు చెక్కడంలోనే అధ్యాత్మ శృంగార సంకీర్తనలుగా వర్గీకరించుకున్నా కూడా, ఆ వర్గీకరణను చెక్కించినవారే సరిగా పాటించడం జరగలేదు. అలాగే ఈ కేశవనామ సంకీర్తనలు కూడా కొంత వరస చెడి కనిపిస్తున్నా, పెద తిరుమలాచార్యుల రచనా ప్రణాళికను వెల్లడిస్తున్నాయన్న సంగతిని గుర్తించక తప్పదు.

ఈ కేశవనామ సంకీర్తనల రచనలో వున్న విశేషం పల్లవిలోనూ చరణాలలోని ప్రతి పాదాంతానా ఇరవై నాలుగు నామాల్లోని ఏదో వొక నామం మాత్రమే సంబోధన రూపంలో వస్తూ వుంటుంది. వివిధ రాగ తాళాలలో రచితమైనప్పటికీ ఈ లక్షణాలు వొకే వొక్క సంకీర్తనలో తప్ప మరెక్కడా తప్పలేదు. 20 వ రేకులోని 5 వ పాట హరి నామాన్ని స్మరించిన సంకీర్తన మిగిలిన సంకీర్తనలకన్నా భిన్నంగా వున్నది. ఈ సంకీర్తనలో రెండు పాదాల పల్లవీ, మూడు పాదాలు మాత్రమే గల రెండు చరణాలూ ఆఖరి చరణంలో నాలుగు పాదాలూ వున్నాయి. పాద మధ్యంలోనూ పాదాంతంలోనూ కూడా హరి నామం పునరావృత మౌతున్నది. ఈ సంకీర్తనకూ మిగిలిన కేశవ నామ సంకీర్తనలకూ తేడా యిది వొకటే కాదు. మిగిలిన సంకీర్తనలన్నీ శృంగార సంకీర్తనలు కాగా యిదొక్కటే పూర్తిగా ఆధ్యాత్మికమైనది.

పల్లవి॥ ఇతని చందము హరి హరి
యేమి చెప్పఁగొలది హరి హరి
అతి రహస్యముల హరి హరి
అదిగో మనకుఁ జిక్కె హరి హరి

చరణం॥ అది విష్ణుడితడు హరి హరి
అదె యశోద కొడుకు హరి హరి
వేదమూర్తి ఇతఁడె హరి హరి
వెన్న దొంగిలించె హరి హరి
సాదు బండి విఱిచె హరి హరి
చంటి విషము చెరిచె హరి హరి ॥ఇతని॥6

(వ్యాస విస్తర భీతివల్ల పూర్తిగా ఉదహరించలేదు.)

పల్లవిలోనూ చరణాలలోని ప్రతి పాదాంతాన ఒక విష్ణు నామాన్నో కాకపోతే క్షేత్ర నామాన్నో నిలుపుతూ అన్నమాచార్యుల రచనలూ వున్నాయి.

"ఆనంద నిలయా ప్రహ్లాద వరదా
భాను శశి నేత్ర జయ ప్రహ్లాద వరదా"7

"నగుమోము తోడి వో నరకేసరి
నగ రూప గరుడాద్రి నరకేసరి"8

అనాది జగమున కౌభళము
అనేకాద్భుతం బౌభళము"9

కేశవ నామ సంకీర్తనల రచనలో అన్నమాచార్యులు రచించిన సంకీర్తనలే పెద తిరుమలాచార్యుడికి ఉత్తేజాన్నిచ్చి వుంటాయని ఊహించడంలో తప్పులేదు. అన్నమయ్య రచనలేవీ ఏదో ప్రణాళిక ప్రకారం చేసినవి కావు. ఏ క్షణంలో ఆయన్ని ఏ భావం కదిలిస్తే ఆ భావంతోనే ఆ ఉద్వేగంతోనే సంకీర్తనలు పాడుకుంటూ పోయాడు. నిజానికి శృంగార, అధ్యాత్మ సంకీర్తనలన్న విభాగాన్ని ఆయన తరువాతి వారు చేశారేమోనన్న అనుమానం కలగకపోదు. పద కవితా ప్రక్రియలో నూతన ప్రయోగాలు ఆయన చేసినంతగా మరెవరూ చేయలేక పోయారు. ఆయన్ని అనుకరించడమే తరువాతి వారు చేసింది.

అదీగాక అన్నమయ్యకు సంధ్యావందనం మీద అట్టే శ్రద్ధ వున్నట్టు కనిపించదు కూడా. ఈ సంకీర్తనను చూడండి—

పల్లవి॥ సహజ వైష్ణవాచార్య వర్తనుల
సహవాసమె మా సంధ్య

చరణం॥ అతిశయమగు శ్రీహరి సంకీర్తన
సతతంబును మా సంధ్య
మతి రామానుజ మతమె మాకును
చతురత మెరసిన సంధ్య. ॥సహజ॥10

అలాగే తీర్థస్నానాల మీద కూడా అన్నమయ్యకు అట్టే మక్కువ లేదు—

పల్లవి॥ నదులొల్లవు నా స్నానము
సదరము నాకీ స్నానము

చరణం॥ పరమ భాగవత పాదాంబుజలముల
దరుశనమే నా స్నానము
తిరు వేంకటగిరిదేవ నీ కథా—
స్మరణమే నా స్నానము ॥నదులొల్లవు॥11

మరి తిరుమలాచార్యుల మనస్తత్వమే వేరు. ఆయన బిరుదే "శ్రీమద్వేద మార్గ ప్రతిష్ఠాపనాచార్య" అయినప్పుడు నియమ నిష్ఠల మీద ఆయనకున్న పట్టుదలను సులభంగానే ఊహించుకోవచ్చు.

పెద తిరుమలాచార్యుల వారి సంకీర్తనలను కొంచెం సూక్ష్మంగా పరిశీలిస్తే ఈ కేశవ నామ సంకీర్తనలు ఆయన తొలి సంకీర్తనలని అనుకోక తప్పదేమోననిపిస్తోంది. పెద తిరుమలాచార్యులు మంచి పండితుడు. ఆయన రచనలను చూస్తే— "రేఫ అకార నిర్ణయం" ఆయనలోని వైయ్యాకరుణ్ణీ, నీతి

సీసపద్య శతకమూ, శృంగార వృత్తపద్య శతకమూ, సుదర్శన రగడ, శ్రీ వేంకటేశ్వరోదాహరణమూ, చక్రవాళ మంజరీ మొదలయినవి ఆయనకు సాంప్రదాయిక కవితా రచనలో గల ప్రీతినీ సమర్థతనూ వ్యక్తం చేసేవిగా వున్నాయి. శృంగార అధ్యాత్మ సంకీర్తనలలోకూడా ఎన్నో గడుసు పోకడలుపోయి సుందర కవితా ఖండికలను సృష్టించిన పెద తిరుమలాచార్యులేనా ఈ కేశవ నామ సంకీర్తనలు రాసినది అనిపించేటంత నీరసంగా వున్నాయి కొన్ని.

ఈ నామ సంకీర్తనలలో ప్రతిపాదాంతాన ఏదో వొక కేశవ నామాన్ని సంబోధనగా నిలపడం వలన మిగిలిన పాదభాగం లోనే భావాలను ప్రకటించవలసి రావడం అనివార్యమై కవిస్వేచ్ఛ పరిమితం కావడం తటస్థించింది. కొన్ని సంకీర్తనలు కేవలం రోకటి పాటగా తయారయాయి. చూడండి—

"వరుసలు వెదికేవు వామనా, నీవు
వరుఁడ వెందరికిని వామనా
వరవాత వలపించి వామనా, దే
వరవలె నున్నాఁడవు వామనా" 12

ఇందులో వామన నామం అవతార పరంగా కాక శ్రీ వేంకటేశుని పరంగా మాత్రమే వాడటం వలన వామన నామానికున్న ప్రత్యేకత అంతరించింది. రచన కూడా పేలవమైపోయింది. సంకీర్తనలోని వస్తువుకూ వామన నామానికీ ఏ విధమైన పొందికా లేకపోయింది. కేశవ నామ సంకీర్తనలు రాయ తలపెట్టినప్పుడు అధ్యాత్మ సంకీర్తనలుగా కాక శృంగార సంకీర్తనలుగా రాయడం కూడా ఆశ్చర్యం కలిగించే విషయమే. ఈ ఇరవైనాలుగు కేశవ నామ సంకీర్తనలలోనూ విష్ణువు పేర రచించిన సంకీర్తన చక్కగా వచ్చింది.

"వెట్టి వలపు చల్లకు విష్ణుమూరితి నాతో
వెట్టిదేర మాటాడు విష్ణుమూరితి
. ....
... .
వెలసె నీ సేఁతలెల్లా విష్ణుమూరితి, మా
వెలుపల, లోన నీవె విష్ణుమూరితి
వెలలేని శ్రీ వేంకట విష్ణుమూరితి, కూడి
విలసిల్లితివి నాతో విష్ణుమూరితి" 13

ఈ రచన అధ్యాత్మ, శృంగార సంకీర్తనల శైలులను కలగలుపుకొని ఉదాత్తంగా సాగింది.

ఈయన సంకీర్తనల తొలి రాగి రేకుమీద వున్న శాసనం "శాలివాహన శక వరుషంబులు ౧౪౨౪ అగు నేటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బ॥ ౧౨ మొదలుగాను, తాళ్ళపాక అన్నమాచార్యులుం గారు తమ కొమారుఁడు తిరుమలాచార్యులను దిన మొక సంకీర్తన శ్రీ వేంకటేశ్వరునకు అంకితము చేసి చెప్పు మనఁగాను విన్నపము సేసిన సంకీర్తనలు"14 పై శాసనంలోని తేదీ (క్రీ॥ శ॥ 23 గురువారం, ఫిబ్రవరి 1503) అన్నమాచార్యుల నిర్యాణ దినం. అప్పటిదాకా సంకీర్తనా రచనను వొక మహా తపస్సుగా ఆచరించిన అన్నమయ్య తన తదనంతరం కూడా ఆ మహా కార్యాన్ని కొనసాగించమని పెదతిరుమలా చార్యులను కోరగా అతడు ప్రారంభించినట్లు అర్థం చేసుకోవచ్చు. అంటే ఆయన సంకీర్తన రచనను మిగిలిన రచనలకన్నా చాలా తరువాత ప్రారంభించినట్లు భావించవలసి వస్తోంది. కృత్యాద్యవస్థను అధిగమించడానికి కేశవ నామాలను సంకీర్తన రచనకు ఎన్నుకొని వుంటాడు. తొలి రచనలు కావడం వలన తన కవితా శక్తిని పూర్తిగా ప్రకటించడానికి సంకీర్తన ప్రక్రియ అప్పటికి ఆయనకు పూర్తిగా లొంగి రాలేదనుకోవలసి వస్తుంది. అప్పటిదాకా తనకు అలవాటైన సాంప్రదాయిక కవితా శైలి కూడా కొంతలో కొంత, పద కవితా శైలిగా మారడానికి ఇబ్బంది కలిగించి వుంటుంది.

అయితే పెద తిరుమలాచార్యులు అనతికాలంలోనే ఈ ఇబ్బందులన్నింటినీ అధిగమించి చక్కని సంకీర్తనలను రచించాడు. సాంప్రదాయిక కవిత్వంలోని భావ గాంభీర్యాన్నీ దేశికవిత్వం లోని సారళ్యాన్నీ కలబోసి రచించిన చక్కని కవితాఖండిక లెన్నో ఉన్నాయి. అధ్యాత్మ సంకీర్తనల్లో

"అన్ని పదార్థము లమ్మ నంగళ్ల లోపల
తిన్నఁగా మంచివే కొని తెచ్చుకొన్నట్లు
పన్నినానా ధర్మములు ప్రాణుల కెల్లాఁగలవు
అన్నిటా మంచితనాన కానందించ వలయు" 15

అన్న విశాల దృష్టినే కాక—

"ఒకపరి యీశ్వరుఁడ నౌదును, వూహాపోహలను
ప్రకటపు పట్టణ గోపుర ప్రాకారంబులు సృజింతును,
సకలము భోగించిన వాఁడనౌదు, చవులూరకే కొందును,
అకటా ! అంతలో భిక్షవ కేఁగుదు, హరిఁ గొలిచిన వాడగా
నైతి." 16

అన్న మానవ హృదయ దౌర్బల్యాన్ని మనోహరంగా ప్రకటించిన కవిత్వాన్ని రాశాడు. ఆయన కవిత్వాన్ని గురించి రాయాలంటే వేరే పెద్ద వ్యాసమే రాయవలసి ఉంటుంది.

అన్నమాచార్యుల జనన నిర్యాణ తేదీలు రాగిరేకుల మీద చెక్కించడంలో శ్రద్ధ తీసుకున్నవారు పెద తిరుమలాచార్యుని జనన నిర్యాణ తేదీలను చెక్కించ లేదు. అనాటికి ఆయన ఇంకా సజీవుడుగానే వున్నాడేమో। పెదతిరుమలాచార్యుల జననం నాటికి అన్నమయకు 34 ఏళ్ల వయసు ఉండి ఉండాలి. క్రీ. శ. 1458-60 ప్రాంతాలలో పెద తిరుమలాచార్యులు జన్మించి వుంటాడనే శ్రీ వేటూరి ఆనందమూర్తిగారి భావన సహేతుకంగా వుంది. 17 అంటే అన్నమాచార్యుల అవసాన దశలో పెద తిరుమలయ్య సంకీర్తన రచనను ప్రారంభించే నాటికి 43, 45 సంవత్సరాల ప్రాయపు వయసు వాడై వుండాలి. కేశవనామ సంకీర్తనల రచనా కాలం ఇంచుమించుగా ఆ ప్రాంతాలకే చెంది వుండాలి. ఇది స్వల్పమైన ఆధారాల మీద నడచిన వూహ అయినా ఆయన తదుపరి రచనలను విశ్లేషించి చూస్తే మరికొంత వివరంగా రచనా కాలక్రమణికను నిర్ణయించు కోవడానికి వీలు వుంటుందని భావిస్తున్నాను.

కేశవనామ సంకీర్తనల పల్లవులు — 18

1. కేశవ

"కిందుపడి మొక్కెకుమీ కేశవా
కెందమ్మి రేకుఁ గన్నుల కేశవా"

2. నారాయణ

"నన్ను నిన్ను నెంచుకోవో నారాయణా
అన్నియు నీ చేతినే అదివో నారాయణా"

3. మాధవ

"మా యింటికి రావోయి మాధవా, నీ
మాయలెల్లా గంటిమిదె మాధవా"

4. గోవింద

"కొల్ల వలపులు చల్లే గోవిందరాజ, నిన్ను
గొల్లెతలు నవ్వేరు గోవిందరాజ"

5. విష్ణు

"వెట్టి వలపు చల్లకు విష్ణుమూరితి, నాతో
వెట్టి దేర మాటాడు విష్ణుమూరితి"

6. మధుసూదన

"మానరాని చుట్టమవు మధుసూదనా, నీ
మానిసిఁ జుమ్మీ నేను మధుసూదనా"

7. త్రివిక్రమ

"వేగిరించకంతేసి త్రివిక్రమ
వేగుఁజుక్కె రానీ త్రివిక్రమ"

8. వామన

"వద్దు వద్దు సటలింక వామనా, నీ
వద్దనే వున్నారమిదె వామనా"

9. శ్రీధర

"చెప్పరాని మహిమల శ్రీధరా, నీవు
చెప్పినట్టు చేసేము శ్రీధరా"

10. హృషీకేశ

"ఇద్దరము నిద్దరమె హృషీకేశ
యిద్దె సనకాని వచ్చె హృషీకేశ"

11. పద్మనాభ

"బందుగుడ వన్నిటాను పదుమనాభ, వట్టి
బందెలు గట్టకు మమ్ము పదుమనాభ"

12. దామోదర

"తప్పని బొంకనియట్టి దామోదర, నాకు
దప్పిదేర మోవియ్యవో దామోదర"

13. సంకర్షణ

"సాధించితివి విద్యలు సంకరుషణా, మంచి
సాదువలె సుండే నీవు సంకరుషణా"

14. వాసుదేవ

"వాడిక లాయె నీ పొందు వాసుదేవుడా
వాడుదేరెఁ గెమ్మోవి వాసుదేవుడా"

15. ప్రద్యుమ్న

"పంతము తప్పదు నీకు ప్రద్యుమ్నా, వొక్క
బంతి గూడేవు సతుల ప్రద్యుమ్నా"

16. అనిరుద్ధ

"అంతా నీకులోనే అనిరుద్ధా, మన
యంతరంగ మొక్కటాయె ననిరుద్ధా"

17. పురుషోత్తమ

"పోకు పోకు పంత నీవు పురుషోత్తమా, వట్టి
బూకలు మే మెఱుఁగమా పురుషోత్తమా"

18. అధోక్షజ

"అల్లనాఁడే కంటి వింటి నధోక్షజా
అల్లుకొంటి విని చెలుల నధోక్షజా"

19. నరసింహ

"చిత్తగించు మా మాటలు శ్రీ నరసింహ
చిత్తజ జనకవో శ్రీ నరసింహ"

20. అచ్యుత

"అసలు చెరచకుమీ యచ్యుత
ఆ సుద్దులె యీ సుద్దులు అచ్యుత"

21. జనార్దన

"చతురుఁడ వన్నిటాను జనార్దనా, మమ్ము
సతముగా నేలితివి జనార్దనా"

22. ఉపేంద్ర

"వొద్దివారెల్లా సాక్షి ఉపేంద్రుఁడా మన
వొద్దిక నీ వెఱుఁగవా ఉపేంద్రుఁడా"

23. హరి

"ఇతని చందము హరి హరి యేమి చెప్పఁగొలది హరిహరి
అతి రహస్యముల హరి హరి అదిగొ మనకుఁ జిక్కె
హరి హరి."

24. శ్రీకృష్ణ

"కేరక మాచీర లీవోయి కృష్ణరాయ మేని
గిర లేదవోయి నీకు కృష్ణరాయ"

అ ధో జ్ఞా పి క లు

1. నీతిసీస పద్య శతకము-ఆంధ్రసాహిత్య పరిషత్తు పత్రిక నుండి పునర్ముద్రితం. 1917.
2. ఈ ఇరవై నాలుగు కేశవ నామాలకు ఆధారమేమిటో తెలియ డంలేదు గాని 'రూపమండనమ్' (కలకత్తా ముద్రణ) లోనూ, పద్మ పురాణంలోని పాతాళఖండం లోనూ ఉన్నాయి. (విష్ణువు వొకొక్క రూపంలో ధరించే ఆయుధాల విషయంలో తేడా లున్నాయి.) అంతేకాక పద్మపురాణంలో జనార్దన, ఉపేంద్ర, హరి నామాలు లేనే లేవు. 'రూపమండనమ్' శిల్పశాస్త్ర గ్రంథం.
3. పుట 112. శ్రీ తాళ్లపాకవారి గేయరచనలు. సంపుటం 21. అధ్యాత్మ సంకీర్తనలు పెద తిరుమలాచార్య విరచితములు. పరిష్కర్త డా॥పి. టి. జగన్నాథరావు. తిరుపతి.
4. ఈ పట్టికలోని సంకీర్తనలన్నీ పైన పేర్కొన్న గ్రంథంనుంచే.
5. పుటలు 135, 137. శ్రీ తాళ్లపాకవారి పద సాహిత్యము సంపుటము 23, శృంగార సంకీర్తనములు. పెద తిరుమలా చార్య విరచితములు. పరిష్కర్త డా॥ పి. టి. జగన్నాథరావు. తిరుపతి.
6. పుట 77. అధ్యాత్మ సంకీర్తనలు పెద తిరుమలాచార్య విర చితములు. సంపుటం 21.
7. సంకీర్తన 213. తాళ్లపాకవారి పదసాహిత్యము, సంపుటి 9.
8. సంకీర్తన 421. తాళ్లపాకవారి పదసాహిత్యము. సంపుటం 1. పునర్ముద్రిణ (1980) తాళ్లపాకవారి కృతులు 1935 నుంచీ ఈ నాటికీ కూడా తిక్కిరి బిక్కిరిగానే అచ్చవుతుండడం తెలుగువారి దురదృష్టాలలో వొకటి. ఈ పునర్ముద్రణలో సంకీర్తనల వరుస సంఖ్యను మార్చి వేయడంతో పరి శోధకులు తమ వ్యాసాలలో, గ్రంథాలలో ఈ సంపుటికి మాతృకలైన 5 వ సంపుటం, 6 వ సంపుటం నుంచి ఉదాహ రించి యిచ్చిన సంఖ్యలు నిరుపయోగమైనాయి. పాతసంపు టాలలోని సంఖ్యలను కనీసం కుండలీకరణాల్లో ఇచ్చి వుండ వలసింది.
9. సంకీర్తన 29. తాళ్ళపాకవారి పద సాహిత్యం, సంపుటం 10.
10. సంకీర్తన 10. తాళ్ళపాకవారి పద సాహిత్యము 1వ సంపుటం. పునర్ముద్రిణ.
11. సంకీర్తన 51. పై సంపుటమే.
12. సంకీర్తన 244. అధ్యాత్మ సంకీర్తనలు. పెద తిరుమలా చార్య విరచితములు. సంపుటం 21.
13. సంకీర్తన 211. పై సంపుటమే.
14. సంకీర్తనల మొదటి పుటలు - 21, 22 సంపుటాలు. పెద తిరుమలాచార్య విరచితములు. తొలి రేకుల మీది శాసనాల్లో శృంగార, అధ్యాత్మ సంకీర్తనలన్న విభాగం సూచితం కాక పోవడం గమనార్హం.
15. సంకీర్తన 322, అధ్యాత్మ సంకీర్తనలు. పెదతిరుమలాచార్య విరచితములు.
16. సంకీర్తన 387, పై సంపుటమే.
17. పుటలు 66, 67. తాళ్లపాక కవుల కృతులు, వివిధ సాహితీ ప్రక్రియలు. డా॥ వేటూరి ఆనందమూర్తి.
18. ఈ పల్లవుల పట్టికలో 13, 22 24 సంఖ్యల నామాలైన సంకర్షణ, ఉపేంద్ర, శ్రీకృష్ణ నామాలున్న సంకీర్తనలు పెద తిరుమలాచార్య రచితాలైన శృంగార సంకీర్తనల సంపుటం 23 లోవి. మిగిలిన సంకీర్తనలు 21 సంపుటంలోనివి.

—✲—

చూపు నిలిపి క్షణం

నది
వేగంగా ప్రవహించనిది
ఆగనిది
మెత్తగా మలుపు తిరిగినది
నది ....

అవతల
ఇవతల
తడిసిన తటి తడవనట్లు
ఒడ్డుమీద వంగీ వంగని కొబ్బరిచెట్లు ....

కొబ్బరి ఆకుల
చీలిన సూర్యుని రేకల
శబల సంధ్యా మిలమిలలు
నిశ్శబ్ద పత్రపు గలగలలు ....

నీలిమ
నదిలో నీళ్ళ నీలిమ
నీటిలో ప్రతిఫలిత గగనం నీలిమ
నీలిమ ....

ముందు
మెత్తని రాళ్ళ
మధ్య మధ్య గరిక చిగుళ్ల
ఆకుపచ్చని తివాచి
ఆరబెట్టుకొన్న వాంఛార్ద్రితమీద
తడిసిన తెల్లని గాగర

ఒదిగి మోకాళ్ళమీద విలసిత ముగ్ధ
దుకూల పారదర్శక పాటల పాటలి
నీలి వెంట్రుకల విప్పు
మల్లెలు చుట్టిన కొప్పు ....
తేటి
వాలని నాటి
గుర్తుగా
సాంద్ర నీహారస్నాత
గోముగా తిప్పిన మెడ
ఒంపు భుజాల నెలవంక ....

వాలిన కళ్లు
వేడిని కోరినట్లు
వేడుకొని నట్లు ....

తడి ముడతల
మేనంటిన అపరంజి అంచు
శార్కర చేలా వ్యవధను చీల్చి
పైకెగబ్రాకి
తొంగి తొంగి చూడాలనుకునే ఉత్కంఠల జంట
నడుమ
ఎగబ్రాకిన సరళరేఖ ....

ఎదలో
తీయని చల్లని నిశ్శబ్దపు జ్వరం ధ్యాస
నిర్నిమేషంగా
చూడాలనే ఏకాగ్రతకు స్వరం శ్వాస.

స్వేచ్ఛ - దీక్ష

వియత్తలంనుండి జగత్తలం చూస్తోంది మింటిమీది డేగ
జగత్తలం నుండి వియత్తలం ఎగబ్రాగ చూస్తోంది
మంటిలోని తీగ
సప్తద్వీపాలు కలేసి తిరగాలన్న కాంక్ష డేగలో
సుప్త సౌందర్యాలు దాచుకుని ఎదిగే సొంపు తీగలో

ఫాలం తడుముకొని డేగలో ఏకైక దీక్షా మేధ
ఫలం పాదులోని తీగతో పైకివచ్చే స్వేచ్ఛాగాథ
మెలికలు మెలికలుగా తిరుగుతోంది డేగ
మెలేసుకు పెరుగుతోంది తీగ.

"సాంధ్యశ్రీ"

కలగూరగంప

విష్ణువర్ధనుడు

ఫిబ్రవరి '83 భారతి లో వెలువడిన, "కన్యకా పురాణము నందలి విష్ణువర్ధనుడెవ్వరు?" అను వ్యాసము ఘట్ట కుటికా ప్రభాత న్యాయమునకు ప్రముఖ లక్ష్యము.

1951 వ సంవత్సరమునందు ప్రకటితమైన వాసవీ కన్యకా పురాణము, తెనుగు వచనానువాదము తోడి సంస్కృత గ్రంథము. స్కాంద పురాణోత్తర ఖండములోని సనత్సుజాత సంహిత. సాలంకాయన మహర్షి ప్రోక్తము. అందు అభిమన్యుని కొడుకు పరీక్షిత్తు, పరీక్షిత్తు కొడుకు జనమేజయుడు, జనమేజయుని కొడుకు శతానందుడు, శతానందుని కొడుకు క్షేముడు, క్షేముని కొడుకు విజయార్థుడు, విజయార్థుని కొడుకు విష్ణువర్ధనుడు, విష్ణువర్ధనుని కొడుకు రాజ రాజేంద్రుడు అని కలదు. (9-18 శ్లో. 30అ.) అంతేకాదు. విష్ణువర్ధనుడు అంగ వంగ కళింగ సింహళ, చోళశక పాండ్య తుండీర, కాంభోజ పారశీక బర్బర నిషాద పుళింద మ్లేచ్ఛ, కురు పాంచాల కోసల రాజులను జయించి, స్వస్థానమైన పద్మశయనమునకు తిరుగు ప్రయాణమై, మార్గమధ్యమునందు జ్యేష్ఠశైలాఖ్య పురికి వచ్చెననియును కలదు. (20-43 శో. 30 అ.) [జ్యేష్ఠ శైలాఖ్యపురి అనగా పెనుగొండ. మరి పద్మశయన రాజధాని అనగా? తామర పడక = తామరవాడ = తామరాడ అగునా?] ఉపరి, వాసవీ కన్యకతోపాటు నూటరెండు గోత్రముల వైశ్యులును అగ్ని ప్రవేశము చేయుటకు గురుత్వము వహించిన భాస్కరాచార్యులకు, వారు ఇచ్చిన శాసనము కూడ కలదు. (21-34 శో. 44 అ.) అందు శాసనకాలము సహితము కలదు. ఆ శ్లోకమిది :

"కల్యాద్యబ్ది గణేక్షణాబ్ధి రసదైస్సంఖ్యాం గతే వత్సరే
ప్రాప్తేఽథ ప్రభవే తపస్యవ సితే పక్షే ద్వితీయా గురౌ
వైశ్యైర్భాస్కర పండితార్యధరణీ బృందారకాయోత్సుకైః
ప్రీత్యాష్టాదశ పట్టణాధిపతి భిర్దత్తం శుభం శాసనమ్"

22 శ్లో. 44 అ.

ఇది ఆ భాస్కరాచార్యులే ఆంధ్రీకరించిన వైశ్యపురాణము నందు ఇట్లు కలదు.

"భాస్కరాచార్యులకు జాహ్నవీతీరంబునఁ దామరవాడయను గ్రామం బగ్రహారంబుగా నిడుండని చెప్పి పెనుగొండలో నర్ధాంశంబు తత్పురదేవతా మహోత్సవంబున కొసంగి మిగిలిన యర్ధంబు కులగురువులైన పండిత వర్గంబుల కిమ్మని పురమధ్యంబున శాసన స్తంభంబు నిలిపి భాస్కరాచార్యులకుఁ దామ్రశాసన పత్రిక లిఖియింపం జేసిరి. తత్క్రమం బెట్టిదనిన

◆ ◆

కల్యాద్యబ్దగణేష్ట నేత్రరస దృక్సంఖ్యే గతే వత్సరే
ప్రాప్తేఽబ్దే ప్రభవే తపస్యపి సితే పక్షే ద్వితీయా గురౌ
ఆర్యా భాస్కర పండితాది ధరణీ బృందారకేభ్యస్సదా
ప్రీత్యాష్టాదశ పట్టనాధిపతిభిః దత్తం శుభంశాసనమ్—"

ఇందు సంస్కృత పురాణమునందులేని పెనుగొండ స్తంభ శాసనము, తామరవాడ తామ్రశాసనము తెలుగు పురాణములోని విశేషములు. అంతేకాదు. సంస్కృత పురాణములోని శాసనసంఖ్యా కాలము కంటే, తెలుగు పురాణములోని శాసనసంఖ్యాకాలము భిన్నము. అది కల్యాద్యబ్ద గణేక్షణాబ్ధరసదోస్సంఖ్య. ఇది కల్యాద్యబ్ద గణేష్ట నేత్రరస దోస్సంఖ్య. ఇందు మొదటి సంఖ్య 2642. కలికాలము. కనుక క్రీస్తుపూర్వము 458 వ సంవత్సరము. పరీక్షిత్తు పరిపాలనము కలియుగాదిని కావున, అతని మనుమని మనుమడు విష్ణువర్ధనుని దానకాలము క్రీస్తుపూర్వము 457 వ సంవత్సరము కావచ్చును. వారు పురాణపురుషులు కావున, తరమునకు 20, 30, 40 సంవత్సరములు, శతాబ్దికి మూడు తరములు అను చరిత్ర లెక్కలకు అతీతులు. ఇక రెండవ సంఖ్యకు లెక్కలు వచ్చినవి. పెనుగొండ పురమధ్యమునందు స్తంభశాసనము గోడ కానరాదు. తామరవాడ చుట్టుపక్కలయందు తామ్రశాసనము జాడ కానరాదు. కాని, సంస్కృతాంధ్రపురాణములలోని భాస్కరాచార్యుల కాలము మాత్రము బమ్మెర పోతన అనంతరము.

అగ్ని ప్రవేశమునకు ముందు అష్టాదశ పట్టణాధి పతులకు సంబంధించిన నూటరెండు గోత్రముల వైశ్యులు, భాస్కరాచార్యులకు కావించిన అభ్యర్థనమిది :

"మీరు మహానుభావులు సమిద్ధవచోవిభవాభిరాము లిం
పారఁగ వైశ్య వంశము మహత్వత వృద్ధియొనర్ప దీవనల్
ధీరత నిచ్చి గోత్రశత దీప్తయశస్థితి శీల మూలమై
పేరతలుల్లసిల్లఁగఁ గవిత్వకృతిన్ గృతిసేయుటొప్పగున్.

మను మా పెద్దల చరితము
ముని సాలంకాయనుండు ముదమునఁజెప్పెన్
ఘనముగఁ దత్కృతి పొందుగ
ననుగుణమై చేసి చెప్పు డాంధ్రోక్తిఁదగన్."

◆ ◆

"భారతరామ సత్కథలు భాగవతంబుఁ దెనుంగు సేయఁగా
నేరరె సత్కవీశ్వరులు నేర్చి రచించిన సత్కవిత్వముల్
మీఱుఁ దెనుంగు బాస నిల మెచ్చుగ నొక్క తెనుంగు గ్రంథమిం
పారఁ బ్రసిద్ధిసేయు మహి మండలి నొప్పుగఁ బండి
తాగ్రణీ."

భారతమును తెనుగు సేసినది నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలు. రామాయణమును తెనుగుసేసినది గోనబుద్ధారెడ్డి, గోనకాచ, విఠల రెడ్లు. హుళక్కి భాస్కరాదులును. భాగవతమును (దశమ స్కంధము మాత్రము తెనుగు సేసినది మడికి సింగన) ద్వాదశ స్కంధములను తెనుగు సేసినది బమ్మెర పోతన. కనుక భాస్కరా చార్యులు తెనుగు సేసిన తెలుగు వైశ్య పురాణము, భాస్కరా చార్యులు పాత్ర వహించిన సంస్కృత వాసవీ కన్యకాపురాణము, బమ్మెర పోతన భాగవతము రచనా కాలము కంటె అనంతర గ్రంథములు కావలయును. బమ్మెర పోతిన భాగవతము రచనా కాలము స్థూలముగ 1480 వ సంవత్సరము. భాస్కరా చార్యులు తెనుగుసేసిన తెలుగు వైశ్య పురాణము వ్రాత ప్రతుల లేఖన కాలములందు తెలిసినంత వఱకు పూర్వతరమైన లేఖన కాలము 20-9-1704 వ తేదీ.[1] కనుక సంస్కృతాంధ్ర వైశ్య పురాణ ముల కాలము స్థూలముగ పదునారు, పదునేడు శతాబ్దుల కాలము.

కన్యకా పురాణములోని వాసవీకన్య కథకు మూలము మార్కండేయ పురాణము, గౌరన నవనాథ చరిత్ర అని వ్యాస కర్త అపాదించుట[2] కేవలము అజ్ఞాన విలాసము. వాసవీ కన్య కథకు మూలము మార్కండేయ పురాణమునందు లేదు. ఉన్న మార్కండేయ పురాణోత్తర ఖండములోని కథకు, కన్యకా పురా ణములోని కథయే మూలము. కారణము, మార్కండేయ పురా ణోత్తర ఖండములోని కథయందు హూసపాటిని జయించిన, జయ పురాధీశుడైన గజపతి సంగతియును కలదు. కనుక మార్కండేయ పురాణోత్తర ఖండము పరమార్వాచీన కాలికమని ప్రసిద్ధము. ఇక గౌరన నవనాథచరిత్రమునందును వాసవీ కన్య కథకు మూలము లేదు. అసలు నవనాథ చరిత్రమునందు ఆంధ్రదేశమునకు సంబంధించిన రాజు కథయే లేదు. మాళవదేశమునకు సంబంధించిన రాజ మహేంద్రి భూవిభుని, మహారాష్ట్రదేశమునకు సంబంధించిన గణ్యా వంతుని, కృష్ణకంధార భూపుని కథలు మాత్రము కలవు. సింహద్రి పురమేలు సింహళుని కథ కలదు గాని, ఆంధ్రావనిలోని సింహాద్రి ఏనాడును రాజధాని కాదు. కనుక వాసవీకన్య కథ సమూ లము కాదు.

సంస్కృత వైశ్య పురాణములోని శాసన కాలమునకు భిన్నమైన, తెలుగు వైశ్య పురాణములోని తామరవాడ తామ్రశాస నము నకలు కాలము, పెద్దచెఱుకూరు శిలాశాసనమునందు దఖలు పడినది. పెద్దచెఱుకూరులోని త్రివిక్రమ స్వామి దేవాలయము నందలి గరుడ స్తంభము నలుప్రక్కల చెక్కిన శాసనము, పెద్ద చెఱుకూరు శిలాశాసనము. పెద్ద చెఱుకూరు గుంటూరుజిల్లా బాపట్ల తాలూకాలోనిది. పెనుగొండ, తామరవాడ (ఇప్పటి తామరాడ) పశ్చిమగోదావరిజిల్లా తణుకు తాలూకాలోనివి. తామరవాడ తామ్ర శాసనము నకలులోని కాలమును తెలుపు శ్లోకము పూర్వార్ధము, పెద్దచెఱుకూరు శిలాశాసనములోని కాలమును తెలుపు శ్లోకము పూర్వార్ధమును ఒకటే. అలతి మార్పున అది ఇక్షు గ్రామ తామ్ర శాసనము నందును కలదు. ఇక్షుగ్రామమన చెఱుకూరే. అంతే కాదు. పెద్ద చెఱుకూరే. ఇట్లు మూడు శాసనముల కాలములు ముడిపడియుండుట మఱి ముచ్చట గొలుపు విషయమే.

తూర్పు చాళుక్యుల చరిత్రను తూర్పారఁబట్టిన నేలటూరి వెంకటరమణయ్యగారు, చాళుక్యచోళుల చరిత్రను చాలనము చేసిన మల్లంపల్లి సోమశేఖరశర్మగారును ప్రకటించిన శాస నము పెద్దచెఱుకూరు శిలాశాసనము:

గరుడ స్తంభము మొదటి ప్రక్కను ఒక విష్ణువర్ధన మహా రాజు వర్ణనము, మఱొక విష్ణువర్ధన మహారాజు వివరము, తదుపరి కుముదవర్ధన మహారాజు విషయము కలదు. రెండవ ప్రక్కను విగ్రహ వర్ణనాత్మకమైన త్రివిక్రమస్వామి స్తోత్రము కలదు. మూడవ ప్రక్కను కుముదవర్ధన మహారాజు దిగ్విజయయాత్ర, బృహదిక్షుగ్రామ సమాగమనము, దానము, దానకాలము మొదలైనవి కలవు. నాల్గవ ప్రక్కను దానమిచ్చిన మూడు గ్రామముల ఎల్లలు కలవు. మొదటిప్రక్క తుదిని, రెండవప్రక్క తొలిని, తుదిని అక్షరములు పోయినవి. కనుక మొదటిప్రక్క విషయమునకు రెండవ ప్రక్క విషయమునకు గల అనుబంధము, రెండవప్రక్క విషయమునకు మూడవ ప్రక్క విషయమునకు గల అనుబంధము తెలియు అవకాశము లేదు. అయినను రెండవప్రక్క విషయము ముందు చెక్కినది లేక తర్వాత దూర్చినది అని వ్యాసకర్త అ-

ప్రాయపడుట [3] అనాలోచన పూర్వకము. పెద్ద చెఱుకూరు దేవాలయములోని త్రివిక్రమస్వామిని సందర్శించి(దదర్శ), మూడుగ్రామములు దానము చేసినట్లు కల శాసనము నందు విగ్రహ వర్ణనాత్మకమైన త్రివిక్రమస్వామి స్తోత్రము ప్రకరణ విరుద్ధము కాదు. స్తోత్ర శ్లోకముల వలన శాసనమునకు "అస్పష్టత" కలిగినది, "చరిత్ర పరిశీలకులకు తీవ్రమైన సమస్యగా పరిణమించును" అని వ్యాసకర్త ఆందోళన చెందుట [4] అనభిజ్ఞతా స్థాపకము. అందుకు నేలటూరు వేంకటరమణయ్యగారు, మల్లంపల్లి సోమశేఖరశర్మగారు పెద్ద చెఱుకూరు శిలాశాసనమును ప్రక్కను బెట్టలేదు. ఎందుకు ప్రక్కను బెట్టినదియు శాసనమును సరిగా పరిశీలించిన స్పష్టము కాగలదు.

పెద్ద చెఱుకూరు శిలాశాసనము నందు లేఖక దోషములు మాత్రమేగాక, కవి దోషములును కలవు. మొదటి ప్రక్కను "చతుర్దిక్కారాతి" అని కలదు. "చతుర్దిగరాతి" అని ఉండవలయును. మొదటి ప్రక్కనే "అథ చాళుక్య కులాబ్ధి సుధాకరః కుముదవర్ధన మానవనామకః" అని కలదు. అది చూచి, "అథ"కు ముందు కల విష్ణువర్ధన మహారాజు పేరు కుముదవర్ధన మహారాజు అని వ్యాసకర్త అర్థము చెప్పుట [5] అవిచార మూలకము. మానవ నామము కలవాడు, దానవనామము కలవాడు అని ఉండదు. విష్ణువర్ధన మహారాజు అను పేరు కూడా మానవనామమే. అంతేకాదు. "అథ" అను నిర్దేశము అర్థరహితము కాదు. విష్ణువర్ధన మహారాజు తర్వాత కుముదవర్ధన మహారాజు అని శాసనపంక్తికి అర్థము. "మానవ నామకః" అనునది "మానవ నాయకః" అను దానికి లేఖకదోషము. యనలేఖన వ్యత్యయము ప్రసిద్ధము. ఒక విష్ణువర్ధన మహారాజు మనుమడు, రామదేవ యువరాజు ఇష్టుడు అయిన వేరొక విష్ణువర్ధన మహారాజు తర్వాత కుముదవర్ధన మహారాజు ఎవరు? అన్నది ఒక సమస్య. "కుముదవర్ధన మానవ నాయకః జయతి రాజమహేంద్ర వరే స్థితో ... శాసిత తలం... ...."అని కలదు గావున, రామదేవ యువరాజు ఇష్టుడైన విష్ణువర్ధన మహారాజు తర్వాత రాజమహేంద్రవరము రాజధానిగ పరిపాలించిన కుముదవర్ధన మహారాజు ఎవరు? అన్నది వేరొక సమస్య. మూడవ ప్రక్కను,

"పూర్వ వైరమను స్మృత్య జిత్వా కల్యాణభూపతిం
తస్య రాజ్యశ్రియం హృత్వా యుద్ధే లబ్ధ పరాక్రమః"

అని కలదు గావున, రామదేవ యువరాజ ప్రియుడు, రాజమహేంద్రవరస్థితుడు మాత్రమేగాక, దిగ్విజయ యాత్రయందు పూర్వవైరమును పురస్కరించుకొని కల్యాణ భూపతిని జయించి, అతని రాజ్యలక్ష్మిని అపహరించిన కుముదవర్ధన మహారాజు ఎవరు? అన్నది ఇంకొక సమస్య. కల్యాణభూపతి అనగా కాంచీ నగరాధిపతి అని పండితులు అర్థమును కిట్టించుట[6] ప్రమోదకరము కాదు గాని, అది పూర్వ చరిత్రయొక్క పునరుద్ధరణమని వ్యాసకర్త చరిత్రను కిట్టించుట[7] ప్రమాదకరము. "పూర్వవైరమ్" అను ప్రథమ పురుషలోని పూర్వ శ్లోకమునకు, "తత్రైమధ్యే" అను ప్రథమ పురుషలోని తర్వాతి శ్లోకమునకు మధ్య "కించత్రైః" అను మధ్యమ పురుషములోని శ్లోకమునకు అన్వయమెట్లు? అన్నది వేరొక సమస్య. ప్రథమ పురుష ప్రకరణము కుముదవర్ధన విషయము. మధ్యమ పురుష ప్రసంగము మరల విష్ణువర్ధన విషయము. అన్నిటికంటె అగ్రేసరమైనది పెద్ద చెఱుకూరు శిలాశాసనములోని కాలము. కలికాలము. కలిసిరాని కలి కాలము. ఇది అసలు సమస్య.

"కల్యాద్యబ్ది గణేష్ట నేత్రరసదో [స్స]ంఖ్యే గతే వత్సరే
ప్రాప్తేథ ప్రభవే తపస్యపి సితే పక్షేద్వితీయా గు[రౌ]
వారే చేతు పురింధ్రినామ చెరయూరి గ్రామకే శ్రీపతిం
నాత్వానేన పురా త్రివిక్రమ రమానాథాయ దత్తా[ం] స్థితిం."

ఇట్లు పెద్ద చెఱుకూరు శిలా శాసనమునందు కలదు. ఇందు "పురీంద్ర" అనుటకు "పురీంధ్ర" అనునది లేఖక దోషము. "నత్వా" అనుటకు "నాత్వా" అనునది కూడ లేఖక దోషము. ఇందలి పూర్వార్ధమే యథా తథముగ, తెలుగు వైశ్య పురాణములోని తామరవాడ తామ్రశాసనము నకలునందు కలదు. "దోస్సంఖ్యే" అనునెడ "దృక్సంఖ్యే" అని మాత్రము పాఠాంతరము. అర్థాంతరము కాదు.

కల్యాద్యబ్ది గణేష్టనేత్ర రసదోస్సంఖ్యా సంవత్సరము గతించిన తర్వాత ప్రాప్తించిన ప్రభవనామ సంవత్సర మాఘ శుద్ధ విదియా గురువారమునాడు - కుముదవర్ధన మహారాజు - పూర్వము ("పురా") త్రివిక్రమస్వామికి - పురత్రయ - స్థితిని దానమిచ్చెను అని శ్లోకార్థము.

పయి శ్లోకములోని పురాశబ్దము పురాణార్థము కాదు. పూర్వార్థకము. కనుక పూర్వము కుముదవర్ధన మహారాజు త్రివిక్రమ స్వామికి పురత్రయమును దానమిచ్చిన కాలము శ్లోకమునందు కలదుగాని, తర్వాతి శాసనకాలము లేదని కరతలామలకము.

కల్యాద్యబ్ది గణేష్టనేత్ర రసదోస్సంఖ్యా సంవత్సరము గతించిన తర్వాత ప్రాప్తించిన ప్రభవనామ సంవత్సర మాఘ శుద్ధ విదియా గురువారము శాసనకాలము కాదు. దానకాలము. దాన

కాలము, శాసనకాలమును ఒకటే అగుట సర్వశాసన సాధారణము. కాకపోవుట పెద్ద చెఱుకూరు శిలా శాసనము ప్రత్యేకత.

"కల్యాద్యబ్ది గణేష్ట నేత్ర రసదోస్సంఖ్యే" అను పంక్తి నుండి అష్టనేత్ర రసదోస్సంఖ్య అని గ్రహించుటకు అవకాశము కలదు గాని, అష్టశబ్దము సంఖ్యావాచకము. నేత్రరసదోశ్శబ్దములు సంఖ్యా వాచకములు కావు. సంఖ్యాసూచకములు. సంఖ్యా వాచకమునకు సంఖ్యా సూచకములకు సాంకర్యము చేయుట సాంప్రదాయిక సరణి కాదు. అంతేకాదు. "గతే వత్సరే ప్రాప్తేఽథ" అను శాసన పంక్తికి అనుగుణమును కాదు. కనుక ఇష్టనేత్ర రసదోస్సంఖ్య అని గ్రహింపవలయును. ఇష్ట శబ్దమునకు యజ్ఞమని అర్థము కలదు. సప్త యజ్ఞములు ద్విధా ప్రసిద్ధము. ఇష్ట నేత్ర రసదోస్సంఖ్య 2627 గాని, 2927 గాని అగును. అది క్రీస్తు పూర్వము 473 గాని, 173 గాని అగును. క్రీస్తుపూర్వము 472 వ లేక, 172 వ సంవత్సరము ప్రభవనామ సంవత్సరాదికమైనను కాకపోయినను, తూర్పు చాళుక్యుల, చాళుక్య చోళుల పరిపాలన కాలము క్రీస్తు పూర్వము కాదు. కనుక ఇష్ట (అష్ట) నేత్ర రసదోస్సంఖ్య కల్పితము.

ఇక ప్రభవనామ సంవత్సర మాఘ శుద్ధ విదియా గురువారము తూర్పు చాళుక్యుల, చాళుక్య చోళుల పరిపాలన కాలము[8] నందు (క్రీ శ. 624 – 1170) ఒక్క 12–1–848 వ తేదీని మాత్రమే కలదు.[9] అది సరిగా గుణక విజయాదిత్యుని రాజ్యారంభ కాలము.[10] కాని, గుణక విజయాదిత్యుని కాలమునందు రాజమహేంద్రవరము రాజధాని కాదు. కల్యాణ కటకము లేదు. కనుక 12–1–848 వ తేదీ పెద్ద చెఱుకూరు శిలా శాసనములోని దానకాలము కాదు అనగా ప్రభవ నామ సంవత్సర మాఘ శుద్ధ విదియా గురువారమును కల్పితమని అవగాహనమగును.

మఱి శాసనకాలము – పెద్ద చెఱుకూరు శిలాశాసనము లిపి పదమూడు, పదునాల్గు శతాబ్దుల లిపి కావున, పదునాల్గవ శతాబ్ది లోని ప్రభవనామ సంవత్సర మాఘశుద్ధ విదియా గురువారము, 14–1–1328 వ తేదీ శాసనకాలమని వ్యాసకర్త సమన్వయించుట[11] కూడ సమంజసము కాదు. 14–1–1328 వ తేదీని సూర్యోదయాత్ప్రభృతి సుమారు మూడు గంటల వఱకు పాడ్యమి కలదు.[12] (13) సూర్యోదయకాల తిథియే దినతిథి. కనుక 14–1–1323 వ తేదీ ప్రభవనామ సంవత్సర మాఘశుద్ధ పాడ్యమీ గురువారమేకాని, విదియా గురువారము కాదు. తత్కాల విదియతిథి వివక్షశాసనమునందు లేదు. కనుక 14–1–1328 వ తేదీ శాసనకాలము కాదు. దానకాలము ఎట్లును కాదు. అంతేకాదు. శాసన లిపి శాసన కాలము పదునాల్గవ శతాబ్ది అనుటకు సాధకమైనను, శాసనస్థ విషయము బాధకము. మూడవ ప్రక్కనే శాపోక్తుల చివఱ, సీమా చిహ్నాల మొదట శాసనకర్త సంగతి ఇట్లు కలదు.

"విద్యాధికారీ శ్రీపతిర్వీర శ్రీ విష్ణువర్ధనః
అకరోద్దానకరో వాచా నిర్మలం ధర్మశాసనం."

ఇందు లేఖక దోషముతోపాటు కవి దోషములు కలవు. అవి "శ్రీపతిః" అనునెడ ఛందోభంగము. "విష్ణువర్ధనః" అనునెడ వ్యాకరణ దోషము. అది కూడ కారక దోషము. విభక్తి ప్రత్యయ విపర్యయము. నిజముగ విద్యాధికారి అయిన కవి ఎవ్వడును విభక్తి ప్రత్యయ విపర్యయముగ శ్లోకరచన – కాదు – వాక్యరచన చేయడు. కారకదోషమునకు కారకుడు కాడు. ఛందోభంగమునకు గురికాడు. నిజముగ విద్యాధికారి అయిన శ్రీనాథుడు రచించిన పెద కోమటి వేమారెడ్డి శాసనమునందు ఇట్లు కలదు.

"విద్యాధికారీ శ్రీనాథో వీరశ్రీ వేమభూపతేః
అకరో దాకరో వాచాం నిర్మలం ధర్మశాసనం."

ఇందు ఛందోభంగము లేదు. వ్యాకరణ దోషమును లేదు. అయినను పెద్ద చెఱుకూరు శాసనములోని అవక తవక శ్లోకమునకు శ్రీనాథుడు మెఱుగుపెట్టెనని పండితులు వ్రాయుట[13] ప్రామాదికము. శ్రీనాథుని శ్లోకమునందు పెట్టిన మెఱుగు లేదు. శ్రీపతి శ్లోకమునందు పట్టిన తఱుగు కలదు. "శ్రీనాథః" అను చోట "శ్రీపతిః" అని మార్చుట వలన మాత్రమే ఛందోభంగము ఘటిల్లును. "వేమభూపతేః" అనుచోట "విష్ణువర్ధనే" అనుటకు వీలు లేదు. అది ఇకారాంత శబ్దము. ఇది అకారాంత శబ్దము. "విష్ణువర్ధనస్య" అనవలయును. అనిన శ్లోకపాదమునందు అక్షరము పెరుగును. శ్లోకపాదము అక్షరబద్ధము కావలయును. కనుక "విష్ణువర్ధనః" అని కర్తృ ప్రయోగము. అనగా శ్రీనాథుని శ్లోకమునకు పెద్ద చెఱుకూరు శాసనములోని శ్లోకము అగతికమైన అనుకరణ మని అవగాహన మగును. శ్రీనాథుని శ్లోకము అసలు వజ్రము. శ్రీపతి శ్లోకము నకిలీ వజ్రము. కనుక శ్రీనాథుడు రచించిన పెద కోమటి వేమారెడ్డి శాసనముల కాలముకంటె, శ్రీపతి రచించిన పెద్ద చెఱుకూరు శిలా శాసనము కాలము అనంతర మగుట అపరిహార్యము.

పెద కోమటి వేమారెడ్డి చిట్టచివఱి రుద్రవరము శాసనము కాలము 1419 వ సంవత్సరము.[14] కనుక పెద్ద చెఱుకూరు శిలా శాసనము కాలము 1420 వ సంవత్సరము కంటె అనంతరము కావలయును.

పయి శ్లోకము తర్వాత "ఉంద్రాలపాలెమితి పూర్వతలేచ ఖండం యామ్యంచ ఖండమిదమో బళసానిపాలెం-" అని శాసనము నందు కలదు. ఇందు "పాలెము" అను లేఖనము ఇతోధికమైన అర్వాచీన కాలమును సూచించును. పాళెము ప్రాచీన రూపము. ప్రాచీన లేఖనమును. పాలెము అర్వాచీన రూపము. అర్వాచీన లేఖనమును. అంతే కాదు. పెద్ద చెఱుకూరు శిలా శాసనము నందు ప్రాచీన వర్గ పంచమాక్షర లేఖన విధానమును సరిగా పాటింపఁబడలేదు. అది కూడ అర్వాచీనతాస్ఫోరకము.

ఇంతకు, 1881 వ సంవత్సరము ప్రాంతమునందు ప్రథమతః పెద్ద చెఱుకూరు శిలాశాసనమును పరిశీలించిన రాబర్ట్ స్యూయెల్ అందఁజేసిన సమాచార మిది:15

"పెద్ద చెరుకూరు:- 10 మైల్స్ నార్త్-వెస్ట్ అఫ్ బాపట్ల. ఇన్ ది టెంపిల్ అఫ్ త్రివిక్రమస్వామి అర్ టు ఇన్‌స్క్రిప్షన్స్ అన్ ది గరుడ స్తంభ.

(1) అన్‌డేటెడ్. గ్రేంట్ బై "విష్ణువర్ధన మహారాజ."

(2) శ్లోకాస్ ఇన్ ప్రైజ్ అఫ్ ది డెయిటీ."

ఇందు 1881 వ సంవత్సరము ప్రాంతమునందు, పెద్ద చెఱుకూరు శిలాశాసనమునందు కాలము లేదని ఇదమిత్థముగ కలదు. (అన్‌డేటెడ్) అంతే కాదు. త్రివిక్రమస్వామి దేవాలయములోని గరుడ స్తంభము మీద రెండు శాసనములు కలవని, ఒకటి విష్ణువర్ధన మహారాజు దానమని, మఱొకటి త్రివిక్రమ స్వామి స్తోత్రమని స్పష్టముగ కలదు. కనుక దాన కాలమును తెలుపు ప్రస్తుత శ్లోకము, పెద్ద చెఱుకూరు శిలా శాసనమునందు, 1881 వ సంవత్సరము ప్రాంతము తర్వాత ప్రవేశించినట్లు కరతలా మలకము.

ఇది గమనింపకుండ, అది పట్టుకొని వ్యాసకర్త అట్టహాసము చేయుట16 అక్షంతవ్యము.

ఇక మఱి ఇక్షుగ్రామ తామ్రశాసనము - ప్రభుత్వ శాసన పండితుడు అందఁజేసిన సమాచారమిది:17

"కింగ్- విష్ణువర్ధన రూలింగ్ ఫ్రమ్ రాజమహేంద్రవరమ్.

డేట్ - కలి ఇయర్ 2828. (అష్ట - నేత్ర రసదోః రాంగ్ ఫర్ 4428) ప్రభవ. తపస్. (తపా = మాఘ) అమావాస్య, థర్స్‌డే= 1328 ఎ.డి. ఫిబ్రవరి 11, యఫ్. డి. టి. 18.

రిమార్క్స్ - రిజిష్టర్స్ ది గ్రేంట్ అఫ్ ది విలేజ్ ఇక్షుగ్రామ టు ది బ్రాహ్మణ నారాయణ సన్ అఫ్ ఔభళయ అండ్ ది గ్రేండ్ సన్ అఫ్ జ్యేష్ఠశర్మన్ అఫ్ ది హరిత గోత్ర బైది కింగ్. ది లాంగ్వేజ్ అఫ్ ది రికార్డ్ ఈజ్ వెరీ కరెక్ట్. ఇన్ కేరెక్టర్స్ అఫ్ ఎబౌట్ ఫోర్టీన్త్ సెంచరీ. సియఫ్. ఎ. అర్. ఇ పి 1890. పి. 2. నెం IV అల్సో. సియఫ్. యస్ ఐఐ. వాల్. VI. నెం. 202."

ఇది కేవలము ఇక్షుగ్రామ తామ్ర శాసనమునకు విషయ సూచిక మాత్రమే. ఇందు "కలి సంవత్సరము 2828. అష్ట. నేత్ర రసదోః, ప్రభవ, తపస్, అమావాస్య, గురువారము" అని కలదు గావున, ఇక్షుగ్రామ తామ్ర శాసనమునందును,

"కల్యాద్యబ్ది గణేష్ట నేత్ర రసదోస్సంఖ్యే గతే వత్సరే
ప్రాప్తేఽథ ప్రభవే తపస్యపి అమావాస్యే గురౌ వాసరే"

అని ఉండును. అక్షరశః లేకపోయినను అర్థమదే. అంతే కాదు. "రాజమహేంద్ర వరేస్థితః" అనియును ఉండును. ఉపరి, విష్ణువర్ధన మహారాజః అని కూడ ఉండును. "కుముదవర్ధన మానవ నామకః" అని కూడ ఉండవచ్చును. ఇక్షుగ్రామ తామ్ర శాసన లిపి సుమారు పదునాల్గవ శతాబ్దిది అని సూచించుటకు ఆధారము పెద్ద చెఱుకూరు శిలా శాసనము అని విషయ సూచిక యందు మూదలింపఁబడినది. శాసన లిపితోపాటు శాసనకవి కూడ ఒకడే కావచ్చును. శాసన లిపి సుమారు పదునాల్గవ శతాబ్ది నాటిదని-కలిసిరాని కలికాలము తప్పని కలిసివచిన ప్రభవసంవత్సరాదికమును బట్టి కాలము 11-2-1328 వ తేదీ అని ప్రభుత్వశాసన పండితుని ప్రకటనము. అది నిజమైనచో, 1328 వ సంవత్సరము ప్రాంతమునందు ఒక విష్ణువర్ధన మహారాజు రాజమహేంద్రవరము రాజధానిగ, రాజ్యాధిపతిగ ఉండవలయును. రాజమహేంద్రవరము రాజధాని కాకపోయినను రాజమహేంద్రవరము ప్రాంతమునకైన రాజ్యాధిపతిగ ఉండవలయును. మఱి 1328 వ సంవత్సరము ప్రాంతమునందు రాజమహేంద్రవరము ప్రాంతమునకు మాత్రమే గాక, పారతంత్ర్య విముక్తము కావించిన మధ్యాంధ్ర దేశమునకెల్ల రాజ్యాధిపతి ముసునూరి ప్రోలయనాయకుడు18 కదా! ముసునూరి ప్రోలయనాయకునికి ఒక విష్ణువర్ధనమహారాజు సామంతుడు కాడు కదా! కనుక 1328 వ సంవత్సరము ప్రాంతమునందు ఒక విష్ణువర్ధన మహారాజు రాజమహేంద్రవరము ప్రాంతమునకైన రాజ్యాధిపతి కాఁజాలడు. కనుక ఇక్షుగ్రామ తామ్రశాసనములోని కాలము పదునాల్గవ శతాబ్ది కాఁజాలదు.

1890 వ సంవత్సరమునందు పెద్దచెఱుకూరు శిలాశాసనము లిపి పదమూడు, పదునాల్గు శతాబ్దుల నాటిదని ఒక ప్రభుత్వశాసన పండితుడు సూచించినను, దానిని బట్టి 1961-62 వ సంవత్సరము నందు ఇక్షుగ్రామ తామ్రశాసనము లిపి కూడ సుమారు పదునాల్గవ శతాబ్ది నాటిదని మఱొక ప్రభుత్వ శాసనపండితుడు ప్రకటించినను, పెద్ద చెఱుకూరు శిలాశాసనము కాలము ఆంతరంగిక సాక్ష్యమును బట్టి 1420 వ సంవత్సరముకంటె, అనంతరము కావున, పెద్ద చెఱుకూరు శిలాశాసనము లిపిని పునఃపరిశీలనము చేయింపగా, ఇటీవలి అసమగ్రమైన ప్రతిబింబమును బట్టి, అది పదునైదవ శతాబ్ది లిపి అగునని, పదునారవశతాబ్ది లిపి కూడ కావచ్చునని లిపి కాలజ్ఞులు తెలిపిన సంగతి. పెద్దచెఱుకూరు శిలాశాసనము లిపి పదునైదు, పదునారు శతాబ్దుల లిపి అయిన, ఇక్షుగ్రామ తామ్రశాసనము లిపి కూడ పదునైదు, పదునారు శతాబ్దుల లిపియే అగును. పదునైదవ శతాబ్దిని లేదుగావి, పదునారవ శతాబ్దిని ప్రభవనామ సంవత్సర మాఘమాసామావాస్యా గురువారము కలదు. 29-1-1568 వ తేదీ. కనుక ఇక్షుగ్రామ తామ్రశాసనము లోని కాలము సహితము అర్వాచీనము కావలయును.

ఇంతకు, 1381 వ సంవత్సరము ప్రాంతమునందు ప్రథమతః ఇక్షుగ్రామ తామ్రశాసనమును కూడ పరిశీలించిన రాబర్ట్ స్యూయెల్ అందఁజేసిన సమాచారమిది: 9

''దేర్ అర్ త్రి కాపర్ - ప్లేట్ ఇన్‌స్క్రిప్షన్స్ ఇన్ ది విలేజ్ (పెద్ద చెరుకూరు) ఇన్ పొజిషన్ ఆఫ్ నోదు కృష్ణయ్య ఎ రెసిడెంట్.

(1) గ్రేంట్ ఆఫ్ ఏన్ అగ్రహార బై "విష్ణువర్ధన మహారాజ," నో డేట్. ది కమెన్స్‌మెంట్ ఆఫ్ ది ప్లేట్ ఈజ్ ఇన్ ది చాళుక్యన్ స్టైయిల్, అండ్ ఐ ఇమేజిన్ దట్ ది గ్రేంట్ మస్ట్ బి బై ఒన్ ఆఫ్ ది ఈస్టెర్న్ చాళుక్య సోవరిన్స్ ఆఫ్ ది నేమ్, బట్ ఐ కెనాట్ ఎసర్టైన్ విచ్."

ఇందు పెద్ద చెఱుకూరులోని ఇక్షు గ్రామ తామ్రశాసనము నందు కాలము లేదని ఇదమిత్థముగ కలదు. (నో డేట్). ఇది గమనార్హమైన విషయము.

1881 వ సంవత్సరము ప్రాంతము నందు రాబర్ట్ స్యూయెల్‌కు అందిన ఇక్షుగ్రామ తామ్రశాసనమునందు కాలము లేదు. 1961 వ సంవత్సర ప్రాంతము నందు ప్రభుత్వ శాసన పండితునికి అందిన ఇక్షుగ్రామ తామ్రశాసనము నందు కాలము కలదు. కనుక ఇక్షుగ్రామ తామ్రశాసనము నందును కాలమును తెలుపు శ్లోకము 1881 వ సంవత్సరము ప్రాంతము తర్వాత ప్రవేశించినట్లు కరబదరకము.

పెద్ద చెఱుకూరు శిలాశాసనము, పెద్దచెఱుకూరు ఉరపు ఇక్షుగ్రామ తామ్రశాసనము, తామరవాడ తామ్రశాసనము నకలు అన్యోన్యాశ్రయ గుణభూషితములు కావు. అన్యోన్యాశ్రయ దోష దూషితములు.

1704 వ సంవత్సరము నాటికి వ్రాతప్రతికల తెలుగువైశ్య పురాణము నందలి తామరవాడ తామ్ర శాసనము నకలు లోని, కాలమును తెలుపు శ్లోకము 1881 వ సంవత్సరమునకు తర్వాత, 1890 వ సంవత్సరమునకు పూర్వము- పెద్దచెఱుకూరు శిలాశాసనము నందు, ఇక్షుగ్రామ తామ్రశాసనమునందును ప్రవేశించినట్లు ప్రతీయమానము.

తామరవాడ తామ్రశాసనము నకలు మాతృక నకలు. పెద్ద చెఱుకూరు శిలాశాసనము, పెద్ద చెఱుకూరు ఉరపు ఇక్షుగ్రామ తామ్రశాసనము కూటశాసనములు. (స్పూరియస్ ఇన్‌స్క్రిప్షన్స్), జనమేజయుని శాసనములు.

ఇక వాసవీ కన్య కథలోని విష్ణువర్ధనుడు - ఇతడు చాళుక్య విష్ణువర్ధనుడు అని సంస్కృత వైశ్య పురాణమునందు లేదు. అంతేకాదు. అతని రాజధాని రాజమహేంద్రవరము అనికూడ సంస్కృతవైశ్య పురాణమునందు లేదు. తెలుగు వైశ్య పురాణము నందు మాత్రమే కలదు.

“శ్రీ మార్కండేయ మునికి
స్వామికి నిలయంబనంగ జగతిన్ దివిష
ద్ధామము రాజమహేంద్రిని
నామమున నొప్పు పురము నవ్యస్ఫూర్తిన్.

ధూర్జటి పాదభక్తుఁ డరిదుర్గ విభేదన శౌర్యశాలి న్యా
యార్జిత వైభవుండు విబుధావన కల్పకుఁ డార్యసమ్మతుం
డర్జున వంశ వర్ధనుఁ డహర్పతి తేజుఁడు విష్ణువర్ధనుం
డూర్జిత సర్వ సంపదల నొప్పును రాజమహేంద్రినాథుఁడై

రాజ కళాధర భక్తుఁడు
రాజకులోత్తంసుఁ డన్యరాజ యశస్తే
జోజయ శాలిగఁ బరగును
రాజిత చాళుక్య వంశ రక్షకుఁడెలమిన్.”

సంస్కృత వైశ్య పురాణమునందు లేని సమాచారమిది తెలుగు వైశ్య పురాణమునందు తీగ సాగినదో లేక, తెలుగు

వైశ్య పురాణములోని సమాచారము సంస్కృత వైశ్య పురాణము నందు మూగవోయినదో ఇంకను పరిశోధనీయము. ప్రకృతము తెలుగు వైశ్య పురాణములోని సమాచారమునకు రక్షకవచము కలదేమో పరిశీలనార్హము.

1124 వ సంవత్సరమునందు పెనుగొండ పురవరాధీశ్వరుడు, మొక్కల గోత్రుడు, కోసానిసెట్టి కొడుకు కామసెట్టి నాదెండ్లలో విశ్వేశ్వర స్వామికి దేవాలయము కట్టించినట్లు, 1144 వ సంవత్సరమునందు పెనుగొండ పురవరాధీశ్వరుడు, నాబెలగోత్రుడు, గొంటా కొమ్మిసెట్టి ఘంటసాలలో జలధరేశ్వర స్వామికి దీపారాధన కొఱకు 10 రాజమాడలు సమర్పించినట్లు, 1145 వ సంవత్సరమునందు పెనుగొండ (పురవరాధీశ్వరుడు) మాదిసెట్టి కొడుకు పోలిసెట్టి పట్టిసములో వీరభద్రేశ్వర స్వామికి 25 గోవులను దానము చేసినట్లు, 1151 వ సంవత్సరమునందు పెనుగొండ పట్టణాధిపతి, వాసయసెట్టి కొడుకు కోసయనసెట్టి కొణిదెనలో చెఱువు త్రవ్వించి, సోమేశ్వరుని ప్రతిష్ఠించి, ఆలయము నిర్మించినట్లు, ఇంకను పెనుగొండ పురవరాధీశ్వరులు వైశ్యులు ఉన్నట్లు పెక్కు శాసనములు కలవు.[20] అంతేకాదు. 1233 వ సంవత్సరమునందు పెనుగొండ శాసనుడు ఆయత సెట్టి ఏలూరులో నారాయణమూర్తికి లక్ష్మీయుత మూర్తిని పెట్టినట్లు శాసనము కలదు.[21] కనుక పండ్రెండు, పదమూడు శతాబ్దులందు శివభక్తులైన వైశ్యులు, విష్ణుభక్తులైన వైశ్యులు పెనుగొండ పురవరాధీశ్వరాది బిరుదాంకితులుగ కలరు. కనుక వైశ్యులు అష్టాదశ పట్టణాధిపతులు అనఁబడిన కాలము ప్రధానముగ పండ్రెండు, పదమూడు శతాబ్దులు కావలయును. కనుక అష్టాదశ పట్టణాధిపతులైన వైశ్యుల ప్రమేయము కల వాసవీకన్య కథ చారిత్రికమైనచో, అది పండ్రెండు పదమూడు శతాబ్దులందు జరుగుటకు అవకాశము గలదు.

కథానాయకుడైన విష్ణువర్ధనుని కొడుకు రాజరాజేంద్రుడు అని మాత్రమేగాక, కథాంతమునందు రాజరాజేంద్రుడు వాసవీ కన్యక సోదరుడైన విరూపాక్ష శ్రేష్ఠికి యౌవరాజ్య పట్టాభిషేకము చేసినట్లు సంస్కృత వైశ్య పురాణమునందు కలదు. (1‒50 శ్లో. 53 అ.) ఇది తెలుగు వైశ్య పురాణము అయిదు ప్రతులందు, ముద్రిత గ్రంథము నందు లేదుగాని, ఒక వ్రాత ప్రతియందు అష్టమాశ్వాసమునందు "విరూపాక్ష పట్టాభిషేకము" అను ఘట్టముగ కలదు.[22] అందు విరూపాక్షశ్రేష్ఠికి పట్టాభిషేకము చేసినది రాజనరేంద్రుడు అని కలదు. ఇట్లు కల తాళపత్రి గ్రంథము లేఖనకాలము 31‒3‒1787 వ తేదీ.[23] అప్పటికి దక్షిణభారత దేశమునందు అధునిక చరిత్ర పరిశోధన ఆరంభము కాలేదు. కనుక ప్రక్షిప్తము కావలసిన ఆవశ్యకము లేదు. కనుక వాసవీ కన్య కథకు సంబంధించిన విష్ణువర్ధనుడు రాజనరేంద్రుని తండ్రి కావలయును.

వేంగిదేశమునందు పరిపాలనము కావించిన తూర్పుచాళుక్య రాజులు, వారి వంశీయులైన చాళుక్య చోళరాజులు అందఱును విష్ణువర్ధనులు అగుదురు కాని, రాజనరేంద్రులు కాఁజాలరు. కాఁజాలిన రాజరాజనరేంద్రులు ఇద్దఱు ముగ్గురే కలరు. ఒకడు తూర్పు చాళుక్యరాజైన, నన్నయ భారతమునకు నాందీవాక్యము పలికిన, మొదటి రాజరాజనరేంద్రుడు. మఱొకడు చాళుక్య చోళ రాజైన ఇమ్మడి రాజరాజనరేంద్రుడు. ఇతడు మొదటి రాజరాజనరేంద్రుని మనుమని (ముని) మనుమడు. ఇమ్మడి కుళోత్తుంగ చోళుని కొడుకు. కాలము 1145‒1173. కనుక వాసవీకన్య కథకు సంబంధించిన విష్ణువర్ధనుడు మొదటి రాజరాజనరేంద్రుని తండ్రి విమలాదిత్యుడు కాక, రెండవ రాజరాజనరేంద్రుని తండ్రి రెండవ కుళోత్తుంగ చోళుడు కావచ్చును.

తెలుగు వైశ్య పురాణమునందు వాసవీకన్య కథకు సంబంధించిన విష్ణువర్ధనుడు, రాజ నరేంద్రుని తండ్రి అని మాత్రమే గాక, రాజ రాజ నరేంద్రుని కొడుకు అనియూడ కలదు.

"గంధర్వపతి చిత్రకంఠుఁడు సొంపున
        వైశ్య శాపమునొంది వసుధ నతఁడు
సోమవంశంబున సురరాజ భోగియై
        రాజ రాజ నరేంద్ర రాజునకును
శుభముహూర్త శుభగ్రహ దృష్టి వేళఁ
        బరమ పాతివ్రత్య భాసయైన
సర్వలక్షణయగు శర్వాణి దేవికి
        వంశవర్ధన విష్ణు వర్ధనుండు
పరగ జనియించి సత్పరిపాలనంబు
సేయుచుండెను శ్రీరామచంద్రు మాడ్కి
తల్లిదండ్రుల గురువుల దైవములను
భక్తిఁ గొలుచుచు నుండెను రక్తితోడ."

ఇందు వంశ వర్ధనుడైన విష్ణువర్ధనుడు శ్యామాంగీ రాజ రాజ నరేంద్రుల కొడుకు అని ఇదమిత్థముగ కలదు. మఱి రెండవ కుళోత్తుంగ చోళుని తండ్రి విక్రమ చోడుడు. కాని విక్రమ చోడునికి రెండవ కుళోత్తుంగ చోళుడు ఔరస పుత్త్రుడు కాడు. స్వీకృత పుత్త్రుడు. కూతురు కొడుకు. కనుక రెండవ కుళోత్తుంగ చోళుని తల్లి శ్యామాంగి నామధేయ, తండ్రి రాజ రాజ నరేంద్ర నామధేయుడు కావచ్చును. పల్లవ రాయన్‌పేట శాసనమును

పరిశీలింప వలయును. అథవా, మొదటి కులోత్తుంగ చోళుని తండ్రి రాజరాజ నరేంద్రుడు కావున, అతడు రెండవ కులోత్తుంగ చోళుని తండ్రిగ, అర్వాచీనాంధ్ర వైశ్య పురాణమునందు ఆపాదితము కావచ్చును; శ్యామాంగి అను పేరు కవిత్వము కావచ్చును.

శక 1164 వ సంవత్సరమునందు "నూటరెండు గోత్రముల వైశ్యుల" సంగతియును ఒక శాసనమునందు కలదు గావున, వాసవీ కన్యకతోపాటు నూటరెండు గోత్రముల వైశ్యులను అగ్నిప్రవేశము చేయుటకూడ అచ్చ చారిత్రికమైనచో, అది 1164వ సంవత్సరము కంటె పూర్వమే జరుగుట కూడ అనుకూలము. కనుక వాసవీ కన్యకతోపాటు నూటరెండు గోత్రముల వైశ్యులను అగ్నిప్రవేశము చేసిన కాలము స్థూలముగ 1150 వ సంవత్సరము కావచ్చును.

ఇదొక సంభావ్యమైన సమన్వయము. కాని, ఇందు సంస్కృత వైశ్య పురాణమునందు పాత్ర వహించిన, తెలుగు వైశ్య పురాణమునకు కర్త అయిన, బమ్మెర పోతనకు అనంతరుడైన భాస్కరాచార్యుల ఉదంతము సంగతము కాదు. అది కూడ సంగతము కావలయును. కనుక మరొక సంభావ్యమైన సమన్వయము కర్తవ్యము.

ఏడవ శతాబ్దినుండి పండ్రెండవ శతాబ్ది వరకు పరిపాలించిన తూర్పు చాళుక్య రాజులు, చాళుక్య చోళ రాజులు మాత్రమే గాక, పదమూడవ శతాబ్దిని వారి వంశీయులును మాత్రమే గాక, పదునాల్గవ శతాబ్ది నుండి పదునారవ శతాబ్ది వరకు విష్ణువర్ధన మహారాజ శబ్ద వాచ్యులు అన్యులు కలరు. అందు వాసవీ కన్య కథకు రంగస్థలమైన పెనుగొండకు సమీపమునందలి పాలకొల్లులోని రామేశ్వరాలయము నందలి శయనాగార స్తంభముమీది శాసనము ఇట్లు కలదు. 26

"స్వస్తిశ్రీ అభ్యుదయ శాలివాహన శకవర్షంబులు ౧౫౧౮ అగు నేటి దుర్ముఖి సంవత్సర ఫాల్గుణ శు ౧౩ శు, స్వస్తిశ్రీ సర్వ లోకాశ్రయ విష్ణువర్ధన మహారాజులైన శ్రీ సాతోడా బెహరా మహా పాత్రులైన శ్రీ శంకర హరిశ్చంద్ర మహారాజులుంగారు సుముహూర్తాన ప్రతిష్ఠ చేసిన [పెరుమాండ్ల నగరము]."

ఇందు "శంకర హరిశ్చంద్ర మహారాజులుంగారు సాతోడా బెహరా మహాపాత్రులు" మాత్రమే గాక, "సర్వలోకాశ్రయ విష్ణువర్ధన మహారాజులు" అని కూడ ఇదమిత్థముగ కలదు. శాసన కాలము 1518 + 78 = 1596 వ సంవత్సరము. (19-2-1597 ?) ఈ విష్ణువర్ధన మహారాజు కాలములోని భాస్కరాచార్యులు-బమ్మెర పోతనకు అనంతరుడగుట, తెలుగు వైశ్య పురాణమునకు కర్త అగుట, సంస్కృత వైశ్య పురాణమునందు పాత్ర వహించుట సంభవము. సంస్కృతాంధ్ర వైశ్య పురాణముల కాలము పదునారు, పదునేడు శతాబ్దులని పూర్వోక్తము. పదునారవ శతాబ్ది అవర విష్ణువర్ధన మహారాజును అసలు విష్ణువర్ధన మహారాజును చేయుటకు చాళుక్య వంశ వర్ధనత్వము, రాజమహేంద్రవర రాజధానీత్వము, రాజ రాజ నరేంద్ర పుత్రత్వ పితృత్వములు భాస్కరాచార్య కల్పితములు కావచ్చును.

కనుక సంస్కృతాంధ్ర వైశ్య పురాణములలోని విష్ణువర్ధనుడు పురాణ పురుషుడు గాక, చారిత్రిక వ్యక్తి అయినచో, అతడు రెండవ కులోత్తుంగ చోళుడుగాని, శంకర హరిశ్చంద్రుడు గాని కావచ్చును. అటు నిటు సాధకములు, బాధకములును కలవు. కనుక వాసవీకన్య కథకు సంబంధించిన విష్ణువర్ధనుడు చారిత్రిక వ్యక్తి కాకపోవచ్చును.

సూచికలు

1. ఆంధ్ర కవితరంగిణి, తొమ్మిదవ సంపుటము, పుట 207.
2. భారతి, ఫిబ్రవరి '83, పుట 43.
3. అదే, అక్టోబరు '80, పుట 16.
4. అదే, పుట 17.
5. అదే, పుట 14.
6. అదే, సెప్టెంబరు '72, పుట 18
7. అదే, అక్టోబరు '80, పుటలు 15-6.
8. తెలుగు విజ్ఞాన సర్వస్వము. మూడవ సంపుటము, పుటలు 142-73 & 191-223.
9. ఇండియన్ ఎఫెమెరిస్
10. ఎనిమిదివ వలె, పుట 148.
11. రెండవ వలె, పుట 45.
12. తొమ్మిదివ వలె.
13. ఆరువ వలె, పుట 12.
14. హిస్టరీ ఆఫ్ ది రెడ్డి కింగ్‌డమ్స్, పుట 167.

15. ఏన్టిక్వేరియన్ రిమైన్స్ ఇన్ ది ప్రెసిడెన్సీ ఆఫ్ మెడ్రాస్, పుట 84.

16. రెండు, ఏడు వలె.

17. ఏన్యుయల్ రిపోర్ట్ ఆఫ్ ఇండియన్ ఎపిగ్రఫీ, పుట 37.

18. ఎన్మిదివలె, పుట 282.

19. పదిహేను వలె.

20. రాజరాజనరేంద్ర పట్టాభిషేక సంచిక, పుట 148.

21. దక్షిణ హిందూదేశ శాసనములు, సంపుటము 5, సంఖ్య 171, పుట 65.

22. ఎ డిస్క్రిప్టివ్ కేటలాగ్ ఆఫ్ తెలుగు మేన్యుస్క్రిప్ట్స్ ఇన్ ది మెడ్రాస్ ఓరియంటల్ లైబ్రరీ, వాల్యు. 1, పుట 301.

23. ఒకటి వలె.

24. ఎన్మిది వలె, పుట 211

25. అదే, పుట 208.

26. ఇరువది యొకటి వలె, సంఖ్య 165, పుట 64.

డా॥ కొర్లపాటి శ్రీరామమూర్తి

రాయవాచకం - కృష్ణరాయ విజయం

1983 ఏప్రిల్ నెల భారతిలో అచ్చయిన 'రాయవాచక రచనాకాలము-దాని చారిత్రకత' అనే వ్యాసాన్ని సాహిత్య అకాడమీ 1982లో పునర్ముద్రించిన రాయవాచకానికి పీఠికగా అచ్చయింది. వ్యాసాంత సూచికల్లో దీన్ని వ్యాసకర్త పేర్కొన్నారు కూడా. అకాడమీ తాంబూలం అందుకొన్న అదే వ్యాసాన్ని భారతికి వ్యాసకర్తలు ఎందుకు పంపించినా ఔచిత్యం మాత్రం కొరవడింది. అకాడమీ ముద్రణలో కంటె ఈ మధ్య కాలంలో అపూర్వమైన సమాచారం వ్యాసకర్తకు అందితే దాన్ని లోకానికి తెలపడానికి వ్యాసకర్త పరిశిష్టవ్యాసం ప్రచురణకి పంపుకొనడంలో ఔచిత్యం ఉంది. ముందుగా అకాడమీకి నిర్దిష్టమైన దానిని మరో పత్రికకు 'అమ్మడం' తప్ప వ్యాసంలో చెప్పుకోదగ్గ అత్యద్భుత పరిశోధన ఏదీ కూడా లేదు. మొదటిదాని కి రెండోది నకలు.

అయితే "శవాన్నయినా వ్యాకరణయుక్తంగా కట్టమంటాడు జయంతి రామయ్యపంతులు" అనిశెట్టి లక్ష్మీనరసింహంగారన్నట్లు శీర్షికలు, ఉపశీర్షికలు, అధస్సూచికలు, అనుబంధాలు సాంప్రదాయ సిద్ధంగా వ్యాసకర్త అలంకరించడానికి చేసిన ప్రయత్నం మాత్రం మెచ్చుకో తగింది. ఇది ఈనాటి సాహితీ, చారిత్రక పరిశోధకుల ఫేషన్.

ఇది ఇలా ఉండగా కుమార ధూర్జటి కృష్ణరాయ విజయాన్ని సాహిత్య అకాడమీ 1981లో పునర్ముద్రించింది. దాని పీఠికా కర్తలు కూడా డా. సి. వి. రామచంద్రరావుగారే. ముద్రణలు ఎప్పుడు వెలసినా డా. రావుగారు నెల్లూరు చిరునామాతో 80 నవంబరు 1 వ తేదీకే రెండింటికి పీఠికలు రాశారు-అకాడమీ కోరికపైన.

రాయవాచక వచనానికి కృష్ణరాయ విజయం పద్యచ్ఛాయ కాబట్టి రెండు గ్రంథాలు ఒకరికే అకాడమీ అప్పగించడం మంచిదే.

విజయనగర చరిత్రకు అతిముఖ్యమైన సారస్వతాధారం రాయవాచకం అని, స్వర్ణఖని అని చెప్పిన వ్యాసకర్త కేవలం రాయవాచక, కృ. రా. వి. రచనల కాల నిర్ణయాలకే పీఠికలను వినియోగించే రెండుకు ? కవుల కాల నిర్ణయాలు, పాఠభేదాలు చర్చించే కాలమా ఇది ! కృ. రా. విజయంలో లేకపోయినా రాయవాచకంలోని అపూర్వ విషయాలను ఈనాటి వారికి తెలిసేటట్లుగా చెప్పవచ్చుకదా ! కాల నిర్ణయానికి అనవసర యుక్తులు చూపించారు. అయినవారిని, కానివారిని ప్రామాణికులుగా పేర్కొన్నారు. వీరేశలింగంపంతులు, నేలటూరి పొరబడ్డారన్నారు. మరి వ్యాసకర్తే పొరబాటుగా పైవారి రచనలను గ్రహించారంటే ఏమవుతుంది ?

కందుకూరి వీరేశలింగంపంతులుగారు ఆంధ్రకవుల చరిత్ర మూడు భాగాలలో రాశారు. మొదటి భాగాన్ని (1917) ఆయన బతికున్న రోజుల్లోనే పరిష్కరించి ప్రకటించారు. అపరిష్కృతమైన రెండు, మూడు భాగాలను 1950లో రాజమండ్రి హితకారిణీ సమాజం ప్రకటించింది.

తెలుగుదేశ చరిత్రలో సాహిత్యపరమైన వ్యాసాలు రాయవలసి వచ్చినప్పుడు వీరేశలింగం పంతులుగారి పై మూడు సంపుటాలు 'ఏదో చదివేం' అని కాకుండా నిదానంగా చదవాలి. అట్లా చదివిన వారిలో మానవల్లి, వేటూరి, నిడుదవోలు, నేలటూరి, కొమర్రాజు, మల్లంపల్లి. డా. రావుగారు కవి చరిత్రకారులు పొరపాటు పడ్డారని ఈ క్రింది విధంగా రాశారు.

కృష్ణరాయ విజయం కృతిభర్త - "చినవెంకటాద్రి కాల నిర్ణయ విషయంలో చాలామంది చరిత్రకారులు, కవి చరిత్ర కారులు పొరపాటు చేశారు. ఏలనో కందుకూరి వీరేశలింగం పంతులు ఈ ఆర్వీటి చినవెంకటాద్రిని అకువీటి చినవెంకటాద్రిగా పొరపడినాడు" (కృ. రా. వి. పీఠిక XX పుట).

◆ ◆

"కుమార ధూర్జటి తన కావ్యముల ఆశ్వాసాంత గద్యలలో అవతారికా పద్యాలలో తనను 'ధూర్జటి పౌత్ర' అని చెప్పుకొన్నది ఆధారంగా వీరేశలింగం కృష్ణరాయవిజయం 1550 ప్రాంతంలో రచింపబడి ఉంటుందని కుమార ధూర్జటి 1560 - 70 ల వరకు జీవించి ఉంటునని భావించారు." (అదే పుట)

వీరేశలింగం పంతులుగారు కొన్నిచోట్ల భ్రమ ప్రమాదాలకు లోనైనా తరవాత సందర్భం వచ్చినపుడు సర్దుకొంటూ వచ్చారు. కవుల చరిత్ర మూడో భాగంలో ధూర్జటి వెంకటరాయ కవిని గూర్చి రాస్తూ ఈ విధంగా తెల్పారు.

"ఈ కుమార ధూర్జటి తాను కృష్ణదేవరాయల కాలములో నుండి కాళహస్తి మాహాత్మ్యమును రచించిన ధూర్జటి కవికి మనుమఁడైనట్టు తన కృష్ణరాయవిజయమున వ్రాసికొని యున్నాఁడు. 1520 వ ప్రాంతమునందుఁ గృష్ణదేవరాయల కాలములో నుండిన ధూర్జటి కవి మనుమని కొడుకగు లింగకవి 1730 వ సంవత్సర ప్రాంతమునం దక్కరాజు వేంకటపతి కాలములో నన్నఁగా నిన్నూఱు సంవత్సరముఁల దరువాత నుండుట పొసఁగ నేరదు. కాబట్టి కుమార ధూర్జటికి ధూర్జటి సరిగా తాత కాక తాత వరుస వాఁడయి యుండవచ్చును. అందుచేతనే కాఁబోలుఁ గుమార ధూర్జటియే యొకచోట ధూర్జటిని దన పెదతాతనుగాఁ జెప్పు కొన్నాఁడు. ఈ లింగకవియుఁ, దన తండ్రిని ధూర్జటి మనుమనిగాఁ జెప్పక 'ధూర్జటి వంశ పాథోధిచంద్ర' యని తద్వంశజునిగా మాత్రము చెప్పినాఁడు. కుమార ధూర్జటి చిన వెంకటాద్రీశ్వరుని యాజ్ఞాప్రకారముగాఁ దాను కృష్ణరాయ విజయము చేసితినని చెప్పు కొన్న చిన వేంకటాద్రి నరపతి కృష్ణరాయవిజయ కృతిపతి యగు కోదండరామరాజు యొక్క రెండవ కుమారుడగు చినవేంకటాద్రి యైనచో నీ కాలనిర్ణయమించుమించుగా సరిపోవును." (ఆంధ్రకవుల చరిత్ర, తృతీయ భాగం, ఆధునిక కవులు 1950, పుటలు 129-130.)

కవుల చరిత్ర మూడో సంపుటాన్ని ప్రొఫెసర్ రావుగారు చదవక పోబట్టి, అనవసరంగా కాలనిర్ణయ చర్చ పొడిగించారు. అకువీడును, ఆరవీడుగా, పౌత్రుడనగా మనమడి వరసగా చిన వెంకటాద్రి అరవీటి చిన వెంకటాద్రిగా అన్మదాదులు అక్షింతలు వేయక మునుపే వీరేశలింగం పంతులుగారు మూడోసంపుటంలో సవరించుకొన్నారు.

ఇక రా. వా. పీఠిక VI లోను, కృ. రా. వి. పీఠిక XX లోను కృ. రా. వి. కృతి భర్త చిన వెంకటాద్రిని గుర్తించడంలో నేల టూరి వేంకటరామయ్యగారు పొరపాటు పడ్డారని డా. రావుగారు అన్నారు. ఆ పొరపాటుకి కారణమేమిటో సోర్సెస్ ఆఫ్ విజయ నగర హిస్టరీ పుట 311 ఫుట్‌నోట్ చూస్తే తెలిసిపోను కదా! అది చూడలేదని తెలుస్తోంది. హిస్టరీ పాఠాలు చెప్పేవారికి కవుల చరిత్ర ఈసడింపు కావచ్చు. సోర్సెస్ వారికి మొదటి తరగతి వాచకం గదా!

కవికర్ణ రసాయనం లోని పద్యాలు రా. వా. కంలో ఉన్నా యని మొదట చూపినవారు నిడుదవోలు వేంకటరావుగారు. (చూ. దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయం). రా. వా. పద్యాలను గుర్తించుటకు పీఠికా కర్తకు సాధ్యం కాలేదని ఒప్పుకోనప్పుడు (L III, పై విషయాన్ని ఎందుకు ఒప్పుకోలేక పోయారో? కనీసం గుర్తించిన పద్యాలకు అకరాలైనా చూపలేక పోయారే. పైగా "ఏవంక జూచిన" అనే సీసపద్యం మన మెవ్వరయినా గుర్తిస్తే- సీ రా. వా. కాల నిర్ణయానికి తోడ్పడుతుందట!

విజయనగర నిర్మాణం కాలనిర్ణయం గురించే చెప్పారు. కాని ముల్లండ్ర డిండిమపుంభార సరస్వతిని గూర్చి గాని, విద్యా రణ్యులవారు కాశీలో దర్శించిన వేదవ్యాసుడనే యతినిగూర్చి కాని ఒక్క ముక్కయినా విదల్పలేదే. శ్రీనాథుని కాలం నుండి విజయ నగర దొరల ఆస్థాన విద్వాంసులుగా పేరొందిన ముల్లండ్రం అరుణగిరినాథాది డిండిమ సార్వభౌముల పండిత కుటుంబాన్నిగూర్చి డా. రావుగారు వినలేదేమో! కృ. రా. వి. లో ముల్లండ్రం వంశం పేరు లేదు రాయవాచకంలో కదా!

విజయనగర స్థాపన విషయంలో కర్ణాటకంలో వీరశైవులకు అద్వైతులకు కొంతకాలం క్రితం జరిగిన వాదోపవాదాలను గూర్చి కూడా డా. రావుగారు వినలేదు కాబోలు. విద్యారణ్యులు కాదు కాశీవిలాస క్రియాశక్తి విజయనగర స్థాపకుడని ఒక వాదన అక్కడ లేచింది. రా. వా. లో విద్యానగర స్థాపన నిమిత్తం విద్యారణ్యులు కాశీకి వెళ్ళి అక్కడ వికృత వేషధారిగా అయనకు కనబడిన వ్యక్తి శైవాచారంలోని వామ శాఖకు చెందిన అవ తారంగా డా. రావుగారికి గోచరించటం లేదా? మాధవుని గురువు కాశీవిలాసక్రియా శక్తిగా సూతసంహిత వ్యాఖ్యలో చెప్పుకోలేదా? రా. వా. లో జంగమువాడు భిక్షాటనకు వచ్చి శంఖనాదం చేసి ముహూర్తం తప్పించలేదా?

వీర నరసింహరాయలు ఆరాధ్య నామావళులు బ్రాహ్మీ ముహూర్తాన్నే లేచి వినేవాడని రా. వా. ఓం ప్రథమంలోనే ఉంది. ఆరాధ్య నామావళులు పాల్కురికి సోమనకృతి. పండితారాధ్య చరిత్రలో ఉంది. విడిగా ఉంది. పైగా వీరనరసింహరాయలు "విభూతి ధరియించి" పేరోలగానికి వచ్చేవాడని కూడా ఉంది. అప్పుడు ఆరాధ్య పీఠాలు కూడా ఉన్నట్లు చెప్పబడింది. ఇవన్నీ క్రాశీవిలాసక్రియాశక్తివాదానికి తోడ్పడటం లేదా !

ఇకపోతే రా. వా. లో (పుటలు 13-18) 'సభాపతి వచనం' అనేది ఉంది. 1922 లో వేటూరి ప్రభాకర శాస్త్రిగారు చాటుపద్య మణి మంజరి ద్వితీయభాగం చివర అచ్చు వేసిన నోటీసు ఇది పరిశోధకుల కందరికీ తెలిసిన విషయమే. ఇది తెలియక, ఎన్ని పుట్నోట్లు? ఎంత అనవసర ప్రసక్తి. ఈ సభాపతి వచనాన్ని తంజావూరి నుండి నకలు తెప్పించి కర్నూలు జిల్లా డోన్ తాలూకా ఉ. కొత్తపల్లి 'గాయత్రీ ప్రచురణలు' సంస్థ డా. రావుగారి పీఠికా రచనకు ముందే ప్రత్యేక గ్రంథంగా అచ్చువేసిన విషయం వ్యాసకర్తకు తెలియదంటే నమ్మటానికి వీలుంది.

అనేరత భూపాలుని సిద్ధవటం శాసనం లభించడమేమిటి? భూమిలోంచి పైకి తీసినట్లు 15, 20 సంవత్సరాలనుండి తెలుగు ఎం. ఏ. విద్యార్థులందరికి కొట్టినపిండి. కొందరికి జిహ్వాగ్రం మీద కూడా ఉంది ('శాసన పద్యమంజరి' ప్రతులు దొరక్క).

అర్థ వివరణలు విమర్శించాలంటే పాఠకులకు తలనొప్పి, ఈ వ్యాస రచయితకు కరదీగరుడసేవ. చిన్న విషయం- "కర్తారుడు ముస్లిం దేవత కాదు" అని (84 వ పుట) అర్థ వివరణలో ఇచ్చారు. "కర్తారుడుండు తురక్కల మశీదు" అని క్రీడాభిరామంలో ఉంది.

కృష్ణరాయ విజయం రాయవాచకాన్ని దగ్గర పెట్టుకొని కుమార ధూర్జటి అరవీటి కోదండ రామరాజు చిన్నకొడుకు చిన వెంకటాద్రి ప్రేరణచే శ్రీ రాములవారికి అంకితం ఇచ్చింది. రాయ వాచకానికి నూరేళ్ల తర్వాత పుట్టిందని ఇప్పటికి అందరూ తీసుకొన్నట్లుగానే ఒప్పుకొంటాం.

ఇందులో కూడా డా. రావుగారు కుమార ధూర్జటి కృతిపతి చినవెంకటాద్రి కాలానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. రాయ వాచకాన్ని ఎట్లా కు. ధూ. అనుసరించాడో పనికిరాని రెండు అంశాలు చెప్పి దాటేశారు.

రామ రాజీయంలో కోదండ రామరాజు అసనపురం (హసన్) వద్ద మైసూరు దళవాయి కుమారయ్యను ఎదుర్కొన్నాడు (రామ. రా. 480 పద్యమాలిక). కుమారయ్య మైసూరు చిక్కదేవ రాయుని దళవాయి. 1673 లో దొడ్డ బేలూరుతో చిక్కరాయల శాసనంలో కుమారయ్య పేర్కొనబడ్డాడు. క్రీ. శ. 1674 లో కుమారయ్యపై కోదండ రామరాజు దండెత్తి ఉండవచ్చునని సి. హయవదనరావు హిస్టరీ ఆఫ్ మైసూర్ (1399 - 1799) 276వ పుటలో రాశారు. కోదండ రామరాజు రెండో కొడుకు చినవెంకటాద్రి 1700 - 1725 మధ్య ఉండటంలోను కృతిని స్వీకరించటంలో ఆశ్చర్యమేముంది ?

ద్విపద రామాయణ కృతికర్త కట్టా వరదరాజు తండ్రి హరిదాసరాజు 1680 లో శాసనం వేయించాడు. అంటే వరదరాజు 1650 లో ఉన్నాడట మాట. మరి వరదరాజు మనుమరాలు, అప్పలరాజు కూతురు, అర్వీటి కోదండ రామరాజు భార్య అయిన తిరువెంగళాంబ 1710 ప్రాంతంలో ఉండొచ్చుకదా (రామరాజీయం) కోదండరామరాజు రెండో కొడుకు కృ. రా. వి. కృతిపతి వీరేశలింగం పంతులు గారు చెప్పినట్లు 1730 లో ఉండటం అసంభవం కాదు కదా!

కొత్త ఆలోచనలతో కాలం నిర్ణయించడానికి ఈ విధంగా వీలుంటుంది, ఇంతకు పూర్వం పండితుల వ్రాతలను, గుది గుచ్చటం, ఇప్పటి సిద్ధాంత గ్రంథాలలోని అభిప్రాయాలను మధ్య మధ్య పానీయం సమర్పయామిలా తయారు చేస్తే కొత్తసంగతులు బయట పడే దెప్పుడు? అక్కిరాజు ఉమాకాంతం గారు పల్నాటి వీరచరిత్ర భూమికలో చెప్పినట్లు మనం ఇంకా "ఎత్తి వ్రాసుకొనే దశ"లోనే ఉన్నాం.

రాయలవారు, ఉభయదేవేరుల తామ్ర ప్రతిబింబాలు తిరుమలలో స్వామివారి సన్నిధిని ఎప్పుడు నిలిపిందీ స్పష్టంగా తెలియక పోవటం నిజమే కాని తిరుపతి శాసనాలను కాస్త ఓపికతో తిరగవేస్తే వాటి సంపాదకులు ఏమన్నారో తెలుస్తుంది కదా ! క్రీ. 1518 సంవత్సరంలో అవి వెలసినట్లు డా. రావుగారన్నారు. టి. టి. డి. శాసనాల సంపాదకులు మాత్రం 1517 ఫిబ్రవరి 2 వ తేదీన రాయలవారు తమ సమక్షంలో పోత పోయించినట్లు నిర్ణయించారు. (చూ. కృష్ణరాయల శాసనాలు, పుట 175, టి. టి. డి. రిపోర్టు 186 వ పుట). పేయసీ, అల్లసాని పెద్దన వర్ణించిన తీరులో రాయలవారి విగ్రహం ఉన్నదని వారు చెప్పారు. టి. టి. డి. దేవస్థానం పూర్వంలో ప్రచురించిన శాసనాల్లోని ఇంగ్లీషు అనువాదాలు, రిపోర్టు సంపుటం చదివి చాలామంది పెద్దలు కాలం గడిపేశారు. కాని తమిళ మూలం చదివి ఆశ్చర్యకరమైన విషయాలు, భాషాప్రయోగ వైచిత్రి గుర్తించిన వారెందరు ?

అందుగుల వెంకయ్య రాసిన రామరాజీయం లేదా నరపతి విజయం కృష్ణరాయ విజయ కృతికర్త చిన వెంకటాద్రి అన్న పెద వెంకటాద్రి వర్ణనతో అసంపూర్తిగా ఆగిపోయింది. దీనికి కారణం చెప్పలేం. తన వర్ణనలేని కారణం చేతనో, అవమానం చేతనో తండ్రి రామరాజీయం రాయిస్తే, కుమారుడు చిన వెంకటపతి ఆ రామరాజు మావగారి చరిత్రను రాయించాడు. రామరాజీయ పరిష్కరణలో గస్టవ్ ఆపర్ట్‌కి తోడ్పడిన వారు భారతవర్ష ప్రథమ మహా మహోపాధ్యాయ బిరుదాంచితులు కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు.

మొత్తం మీద రాయవాచక, కృష్ణరాయ విజయ పునర్ముద్రణల వల్ల సాహితీ శోధకులకు పుస్తకాలు లభించేటట్లు సాహిత్య అకాడమీ చేసిందే కాని వాటి పీఠికలు మాత్రం ఆ రంగంలో పని చేసిన వారికి ఏ మాత్రం సంతృప్తి పరచలేక పోవటమే కాక ప్రధాన గ్రంథాలలోని అపూర్వ విషయాలను అవిష్కృతం చేయలేనట్టి నీరస స్థితిలో ఉన్నాయని చెప్పటానికి వీలు కల్పించాయి. అకాడమీకి జమాఖర్చులు, పీఠికాకర్తలకు పేరు ప్రధానమవి ఈ పీఠికలే కాకుండా ఇటీవల వెలువడిన ప్రాచీనాంధ్ర గ్రంథాల పీఠికలు ఋజువు చేస్తాయి. అవకాశ మున్నప్పుడు వాటికో రేవు పెట్టవచ్చు.

— ఒక పాఠకుడు

గ్రంథ విమర్శలు

శ్రీ దేవీ భాగవతం

[వ్యావహారిక వచనకావ్యం. రచయిత: కవికిశోర, కవితావిశారద, కవితావతంస, విద్వాన్ శ్రీ పూడి వేంకటరామయ్య. డెమ్మీ సైజు. మొదటి సంపుటం. 1, 2, 3 స్కంధములు 16+274 పేజీలు. వెల 15 రూపాయలు. రెండవ సంపుటం. 4, 5 స్కంధములు. 268 పేజీలు. వెల 15 రూ. ప్రతులకు - శ్రీ పి. శివకుమార్, 486, కొండమిట్ట, శ్రీకాళహస్తి - 517 644, చిత్తూరు జిల్లా.]

భారత భాగవత రామాయణాల తర్వాత ఎక్కువగా ప్రజామోదాన్నీ, బహుళ ప్రచారాన్నీ పొందిన గ్రంథాలలో దేవీభాగవతం ఒకటి. దీనిని యిదివరలో దాసు శ్రీరాములుగారు, తిరుపతి వేంకటకవులు, పురిపండా అప్పలస్వామిగారు, సరిపెల్ల విశ్వనాథశాస్త్రిగారు, స్థానాపతి రుక్మిణమ్మగారు తెలుగులోకి తర్జుమా చేశారు. పిలకా గణపతిశాస్త్రిగారు ఆంధ్రపత్రికలో అనుస్యూతంగా ప్రకటించారు. పిల్లలకు ఉద్దేశించిన చందమామలో కూడా ఇది పడింది. ఇప్పుడు పూడి వెంకటరామయ్యగారు వ్యావహారిక భాషలో దీన్ని రచించి ప్రకటిస్తున్నారు. కొంత కాలం క్రిందట రచయిత సంస్కృత మూలంలోని కొంత భాగం పారాయణ చేస్తున్నప్పుడు దీనిని తెలిగించాలనే సంకల్పం కలిగింది. దీక్షతో అనువాదాన్ని పూర్తి చేశారు. ప్రస్తుతం రెండు సంపుటాలలో అయిదు స్కంధాల వరకూ ప్రకటించారు. శ్రీ దేవీ భాగవతం చాలా పెద్ద గ్రంథం కావడం వల్ల రచయిత దీనిని నాలుగయిదు సంపుటాలుగా ప్రకటించదలచారు. ఇంత పెద్ద గ్రంథాన్ని ముద్రించడానికి ఎన్నో వేల రూపాయలు కావలసి ఉన్నది. తిరుమల తిరుపతి దేవస్థానాల వారూ, శ్రీకాళహస్తిలోని శుక బ్రహ్మాశ్రమాధిపతులూ, ఇతరులైన వదాన్యశేఖరులు, మిత్రులూ ఆర్థిక సహాయం చేసి దీని ముద్రణకు ఎంతో తోడ్పడినట్లు రచయితయే చెప్పుచున్నారు.

పురాణాలన్నీ ఏదో ఒక్క గాథనే చెప్పకుండా పెక్కు విషయాలను చెప్పుతూ ఉంటాయి. భాగవతాదుల్లో రామాయణ కథ కూడా కానవస్తుంది. భారతంలో కౌరవ పాండవుల వృత్తాంతమే కాకుండా సందర్భానుసారంగా ఎన్నో గాథలు, పూర్వరాజుల వృత్తాంతాలూ చెప్పబడి ఉన్నాయని అందరికీ తెలుసును. ఆ రీతిగానే యీ దేవీ భాగవతంలో కూడా దేవీ మాహాత్మ్యం మాత్రమే కాక అవతారాలకు సంబంధించిన కథలు, ఇతర కథలు కూడా ఉన్నవి.

మొదటి సంపుటంలోని విషయ సూచికలో - మొదటి స్కంధంలో శౌనకుని ప్రశ్న, పురాణ సంఖ్య, హయగ్రీవావతారం, మధుకైటభ వృత్తాంతం, పురూరవుడు, వ్యాస శుక సంవాదం, జనక శుక సంవాదం, ధృతరాష్ట్రాదుల జననం ఉన్నవి. రెండవ స్కంధంలో మత్స్యగంధీ వ్యాసుల జననం, గాంగేయుని జననం, సత్యవతీ శంతనులు, యుధిష్ఠిరాదుల చరిత్ర, ధృతరాష్ట్రాదుల మరణం, పరీక్షితుని, జనమేజయుని చరిత్రలు, వ్యాస జనమేజయ సంవాదం ఉన్నవి. మూడవ స్కంధంలో దేవీ స్వరూపం, బ్రహ్మాదులు భువనేశ్వరిని దర్శించడం, త్రిమూర్తులు భువనేశ్వరిని స్తుతించుట, బ్రహ్మాండోత్పత్తి, సత్త్వాది గుణ స్వరూపం, సత్యవ్రతోపాఖ్యానం, దేవీయజ్ఞ విధి, దేవీ వ్రతం, సుదర్శనుని కథ, నవరాత్ర వ్రత మాహాత్మ్యాలు, శ్రీరామచరిత్రం ఉన్నవి. కాని యివి ఏయే పేజీలలో ఉన్నవీ చెప్పబడలేదు. పేజీలను సూచిస్తే పాఠకులకు సౌకర్యంగా ఉండేది.

రెండవ సంపుటంలో విషయ సూచిక లేనే లేదు. పేజీలను తిరగవేస్తూ, హెడ్డింగులను చూస్తూ, విషయాలను గ్రహించ వలసినదే! నాల్గవ స్కంధంలో శ్రీకృష్ణ జన్మ కారణ ప్రశ్న, కర్మగతి, అదితికి శాపం, సంసార విముక్తికి ఉపాయం, ఇంద్రుని యీర్ష్య, మన్మథుని దండయాత్ర, ప్రహ్లాద నారాయణుల సంగ్రామం, భృగు శాపం, శుక్ర వృత్తాంతం, కృష్ణావతార గాథ ఉన్నాయి. అయిదవ స్కంధంలో శివకృష్ణుల ఉత్కర్షాపకర్షలు,

మహిషాసురుని కథ, దేవీప్రాదుర్భావం, దేవీమాహాత్మ్యం, లోక కల్యాణం, శుంభ నిశుంభులు, శుంభుని వధ, సురథ సమాధుల కథ అనే శీర్షికలు ఉన్నవి. వీటిలో "మహిషాసురుని కథ" అనే శీర్షికలు, "శుంభ నిశుంభుల కథ" అనే శీర్షికలు, "సురథ సమాధుల కథ" అనే శీర్షికలు చాలా ఉన్నాయి. అందువల్ల పాఠకులు సంపూర్ణంగా చదివితే గాని కథ ఎక్కడ ప్రారంభమయ్యేదీ తెలియదు. ఇలాటి పెద్ద పుస్తకాలలో విషయ సూచికను పేజీల సూచనతో సహా సరియైన పద్ధతిలో చేర్చడం ఎంతో అవసరం.

రచయిత సంస్కృతాంధ్రాలలో విద్వాంసులు. ప్రాచ్య కళాశాలలో అధ్యాపకులు. అందువల్ల సామాన్యులకు సులభంగా బోధపడేటట్లు వ్రాయగలవారు. అందువల్లనే యీ గ్రంథం సులభంగా బోధపడే సరళ శైలిలో కూర్చబడింది. అక్కడక్కడ మూలంలోని శ్లోకాలూ, వాటి అభిప్రాయం ఇవ్వబడినవి. ఒక్క ఉదాహరణ -

"బ్రహ్మా సృజ త్యవతి విష్ణు రిదం మహేశః
శక్త్యా తవైవ హరతే నను చాన్తకాలే,
ఈశాని తేఽపి చ భవంతి తయా విహీనా
స్తస్మాత్ త్వమేవ జగతః స్థితినాశకర్త్రీ.

కీర్తి ర్మతిః స్మృతిగతీ కరుణా దయా త్వం
శ్రద్ధా ధృతిశ్చ వసుధా కమలా జయా చ,
పుష్టిః కళా థ విజయా గిరిజా జయా త్వం
తుష్టిః ప్రమా త్వమసి బుద్ధి ఉమా రమాచ.

[రెండవ సంపుటం, పుట 181]

పై మూలానికి అభిప్రాయం

"తల్లీ! జగన్మాతా! నీ చెంతనుండి శక్తిని పొంది బ్రహ్మ విష్ణు మహేశులు సృష్టి స్థితి సంహారాలు కొనసాగిస్తున్నారు. వాళ్లు శక్తి విహీనులైతే ఆ కార్యాలు చేయలేరు. అంచేత నిజంగా నీవే సృష్టి స్థితి సంహారాలు కొనసాగిస్తున్నావు. కీర్తీ, మతీ, స్మృతీ, గతీ, కరుణా, దయా, శ్రద్ధా, ధృతీ, వసుధా, కమలా, జయా, పుష్టీ, కళా, విజయా, గిరిజా, తుష్టీ, బుద్ధీ, ఉమా, రమా, నీవే.... [పుట 182]

శ్రీ కాళహస్తి నివాసులు, సుప్రసిద్ధ విద్వాంసులు, అరుణాచల కృష్ణమూర్తి ఘనపాఠి గారు దీనిపై సదభిప్రాయాన్ని ఇచ్చారు. సులభంగా దేవీభాగవతాన్ని తెలిసి కొనుటకు ఈ గ్రంథం ఉపయోగ పడుతుంది.

"ఆంగీరస"

వెన్నెల వెలుగులు

[పద్మభూషణ్ శ్రీ వెన్నెలకంటి రాఘవయ్య జీవితచరిత్ర. సంకలనం, రచన : అడ్డుమిల్లి పూర్ణచంద్రరావు. ప్రచురణ : ఆంధ్రరాష్ట్ర ఆదిమజాతి సేవక్ సంఘ్, కస్తూర్బాపేట, విజయవాడ-520 010. వెల : లేదు.]

ఆదిమ జాతులను మానవులుగా తీర్చిదిద్దటానికి జీవిత సర్వస్వం సమర్పించిన శ్రీ వెన్నెలకంటి రాఘవయ్య ఆదిమ జాతుల అంధకారానికి వెన్నెల వెలుగుకే. ఆయన జననం 1897 జూన్ 4. మహాప్రస్థానం 1981 నవంబరు 24. రాఘవయ్యగారు ఆంధ్రప్రదేశ్‌లోని ఎఱుకలు, యానాదులు, ఇతర ఆది వాసుల అభ్యున్నతికి జీవితమంతా కృషి చేశారు. ఆయన కృషిలో అధిక భాగం నెల్లూరు జిల్లాకు పరిమితం కావటం సహజమే. ఆదివాసులు కూడా మనందరివంటి వారే. నిజానికి వారే భూమి పుత్రులు. ప్రకృతి అందరి సొమ్ము. దానికి పాక్షికత్వం లేదు. ప్రకృతి మాతకు వారు ముద్దు బిడ్డలు.

పెక్కు చారిత్రకాది కారణాలవల్ల ఎఱుకలు, యానాదులు ఇతర ఆదివాసుల వారు సంఘంలో వెనుకబడి పోయారు. సమాజంలోని ఇతరు తోపాటు వారు అభ్యున్నతిలో భాగస్వాములయినపుడే స్వరాజ్యం సార్థకమవుతుందని మహాత్మ దేనాడో ప్రబోధించారు. ఆ ప్రబోధాలను కీర్తిశేషులు ఉన్నవ లక్ష్మీనారాయణ గొల్లపూడి సీతారామశాస్త్రి గారలు ఒక రంగంలో ఆచరణలో పెట్టారు. వెన్నెలకంటి రాఘవయ్యగారు ఆదివాసుల అభివృద్ధికే జీవితాన్ని అంకితం చేశారు. ఎఱుకలు, యానాదుల ఆర్థికాభ్యున్నతికీ, వైజ్ఞానికాభ్యున్నతికీ అవిరళ కృషి చేసిన మహనీయుడు వెన్నెలకంటి రాఘవయ్య. ఆదివాసులకు ఆయన చేసిన సేవలను ఈ 166 పుటల పుస్తకంలో పరిచయం చేశారు. ఇది సమగ్ర జీవిత చరిత్ర కాదు. సంఘ సేవ పట్ల యువ తరం శ్రద్ధాసక్తులను పెంపొందించడానికి ఈ పుస్తకం బాగా ఉపయోగ పడుతుంది. "అలవాటు పడిన నేరస్థుల చట్టం" బ్రిటిష్

పాలకులు ప్రవేశ పెట్టినది. ఆ చట్టం రద్దయిన తర్వాత కూడా పోలీసులు కొన్ని తెగలవారిపై దానిలోని నిబంధనల ప్రకారం చర్యలను కొనసాగించారు. శ్రీ రాఘవయ్య గారి నాయకత్వాన రాష్ట్ర ఎరుకల సంఘం అవిరళ కృషి చేసింది. 1951లో రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ మద్రాసులో విడిది చేసినప్పుడు రాష్ట్రఎరుకల సంఘం ఆయన చేసిన విజ్ఞప్తిని సమర్పించింది. ఆయన జాతీయవాదియే అయినా విశాల మానవతా దృక్పథం కలవాడు. ఇటువంటి జీవిత చరిత్రలను వ్రాసేప్పుడు మరింత పరిశీలన జరపాలి. సాధ్యమయినంత వరకూ నిష్పాక్షికంగా వ్రాయగలగాలి ఏమయినా "పద్మభూషణ్" వెన్నెలకంటి రాఘవయ్యగారి జీవితం యీనాటి యువకులకు పరిచయం చేసే మంచి పుస్తకం యిది.

శ్రీ వి. ఎస్. అవధాని

రామాయణ తనిశ్లోకి

[పెరియవాచ్చాన్పిళ్ళ వ్యాఖ్యానానికి శ్రీ చిలకపాటి వేంకట రామానుజశర్మగారి ఆంధ్రానువాదం. 93 పేజీలు. వెల : 10 రూ. లు. ప్రతులకు : శ్రీ గోదా గ్రంథమాల, ముసునూరు - 521 207, కృష్ణా జిల్లా.]

ఆంధ్ర వైష్ణవులు వైష్ణవ సాహిత్యం విషయంలో తమిళ గ్రంథాలను పరమ ప్రమాణంగా భావించడం జగద్విదితం. దివ్య ప్రబంధాన్ని అర్థం తెలియకున్నా పారాయణంచేసే భక్తులు ఇంకా అక్కడక్కడ కనిపిస్తారు. ఆళ్వారుల అద్భుతచరిత్రలను, స్తోత్రాలను అనుసంధానం చేసుకొంటూ సోలిపోతూ ఉంటారు. ద్రావిడ వైష్ణవుల్లో సంస్కృత భాషలో మహా పండితులయిన వారు పలువురున్నారు. వారిలో పెరియవాచ్చాన్ పిళ్ళ చెప్పదగినవాడు. ఆయన వాల్మీకి రామాయణంలోని కొన్ని ప్రముఖ శ్లోకాలకు తమిళభాషలో 'తనిశ్లోకి' పేరిట వ్యాఖ్యానం వెలయించాడు. 'తని' అనే పదానికి 'ప్రత్యేకమైన, ఒంటరి, విశిష్టమైన' అనే అర్థాలున్నాయి. అలాంటి కొన్ని శ్లోకాలు ఎంపిక చేసి అతివిపులమైన వ్యాఖ్యానం సంతరించాడు. ఒకొక్క శ్లోకానికి పూర్వాపరాల్లో వాల్మీకి, కాళిదాసు ప్రభృతుల శ్లోకభాగాలు అసంఖ్యాకంగా ఉదహరించడం జరిగింది. అక్కడక్కడ తమిళ పద్యభాగాలు కూడా ఉటంకించి వ్యాఖ్యాత తన ప్రాజ్ఞతను ప్రదర్శించాడు.

ఈ ప్రసిద్ధ గ్రంథంలోని 20 శ్లోకాలను ఎంపికచేసి శ్రీ చిలకపాటి వేంకట రామానుజశర్మ గారు శతాబ్దం క్రితం చక్కగా తెనిగించారు. ప్రస్తుత గ్రంథం వాటిలో ఓ ఏడు శ్లోకాలకు వారు వ్రాసిన వ్యాఖ్యానం మాత్రమే. ఈ శ్లోకాల్లో ప్రతి పదమూ సార్థకమే అని నిరూపించడమే వ్యాఖ్యాత లక్ష్యం. అనువాదకులు మద్రాసు నివాసులు కావడం వల్ల కావచ్చు, తమ తెలుగులో అడయాళం (గుర్తు) వంటి తమిళపదాలు ప్రయోగించారు. ఇక తమిళ పద్యభాగాల్లో 'కుట్రం' అనే పదాన్ని 'కుత్తం' అని వ్యావహారికరీతిలో ముద్రించడం కుట్రం (నేరం).

"హరిణీ ఖుర మాత్రేణ చర్మణా మోహితం జగత్" (జింక గిట్టంత స్త్రీ అవయవ విశేషముచే జగత్తంతయు మోహితమై యున్నది.) ఇత్యాది వైరాగ్యపరమైన శ్లోకాలు ఈ గ్రంథానికి వన్నె తెస్తున్నాయి. మొత్తం మీద రామభక్తులంతా పఠించవలసిన గ్రంథం యిది.

శ్రీ పులిచెర్ల సుబ్బారావు

నీడలు (కథా సంపుటి)

[రచన, ప్రచురణ: శ్రీమతి ఆర్. వసుంధరాదేవి, 8-241, సువిశేషపురం, రాజమండ్రి - 4. పేజీలు: 140. వెల: తొమ్మిది రూపాయలు.]

ఈ సంపుటిలో పన్నెండు కథలున్నాయి. ఇవన్నీ 1967-1979 మధ్య కాలంలో 'భారతి' లో ప్రచురింపబడ్డాయి.

చిన్న కథలనుకుని చిటికెలో చదివేవారికి ఈ కథలు అంతు పట్టవు. మనిషి ఆలోచనలు, మనసు చేసే విన్యాసాలు ఈ సంపుటిలోని కథలకు వస్తువు. ఆలోచనలను చిక్కబట్టుకుని స్పష్టమైన వ్యాఖ్యానాలతో కథారూపం కల్పించటం, రచయిత్రి గొప్పతనాన్ని తెలియ జేస్తుంది. ఇట్లాంటి కథలు రాయటం అంత సుళువుకాదని పిస్తుంది కూడా.

వస్తువుకుగానీ, మనిషికిగానీ, ఆకర్షణశక్తివుండాలి. అప్పుడే వాటికి విలువ. ఆకర్షణ శక్తి లేకపోతే బొద్దింకలాంటి అసహ్యకరమైన జీవితో సమానం. బజార్లో ఏ వస్తువైనా కొనాలనుకున్నప్పుడు

క్కువమందిని ఆకర్షించే వస్తువునే కొనాలని వుంటుంది. ఆ వస్తువు ఎంతవరకు ఉపయోగం అన్నది తర్వాత చూస్తారు. మనిషి అంతే. మనుష్యులు-బొద్దింకలూ కథలో- కిష్టుడు పద్నాలుగేళ్ళ పని కుర్రాడు. ఏ పని చెప్పినా తప్పించుకోడానికి చూస్తాడు, అయినా మాటలుచెప్పి నెగ్గుకురాగల సమర్థతవుంది. రామయ్య అలాకాదు. చెప్పినపని మౌనంగా, వినయంగా చేస్తాడు. తండ్రి మాట జవదాటనివాడు. ఒక ఉద్యోగం ఖాళీవచ్చినపుడు, రామయ్యకు కాకుండా, కిష్టుడికి ఇప్పించాలని మనసు అనుకుంటుంది. కిష్టుడికి ఉద్యోగం రావాలి, వస్తే సంతోషిస్తాడు. రామయ్యకు వచ్చినా వాడికి సంతోషించటం తెలీదు. కానీ కిష్టుడుకి రాలేదు, రాకపోవటం చాలాఅన్యాయం అని విచారిస్తుంది మనసు.

'మాయ' కథలో సత్యంమేష్టారు, హెడ్మాస్టారుగా సిరిపాడు గ్రామం వెళ్తాడు. అక్కడ రెండు వర్గాలు - రైతులు, కూలీలు. ఇరుపక్షాలనుంచీ కానుకలూ, సేవలూ స్వీకరించి, ఎవరిపక్షానా నిలవకుండా వాళ్ళకు వేదాంతాన్ని బోధిస్తూ వుంటాడు. పనిమనిషి రత్తితో సంబంధం ఏర్పరచుకున్నాడనే అపోహతో రత్తితాలూకు మనుషులు తాగివచ్చి ఇంటిమీదపడి చావ బాదేస్తారు.

కథ చదివాక ఎందుకిలా జరిగిందీ, ఏమిటీ అనుకుంటే కారణం కనిపించదు. వేదాంతం చెప్తున్న సమయంలో సత్యం మేష్టారు ఒకడు వేసిన ప్రశ్నకు ఇట్లా సమాధానం చెప్తాడు.

'నిజమైన దానికి కారణం వుంటుందిగానీ, లేనిదానికి, మాయకు కారణం ఏముంటుంది?'

కాబట్టి కారణం 'మాయ' అనుకోవాలి. లేకపోతే తన కోసం ఏర్పాటుచేసిన ఇంట్లో అష్టమీ మంగళవారం కృత్తికా నక్షత్రం వేళ కాలు పెట్టడం కారణమా?

ప్రతి విషయాన్నీ అల్పమని త్రోసిపుచ్చే మనసు ఏ పనినీ సరిగా చెయ్యనివ్వదు- ఇది నళిని విషయంలో. అందువల్లనే తన స్వంత వస్తువు అయిన గిన్నెను సరిగా గుర్తించలేక పోతుంది 'గుర్తు' కథలో.

మలినం అంటని మనసు, నిర్మలమైన జీవితం గల దానిగా వుండాలని నిర్మల తాపత్రయం. కానీ సంసార బాధ్యతలు స్వీకరించాక జీవితాన్ని ఆదర్శాల మేరకు నడపటం కష్టమని భావిస్తుంది.

చిన్నతనంలో తమ ఇంట్లో వస్తువులు పోయినప్పుడు తల్లి, ఇంట్లో పనివాళ్ళమీద కేకలేసేది. ఏ ఋజువూ లేకుండా దొంగలైనట్లు నిలదీసేది. ఆ పద్ధతి మంచిది కాదనిపించేది నిర్మలకు. అట్లాంటిది ఇప్పుడు తన ఇంట్లో వస్తువు పోయినప్పుడు ఏం చెయ్యాలి? ఎవరు మంచివారో, ఎవరు చెడ్డవారో తెలుసుకోలేని అశక్తత. ఒక వ్యక్తి మంచివాడని ఋజువయినప్పటికీ, మళ్ళీ ఆ వ్యక్తిమీద ఏదో సందేహం. 'మనసా' నిర్మలంగా వుండటం అసాధ్యం అని చెప్తుంది 'నీడలు' కథ.

పథ్యం సరిగా చెయ్యకుండా కోడలు అదీ ఇదీ తినే మనిషని, పిల్లాడికి అలాంటి తల్లిపాలు ఇస్తే ఎదిగి రాడని తల్లికి దూరంగా పిల్లాడిని వుంచుతుంది అత్తగారు. కోడలికి పిచ్చిపట్టి అత్తగార్ని తిడుతుంది. దాంతో నలుగురూ కోడలిని పట్టుకుని తాళ్ళతో కట్టేసి వొంటిమీది బంగారుబొట్టు గొలుసూ, రెండు గాజులు లాగేస్తారు.

బిడ్డను తల్లినుండి వేరు చెయ్యక పోయినా, పోనీ నగలు లాగేసుకోపోయినా, ఆమెకు పిచ్చి ఎక్కకపోను. తర్వాత బిడ్డను ఆమె దగ్గరకు పంపినా, నగలు ఇచ్చినా పిచ్చి తగ్గేదేమో. తన దగ్గరివస్తువు ఇతరులు బలవంతంగా లాగేసుకుంటే, ఎవరికైనా పిచ్చి ఎక్కుతుంది- కాకపోతే కాస్త ప్రమాణంలో తేడా వుంటుంది, అంతే, అనిపిస్తుంది. 'పిచ్చి' కథచదివాక.

సామాన్య సంసారపుస్త్రీ. ఇంట్లో ఎంతో పని. అన్నీ ఒక్కత్తే చూసుకోవాలి. పిల్లల గొడవ. చేతి వేళ్ళ వాపుల గొడవ. కుష్ఠ రోగమో ఏమో అన్న భయం. వీటన్నిటికీ కారణాలు ఈ పిల్లలే. వీళ్ళే లేకపోతే హాయిగా ప్రశాంతంగా వుంటుంది. ఇలాంటి ఆలోచన వచ్చిన సమయంలో టపాకాయలు పేలి ఆ వీధిలో ఎవరో నలుగురు పిల్లలు చనిపోతే, తన పిల్లలే అనుకుని కంగారు పడిపోతుంది ఓ తల్లి మనసు, 'మచ్చలు' కథలో.

కేవలం సంపద, స్నేహితులు, పార్టీలు, ఆడంబరాలతో, ఎదుటి మనుషులలోని ఆప్యాయతా, అనురాగాలు గుర్తించక, చీకటైన మనసుతో బ్రతుకుతున్న లలితకు, ఇంకా ఎక్కువ ఆడంబరాలతో బ్రతకాలని ఆశ. ఆమెకు సంతానం లేదు. అక్కర్లేదు. మరణశయ్య మిద వున్న తండ్రిని చూడటానికి బయలుదేరి, మధ్యలో హోటల్లో తన కిష్టమైనవి తినివెళ్ళేసరికి తండ్రి చూపు దక్కదు. ఇది పాత అనుభవం. ఇప్పుడు భర్త కారు ప్రమాదానికి లోనయి, హాస్పిటల్లో ఉన్నాడని తెలిసినప్పుడు పాత అనుభవం గుర్తుకొచ్చి వెంటనే బయలుదేరాలనుకుంటుంది. మనుషుల విలువ తెలిసివచ్చే సమయాలు ఎప్పుడోగానీ రావు అని చెప్పేకథ 'చీకటి'.

పిల్లలు వస్తువులు పాడు చేస్తుంటే, తనకింటూ ఓ బీరువా చేయించుకుని అందులో వస్తువులు పెట్టుకోవాలనుకుంటుంది ఆమె. జాన్‌పాల్ మంచి వడ్రంగి పని మంతుడు. కానీ డబ్బులు ఎక్కువ గుంజేరకం. ఓ పట్టాన పనిపూర్తి చేయడు. పైగా కాస్త త్రాగుబోతు. అందువల్ల అతనిభార్య, కూతురూ పట్నంలో విడిగా వుంటారు. జాన్‌పాల్ కొడుకు ఫిలిప్‌తో వుంటాడు. అతడు సోమరి, చదువులేదు.

బీరువా తయారు చేయటానికి రోజుల తరబడి టైము తీసుకుంటాడు. ఎన్నో రోజులకు బీరువా పూర్తి చేసి ఇంట్లో పెడతాడు. ఆ సమయంలో కొడుకు ఏటిలో కొట్టుకుపోయినట్టు కబురు విని పరుగెడతాడు. నాలుగురోజుల తర్వాత మళ్ళీ కనిపిస్తాడు జాన్‌పాల్. అతనిలో పూర్తి హుందాతనం వస్తుంది. టక్కరితనం కనిపించదు. ఒక్కొక్కరి జీవితంలో తగిలే దెబ్బ వల్ల వారి నిజమైన మనసు, ప్రవర్తన బయట పడతాయి. ఇది 'జాన్‌పాల్ చేసిన బీరువా' కథ.

ఇద్దరి అక్కా చెల్లెళ్ళ మనస్తత్వాల్లోని వైవిధ్యమే 'గడియారం' కథ. ధర్మ అక్కయ్యకు జీవితం అంటే హృదయ

సంబంధి. అందులో అనుభూతి వుండొచ్చు గానీ, ప్రగతి లేదు - తను ? రాగద్వేషాల్ని తిరిగ్గా నెమరు వేసుకుంటూ, తనకు తానే కితకితలు పెట్టుకునే సోమరితనం లేదు. దుఃఖపడి ఏం సాధించ గలం అనుకుంటుంది - సోదరి చనిపోతుందని తెలిసి.

'అమల' ఒక విచిత్రమైన మనస్తత్వం గలది. ఆమె మనసు ఒక్కోసారి నిశ్చలమైన లోకంలోకి వెళ్ళిపోతూ వుంటుంది.

'తొందర అనేది ఎక్కడో జారిపోయింది. నాకసలు ఏపనీ చెయ్యాలని వుండదు. పని చెయ్యటం శ్రమ. దేనికీ విలువ, ప్రయోజనం లేవు. నేను క్రమంగా ఒక నిరంతర నిశ్శబ్దంలోకి మునిగిపోతున్నాను. ఇక్కడ నేను స్వతంత్రురాలిని. బరువు, బాధ్యతలు లేని స్వేచ్ఛాజీవిని' అనుకుంటూ వుంటుంది.

ఆమె ఆలోచిస్తున్నప్పుడు తప్ప మిగతా ఎప్పుడైనా చురుకుగానే వుండగలదు. ఎప్పుడైనా ఒకసారి పని మధ్యలో ఆపి శూన్యంలోకి చూస్తున్నట్లు నిలుస్తుంది. మరుక్షణంలోనే తిరిగి మామూలు స్థితికి వస్తుంది.

వంట గదిలో ఓసారి అమల అగ్గిపుల్ల గీస్తుంది. కానీ స్టవ్‌ని ముట్టించదు. మండుతున్న పుల్లను అలాగే పట్టుకుని చెయ్యి దించుతుంది. అగ్గిపుల్ల నైలాన్ చీరకంటుకుని కాలిపోతుంది. మనసు శూన్యంలోకి వెళ్ళినప్పుడు మనిషికి ఏం జరుగుతుందో తెలియదు. ఇది 'అమల' కథ.

చిన్నతనంలో తను బుద్ధి తెలియని పసివాడు. అమ్మ ప్రేమమూర్తి. నాన్న క్రమశిక్షణతో రూపుదిద్దిన గురువు. ఆ జీవిత గమనంలో అక్క తన సహచరి. ఇదంతా ఇప్పటి వూహ. కానీ వారితో అతని అనుభవాలు వేరు. రెంటికీ సంబంధమే వుండదు. ఇప్పటికి వూహ సత్యమా, అప్పటి అనుభవాలు సత్యమా అన్న తర్కంతో నిండిన కథ 'సీతాకోక చిలుక'.

శివరావు గొప్పమేధావి. 'మానవ అనుభవాన్ని నిత్యసత్యంగా మార్చటం ఎలా ? అన్న విషయంమీద పరిశోధన చేస్తుంటాడు.

"దైనందిన జీవితంలో మనిషి ఎన్నో అనుభవాలకు లోనవుతున్నాడు. అందులో కొన్ని అర్థం లేనివి, వ్యర్థమైనవి పోయినా మిగిలిన అనుభవాలు అతనికి మిగలటం లేదు. రుచికరమైన పదార్థం తిన్నప్పుడు, ఆ అనుభవం ఆ క్రియతో మాయమయి పోతుంది. అలాగే. వాసన, సుఖము, భోగము, నవ్వు, ఏడుపూ అన్నీ ఎటో పోతాయి. కొన్ని అనుభవాలు జ్ఞాపకాలుగా కొద్దికాలం నిలిచినా తర్వాత జారిపోతాయి. తాను కోరుకున్న కొన్ని ముఖ్యమైన అనుభవాల్ని శాశ్వతం చేసుకుంటే మానవ జీవితానికి పరిపూర్ణత వస్తుంది అనుకుంటాడు. కానీ నిజానికి ఆ అనుభవాలన్నీ ఒక్కసారిగా అనుభూతి పొందుతుంటే, మనిషి తట్టుకోగలడా ? శివరావు తట్టుకోలేక పోతాడు.

"తానొకరిలా వ్రాయక పోవటం, ఇంకొకరు తనలా వ్రాయటానికి వీలుండక పోవటం శ్రీమతి వసుంధరాదేవి గారి కథలలో విశిష్టత" అని శ్రీ మధురాంతకం రాజారాం గారు అనటం సరైన వ్యాఖ్యానం అనిపిస్తుంది.

బా. శ

గ్రంథ స్వీకారాలు

శ్రీ తనికెళ్ళవారి పంచాంగము : పంచాంగకర్తలు : శ్రీ తనికెళ్ళ వేంకట సూర్యనారాయణ సిద్ధాంతి, పుత్రులు. వెల : రు. 3-25 పై. లు. కావలసినవారు పంచాంగకర్త పేర మృత్యుంజయ నగరం (కొత్తపట్నం), పార్వతీపురం తాలూకా, విజయనగరం జిల్లా కు వ్రాసి తెప్పించుకొనవచ్చును.

నూతన (మాసపత్రిక) : సంవత్సర చందా రు. 20 లు. ప్రతులకు : నూతన, సి - 85, వనస్థలి పురం, హైదరాబాద్ - 500 661.

ఎక్స్‌రే : ఆధునిక కవితా వేదిక. సాలు చందా 6 రూ. లు. ప్రతులు కావలసినవారు ఎక్స్‌రే, కొల్లూరి హౌస్, అమలాపురం 533 202 కు వ్రాయవచ్చును.

శ్రీ శ్రీ : సంస్మరణిక. ఉచిత ప్రతులకు : శ్రీ "కాట్రు గడ్డ", పెదపాడు-534 437 అను అడ్రసుకు వ్రాసి తెప్పించుకోవచ్చును.

శ్రీ రామపూజ : గ్రంథకర్త శ్రీ గుండు విఘ్నేశ్వర శాస్త్రి. ప్రతులు దొరుకు చోటు : శ్రీ వీర వెంకట సీతారామ భజన మందిరము, లలితా నగరము, రాజమండ్రి-5. లేదా భక్తి ప్రబోధ మండలి, అనపర్తి-533 342 (తూ. గో. జిల్లా).

నవత : సాహితీ ఉద్యమ వేదిక. సంవత్సర చందా రు. 10 లు. ప్రచురణ : సింహపురి సాహితీ సమాఖ్య, 10-170, సంతపేట, నెల్లూరు-524 001.

ఊపిరి : వెల : 50 పైసలు. కావలసినవారు చైతన్య సాహితీ మిత్రులు, సిద్ధిపేట అను చిరునామాకు వ్రాయవచ్చు.

సమాలోచన : జాతీయ సాంస్కృతిక పక్ష పత్రిక. సంపాదకుడు : విద్వాన్ బులుసు సీతారామ శాస్త్రి. ప్రతులకు సంపాదకుని పేర రాజమండ్రికి వ్రాసి తెప్పించుకోవచ్చును.

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrik Press, Gandhinagar, Vijayawada-3 Editor : S. Radhakrishna, Vijayawada. Phones : 75667 & 61247.